మాతృదర్శనం



కొండముది రామకృష్ణ

మాతృదర్శనం

కొండముది రామకృష్ణ

ప్రచురణ :
ప్రచురణ విభాగం
శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి - 522114
బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా.

మొదటి ప్రచురణ :
రుధిరోద్గారి చైత్ర శుద్ధ ఏకాదశి
23-4-1983

ప్రతులు : 2000

వెల : రు. 10-00

ముద్రణ :
శ్రీ లక్ష్మీగణేష్ ప్రింటర్స్,
విద్యాధరపురం, విజయవాడ-12.

విషయసూచిక



ముందుమాట

నా చరిత్ర పండితుడైన పామరుడు వ్రాయడు. పామరు డయిన పండితుడు వ్రాస్తాడు – అన్నది అమ్మ.

పండితు డయిన పామరు డంటే ఏమిటో, పామరు డయిన పండితు డంటే ఏమిటో, ఆ భేదం నాకు తెలీదు.

నేను పండితుణ్ణి కాదు. గ్రంథాలు చదువలేదు, శాస్త్రాలు తెలీవు.

1962 వ సంవత్సరంనుండి తన పదసాన్నిధ్యాన్ని అమ్మ నాకు పరమ కృపతో అనుగ్రహించింది.

అప్పటినుండి నేను అమ్మకు బహిరంగమే అయి మెలిగానో, అమ్మ నా అంతరంగమే అయి వెలిగిందో – విడదీసి చెప్పలేని అభేదస్థితిలో జీవనాన్ని అమ్మ నాకు ప్రసాదించింది.

అమ్మను చూసేందుకు అనునిత్యం వందలాది ప్రజలు వస్తారు. వారిలో అనేక విధాల వాళ్ళుంటారు. కొందరు కోరికలతో వస్తారు. కొందరు తెలుసుకుందామనే కుతూహలంతో వస్తారు. కొందరు మోక్షగాములై వస్తారు. కొందరు కేవలం అమ్మను చూసేందుకు మాత్రమే వస్తారు.

అమ్మ అందరినీ సమంగానే ప్రేమించినప్పటికీ - వాళ్ళ వాళ్ళ మనస్సును బట్టీ, అవసరాన్నిబట్టీ వాళ్ళను అమ్మ ఆదరిస్తుందీ, అదుకుంటుందీ, వాళ్ళతో ఆడుకుంటుందీ.

అమ్మను చూసేందుకు వచ్చేవారిలో ఎట్లాగయితే ఎవరి పోలిక వారిదో, ఎవరి కోరిక వారిదో, అమ్మ వాళ్ళను అనుగ్రహించే తీరులుగూడా వెయ్యివిధాలు.

ఒకే ప్రశ్నను యిద్దరు వేసినపుడు, అమ్మనుంచి యిద్దరికీ ఒకే జవాబు ఉండదు. ఎవరి సమాధానం వారిదే.

అమ్మ దినచర్యకూడ నిన్న ఉన్నట్లే యీ రోజు ఉండదు. ఈనాడు వున్నట్లే రేపు ఉండదు.

ఈ వైవిధ్యంవల్లనే అమ్మసాన్నిధ్యం నిత్యనూతనంగా ఉంటుంది. ఇన్ని సంవత్సరాలు ఉన్నా, అహర్నిశం ఉన్నా - ఎప్పటికప్పుడు ఆ చరణసన్నిధి క్రొంగొత్తగానూ ఉంటుందీ, క్రొత్త పరిమళాలను ప్రసారంచేస్తూనూ వుంటుందీ. క్రొత్త వెలుగులను విరజిమ్ముతూనూ ఉంటుందీ, క్రొత్త అనుభవాలను అందిస్తూనూ వుంటుంది.

అమ్మను చూసేందుకు వచ్చినవాళ్ళకు 'అమ్మదర్శనం' చేయించేందుకు, అమ్మప్రసాదం వారికి అందించేందుకు, ఒక వ్యక్తికావాలి.

అతడికి అర్చకుడు అని పేరుపెట్టండీ, పూజారి అని పిలవండీ .... పేరు ఏదయినా ఆ స్థానం అత్యంత విలువయినది. అతడు భగవంతుడికీ, భక్తుడికీ వారధి వంటివాడు.

పరమ పవిత్రమయిన ఆ బాధ్యతను అమ్మ నాకు ప్రసాదించింది. 1962 నుండి అమ్మసన్నిధిలో ఆ కర్తవ్య నిర్వహణలో వున్నాను. ఆ బాధ్యత సులభమయినదిగా కనిపిస్తుందిగానీ, అది అసిధారావ్రతంలాంటిది.

అమ్మ మాధవిగా ఆరాధింపబడుతున్నప్పటికీ, అమ్మ దేహధారిణి. దేహానికి కొన్ని పరిమితులూ, లక్షణాలూ ఉంటాయి. అవి ఏ దేహానికయినా అనివార్యమే. అట్లా అని సామాన్యమానవులవలె అమ్మ ప్రవర్తన వుంటుందా? - అని ఆలోచిస్తే, అవలోకిస్తే ....సామాన్యులకూ - అమ్మకూ హస్తిమశకాంతరం.

సామాన్యమయిన తరుణాల్లో అమ్మశరీరమూ-సాధారణంగానే ఉంటుంది. కాని క్లిష్టసమయం వచ్చినపుడు లోకాతీతమయిన, మానవాతీతమయిన ఆ శరీర - అసాధారణ స్థితి మనకు అవగతమవుతుందీ, అనుభూతమవుతుందీ; ఆశ్చర్య పరుస్తుందీ.

ఆ శరీరం వెన్నకంటే ఎట్లా మృదువుగా ఉంటుందో, అవసరసమయాల్లో వజ్రంకంటే కఠినంగానూ ఉండగలదు.

అందువల్లనే అమ్మ 'సర్వరోగసమన్విత' - అయినప్పటికీ హాయిగా నవ్వుతూ జీవించగలుగుతున్నది.

అమ్మకూ మనవలె మనస్సు ఉన్నది. అయితే, అది అన్ని విధాల పరిమితులకూ, పరిధులకూ అతీతమై ఉంటుంది. స్వతంత్రమై ఉంటుంది. భిన్నత్వ రహితమై ఉంటుంది. సంపూర్ణమై ఉంటుంది.

అపురూపమైన అమ్మరూపసౌందర్యంవల్లనూ, అతిమానవమైన అమ్మ శరీరధర్మాలవల్లనూ. స్వతంత్రమూ, సమగ్రమూ అయి భిన్నత్వంలేని అమ్మ అసాధారణమన స్తత్వంవల్లనూ - అమ్మ జగత్తుకంతకూ 'అద్భుతవ్యక్తి'యై అర్చామూర్తి అయింది.

ఈ దేహమూ, మనస్సూ ప్రవర్తించే విలక్షణమయిన తీరులో మనకు అసంఖ్యాకమయిన కథలు, గాథలు లభ్యమవుతున్నాయి.

అమ్మ మహామేధావి. అమ్మ జ్ఞాపకశక్తి అత్యద్భుతమూ, అనుపమమూ, అసామాన్యమూ అయింది.

అమ్మ మహాయోగిని. పరమజ్ఞాని. ప్రతిభాశాలిని అయిన గురువు. తన యిష్టప్రకారం అందరనూ నడుపుకుంటూ అందరి యిష్టప్రకారం తాను నడుస్తున్నట్లు కనిపించే పరమలౌక్యం అమ్మతత్వం.

అమ్మ పరమలావణ్యవతి. అమ్మ కరచరణాదులు అంగాంగమూ అతిలోక సుందరాలై భాసిస్తూంటాయి.

అమ్మ ఆదర్శ గృహిణి. పతియే దైవం - అని మనసారా విశ్వసించి, పతిని ఆధారంగాచేసుకుని పంచభూతాలను జయించిన పతివ్రతాశిరోమణి. సర్వాన్నీ స్వాధీనం చేసుకున్న పరమసాధ్వి.

అమ్మ స్థితప్రజ్ఞ. అమ్మదృష్టిలో కష్టసుఖాలు రెండూ దైవం ప్రసాదించిన వరాలే. అనుగ్రహనిగ్రహాలని రెండు లేవు. అంతా కటాక్షమే. పడటానికీ, పడకుండా ఉండడానికీ, పడినా దెబ్బలు తగలకుండా ఉండడానికీ, అన్నిటికీ కారణం ఒక్కటే. ఏమీ కావాలనేది అక్కరలేకుండా కావాలి – అనుకునే నిర్లిప్తస్థితి అమ్మది.

అమ్మ సిద్ధసంకల్ప. అమ్మశుద్ధమానసంలో ఏ భావ తరంగం ఉత్పన్నమయినా అది క్రియారూపం ధరించవలసిందే!

అమ్మ అమోఘవచస్క. అమ్మ తమాషాగా అన్నట్లుంది గానీ అమ్మ వాక్కు ఎప్పుడూ వ్యర్థంగాదు. తోలునోరు కాదు గదా! తాలుమాట రాదు – అన్నది అమ్మ.

అమ్మ వాక్చతుర. అమ్మ మధురాలాప. అమ్మ వాగేశ్వరి. అమ్మ వాగ్దేవత.

అమ్మ ప్రేమస్వరూపిణి. తనను ఎవరు ప్రేమించినా, ప్రేమించకపోయినా, ద్వేషించినా, దూషించినా, హింసించినా ... అందరినీ ప్రేమించాలనుకునే ఉదాత్త మనస్విని అమ్మ. మన యోగ్యతాయోగ్యతలతో అవసరంలేని అవ్యాజమయిన, అనిర్వచనీయమైన, అనంతమయిన, అమలినమైన అమ్మప్రేమ అతి సహజమయింది.

అమ్మ నిరుపమ త్యాగమయి.
అమ్మ సహనమూర్తి.
అమ్మ జీవితాన్ని పరిశీలిస్తే–

తాను సూర్యాతపంలో పరితప్తమవుతూ, ఆశ్రితులకు చల్లని నీడను అనుగ్రహించే తరువు స్మృతిలో మెదులుతుంది. తనను శిలాఘాతాలతో బాధించిన వారికి సైతమూ తీయని ఫలాల నందించే వృక్షం కళ్ళముందు కదులుతుంది.

తాను కాలిపోతూ మనకు వెలుగులు వెదజల్లే క్రొవ్వొత్తి జ్ఞాపకం వస్తుంది.

తాను కరిగిపోతూ, అరిగిపోతూ మనకు పరిమళాలను ప్రసరించే చందనపు చెక్క మన మనస్సులో చోటుచేసుకుంటుంది. మన మాలిన్యాన్ని తాను గ్రహించి మనను శుభ్రపరిచే పావనజాహ్నవి గుర్తుకు వస్తుంది.

అందువల్లనే అమ్మ - తల్లి అంటే తరింపజేసేది - అని తననుగురించి తానే అపూర్వమయిన నిర్వచనాన్ని యిచ్చింది. మనం బురద పూసుకున్నా మరేమి పూసుకున్నా ప్రక్షాళనంచేయాల్సిన బాధ్యత తనదట.

అమ్మ పరమదయాళువు.

మంచివాళ్ళను వాళ్ళ మంచితనమే కాపాడుతుంది. వాళ్ళు లోకంలో ఎట్లాగూ గౌరవింపబడుతారు. చెడ్డవాళ్ళను నేనుకూడా దగ్గరకుతీయకపోతే ఎట్లా ? అందుకే నాఒళ్ళోనూ, నా ఆవరణలోనూ వాళ్ళకు ఎప్పుడూ స్థానం ఉంటుంది - అని చెప్పిన కరుణారససాగర అమ్మ.

అమ్మ విరాగిణి. విరాగమంటే మమకారాలను తుంచివేసుకొనడం కాదు, పెంచుకొనడం. మమకారపరిధిని విస్తృతపరచి, సర్వజగత్తుకూ పరివ్యాప్తంచేయడం

ఎవరిని చూసినా తన బిడ్డయే అనిపిస్తుందట అమ్మకు. తన బిడ్డయందు ఏమి చూస్తుందో, అందరియందు దానినే చూడగల వాత్సల్యస్వరూపిణి అమ్మ. సర్వ ప్రపంచాన్ని తన కన్నబిడ్డగా లాలిస్తూ పాలిస్తూ "ఈ సృష్టి నాది" అని ఉద్ఘాటించ గలిగిన విశాలహృదయ; విశ్వకుటుంబిని విశ్వజనని అమ్మ.

అమ్మ అద్వైతమూర్తి. అమ్మకు జాతి మత భేదం లేదు. వర్గ, వర్ణ భేదం లేదు. వయో లింగ భేదం లేదు. జడ చేతన భేదం లేదు. దేశ కాల భేదం లేదు. మంచివాళ్ళనీ, చెడ్డవాళ్ళనీ భేదం లేదు. పెద్దవాళ్ళనీ, పేదవాళ్ళనీ భేదం లేదు. పండితులనీ పామరులనీ భేదం లేదు. ఇంట్లోవాళ్ళనీ యితరులనీ భేదం లేదు. సర్వ భేదాలకూ అతీతమయిన అత్యున్నతమయిన స్థితి అమ్మది.

అమ్మ సర్వజ్ఞ. అమ్మ సర్వవ్యాపిని. అమ్మ సర్వశక్తిమయి. అమ్మ ఘటనాఘటన సమర్థ.

అమ్మ దృష్టిలో అందరూ మంచివాళ్ళే. అందరూ మహానుభావులే. అందరూ జ్ఞానమూర్తులే. అందరూ దైవస్వరూపులే అందరూ పవిత్రులే అందరూ పూజ్యులే.

అందువల్లనే అమ్మ లోకవందిత అయింది. మరి, సర్వత్రా ఎవరు పూజ్య భావం కలిగివుంటారో వారే పూజ్యులు, సర్వత్రా ఎవరు మంచితనం చూస్తారో వారే మంచివాళ్ళు కదా , అమ్మ అనుభవంలో - జగత్తూ - జగదీశ్వరుడూ వేరు కాదు.

అమ్మదర్శనం

అంతా అదే-నని.

ఎంత వెదికినా నాకు అది (సత్ లేక దైవం) కానిది కనుపించడంలేదని ఘంటాపథంగా చెప్పింది.

అమ్మ ప్రబోధం

అందరినీ ప్రేమించ-మని.

రెండు దశాబ్దాలుగా అనుక్షణం అమ్మను దర్శిస్తూ, అమ్మధ్యాసే ధ్యానంగా జీవిస్తూ అవగాహన జేసుకున్న పరమాద్భుత విషయం రెండు ముక్కల్లో చెప్పాలంటే –

అమ్మ స్వరూపలలిత. స్వభావమధుర.

ఈ సత్యాన్ని ఆవిష్కరించే ఘటనలు అమ్మ చరిత్రలో సహస్రాధికంగా దర్శనమిస్తాయి

చెరుకుగెడను ఎక్కడ కొరికినా మధురంగానే ఉన్నట్లు – అమ్మ చరిత్రలో ఏ క్షణాన్ని గీటురాయిపై పెట్టినా, అది దివ్యత్వాన్నే ప్రకటిస్తుంది.

అమ్మ నోటివెంట వెలువడిన ప్రతివాక్యమూ సత్యాన్నే ప్రవచిస్తుంది.

అహర్నిశం అమ్మ సన్నిధిన ఉంటూ నేను కన్నవీ, విన్నవీ నాగుండెలో జాగ్రత్తగా భద్రపరుచుకున్నాను వేలాది జనుల అనుభవాలను అవగాహన చేసుకున్నాను.

అమ్మ అనుగ్రహంతో అనుమతితో అనుభవాల్ని అక్షరబద్ధం చేయడానికి మొదలుపెట్టాను.

అదే సాహసంతో అమ్మ జీవితచరిత్ర రచనకు కూడా ఉపక్రమించాను.

1966 లో మాతృశ్రీ మాసపత్రిక ప్రచురణ ప్రారంభమయింది. ఆ పత్రిక సంపాదకత్వం అమ్మ నాకు ప్రసాదించిన వరాల్లో ప్రధానమైంది.

ఆనాడు నాన్నగారు అడిగారు, "ఒక వ్యక్తి గురించి నెల నెలా ఏమి చెబుతావూ ? ఎన్నాళ్ళు చెబుతావూ ?" అని.

"చూసే కన్నూ, వ్రాసే పెన్నూ ఉండాలి గానీ యిన్నాళ్ళని ఏముందీ ? ఎన్నేళ్ళయినా చెప్పవచ్చును" అన్నాను.

ఇప్పటికి 17 సంవత్సరాలయింది. 200 కు పైగా సంపాదకీయ వ్యాసాలు వ్రాశాను. ఒక దానిలో స్పృశించిన విషయం మరొక దానిలో ప్రస్తావించబడలేదు.

భగవంతుడెప్పుడూ భక్తుని మాటను నిలబెట్టడానికే ప్రయత్నిస్తాడు. ప్రహ్లాద చరిత్రవల్ల మనకి సత్యమే సుబోధమవుతుంది.

ఈ అన్ని వ్యాసాల్లోనూ నేనెట్లా మాతృదర్శనం చేసిందీ చెప్పాను. అమ్మ చేసిన విశ్వదర్శనం గురించి వివరించాను. మరి, 1983 ఏప్రిల్ 23 న అమ్మ వజ్రోత్సవం. ఈ శుభసందర్భంగా కొందరు సోదరులం కలసి అమ్మకు సారస్వత నీరాంజనం సమర్పించవలెనని ఆకాంక్షించాము. సోదరులు శ్రీ రాచర్ల లక్ష్మీనారాయణ, శ్రీ తంగిరాల కేశవశర్మ, శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయప్రసాద్, శ్రీ విఠాల రామచంద్రమూర్తిగారలు యీ సంపాదకీయాలను గ్రంథరూపంలో ప్రచురించమని సలహాయిచ్చారు. అమ్మకు అరవై సంవత్సరాలు కనుక ఆ రాశినుండి అరవై వ్యాసాలు తీసుకుని యీ గ్రంథం ప్రచురించడం జరిగింది.

ఇంకా రెండు భాగాలు ప్రచురించవలసి ఉన్నది. అందుకు తరుణ మెప్పుడో ! ఆ తెర తీయవలసినది అమ్మ మాత్రమే.

ఈ వ్యాసాలవల్ల అనంతమయిన అమ్మ స్వరూప స్వభావాల్లో అణుమాత్రమయినా నా అనుజులకు నేను అవగాహనచేయగలిగితే - అది అమ్మకు వారిపై గల వాత్సల్యఫలితమే గానీ నా కలం బలం ఎంతమాత్రం కాదని సవినయంగా మనవిచేసుకుంటున్నాను.

'మాతృదర్శనం'కు నన్ను ఉపకరణంగా చేసుకున్న అమ్మ అనిర్వచనీయ అనంత వాత్సల్యాప్రసాదానికి సాష్టాంగప్రణామము లర్పిస్తున్నాను.

— ర చ యి త

శ్రీచరణకమలాలు

1972 డిసెంబరు 15 వ తేదీ రాత్రి. తెల్లవారితే ముక్కోటి పండుగ. ఆవరణమంతా సందడిగా ఉన్నది. చిరంజీవి కొండముది సుబ్బారావు అనారోగ్యం వ్యాజంగా అమ్మ ఆకస్మికంగా చీరాల బయలుదేరి వెళ్ళింది.

ఆ చిరంజీవి చీరాలలో వారి బంధువులయిన శ్రీ బూదరాజు శేషగిరి రావుగారింట్లో ఉన్నాడు అమ్మ అక్కడికి వెళ్ళింది. క్రితం సంవత్సరం సెప్టెంబరు 17 వ తేదిన యిలాగే...శ్రీ నాన్నగారు అనారోగ్యంగా ఉండి చీరాలలో ఉంటే నాన్నగారిని చూచేందుకు అమ్మ చీరాల వెళ్ళి ఆ సమీపంలో ఉన్న శ్రీ శేషగిరిరావుగారింటిని పునీతంచేసింది.

వారింటిని ఉన్నదానికంటే విశాలమూ, సౌకర్యవంతమూ, సుందరమూ చేయాలని వారికి ఎన్నాళ్ళనుండో యోచన. కాని, కారణ మేదయితే నేమి, అందుకు కాలం అనుకూలం కాలేదూ, క్రియ జరుగలేదూ-

ఈ సారి అమ్మ వెళ్ళేటప్పటికి ఆ భవనం రమణీయంగా నిర్మితమై ఉన్నది. వారింటికి అమ్మ వెళ్ళగానే పట్టలేని ఆనందంతో ఆ దంపతులు అమ్మను లోపలకు తీసుకువెళ్ళి వారింటిని మూలమూలలా చూపిస్తూ...కేవలం అమ్మ కృప వల్లనే, అమ్మ ఆ అవనీభాగాన్ని తన పవిత్ర పాదంతో పునీతంచేసిన తరువాతనే ఆ గృహానికి శుభపరిణామం కలిగిందని నివేదించుకున్నారు

1962 జులైలో వాడరేవులో జీర్ణావస్థలో నన్న లలితానందాశ్రమానికి అమ్మ వెళ్ళింది. అప్పుడది ఏముకలతో, బొమికలతో వచ్చేపోయేవారిని వెక్కిరిస్తూ ఉన్నది. ఆ తరువాత అది ఎంతో అందమయిన ఆశ్రమంగా పరిణతి పొందింది. అవును-ఆ చరణరజోలేశం సోకితేనే-మరుభూముల్లో మాణిక్యారాసులు పండుతున్నాయి; నాగజెముళ్ళు వికటాట్టహాసం చేసే వికృతపు టడవులు నందనవనాలై హాసిస్తున్నాయి, పనికిరాని శిధిలాలు పసిడిబొమ్మలై పకపకలాడుతున్నాయి; రప్పలూ రాళ్ళూ రవ్వలూ రత్నాలై కాంతులు వెదజల్లుతున్నాయి గడ్డిపోచలూ, గుడ్డిపూలూ కూడా మందారాల వలే, కెందామరల వలే పూజార్హ మవుతున్నాయి. అందువల్లనే ఆ పాదద్వయంలో-

అమృతకలశాలున్నాయని కొందరు భావిస్తే...పరుసవేది ఉన్నదని కొందరు పలికితే... సంజీవని ఉన్నదని కొందరు ఉద్ఘాటిస్తే...కామధేనువులూ, కల్పవృక్షాలూ వున్నాయని కొందరు కొనియాడితే....పుణ్యాహ్నాని పరవశ్యు చూశామని కొందరు ప్రస్తుతిస్తే.... పార్వతీ పరమేశ్వరులనే సందర్శించామని కొందరు పూజించుకొంటున్నారు.

– మహిమాన్విత మయిన ఆ చరణమధుర సంస్పర్శసంవల్లనే....ప్రక్క గ్రామానికే తెలియనంత కుగ్రామం జిల్లెళ్ళమూడి అనతికాలంలోనే ప్రముఖక్షేత్రమై ప్రపంచ ప్రఖ్యాతి నందింది.

మరి – మహాత్ముల చరణధూళి అఘటనాఘటనసమర్థం కదా! కనుకనే రఘువల్లభుని పాదస్పర్శమాత్రంచేతనే రాయి రమణియై రసవత్కావ్యానికి ఆలంబన మయింది. అమ్మపాదాలు అవలోకిస్తే – ఆ సౌందర్యానికీ, మార్దవానికీ మనం సమ్ముగ్ధుల మవుతాము. అదృష్టవశాత్తు ఆ పాదాలను స్పృశించగలిగితే – ఒక అమృతలహరి ఆ పాదాలనుండి మన కరాల్లోకి ప్రవహించి మేను పులకాంకితమై తీరుతుంది. ఇక, ఆ మహాత్మ్యం అనుభూతమే అయితే ఆ పదసన్నిధికి మనం బద్ధులమే అయిపోగలం.

1972 అక్టోబరు 7 వ తేదీన అనుకుంటాను, సోదరులు శ్రీరామచంద్ర మూర్తి అమ్మచరణ కమలాలను తనహస్తాల్లో పొదుపుకొని .... ఈ పాదాలనే కదా, అమ్మా – బ్రహ్మ కడిగింది?... అని అడిగారు. వెంటనే "ఔను" అన్న అమ్మ మళ్ళీ అన్నది ఒకక్షణం విరామంతో "మీరు కడుగుతూనే ఉన్నారుగా ? మీరందరూ బ్రహ్మకదూ?" అని. ఎంత విచిత్రమయిన అమ్మ! ఎంత విశిష్టమయిన వాక్కు!! ఆ ఒక్కవాక్యంలో ఎంత వర్ణసమ్మేళన మున్నది! ఎంత రామణీయక మున్నది!! చమత్కారంగా ధ్వనిస్తూనే నిగూఢరహస్యాన్ని వెల్లడించే ఎంత గాంభీర్య మున్నది!!! అవి బ్రహ్మ కడిగిన పాదాలే నట – ఇది అమ్మ మాటలో మనకు అరుదుగా వినిపించే అంగీకారం మన మందరమూ బ్రహ్మలమే నట – ఇది అమ్మ అనుక్షణ జాగృతికి చిహ్నం. ఇందులో మళ్ళీ ఒక జలతారు తెర – ఇది అమ్మ విధానంలోని ఒక వైలక్షణ్యం! ఒక పరమలావణ్యం!!

అమ్మ అద్భుత జీవితంవలెనే అమ్మవాక్యాలూ రసబంధురాలూ, రసవత్కావ్యాలూ అయి మనకు సన్యాలోకనను ప్రసాదిస్తూ మనను దివ్యలోకాలకు కొనిపోతుంటాయి.

డిశంబరు 1972

అమృత హస్తం

1963 ఫిబ్రవరి 12 వ తేదీ సాయంకాలం అంతరాలయంలో అమ్మ పాదసన్నిధిన కూర్చుని వున్నాను. నాన్నగారు వచ్చారు. అమ్మకు చెయ్యి అందించి నాడి చూడమన్నారు. అమ్మ కరగ్రహణం చేసింది.

అది ఒక రమణీయమయిన దృశ్యం. నేను ఆ దృశ్య మవలోకిస్తూ ఆనందిస్తున్నాను. నాన్నగారు నన్నుద్దేశించి–

"ఎంత హాయిగా ఉన్నదిరా! ఎందుకో నరాలు గుంజుతున్నాయి; యిప్పుడు కాపు కాచినట్లున్నది" అన్నారు.

"అవును; ఆశ్చర్యమేమున్నది? మరి కాచే చెయ్యి కదా!" అన్నాను.

అమ్మ నావంక చూచింది. ఆ దృష్టిలో దరహాసమున్నది. ఆ దరహాసంలో అంగీకార మున్నది.

ఔను–అగ్నికి వేడిమీ, నీటికి చల్లదనమూ ఎంత సహజమో ఆ చేతికి కాపు అంత సహజం.

ఆ చెయ్యి ఆపదలలో నున్నవారిని ఎంతమందిని కాచిందో - అవసరాలలో నున్నవారిని ఎంతమందిని ఆదుకున్నదో – పాతాళంలో పడిపోయే ఎంతమందిని పైకి చేదుకున్నదో – పాపుల నెంతమందిని పునీతుల జేసిందో!

ఆ చెయ్యి ఎంతో అందంగా ఉంటుంది. కాని ఆ చేతిని పద్మంతో పోల్చటం ఎట్లా? ఏ పువ్వులో ఆ మమతానుబంధ మున్నది?

ఆ చెయ్యి ఎంతో మార్దవంగా ఉంటుంది. కాని ఆ చేతిని నవనీతంతో పోల్చటం ఎట్లా? వెన్నకు ఆ కరుణార్ద్రత ఏదీ?

ఆ చెయ్యి ఎంతో కాంతివంత మయింది. కాని ఆ చేతిని బంగారంతో పోల్చటం ఎట్లా? పసిడికి ఆ అనురాగ పరిమళ మెక్కడిదీ?

ఆ కరస్పర్శలో ఎందరో ఆరోగ్యవంతులయినారు; ఎందరో పునర్జీవు లయినారు.

ఆ కరచాలనంలో ఎందరో క్రొత్త పిలుపు విన్నారు; ఎందరో మంచి దారులకు మళ్ళారు.

ఆ కరకంకణ నిక్వాణాల్లో ఎందరో ఆశాసందేశం ఆలకించారు; ఎన్నో సందేహాల నివృత్తి చేసుకున్నారు.

ఆ చేతిలో సంజీవని ఉన్నది. ఆ చేతిలో చింతామణి ఉన్నది. ఆ చేతిలో అమృతకలశ మున్నది. ఆ చేతిలో అక్షయముద్ర ఉన్నది.

అనంతకోటి జీవుల అద్భుత జీవిత చరిత్రల రచనలకూ ఆధారమయిన అనుపమ లేఖిని ఆ చేతిలో ఉన్నది.

ఫిబ్రవరి 1968

అమ్మ కళ్లు

సహస్రనామాల్లో అభివర్ణితమయిన లలితా పరాభట్టారికవలె అమ్మ మహా లావణ్యశేవధి అమ్మ అంగాంగమూ దివ్యతేజో విలసితమూ, అపురూప సౌందర్యోపేతమూ. అమ్మ శరీర పేటికాంతర్గతమయిన దివ్యజ్వాల శరీరంలోని అణువణువునుండీ బహిర్గతం కావడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అన్ని అవయవాలు అరుణారుణమై ఉద్దీప్తమై ఉజ్జ్వలమై ప్రభాపూరమై ప్రకాశిస్తూ ఉంటాయి

ఆ విధంగా అలౌకికమయిన, అనుపమానమయిన దివ్యతేజాన్ని ప్రసారం చేస్తూ కార్తీక దీపాల్లాగ అందరికీ అన్నివేళలా కమనీయంగా కనుపించి కనువిందు చేస్తుంది అమ్మ కందోయి.

సామాన్యంగా అమ్మకళ్లు అతి ప్రశాంతంగా ఉంటాయి. వర్షానంతరం గగనతలంవలె అతి నిర్మలంగా భాసిస్తాయి. పసిపాప కన్నులవలె ఏ భావ ప్రకటనా లేక అత్యంత నిర్లిప్తంగా కనుపిస్తాయి. రాగాలకూ, అనురాగాలకూ, అనుబంధాలకూ అందని అతిలోక భావ అగాధాలేవో కనుపించి - నిస్తరంగ నిశ్చల గభీర నీరధి తీరాన నిలబడిన అనుభూతిని మనకు కలిగిస్తాయి.

అమ్మ చూపులు అతినిశితంగా ఉంటాయి. ఆసక్తితో, కుతూహలంతో అమ్మ చూపులవెంట మనం పయనిస్తే - దిగంతాలకు దూసుకుపోయే ఆ చూపుల వెంట ప్రయాణం చేయలేక ఎడారిలో సుళ్ళుతిరిగే పవనవీచికలవలె మన చూపులు నడుం విరిగి కుప్పకూలి పోతాయి.

అమ్మ కళ్ళు తెరచి చూస్తుంటే - నభోమండలంలో ఒకే పర్యాయం సూర్య సుధాకరులు వెలుగుతున్నట్లుంటుంది. అమ్మ కళ్ళు మూసుకుంటే దేవాలయ కవాటాలు బంధించినట్లుంటుంది.

అమ్మకళ్ళనుండి అనుగ్రహజలపాతాలు ధరాతలంపైకి దూకుతూ అందరినీ ఆహ్లాదపరుస్తుంటాయి. అమ్మకళ్ళనుండి వాత్సల్యామృతగీతాలు వినిపిస్తూ అందరినీ లాలిస్తూ ఉంటాయి.

అమ్మకళ్ళల్లో – అప్పుడే ఎంతో కష్టంతో ప్రసవించి, తన బిడ్డను చూసుకోవాలనే ఆకాంక్షతో కన్నులు తెరవడానికి ప్రయత్నిస్తూ, బలహీనతతో అలసటతో కనురెప్పలు ఎత్తలేక అరమోడ్పు కళ్ళతో పసిబిడ్డను చూసుకుంటూ పరవశించిపోయే కోటి మాతృమూర్తులు మనకు సాక్షాత్కరిస్తారు.

పొదుగును కుమ్ముతూ పాలు త్రాగుతూ తన్మయం చెందే దూడల మేనులు రసనాగ్రంతో శుభ్రం చేస్తూ పులకించిపోయే గోమాతలు కోటి అమ్మ కళ్ళల్లో మనకు ప్రత్యక్షమవుతాయి.

దృష్టిమాత్రం చేతనే పిల్లలను పోషించే మీనసహస్రం అమ్మ నయన సరోవరంలో చలిస్తూ, జ్వలిస్తూ మనకు దర్శన మిస్తాయి.

అమ్మకళ్ళు నవ్వుతాయి.
అమ్మకళ్ళు మాట్లాడతాయి.
అమ్మకళ్ళు కథలు చెపుతాయి.
అమ్మకళ్ళు కావ్యాలు వినిపిస్తాయి.
అమ్మకళ్ళు ఆదేశిస్తాయి.
అమ్మకళ్ళు ఆశీర్వదిస్తాయి.
అమ్మకళ్ళు దయాసముద్రాలు.
అమ్మకళ్ళు ప్రేమ ప్రవాహాలు.
అమ్మకళ్ళు అగ్ని ప్రభంజనాలు.
అమ్మకళ్ళల్లో హేమంతాలు, శిశిరాలు ...
అమ్మకళ్ళల్లో విరిసిన నందివర్ధనాలు, మల్లెలు విరజాజులు, పారిజాతాలు. కనకాంబరాలు, గులాబులు, మంకెనలు, మందారాలు.

అమ్మకళ్ళల్లో రవ్వలహారాలు, రత్నరాసులు, వజ్రాలు, వైడూర్యాలు తళతళలాడుతాయి.

కెంపులు గుంపులు గుంపులు నిగనిగలాడుతుంటాయి.
కొన్ని వేళల నీలాలు, అతినీలలోహితాలు.

అమ్మకళ్ళల్లో కోటి రాకాపూర్ణిమల ధవళ ధవళ కాంతులు.
కోటి అమావాస్యల కాటుక చీకటి చిక్కని తెరలు.
అమ్మకళ్ళల్లో పాలవెల్లులు, పాలపుంతలు.
అమ్మకళ్ళల్లో పూలజల్లులు, పులకరింతలు.
అమ్మకళ్ళల్లో వసంత శోభలు, కల్యాణ రోచిస్సులు.
అమ్మకళ్ళల్లో దిగంత దీప్తులు, కమనీయోషస్సులు.
అమ్మచూపులో రామబాణం ఉంది.
అమ్మచూపులో గోవిందుని వేణుగానం వినిపిస్తుంది.
అమ్మచూపులో బ్రహ్మాస్త్రం ఉంది, వాత్సల్యాస్త్రం ఉంది.
వారుణాస్త్రా లున్నాయి, ఆగ్నేయాస్త్రాలున్నాయి.
ఆ చూపులు లోకాన్నంతనూ జయించిన ధీమాతో వెలిగి పోతుంటాయి.
జగత్తుకంతకూ అభయప్రదానం చేస్తున్నట్లు అలరారుతుంటాయి.
అమ్మచూపు విశిష్టమయినది. ఆ విషయం అమ్మకూడా అంగీకరించింది.

"మీరు యిక్కడకి వచ్చి నన్ను చూస్తారు. నేను మిమ్మల్ని ఎప్పుడూ చూస్తూనే ఉన్నాను."

"అందరూ ఎప్పుడూ చూడరు నన్ను.
నే నందరినీ ఎప్పుడూ చూస్తాను."
"నన్ను చూడడానికి మీరు రావాలి.
మిమ్మల్ని నేను చూసుకోగలను."
"అదేమిటో నాకు ఎవరూ చూడనట్లుండరు. అంతా చూసినట్లే ఉంటారు."

"నేను మిమ్మల్ని ఎప్పుడూ చూస్తాను. కానీ నేను చూస్తున్నాననేది మీకు ఎప్పుడు అర్థం అవుతుందంటే – మీరు చూస్తున్నప్పుడు నేను చూసినట్టు కనిపించి నప్పుడే."

మనం ఎక్కడున్నా ఏం చేస్తున్నా అమ్మకళ్ళు మనను చూస్తూనే ఉంటాయని అమ్మ అనేక పర్యాయాలు స్పష్టపరిచింది.

అమ్మ చూపులు అప్రతిహతాలు, అజేయాలు, అకుంఠితాలు.

అమ్మ గదిలో కూర్చుని "ఎవరో వచ్చినట్లుంది. చూడు—" అన్నది. బయటికి వెళ్ళి చూస్తే ఒక అన్నయ్య వచ్చి ఉన్నాడు.

మరొకసారి "సుబ్రహ్మణ్యం వచ్చాడురా, చూడు—" అన్నది అమ్మ. రాధన్నయ్య వెలుపలికి వెళ్ళిచూసి 'ఎవరూ లేరమ్మా' అన్నాడు. అమ్మ మళ్ళీ అన్నది "కాదురా వచ్చాడురా" అని. కాసేపటికల్లా ఆ అన్నయ్య రానేవచ్చాడు.

అంటే—దారిలో ఉన్న అన్నయ్య అమ్మకళ్ళల్లోకి ముందుగానే వచ్చాడు.

ఒకసారి హైదరాబాదునుండి ఒక కుర్రవాడు వచ్చాడు. వాడితో అమ్మ మాట్లాడింది.

అమ్మ: నువ్వు మీ పెదనాన్న వాళ్ళ జేబుల్లో డబ్బులు తియ్యలేదూ?

అబ్బాయి: తీశానమ్మా.

అమ్మ: మాంసం తిన్నావా, లేదా?

అబ్బాయి: తిన్నానమ్మా.

అమ్మ: సారాయి త్రాగావా?

అబ్బాయి: త్రాగానమ్మా.

అమ్మ చూపుకు సరిహద్దు లేమున్నాయి?

ఆ చూపులు సర్వలోకావలోకన సమర్థములు!

ఒకాసారి ఫోనుకాల్ వచ్చింది. "భృంగుబండ నారాయణరావులే, యిటివ్వు" అన్నది అమ్మ. నిజమే.

ఒకసారి శేషగిరిరావుఅన్నయ్య అమ్మను అడిగాడు 'నీ నామస్మరణ చేస్తూ మద్రాసు మౌంటురోడ్డులో నడిచిపోతున్న నా మీద నీ ప్రభావం ఎలా ఉంటుంది?' అని.

"ఏముంది నాన్నా – నా ముందు రోడ్డుమీద వెళుతున్నట్లు కనిపిస్తూ ఉంటావు" అన్నది అమ్మ.

ఒక సోదరుడు అమ్మను అడిగాడు 'మేము మాట్లాడుకున్నది నీ కెట్లా వినపడిందమ్మా ?' అని.

"మీరు మాట్లాడుకున్నది మీకు వినబడటం లేదూ? అట్లాగే అంతా వినపడుతుంది. అన్నీ కనపడుతాయి."

ఆ చూపులెంత విశాలములు! ఆ చూపులకు అడ్డు ఏమున్నది?

ఒక సందర్భంలో అమ్మ యీ భావాన్ని అత్యంత బలంగా ప్రకటించింది.

"నేను యీ మంచంమీద కూర్చున్నాననీ, నాకేమీ తెలీదనీ అనుకొంటున్నారు. కాని నాకు గోడచాటులేదు. ఈ ఆవరణంలో ఎవరేం చేస్తున్నారో, ఎక్కడ ఏం జరుగుతున్నదో నాకు తెలుసు. అంత కళ్ళు మూసుకుని కూర్చొనుండలేదు...."

అమ్మకు అయిదవ సంవత్సరంలో అమ్మమ్మ మరణించింది. చిన్నపిల్ల – అని అమ్మను శ్మశానానికి తీసుకొని పోలేదు. అయినా అమ్మ యింటివద్దనే వుండి– శ్మశానంలోని దృశ్యమంతా కళ్ళకు కట్టినట్లు వివరంగా, విపులంగా వర్ణించింది.

అమ్మ చిన్నతనంలోనే ఒక దీపావళి పండుగనాడు అమ్మ తలంటి పోసుకుంటూ ఉండగా కళ్ళలో నురుగుపడింది. ఆ సమయంలో అమ్మ కళ్ళు ఎక్కడెక్కడో జరుగుతున్న అనేక ప్రమాదకర ఘట్టాలు చూసి తెలియజేస్తే–చిదంబరరావు తాతగారు ఆశ్చర్యచకితులైనారు.

1967 డిసెంబరు 31 వ తేదీన కోనా వెంకాయమ్మగారి అంత్యక్రియలకు అమ్మ ఏర్పాట్లు చెబుతున్నది. ఆమె యింకా సజీవంగానే ఉన్నది. నేను విస్మితుడినై అమ్మను అడిగాను 'ఆవిడ బ్రతికే ఉంది కదమ్మా?' అని. "ఇంకెంతసేపూ ? తేడే మారదమేగా–" అన్నది అమ్మ. అంతే జరిగింది.

అమ్మ ఒకసారి గోవిందరాజుల దత్తుగారితో అన్నది "నిన్ను నేను లోగడనే చూశాను. మంగళగిరిలో, బాలాంబగారి సత్రంలో నువ్వు అన్నం వడ్డిస్తుండగా –" అని. ఆ సంఘటన నిజమే. తర్వాత దత్తుగారు జ్ఞాపకం చేసుకోగా – అవి 1918 లో సంఘటన. మరి, అమ్మ జననం 1923లో. ఇదెలా సాధ్యం ?

అమ్మకు కాలభేదం లేదు!

అందుకే అమ్మ అన్నది "నాకు అంతా వర్తమానమే" అని.

ఇదే విషయాన్ని మరో రీతిలో కూడా అమ్మ వివరించింది. "నాకు అవి గుర్తుంటాయంటే-అవి ఎప్పుడో జరిగినట్లు ఉండవు. అన్నీ యిప్పుడే జరుగుతున్నట్లు కనిపిస్తుంటుంది. నేను చెప్పడంలో విశేషం లేదు."

అమ్మ కన్ను చాలా నిశితమయినది. ప్రతి చిన్న విషయాన్నీ ఎంతో సూక్ష్మంగాను పరిశీలనగానూ చూస్తుంది.

ఒకనాడు తన సమీపంలో నేలమీద పారవేయబడిన పురికొసను చేతులు చాచి అందుకొని—సోదరి వసుంధరకు యిస్తూ "తోరణాలు కట్టటానికి ఉపయోగిస్తుంది. ఏమిటో, నాకన్నీ యిటువంటివే కనబడుతాయి" అన్నది అమ్మ.

అమ్మను చూడడానికి వచ్చిన ఒక సోదరునితో అమ్మ అన్నది "పందిరికి ఎదురుగా ఉన్న యింటిప్రక్క పాక ఉన్నది-అక్కడ ఉన్న అరుగుమీద కూర్చున్నారు. పూరింటికి యివతలి ప్రక్కన నువ్వూ యింకా యిద్దరు ముగ్గురూ కలిసి కూర్చున్నారు."

మనకు అన్నీ సమానంగానే కనబడే ఉంగరాల రాళ్ళ ప్రస్తావన వచ్చినపుడు అమ్మ అన్నది "పైకి రాళ్ళన్నీ ఒకటిగానే కనుపిస్తాయి కానీ కట్టుబడిలో, రాయి కోతలో పరీక్షగా చూస్తే మార్పు కనబడుతుంది."

అమ్మను చూసేందుకు ఎంతమంది వచ్చి, ఎదురుగా కూర్చున్నా—అమ్మ ప్రతి ఒక్కరినీ చూస్తుంది. ఆ అవలోకనలో ఎంతో పరిశీలన ఉంటుంది. ఆ చూపులో పలకరింపు ఉంటుంది. ఆ చూపులో పరామర్శ ఉంటుంది. ఆ చూపులో అనురాగముంటుంది. ఆ చూపులో అనుగ్రహముంటుంది.

దీన జనుల కష్టగాథలు వినేటప్పుడు అమ్మ కళ్ళు కలతపడుతాయి. వారి కళ్ళలోని ఆవేదనకు అమ్మకళ్ళు ఆర్ద్రమై రెప్పలు రెప రెప లాడుతాయి, వానలో తడిసిన పావురాయి రెక్కలవలె. ఆ సమయంలో అమ్మ విశాల నయనాల్లో తారాడే వినీల మేఘశకలాలు మనకు స్పష్టంగా కనుపిస్తాయి.

అమ్మ 'అనాథజనతా భాష్పఝరాకులవిలోచన.'

అరుదుగానే అయినా, ఒక్కొక్కసారి అమ్మ కళ్ళలో రక్తారుణిమ దృగ్గోచర మవుతుంది. అమ్మకళ్ళల్లో సాయం సంధ్యలూ, ప్రభాతారుణ కాంతులూ కనుపించ డమూ కద్దు.

1965 వ సం॥ దేవీనవరాత్రి ఉత్సవాలలో అమ్మ ముఖానికి గంధం పూసుకుని కూర్చున్నది. లలితాంబగారు దగ్గర ఉన్నారు.

అమ్మ అడిగింది "భయింగా ఉన్నదా?" అని

లలితాంబగారు 'భయంగా లే' దని చెబుతూ 'అసలు రూపంచూపిస్తే భయంకానీ' అన్నది.

"అసలు రూపం ఏం చూడగలరు? దుర్గాష్టమినాడు మామూలుగా వస్తేనే భయపడ్డారు" అన్నది అమ్మ.

అప్పుడు లలితాంబగారు అన్నది 'నవమినాడు కిరీటం పెట్టుకుని నల్లచీరె కట్టుకుని, జుట్టు విరబోసుకుని వస్తుంటే ఒళ్లు ఝల్లుమన్నది.'

"అవన్నీ అక్కరలేదు. గట్టిగా చూస్తే చాలు-" అన్నది అమ్మ.

1968వసంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలలో ఫోటో తీయడానికి కెమేరా సిద్ధంచేసుకున్న డాక్టర్ అడపా రామకృష్ణరావుగారు ఫోటోలు తీయలేదు. కారణం అడిగితే వారన్నారు "ఇంకా నయం. తీయడానికి ప్రయత్నిస్తే-ఆ చూపులకు కెమేరా బద్దలయి ఉండేది."

అమ్మ అగ్నినేత్ర.

అమ్మచూపు అపూర్వమయినది.

అమ్మచూపు అనన్యమయినది.

అమ్మచూపు అనితర సాధ్యమయినది.

అమ్మచూపు అతిపవిత్రమయినది.

అమ్మచూపు అతిలోకమయినది.

ఆ చూపును గురించి అమ్మ అనేక తీరులలో అత్యంత రమణీయంగా ప్రవచించింది.

"నేను మీ అందరినీ కనడానికి వచ్చాను."

"బిడ్డల్ని కనడమే నా సాధన."

"ఎక్కడ ఎవరినిచూసినా నా బిడ్డే అనిపిస్తుంది."

"ఇది మమతల గర్భగుడి. విరాగిని కానుగా నానా. కాబట్టి అందరినీ చూసుకోవాలనీ ఉంటుంది"

"నాకు బిడ్డగా కాక మరోరకంగా ఎవరూ కనబడరు"

మనబిడ్డయందు ఏమి చూస్తున్నామో, అందరియందు దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం."

"నాకు ఎవరిని చూసినా నా బిడ్డే అనిపిస్తుంది."

అమ్మదృష్టి మనపై ప్రసారితమై ఎంత సుందరంగా, సంపూర్ణంగా ప్రతిఫలిస్తుందో!

"నా దృష్టిలో మీ రందరూ పవిత్రులు."

"త్యాగరాజు ఎందరో మహానుభావులు" అన్నాడు.

నాకు అందరూ మహానుభావులుగానే కనిపిస్తున్నారు.

"నా దృష్టిలో మీరు పరిపూర్ణ జ్ఞానస్వరూపులు."

నా దృష్టిలో మీరుకూడా భగవంతుడే."

నా దృష్టిలో అందరూ మంచివాళ్ళే."

"అందరిలోని మంచియే నాకు కనబడుతూ ఉంటుంది."

"నా దృష్టిలో అన్నీ మంచిరోజులే."

"నేను మీలో మాధవత్వం చూస్తాను."

ఒకరు అమ్మతో "మీ దృష్టిలో మనుషులూ యితర జంతువులూ ఒకటిగానే ఉన్నాయి" అంటే అమ్మ అన్నది "అవి యితరంగా కనుపించడంలేదు. అంతా నేనుగానే కనుపిస్తున్నది."

"అంతా ఆత్మగా కనుపించడమే ఆత్మసాక్షాత్కారం" అని కూడా అమ్మ ప్రవచించింది

ఒకనాడు డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు అమ్మను అడిగారు "అమ్మా-అమ్మకు తానే అయి ఉండడానికంటే లోకంవైపు చూడడానికే ఎక్కువ కాలం ఖర్చు అవుతున్నది."

"ఈ వ్యాపారంలో లాభనష్టాలు లే"వన్నది అమ్మ.

"నష్టమని కాదమ్మా. యోగులు నిర్వికల్ప సమాధిలో ఉంటారంటారు. మేము కొబ్బరికాయలు కొట్టి, హారతి యిచ్చి మిమ్మల్ని మా వేపు త్రిప్పుకుని మీకు సమాధిభంగం చేస్తున్నాం కదా-"

"నేను మీలో నన్ను చూసుకోనప్పుడుగదా చిక్కు?"

అమ్మదృష్టి అతిలోకమూ, అతిమానుషమూ, దివ్యమూ అయినది. ఆ దృష్టిలో అంతా తానే. అంతా ఆత్మే అంతా దైవమే.

"అంతా దివ్యంగా కనబడడమే దివ్యదృష్టి" అని అపూర్వ నిర్వచనాన్ని లోకానికి ప్రసాదించింది అమ్మ.

అమ్మ పాదాలలో కళ్ళున్నాయి.

అమ్మ వీపుకు కళ్ళున్నాయి.

అమ్మ తలచుట్టూ కళ్ళున్నాయి.

అమ్మ సహస్రాక్షి.

అమ్మ నిద్రపోతూ ఉంటుంది. ఎవరో ఒకరు వచ్చి అమ్మ పాదాలకు సమస్కారం చేసుకుని వెళతారు. అమ్మ మేలుకున్న తర్వాత ఫలానావారు వచ్చి నమస్కారం చేసుకొని వెళ్ళారుగదా ! అంటుంది. అట్లాగే అమ్మ గోడవైపుతిరిగి పడుకుని ఉంటుంది. వచ్చి కూర్చున్నవాళ్ళను పేరుపెట్టి పిలుస్తుంది అమ్మ.

ఇన్ని చూడగలిగిన అమ్మకళ్ళు చూడలేనిది ఒకటున్నది - "బిడ్డల దుఃఖం".

అమ్మకు కనుపించనవి- కులభేదం, గుణభేదం, లింగభేదం, వయోభేదం, జడచైతన్యం భేదం, నీవూ నే-నను భేదం.

శివలింగానికీ, గుండ్రాయికీ తేడా కనుపించదు- కుంకుడుకాయలు కొట్టే టప్పుడు.

మంచివాళ్ళనీ చెడ్డవాళ్ళనీ తేడా కనుపించదు - కడుపునిండా పెట్టుకునే టప్పుడు.

రుచుల్లో తేడా కనుపించదు- ఏమయినా తినేటప్పుడు.
సుఖదుఃఖాల్లో తేడా కనుపించదు- అనుభవించేటప్పుడు.
అమ్మకంటికి తగలనివి- మన తప్పులు.
"తల్లికి తప్పే కనిపించదు" అని ఘంటాపథంగా చెప్పింది.
"మీ మచ్చలు చూడడం అంటే అదే నాకు పెద్ద మచ్చ."

'మానవులు దుష్కర్మ చేస్తున్నప్పుడు - సర్వానికి కర్తవయిన తల్లివి - మీరు యీ బిడ్డల మనస్సులు మార్చి సన్మార్గంలో పెట్టవచ్చుకదా' అన్న సోదరునితో అమ్మ అన్నది "నాకు దుష్కర్మ కనబడితేగా?"

అమ్మకు కనిపించనివాళ్ళు- శిష్యులు, భక్తులు.

అమ్మది సమదృష్టి. విచక్షణ లేని వీక్షణ. "విచక్షలేని వీక్షణే - అనుగ్రహం" అన్నది అమ్మ.

"భోజనం చేశావా?" అని అమ్మ అడిగింది.
"లేదమ్మా."
"చేసి, రా నాన్నా-" అంటూ అమ్మ అన్నది.
"చెయ్యనివాడే నాకంటబడతాడు."

రోజూ అమ్మను చూడటానికి వచ్చిన వాళ్ళందరికీ అమ్మ కడుపునిండా అన్నం పెడుతున్నా- అక్కడ కూర్చున్న వాళ్ళల్లో ఏ యిద్దరినో, ముగ్గురినో అమ్మ అడుగుతుంది. వాళ్ళే అన్నం తినకుండా ఉంటారు. ఇక, వాళ్ళను అమ్మ అన్నానికి తరుముతుంది.

ఆ కళ్ళు ఆకళ్ళు పసికట్టడానికి కడు సమర్థములు.

ఆ కళ్ళల్లో మన ఆకలి కార్చిచ్చును చల్లార్చే ఆషాఢ పయోధరాలు ఎన్నో !

అమ్మకళ్ళల్లో హిమాలయాలు
అమ్మకళ్ళల్లో మహిమాలయాలు.
అమ్మకళ్ళల్లో మంత్రాలయాలు.
అమ్మకళ్ళల్లో మలయాచలాలు.

అమ్మకళ్ళు

అమ్మకళ్ళల్లో కావేరులు, గోదావరులు, గంగానిర్ఝరులు.
అమ్మకళ్ళల్లో నందనవనాలు, బృందావనాలు
అమ్మకళ్ళల్లో కామధేనువులు, కల్పవృక్షములు.
అమ్మకళ్ళల్లో లేనిదేమున్నది ?
అమ్మకళ్ళల్లో సమస్తలోకాలూ ఉన్నాయి.
అమ్మ విశాలాక్షి, కామాక్షి,
ప్రసన్నాక్షి, లోలాక్షి, నిటలాక్షి.
వామనయన, పద్మనయన.
సూర్య చంద్రాగ్ని నయన.
"కేవలాపాంగ వీక్షశ్రీ జగదేకైక శాసన."
"వక్త్రబింబోష్మ పరీవాహ చలన్మీనాభ లోచన."
"వందారు జనసందోహానేత్ర కైరవకౌముది."
పుత్ర పుత్రికా నయన కుముదాహ్లాద కౌముది.

అక్టోబరు 1982

మ హి మ లు

సాధారణంగా సంపాదకీయం రాయాలని ఆలోచించేటప్పుడు – అమ్మ ఆధ్యాత్మిక వ్యక్తిత్వం, అమ్మ లౌకిక పరిజ్ఞానం, అమ్మ మహిమలు, అమ్మ మమతలు వీటికి సంబంధించిన అసంఖ్యాక సంఘటనలు జ్ఞాపకాల తెరలను చీల్చుకుని బయటకు వచ్చి కళ్ళముందు నిలబడి కలంలోకి ప్రవేశించటానికి పోటీపడతాయి.

బయట వాన కుండపోతగా కురుస్తున్నది. బంగాళాఖాతంలో వాయు గుండం ఏర్పడ్డట్లు పత్రికలూ, రేడియోలూ ప్రకటించాయి. అప్పటికి కురిసిన వానతోనే చుట్టు జలార్ణవమై కనుపిస్తున్నది.

ఆలోచన ఆకస్మికంగా మహిమలపైకి పోయింది. ఈ మహిమలనేవి రెండు రకాలు. ప్రత్యక్షంగా జరిగేవి, పరోక్షంగా జరిగేవి ప్రత్యక్షంగానంటే– చెప్పి చేసేవి; ఎవరైనా అడిగితే చేసేవి; ఇంద్రియ గోచరమయ్యేవి. మహిమలను ప్రదర్శించే వాళ్ళ ఇచ్ఛాశక్తివల్ల, సంకల్పబలంవల్ల, మనోసిద్ధివల్ల ఇవి జరుగుతాయి.

పరోక్షంగా జరిగేవి అంటే– ఇందులో ప్రదర్శకులు ఉండరు; ప్రదర్శన ఉండదు; సంకల్పం ఉండదు; ప్రయత్నం ఉండదు. ఎంతటి అసాధారణ క్రియ అయినప్పటికీ అత్యంత సహజంగా జరిగిపోతుంది ఆ సమయంలో అది అసాధారణ సంఘటన అనికూడా అనిపించక సర్వసామాన్యమయిన విషయంవలెనే గోచరిస్తుంది. తీవ్ర పరిశీలనానంతరంగానీ అందులోని అసాధారణత్వమూ, అద్భుతమూ, మహిమా స్ఫురించవు. అప్పటికయినా ఇందులోని అలౌకికత అభివ్యక్తం కావచ్చునుకానీ అందుకు కర్త యెవరో బోధపడదు. కర్త యొక్క గుర్తింపు కేవలం "విశ్వాసం" పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్లనే "కర్త" వివాదాస్పదమైన విషయమై పోతుంది అమాటకువస్తే– అసలు విశ్వాసమే వివాదాస్పదమైన అంశం కదా!

మొదటిరకంవారు "సిద్ధవ్యక్తులు" అని పిలువబడితే – రెండవరకంవారు "అవతారమూర్తులు" అని ప్రస్తుతింపబడుతారు.

1978 ఆగస్టు 9 వ తేదీన జిల్లెళ్ళమూడిలో రెండు వివాహాలు జరగాల్సి ఉన్నాయి. లగ్నం మధ్యాహ్నం 1–2 గంటలమధ్య. క్రితపు రోజుననే వధూవరులూ, బంధుజనమూ వచ్చి ఉన్నారు. కావల్సిన ఏర్పాట్లన్నీ జరిగాయి. కానీ 8 వ తేదీ రాత్రినుండే జోరున వాన. ధార ఆగటంలేదు. పెండ్లి నిర్ణయం జరిపేటప్పుడే అనుకున్నాము– పెండ్లి మేడపైన అమ్మ సన్నిధిలోనే జరగాలని. వర్షం తగ్గకపోయినా క్రింద మందిరంలో వేదికపైన జరుపవచ్చునుగానీ అక్కడకు అమ్మ దిగిరాలేదు. అమ్మ ఆరోగ్యం ఏమీ బాగాలేదు. అమ్మలేకుండా జరుపుకోవడం వాళ్ళకు ఎవరికీ యిష్టం లేదు.

పైన జరపటానికి– వర్షం గంటగంటకూ ఎక్కువ అవుతున్నది కానీ తగ్గే సూచనకూడా కనిపించటంలేదు. ముహూర్తం సమీపిస్తున్నది. అందరికీ ఆందోళన అధికమవుతున్నది.

మధ్యాహ్నం పన్నెండయింది. ఆకాశం చిల్లి పడ్డదా– అనిపిస్తూన్నది వర్షం. వధూవరుల్లో ఎవరో బియ్యం బాగా తినివుంటారని కొందరు పరిహాసంగా అనుకుంటున్నారు. కొందరు అమ్మా– యీ కార్యం నెరవేర్చి కాపాడు– మని వారి వారి మనస్సుల్లోనే ప్రార్థిస్తున్నారు.

అంతా అలజడిగా ఆందోళనగా ఉంది. మాకున్కూడా కర్తవ్యం తెలీక– అమ్మవద్దకు వెళ్ళాము, అమ్మనే అడుగుదామని. కానీ ఆ అవకాశమూ మాకు దక్కకుండా అమ్మ స్నానం చేస్తున్నది.

పరిస్థితి మరీ అయోమయమై పోయింది. కానీ ఒక్క ఆశమాత్రం మెరుపులాగ మెరిసింది. సాధారణంగా అమ్మ వివాహవేదిక పైకిగానీ పూజాస్థలికిగానీ వచ్చేముందు స్నానం చేస్తుంది. మరి– యీ స్నానం పెండ్లికి తాను బయలుదేరే ముందు స్నానం యేమో !

.... అని ఆలోచిస్తుండగానే– వర్షపు ధారలు చినుకుల్లోకి, చినుకులు తుంపరల్లోకి మారి క్రమంగా వాన ఆగిపోయింది. అందరి మనసులు ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ పులకించాయి.

గబగబా షామియానా వేయబడింది. తోరణాలు కట్టబడ్డాయి. వేదిక అమర్చబడ్డది. అలంకరణ జరిగింది. మంగళవాద్యాలు మ్రోగాయి పురోహితులు క్రతువు ప్రారంభించేశారు. కళ్యాణకారిణి అమ్మవచ్చి సింహాసనాసేనఅయింది. రెండు కల్యాణాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆ ముహూర్తాన ఆ పెండ్లిండ్లు అలా పూర్తికాగలవని ఎవరూ ఊహించలేదు. అందరి మనస్సులు కరుణామయి అయిన అమ్మయెడల కృతజ్ఞతాభావంతో నిండిపోయాయి.

కాని యిందులో యింకొక వింత ఏమి జరిగిందంటే- పెండ్లి కాగానే భోజనాలు అయినాయి. భోజనాలు పూర్తిఅయి అందరూ యింకా చేతులు కడుక్కున్నారో లేదో, మళ్ళీ వర్షం మొదలయింది.

ఈ సంఘటన కేవలం అమ్మ అనుగ్రహ ఫలితమేనని అందరికీ అవగతమే. కారణం ఒక అదృశ్య శక్తి రెండుచేతులూ ముహూర్తకాలానికి అటూ యిటూ అడ్డుపెట్టినట్లు సుస్పష్టంగానే ఉన్నదాయె. ఇక ఆ శక్తి అమ్మకాక మరెవరు ?

పోనీ యీ సంఘటన కాకతాళీయ మనుకుందామా, అంటే లోగడ యిటువంటి సంఘటనలు అనేకం జరిగాయి.

1973 జూన్ 17 వ తేదీన లాల పెండ్లి. ఆ పెండ్లికి రెండురోజులు ముందుగానే రేడియోలు 'తుపాను తుపాను' అని గగ్గోలు పెట్టాయి జిల్లెళ్ళమూడికి 5, 6 మైళ్ళ పరిధిలో మినహా దేశమంతా భారీవర్షాలే. జిల్లెళ్ళమూడిపై ఎవరో గొడుగు పట్టినట్లుగా తెరిపి.

1971 లో చంద్రమోహన్ పెండ్లి. అచ్యుతరామ్ పెండ్లి! ఒకటేమిటి ? ఎందరో వర్షాకాలం అనికూడా సందేహించక జిల్లెళ్ళమూడిలో పెండ్లిండ్లు ఏర్పాటు చేసుకోవడమూ; అమ్మా-నీదే భారమని ప్రార్థేయపడడమూ.... అనుగ్రహస్వరూపిణి అమ్మ కనికరించడమూ.

ఇవన్నీ అమ్మ సర్వసామర్థ్యానికీ, పంచభూతాలపై అమ్మకుగల అధికారానికీ నిదర్శనాలని మనం భావిస్తాము కానీ అమ్మ మాత్రం సాధారణమయిన సంఘటనలే అంటుంది. ఇందులో నా ప్రయత్నమేమీ లేదు-అంటుంది. కనుకనే మనము ప్రకృతియే అమ్మని అనుసరించి అమ్మకు అనుగుణంగా ప్రవర్తిస్తుంది-అని భావిస్తాము.

ఈ విషయాన్నే యీ మాసపు విషయంగా వివరిద్దాము-అని నిర్ణయించు కునేసరికి-బయట వాన సంరంభం ఎక్కువయింది. వెంటనే ఒక ఆలోచన వచ్చింది. మరునాడే ఆగష్టు 15; అన్నపూర్ణాలయ వార్షికోత్సవం కదా. అందుకు ప్రత్యేకమైన పలు ఏర్పాట్లు చేయబడుతున్నాయి. ఈ సందర్భంలో అమ్మ యీ వానను ఏమి చేస్తుందో చూద్దాము. ఇందులో అమ్మ ప్రమేయంగానీ, ప్రతిభగానీ, ఏమయినా ప్రదర్శితమైతే యీ వ్యాసాన్ని ప్రచురిద్దాము; లేకుంటే మానేద్దాము-అని ఒక భావన కలిగింది.

ఆ రోజల్లా కురిసింది; రాత్రంతా కురిసింది. తెల్లవారింది. వాన మరీ ఎక్కువయింది. రేడియోలు ప్రమాదపు హెచ్చరికలు చేస్తున్నాయి. నదులు పొంగు తున్నాయి....ప్రకృతి మరీ విజృంభిస్తున్నది.

మరి ఉత్సవం ఎలా జరిగేటట్లు ?

విచిత్రం-మధ్యాహ్నం 12 గంటలయింది. వాన వెలిసింది. ఆకాశము నిర్మలమైంది. సోదరులు అనేకులు వచ్చారు. మేము బాపట్ల నుండి పూలూ, దండలూ తెప్పించలేక పూజ ఎట్లాగా అని విచారిస్తుంటే-గుడియాత్తం నుండి దండిగా దండలు వచ్చినయ్. పూజ వైభవంగా జరిగింది. వచ్చిన జనం తృప్తిగా భోజనం చేసి బాపట్ల చేరారు. జిల్లెళ్ళమూడి ద్వీపమే అయింది. చుట్టు సముద్రము ఏర్పడినది.

రెండు చేతులూ ఎత్తి అమ్మకు నమస్కరించి-కాగితాలూ కలమూ అందు కొనక తప్పలేదు.

(ఆగష్టు 1978)

కోటినామ పూజిత

శోభ, విలాసము, గాంభీర్యము, మాధుర్యము, స్థయిర్యము, తేజస్సు, లాలిత్యము, ఔదార్యము.... ఇవి లలితాంబిక లక్షణాలుగా శాస్త్రం చెబుతున్నది. ఈనాడు మనము అమ్మ స్వరూపాన్ని, అమ్మ స్వభావాన్ని, జాగ్రత్తగా పరిశీలిస్తే పై లక్షణాలన్నీ అమ్మలో పుంజీభవించినట్లు అర్థమవుతుంది.

లలితాంబిక పాదములు, కరములు, అంగుళులు, నయనములు, నాసిక, ముఖము, లలాటము.... ఒక టేమిటి సర్వావయవములు సౌందర్యోపేతములు.

ఇక-నేడు అమ్మను చూస్తే...సృష్టిలోని సౌందర్యమంతా ఒక మానవ ఆకృతి ధరించి మన ముందున్నదా-అనిపిస్తుంది.

అమ్మ సౌమ్య, స్వభావమధుర.

అమ్మ విశ్వమాత, విశాలాక్షి, విరాగిణి.

అమ్మ అన్నద, అజ్ఞానధ్వాంతదీపిక, అబాలగోపవిదిత.

అమ్మను అవలోకిస్తూ ఏ నామం స్మరించినా - ఆ నామం అమ్మను గురించే చెప్పినట్లుగా అనిపిస్తుంది.

చిదంబరరావుతాతగారు, లక్ష్మణాచార్యులుగారు, పెమ్మరాజు సత్యనారాయణగారు... ఎందరో అమ్మ చిన్నతనంలోనే అమ్మను రాజరాజేశ్వరీ అవతారముగా అవగాహన చేసుకుని ఆరాధించారు.

"తపో లబ్ధేన దివ్యేన జ్ఞానాగ్నిమయ చక్షుషా
పశ్యామి త్వాం మహాదేవీం మాయాం మానుషవిగ్రహం
హృదిస్ఫురతి దృష్ట్వా త్వాం లలితా సౌమ్యరూపిణీ
అపి చండీ మహాఘోరా లోకసంహారకారిణీ"

అని శ్రీ ప్రసాదరాయ కులపతి స్తుతించారు.

ఇమామ్ అనే ఒక ముస్లింయువకుడు అమ్మ సంకీర్తన నామాన్ని రూపొందించాడు. అది దేవప్రేరణ అని అతని విశ్వాసం. అదే యిపుడు జిల్లెళ్ళమూడిలో అఖండంగా సంకీర్తన చేయబడుతున్నది.

"జయహో మాతా శ్రీఅనసూయా రాజరాజేశ్వరి శ్రీపరాత్పరీ........" మొదటినామం మాత అది లలితాసహస్రనామాలలో మొట్టమొదటిది. మిగతా రెండు నామాలుకూడా లలితానామాలలోవే కావడం అత్యంత విశేషం.

అమ్మను గాయత్రీదేవిగా దర్శించారు శ్రీలక్ష్మీకాంతయోగి. రాజరాజేశ్వరియే అని ఉద్ఘాటించారు. శ్రీకాశీకృష్ణాచార్యులు.

శ్రీ లక్ష్మణ యతీంద్రులు - ఆ వేదవేద్యుడే రాముడు: ఆ రాముడే లలిత; ఆ లలితయే యీ మన అమ్మ. అమ్మ మరో రూపమే హైమ. మనందరనుకూడా లలితామూర్తులుగా మలచుకోవాలన్న అమ్మ అభిలాషే యీ పారాయణ కార్యక్రమానికి మూలం అని వివరించారు.

అమ్మ ఒకసారి చెప్పింది - ముందు మనం నామాన్ని పట్టుకుంటే తర్వాత నామమే మనను పట్టుకుంటుందిట. "పూజగానీ, ప్రార్థనగానీ మనం చేసేది ఏముందీ, వాడే మనచేత చేయించుకోవాలి" అని లోగడ అనేక పర్యాయాలు అమ్మ ఉద్బోధించింది. కనుకనే అమ్మ మనకోసం యింత పెద్దపెట్టున నామపారాయణ కార్యక్రమం ఏర్పాటుచేసింది. అంటే ఆనాడు మాత్రమే కోటినామాలుచేసి దానిని అంతతోనే విస్మరించాలనికాదు ఆనాడు అనుభవించిన నామామృతరుచిని సుస్థిరం చేసుకోవాలనీ; అంటే నిరంతరం ప్రతి హృదయంలో లలితనామ మధుర నాదం ప్రతిధ్వనిస్తూ ఉండాలనీ; అంటే నామరూపంతో ప్రతిహృదయంలో అమ్మ స్థిరనివాసిని అవాలని మరి నామానికీ నామికీ అభేదమే కదా! పర్యవసానంగా మనందరము లలితా-మూర్తులుగా పరిణామం చెందాలని అమ్మ మధురోహ.

అమ్మకూడా అనేక సందర్భాలలో తన అతిమానవ తత్వాన్నీ, దైవత్వాన్నీ సూచనప్రాయంగానే కాక ప్రస్ఫుటంగాకూడా ప్రకటించింది. తన సర్వమాతృత్వాన్ని అనవరతం పలురీతులలో ప్రవచిస్తూనే వున్నది.

"మీరు నా బిడ్డలేకాదు, నా అవయవాలుకూడా" అని చెబుతూ అమ్మ "కాలినొప్పి చేతికి తెలీదు: చెయ్యినొప్పి చెవికి తెలీదు. కాని మీ అందరి నొప్పి నాకు తెలుస్తుంది" - అని వివరించింది.

"మీరంతా నేనే; మీదంతా నేనే" అని అమ్మ స్పష్టపరిచింది.

ఈ ప్రకటనలవల్ల అమ్మకు సృష్టితో అంటే మనతో గల తాదాత్మ్యస్థితీ, అవినాభావసంబంధమూ అభివ్యక్తం అవుతున్నది.

ఈ ప్రకటనకూ, అమ్మ లలితా స్వరూపిణియే నన్న భావనకూ బలము చేకూర్చే సంఘటన ఒకటి జరిగింది నవంబరు 10 వతేదీన.

కోటినామపారాయణం గురించి — ఆ రాత్రి 7 గంటలకు కొందరు గణిత ప్రవీణులు కుస్తీ పడుతున్నారు. కొందరు కోటి పూర్తియైనదంటున్నారు. కొందరు కాలేదంటున్నారు.

అంతలో అమ్మ హైమాలయంకు వచ్చింది. ఈ సంగతివిని సాయంకాలం 6 గంటలకే పూర్తయిందని చెబుతూ శ్రీలక్ష్మణయతీంద్రులను ఆ విధంగా ప్రకటన చేయమని చెప్పింది. వారు చేశారు.

కానీ, కొందరు సంశయాత్ములు ఆ మాటను విశ్వసించలేక లెక్కలతో సతమతమై తుదకు కోటిపై ఎనిమిది లక్షలు పూర్తయినదని లెక్కలు తేల్చారు. అప్పటికి గం. 7—30 ని. లు అయింది. అంటే అమ్మ చెప్పినట్లు 6 గంటలకే కోటి పూర్తి అయిందన్నది సత్యం.

ఇందరు అంత కష్టపడి చేసిన లెక్క అమ్మ ఎట్లా చేసిందీ?

ఇందరు చేసినా - అందరూ అయివున్నది తానే కనుక తెలిసి ఉండాలి. చేసినదెందరయినా అవి చేరినది తనకే కనుక తెలిసివుండాలి.

కోటినామపూజిత అమ్మ ఆనాడు కోటివెలుగులతో దీపించింది.

(నవంబరు 1979)

మంగళగౌరి

శ్రావణమాసం అంటే మహిళల మాసం. క్రొత్తగా పెండ్లి అయిన కన్యలు శ్రావణమాసం రాగానే మంగళవారాలు, శుక్రవారాల్లో రంగురంగుల క్రొత్త పట్టుచీరెలు కట్టుకుని, క్రొత్త ఆభరణాలు పెట్టుకుని గౌరీపూజలు, వరలక్ష్మీ వ్రతాలు చేసుకుంటూ, తలనిండా పూలతో, చేతులకు తోరణాలతో ఉత్సాహంగా సందడిగా తిరుగుతూ కనులపండుగగా కనిపిస్తుంటారు.

కన్యలతోపాటు పెద్దవాళ్ళుకూడా వారి పసుపు కుంకుమలు వెయ్యేళ్ళపాటు నిలపమని మంగళగౌరీ దేవిని ప్రార్థిస్తూ నోములు నోచుకుంటారు.

ఇది హిందూ సంప్రదాయం. హిందూ స్త్రీలకు యీ నోములూ వ్రతాలూ అతి ముఖ్యమయినవి. ఇవి కేవలం విశ్వాసానికి సంబంధించినవే నని కొందరు అంటున్నప్పటికీ - పలువురు హిందూ స్త్రీలలో యిప్పటికీ ఈ నమ్మిక బలంగా ఉందనడంలో సందేహం లేదు.

శ్రావణమాసం రాగానే ఈ అందాలు జిల్లెళ్ళమూడిలోనూ నయనానంద కరంగా కనుపిస్తాయి. ఏ సంప్రదాయాలనూ పాటించని అమ్మ అందరి సంప్రదాయా లనూ, అన్ని సంప్రదాయాలనూ హర్షించడం విశేషం.

అమ్మ ఏ నోములూ నోచలేదు. ఏ వ్రతాలూ పట్టలేదు. ఏ పూజలూ చేయలేదు. 'నేనంటూ ఏ సంప్రదాయాన్నీ పాటించడంలేదు' అనీ, 'తెలిసి దీపారాధన కూడా నేను చేయలేదు' అనీ అమ్మ నిస్సంకోచంగా ప్రకటించిన విషయం అనేకుల దృష్టిని ఆకర్షించి భావ సంచలనం కలిగించింది. అయినా నోములు నోచుకుండేవారిని అమ్మ ప్రోత్సహిస్తుంది. నోముల్లోని పరమార్థాన్ని వివరిస్తుంది, అన్ని నోములకూ లక్ష్యం ఒకటే నంటుంది. 'అంతా అదే' నని సోదాహరణంగా మనకు బోధించటానికే అన్ని నోములూ అని అమ్మ ఉద్దేశం.

శ్రావణమాసంలో కేవలం జిల్లెళ్ళమూడిలో స్థానికంగా ఉండే స్త్రీలేకాక యితర ప్రదేశాలనుండి కూడా పలువురు స్త్రీలు వచ్చి నోములు నోచుకుంటారు.

ముందుగా అందరూ హైమాలయంలో పూజచేసుకుని, తర్వాత అమ్మ సన్నిధికి వస్తారు. అమ్మకు అందరూ కలిసి పూజచేసుకుంటారు. అమ్మకు నివేదనలు చేసి హారతి యిస్తారు.

తరువాత నోముకు సంబంధించిన వాయసం వరుసగా ఒక్కొక్క ముత్తయిదువ యిస్తుంది. వాయనం ఇచ్చిన పిమ్మట 'నా వాయనం అందుకున్న వనిత ఎవరు?' అని అడుగుతుంది. మంగళవారం అయితే "నేనే మంగళగౌరి" నని, శుక్రవారం అయితే "నేనే వరలక్ష్మి" నని – అమ్మ సమాధానం చెబుతుంది.

ఇది అత్యంత విశేషమైన విషయం.

సామాన్యంగా మనం – మన అనుభవంతో, నమ్మకంతో అమ్మను దైవంగా భావించి స్తుతిస్తే, అమ్మ ఆ స్తోత్రాలను ఖండిస్తుంది. "నేనూ మీవంటి దానినే. మీరు కానిది నేనేమి కాను" అని అనేక పర్యాయాలు ప్రకటించింది.

మనం అమ్మను సరస్వతిగానో, లక్ష్మిగానో, పార్వతిగానో భావించి పూజలు చేస్తుంటే.... అమ్మ చాలా ఉదాసీనంగా ప్రవర్తిస్తుంది పూజాసమయాల్లో ఆ పూజలు తనకు సంబంధించినవన్న స్ఫురణే కనుపించదు. ఈ విషయాన్నే అమ్మ స్పష్టంగా వివరించింది. "ఈ పూజలు నాకని చేస్తున్నారా ? ఏ లక్ష్మి అనో, పార్వతి అనో చేస్తున్నారు గానీ" అని అంటుంది అమ్మ.

అనేకులు అమ్మను వివిధ దేవతాస్వరూపాల్లో దర్శించినప్పటికీ అమ్మ మాత్రం ఆ విషయాన్ని అంగీకరించదు. ఒకసారి ఒక భక్తుడు 'నీలో నా యిష్టదైవాన్ని చూశానమ్మా' అంటే – "నాలో నీ యిష్టదైవాన్ని చూడటం కాదు, నాన్నా – నీ ఇష్టదైవమే నాలో కనిపించి ఉంటాడు" అని సవరించింది.

పరాకునగూడా అమ్మ తాను దైవాన్ననిగానీ అవతార వ్యక్తిననిగానీ ప్రకటించుకొనదూ; ఎవరైనా ఆ విధంగా ప్రస్తుతించినా అంగీకరించదు.

అటువంటిది ఈ వ్రత సమయంలో మాత్రం ముత్తయిదువులతో "నేనే మంగళగౌరిని" అని ప్రకటిసుంది.

1979 ఆగస్టు 14 వ తేదీన ఆడపిల్లలు నోము నోచుకుంటుండగా అమ్మ "నేనే మంగళగౌరి" అని ప్రకటించింది.

వెంటనే నేను అన్నాను "ఈ సందర్భంలోనైనా నిజం చెప్పావమ్మా" అని. "ఈ మాట నేనే అనటం ఏముందిరా ? ఈ స్థానంలో కూర్చున్న ఏ ముత్తయిదువ అయినా యీ మాటే అంటుంది. నేను అనడంలో ప్రత్యేకత ఏమి లేదు" అన్నది అమ్మ సమాధానంగా.

నిజమే. ఏ ముత్తయిదువ అయినా ఆ మాటనే అంటుంది. కానీ అందులో వాస్తవం ఏముంటుంది ? నాటకంలో పాత్రలు తామే కృష్ణుడుగా వ్యవహరించవచ్చును; తామే రాముడుగా ప్రవర్తించవచ్చును. అంతమాత్రంచేత ఆ నటులు ఆ అవతారమూర్తులు అవుతారా ? వాళ్ళ వాక్కుకు ఆ బలం వస్తుందా ? వాళ్ళ మాటకు ఆ పవిత్రత కలుగుతుందా ?

కానీ అమ్మమాట ? అతి పవిత్రమయినది. అతి శక్తిమంతమయినది. సత్యమయినది. త్రికరణశుద్ధి కలిగిన అమ్మ నోటివెంట ఏనాడూ వ్యర్థ వాక్యాలు, అసత్యవచనమూ రాకపోవడం అందరి అనుభవమూ. అమ్మకూడా యీ విషయాన్ని బాల్యంలోనే స్పష్టపరిచింది తనది నోరు కాదట. తన నోటివెంట తాలుమాట రాదట.

మరి యిప్పుడు ప్రముఖమయిన ఒక ప్రకటన చేస్తూ .... అది అందరి ముత్తయిదులవలే తానూ పలికాను – అంటే అది సత్యం ఎట్లా అవుతుందీ ? అది మనను భ్రమపరచటానికి అమ్మ వేసే ఒక తెర మాత్రమే గానీ.

సాక్షాత్తూ పరమేశ్వరి మానవాకృతిలో మనమధ్య మసలుతూ తన అలౌకిక చర్యలతో, అసాధారణ వాక్కుతో తన దివ్యత్వాన్ని సూచనప్రాయంగా తెలియజేయడమే కాక అప్పుడప్పుడు వాచకంగాగూడా యథార్థ స్వరూపాన్ని మనకు తెలియజేస్తున్న పరమ కారుణ్యాన్ని ఏమని ప్రస్తుతించడం !

ఈ అసాధారణ ప్రకటనను ఎందరు స్త్రీలు అర్థంచేసుకుని ఆ ప్రయోజనాన్ని పొందగలుగుతున్నారు ? ఆ కరుణను ఎందరు అవగాహన చేసుకొనగలుగుతున్నారు ?

ఈ అదృష్టం కేవలం స్త్రీలవరకే పరిమితమై లేదు. అమ్మది విచక్షణ లేని వీక్షణ గదా. ఈ కారుణ్యంలో భాగం పురుషులకూ అమ్మ పంచింది.

అనంతపద్మనాభ వ్రతంనాడు వాయనం అందుకుంటూ అమ్మ "నేనే అనంత పద్మనాభస్వామిని" అని ప్రకటిస్తుంది.

చర్యలతో, వాక్కుతో, పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రస్ఫుటమయ్యే అమ్మలోని అతిమానవశక్తినీ అలౌకిక స్ఫూర్తినీ మనం గమనిస్తున్నప్పటికీ - మరల అంతలోనే 'అసలు అమ్మ ఎవరూ?' అని ఎప్పటికప్పుడు విచికిత్సలో పడుతుంటాము.

అదే అమ్మలోని విశేషం !

ఇట్లా ఒక ముఖ్యమయిన సత్య ప్రకటనను ఆటలతో పాటలతో కలిపి దానిపై మన మనస్సు కేంద్రీకృతం కాకుండా చేసి—యథార్థాన్ని మనకు బోధ పడకుండా చేయడంలో అమ్మ సరదా ఏమిటో !

మీకు తెలియనిది తెలియజేయడానికే నా రాక - అని ప్రవచించిన అమ్మ యిట్లా సత్యానికీ మనకూ మధ్య తెరదించడంలో అంతరార్థం ఏమిటో !

అయితే - మరుగే నా విధానం - అని పలికిన అమ్మను ఎట్లా అర్థం చేసుకొనగలం ? - అమ్మే తానై అర్థమయితే తప్ప ! !

(ఆగస్టు 1979)

సర్వదేవదేవ స్వరూపిణి

"ఈ పూజలు నాకని చేస్తున్నారా? ఏ పార్వతి అనో, లక్ష్మి అనో, చేస్తున్నారుగానీ—"

ఈ అభిప్రాయాన్ని అమ్మ అనేక పర్యాయాలు అనేక రీతులలో అభివ్యక్తం చేసింది.

అను నిత్యం, అమ్మను అనేకులు అర్చించుకుంటారు. అర్చన ఎప్పుడూ దైవానికే జరుగుతుంది. అయితే, దైవం రెండురకాలు. ఒకటి నిర్వికారం; రెండు సాకారం.

నిరాకార దైవాన్ని మాత్రమే విశ్వసించేవాళ్లు ఎల్లప్పుడూ జిజ్ఞాసువులై విచారణ మార్గంలోనే పయనిస్తూ ఉంటారు. వాళ్లు చింతనలో ధ్యానంలో జపతపాల్లోనే వాళ్ళ కాలాన్ని గడుపుతారు. వాళ్ళూ అమ్మదగ్గరకు వస్తారు. వాళ్లు అమ్మలో "జ్ఞాని" ని మాత్రమే దర్శిస్తారు. అమ్మ వాళ్ళకు అవసరమైన విజ్ఞానాన్ని కరతలామలకం చేస్తుంది. వాళ్ళ చీకటిదారులలో జ్ఞానరోచిస్సులను నింపి దారిని సుగమం చేస్తుంది. వాళ్ళకంతే చాలు. వాళ్ళకిదే తృప్తి. అందుకనే వాళ్ళు అమ్మను గురువుగా భావిస్తారు.

రెండవ వర్గం వాళ్ళు దైవాన్ని సాకారంగా భావిస్తారు. వీళ్ళ భావనే అనేక రీతులలో చీలిపోయింది. సాకారదైవం అనేక రూపాలు గ్రహించాడు. వీళ్ళందరి చుట్టు అనేక పురాణాలు అల్లబడ్డాయి. ఆ పురాణాలలో అనేక కథలు చెప్పబడ్డాయి. ఆ కథలలో అనేక వర్ణనలు చేయబడ్డాయి. ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క రూపం యిష్టం. ఒక్కొక్క మనసుకు ఒక్కొక్క గుణం యిష్టం. కనుకనే ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క యిష్టదైవం. ఎవరికి వారికి వాళ్ళ యిష్టదైవమే ఈ జగత్ సృష్టి స్థితి లయాలకు కర్త అనిపిస్తుంది. మిగతా దైవస్వరూపాలన్నీ అల్పమైనవిగా గోచరిస్తాయి.

అందువల్లనే భక్తులలోకూడా పరస్పర వైరుధ్యమూ, ద్వేషమూ రగుల్తూ అనేక అవాంఛనీయ దుర్ఘటనలు సంభవిస్తూ ఉంటాయి. ఈ కారణంగా జరిగిన యెన్నో దారుణ మారణహోమాలు మానవజాతి చరిత్రకు శాశ్వత కళంకాన్ని ఆపాదించి పెట్టాయి.

కానీ అమ్మలో విశేషమేమిటి అంటే— ఎవరికి వాళ్ళు వాళ్ళ యిష్టదైవాన్నే అమ్మలో దర్శిస్తున్నారు. ఎందరో అమ్మదగ్గరకు వచ్చి "మిరు నా యిష్టదైవంగా సాక్షాత్కరించారమ్మా" అని విన్నవించుకుంటారు. అమ్మ మాత్రం వాళ్ళతో "అదికాదు నాన్నా. మీ యిష్టదైవమే నా రూపంలో కనిపించి ఉంటుందేమో...." అని నవ్వుతుంది.

అయితే యిక్కడ రెండు రకాలయిన ఊహలకు అవకాశం ఉన్నది. భక్తులు వాళ్ళ పరిపక్వమయిన భక్తితో అమ్మలో వాళ్ళ యిష్టదైవాన్ని దర్శించగలుగుతున్నారా? లేక అమ్మే సర్వదేవతా స్వరూపిణియై వారి వారి మనోభీష్టానుసారము అన్ని రూపాల్లోనూ ప్రత్యక్షమవుతున్నదా? ....

హిందువులలో స్థూలంగా మూడు కోవలు ఉన్నాయి. ఒకటి వైష్ణవులు, రెండు శైవులు, మూడు శాక్తేయులు. అమ్మను మూడు కోవలవాళ్ళూ మూడు త్రోవలవాళ్ళూ ఆరాధించటం విశేషం.

అమ్మను విష్ణుమూర్తిగానూ, ఆ విష్ణువు అవతారాలయిన రాముడుగానూ కృష్ణుడుగానూ ఆరాధిస్తారు. పరమేశ్వరుడుగానూ, పార్వతిగానూ అర్చిస్తారు. స్త్రీ ఆకృతిలో ఆవిర్భవించటంచేతనేమో— అధికులు అమ్మను శక్తిస్వరూపిణిగానే మనో మందిరాలలో ప్రతిష్ఠించుకుంటారు.

అమ్మ జీవిత చరిత్రకూడా అమ్మ శక్త్యవతార మనటానికే దోహదం కలుగజేస్తున్నది. అమ్మ ఈ అవనీతలంపై అవతరించిన సంవత్సరంలో మన్నవలో రాజ్యలక్ష్మి దేవాలయంలో రాజరాజేశ్వరీ యంత్రాన్ని ప్రతిష్ఠించటం జరిగింది. కనుక ఆ అమ్మవారే అమ్మరూపం ధరించిందని ఆ గ్రామస్తులు ఊహించటమేకాక తర్వాత అనేక పండితులు దానిని ధృవపరిచారు.

కాలగమనంలో అమ్మ ప్రతిమనిషినీ తన కన్నబిడ్డగా ప్రేమించటం తోనూ, జగత్తునంతా కన్నతల్లివలే ఆదరించటంతోనూ జగజ్జనని అయింది. లలితమైన ప్రవృత్తిచేత లలితగా భావించబడింది. కోరిన కోరికలెల్లా తీర్చటంతో కామేశ్వరి అయింది. పాతివ్రత్యంతో పంచభూతాలను జయించి సీత అయింది. సహనములో సరిహద్దులనుచూసి భూదేవి అయింది. అపారమైన జ్ఞానంతో సరస్వతి అయింది. అందరికీ అడిగినవన్నీ అనుగ్రహిస్తూ, అన్నిటికీ కారణం కాలమేనని వివరిస్తూ ఆ కాలమే తానై కాళిక అయింది. అందరికీ అందినట్లే కనుపిస్తూ ఎవ్వరూ అధిరోహించ లేని "వల్లకాని మిట్టపై" అధివశించి అందరికీ దుర్గమమై దుర్గ అయింది. మనిషిలోని పశు ప్రవృత్తినీ, అసురభావాన్నీ సన్మార్గానికి మళ్ళిస్తూ మహిసాసురమర్దని అయింది.

కనుకనే "దేవి" ని విభిన్న మూర్తుల్లో ఆరాధించే నవరాత్రి ఉత్సవాలకు జిల్లెళ్ళమూడిలో మరింత ప్రాధాన్యం. బిడ్డలందరూ భక్తులై అనేకరీతులలో అత్యధిక ఉత్సాహంతో అమ్మకు పూజలుచేసుకుంటారు.

అమ్మ అన్నిటినీ అంగీకరిస్తుంది. అదే విచిత్రమూ, విశేషమూ కూడా!

మామూలుగా అమ్మ "దైవా" న్నే ఒప్పుకోదు. ఈ "కనుపించేదంతా దైవమే" ననటమే గానీ ఈ సృష్టికి భిన్నమై ఈ సృష్టి స్థితిలయకర్తయై ఎక్కడో ఒక రూపంతో దేవుడుంటాడనే భావాన్ని అమ్మ సమ్మతించదు. అన్ని రూపాలూ దైవమేనని బోధించే అమ్మ అవతార వ్యక్తులని ప్రత్యేకంగా ఎవరిని చూపిస్తుంది ? అవతార వ్యక్తులే లేనప్పుడు అర్చన లెవరికి ? "దేవు" డే లేనప్పుడు పూజలెందుకు ? కనుకనే ;అమ్మ తాను ఎప్పుడూ ఎవరికీ పూజచేయలేదు. పూజచేయమని ఎవరినీ ఆదేశించలేదు.

కానీ —

సర్వసామర్థ్యానికీ, సర్వ విజ్ఞానానికీ ఖని అయిన మనస్సు మాత్రమే మనిషికి మహోన్నతమైన, అసమానమైన, అమూల్యమైన సంపద అనీ, అత్యుత్తమ

గురువనీ, దైవమనీ అభిభాషించే అమ్మ- ఆ మనోనిశ్చలతకు, నైర్మాల్యానికి పూజను ఒక సాధనంగా మాత్రమే అంగీకరిస్తుంది.

కనుకనే దేవుడే లేడనే అమ్మ, అవతారాలనే అంగీకరించని అమ్మ, ప్రతి మనిషికీ ఆస్తిక భావమూ, దైవ విశ్వాసమూ అవసరమని చెప్పని అమ్మ- పూజా సాంప్రదాయాన్ని అంగీకరించటమేకాక తాను ఆ దైవ ప్రతీకగా పూజావేదికపై ఆసీనకావటం ; ఆ పూజలూ, నివేదనలూ అందుకొనటం విచిత్రంగా కనుపించినా, అది మనందరి అదృష్టం; అమ్మకు బిడ్డలపై గల అత్యంతతానురాగానికి నిదర్శనం.

(అక్టోబరు 1977)

వాత్సల్య రూపిణి

1980 జూన్ 19 వ తేదీ ఉదయం 6 గంటల సమయం. వాతావరణం అత్యంత ఆహ్లాదకరంగా ఉంది. ఆకాశంలో అక్కడక్కడో మబ్బుతునక కనిపిస్తోంది.

అమ్మకు నమస్కారం చేసుకుందామని అమ్మ గదిలోకి వెళ్ళాను. అమ్మ మంచంపై పడుకుని ఉంది. ప్రణమిల్లాను. అమ్మనుండి పలకరింపు లేదు. మామూలుగా ఆ తరుణంలో అమ్మ పలకరిస్తుంది. అందువల్ల ఆశ్చర్యంగా అమ్మవంక చూశాను. అంతకంటే విభ్రమచకితం చేస్తూ అమ్మ కళ్ళనిండా నీళ్ళు. కారణం అర్థంకాలేదు. ఏమిటమ్మా? – అన్నాను. మౌనమే సమాధానం. కారణాలు వెతుక్కోవడం ఆరంభించాను.

అంతలో సోదరుడు రిచర్డుషిఫ్‌మన్ గడపదాకా వచ్చి-లోపలికి చూసి వెనుదిరిగాడు. నేను ఏమయినా అంతరంగిక విషయాలు మాట్లాడుతున్నానని భ్రమించి అలా వెళుతున్నాడేమో – నని నేనే అతణ్ణి లోపలికి పిలిచాను.

అతను లోపలికి వచ్చి కూర్చున్నాడు.

అమ్మ ఒకసారి రిచర్డును చూచి నన్ను ఉద్దేశించి "రిచర్డు రేపే వెళ్ళిపోవాలట" అన్నది. అమ్మ రిచర్డును చూచిన చూపులో ఎంతో వాత్సల్యం ఉంది; ఎంతో కారుణ్యం ఉంది. పైగా ఎంతో దీనత్వం ఉంది. ఆ దీనత్వమే మనస్సు మాయచేస్తుంది. తానేమీ చేయలేని అశక్తతను ఆ చూపు తెలియజేస్తుంది. ఏమయినా చేయగల అమ్మ తనకేమీ చేతగాదని మనకు తెలియజేయాలనుకోవడం అమ్మలోని ఒక ప్రత్యేక లక్షణం. సాధారణంగా మనుషులు తమకు తెలిసిన దానికంటే ఎక్కువ తెలిసినట్లూ, తమకు చేతనయిన దానికంటే ఎక్కువ చేయగలిగినట్లూ నటిస్తూ యితరులను భ్రమలో ముంచెత్తటానికి శతథా ప్రయత్నిస్తుంటారు. అమ్మ విధానం సాధారణ మానవ నైజానికి పూర్తి వ్యతిరేకం!

"అతనికి వెళ్ళాలని ఉంది – అతను వెళితే మనకూ బాధ లేదు. అతను యిక్కడనే వుండాలని అనుకుంటున్నాడు. ప్రభుత్వమేమో బలవంతాన పంపి

స్తున్నది" అంటున్న అమ్మ కంఠం రుద్ధమై పోయింది. కళ్ళు టపటపా వర్షించాయి. అమ్మను చూసిన నా మనసూ ఆర్ద్రమైపోయింది.

'అమ్మ నిన్నుగురించి కన్నీళ్ళు కారుస్తున్నది' అన్నాను రిచర్డుతో. ఆ మాట వినగానే అతని మనస్సు మరింత బాధపడ్డట్లు అతని ముఖం మరింత ఎఱ్ఱబడింది. అతను కొంచెంగా ముందుకు జరిగి "నన్న అమ్మ నాకు హామీ నిచ్చింది. మళ్ళీ యిక్కడకు తీసుకొనివస్తానుగా-అని. అప్పటినుండి నాకు ధైర్యంగానే ఉన్నది. నేనిప్పుడు అంతగా బాధపడటం లేదు-" అన్నాడు, నాకు చెబుతున్నట్లుగానే. కానీ అతడు అమ్మనే చూస్తున్నాడు. ఆ చూపులు ఎంతో ప్రేమా, మరెంతో కృతజ్ఞతా భావమూ మిళితం చేసుకుని అమ్మచరణాలను పెనవేసు కుంటున్నట్లున్నాయి.

రిచర్డు షిఫ్‌మన్ అమెరికా దేశస్థుడు. షుమారు 27 సంవత్సరాల వయస్సు మాత్రం ఉంటుంది. బ్రహ్మచారి. అత్యంత శాంత స్వభావం కలవాడు. మితభాషి. అతిమృదువుగా మాట్లాడుతాడు. ఏ వేళలోనూ ఏ విధంగానూ ఎవరికీ బాధాకరంగా ప్రవర్తించడు. అమ్మ యందు అచంచలమయిన భక్తి విశ్వాసాలు కలవాడు. అమ్మలో దైవాన్ని చూడగలిగినవాడు. తాత్విక చింతన కలవాడు. అమ్మ చరిత్రను, అమ్మ సిద్ధాంతాలను నిత్యమూ అధ్యయనం చేస్తాడు. సులభమయిన యింగ్లీషుభాషలో అమ్మను యింగ్లీషుభాష తెలిసిన వారికి తెలియజేయడానికి తీవ్రమయిన కృషి చేస్తున్నాడు.

రిచర్డు మొట్టమొదటిసారిగా అమ్మను 1975 లో నెల్లూరులో డాక్టర్ S.V. సుబ్బారావుగారింటిలో చూచాడు. 1976 లో జిల్లెళ్ళమూడి వచ్చి ఆరు నెలలు ఉన్నాడు. అతనికి అమ్మ ఆరాధ్యమయింది. అమ్మ నివసించే ఆవరణం పరమాప్తమయింది.

అతను అమెరికా వెళ్ళిన తర్వాతకూడా అతను తిరిగి జిల్లెళ్ళమూడి రావాలని తహతహలాడిపోయాడు. జిల్లెళ్ళమూడిలోని 'అందరిల్లు' ను తన స్వంత యిల్లుగానే మనఃపూర్తిగా భావించాడు. కనుకనే అందరింటి అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లోను ఉత్సాహంగా పాల్గొంటాడు.

రోజూ అమ్మకు కావలసిన చందనం తానొక్కడే గంటలకొద్దీ కూర్చుని తయారుచేస్తాడు. అవకాశం లభ్యమయితే చాలు, అమ్మ సన్నిధిలో ఎన్ని గంటలయినా మౌనంగా కూర్చుంటాడు.

ప్రతినెలా ప్రచురింపబడే యింగ్లీషు మాసపత్రికకు ప్రస్తుతం తానే సంపాదకుడు. అమ్మను గురించి ఒక గ్రంథంకూడా ప్రచురణకు సిద్ధంచేశాడు. దానిని మనదేశంలోనే మన ప్రెస్సులోనే ముద్రించాలనుకున్నాడు కానీ ప్రభుత్వం యిక్కడ నివసించడానికి అనుమతి నివ్వని కారణంగా అమెరికా వెళుతున్నాడు. కనుక అక్కడ ప్రచురిస్తానని చెప్పాడు.

"అమ్మా-యిదీ ఒక విధంగా మంచిదే. ఇంతవరకు నిన్ను గురించిన గ్రంథం ఒక్కటికూడా విదేశాల్లో ప్రచురితం కాలేదు. ఇతను అమెరికా వెళితే ఆ లోటూ తీరుతుంది" అన్నాను.

"అతను యిక్కడ ఉండేటట్లు చూడండీ- ఆ పుస్తకం యిక్కడనే అచ్చు వేయించవచ్చును అతను యిక్కడ ఉండగలిగితే-ఆ పుస్తకం ముద్రణ కాకపోయినా సరే-ఎన్ని పుస్తకాలు ప్రచురించినా-అతనికి యిక్కడ ఉన్నట్లుగా ఉండదుగా" అన్నది అమ్మ. ఆ స్వరంలో ఎంతో మార్దవమూ సానుభూతీ స్ఫురించాయి.

పూర్వం ఒకసారి 1968 న సంవత్సరంలో మార్వా అనే అమెరికా సోదరి కొంతకాలం అమ్మసన్నిధిలో ఉండి అమెరికా వెళుతూ "అమ్మా—నేను వెళ్ళి ఉద్యోగంచేసి డబ్బు కూడపెడతాను. ఆ డబ్బుతో నీకు కారు కొని పంపేదా? లేక నేను మళ్ళీ నీ వద్దకు వచ్చేదా?" అని అమ్మను అడిగింది. అమ్మ వెంటనే "నీవే రా" అని సలహా చెప్పింది.

పుస్తకాలూ వద్దూ, ప్రచురణలూ వద్దూ – అతను ఉండిగలిగితే చాలూ...అంటున్న అమ్మనుచూస్తే, మార్వా సంఘటన స్మృతిలో మెదిలి 'అమ్మకు మనపై గల ప్రేమ అభివ్యక్తమవుతూ అవ్యక్తానంద రసోదధిలో ముంచెత్తింది.

"అమ్మా-అతను ధైర్యంగా వెళతానంటుంటే నీ వెందుకమ్మా దిగులు పడతావు?" అని అడిగాను. "అదే అర్థం కావడంలేదురా. మీకున్న గుండెనిబ్బరం నాకు లేదు. వాడ్ని చూడకుండా నేనుండలేనని కాదు; నన్ను చూడకుండా వాడుండలేక బాధపడతాడేమోనని" అని వివరించింది అమ్మ. ఆ వివరణలో మమతామృత రహస్యం యిమిడి ఉంది.

1980 జూన్ 16వ తేదీన గుంటూరునుండి ఒక సోదరి వచ్చింది. ఆమె అమ్మవద్దకూర్చుని తన క్లిష్టసమస్యను అమ్మకు నివేదించుకున్నది. తమకు ఒకతే కూతురు. మగపిల్లలు లేరు. ఆ అమ్మాయికి పెండ్లిచేశారు. అల్లుడు అమెరికాలో ఉన్నాడు. అమ్మాయికూడా అక్కడకు వెళ్ళింది. ఇద్దరూ ఉద్యోగం చేసుకొని బాగా సంపాదిస్తున్నారు. ఇద్దరూ అన్యోన్యంగా ప్రేమగానే ఉంటారు. అయితేనేం, ఆ అమ్మాయికి శాంతి లేదు. చిన్నప్పటినుంచీ తలిదండ్రులవద్ద గారాబంగా పెరిగినందున – అమ్మాయికి తలదండ్రులంటే అమితమయిన ప్రేమ. వాళ్ళను వదిలి ఉండలేని స్థితి. ఆ పరిస్థితి భర్తకు యిష్టంలేదు. ఆ మాట కూడా అతడు సహించలేడు. వాళ్ళను స్మరించకుండా అమ్మాయి ఉండలేదు. కూతురయినా, కొడుకయినా ఆ తలిదండ్రులకు తానొక్కతే కనుక వాళ్ళను తానే చూడాలని అమ్మాయి వాదన. తానే కొడుకయితే వాళ్ళను దగ్గర పెట్టుకొనిపోషించవలసిన బాధ్యత లేదా-అనిఅమ్మాయి ప్రశ్న. ఈ కారణంగావాళ్ళిద్దరి మధ్య ఘర్షణ. దాన్ని తట్టుకోలేక అమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం. పరిస్థితులను విపులీకరిస్తూ "అమ్మా మేము ఎలాగయినా ఉంటాము. మా ఎడబాటులో అమ్మాయి ఉండలేక పోతున్నది. మమ్మల్ని మరచి పొమ్మంటున్నాం. కాని అమ్మాయి నిరంతరం మమ్మల్ని గురించే ఆలోచిస్తుంది."

మధ్యలోనే అమ్మ ప్రశ్నించింది "మీరు మరచిపోగలరా?" అని.

ఆమె ఒక క్షణం మౌనంగా ఉన్నప్పటికీ మరుక్షణంలోనే "మరచిపోలేమమ్మా"– అన్నది.

"ఈ పరిస్థితిలో ఏమి చేయమంటావో చెప్పమ్మా" ఆమె యింతవరకూ కన్నీళ్ళతోనే ఉన్నది. ఇప్పుడా కన్నీరు వాగైంది.

"నేనూ అదే స్థితిలో ఉన్నాను. మీకేం సలహా యివ్వగలనమ్మా?" అన్నది అమ్మ–ఆమెను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ.

"నీవూ చెప్పకపోతే నేనేం చేయగలనమ్మా? నీవే యీ దుఃఖానికి నివారణోపాయం చెబుతావని గంపెడు ఆశతో నమ్మకంతో వచ్చాను," ఆమె ప్రాధేయ పూర్వకంగా అడిగింది.

"మీ ఆశనూ, నమ్మకాన్నీ నేను కాదనటం లేదు. కాని యీ తల్లీ బిడ్డల బంధాన్ని ఎవరు తెంపగలరు? ఎవరు తెంపుకోగలరూ? ఒకళ్ళ నొకళ్ళు మరవాలంటే మాటలా?" అమ్మ సూటిగా ప్రశ్నించింది.

మాతృప్రేమకూ, పుత్రవాత్సల్యానికి ప్రతీకగా రూపు దాల్చిన అమ్మ మరో విధంగా ఎట్లా చెబుతుందీ? ఏమి చెబుతుందీ?

1980 జూన్ 2వ తేదీన — అమ్మగదిలో ఉండే పిల్లిని, పిల్లి పిల్లలనూ ఒక గోతంలో వేసుకుని వాటిని మరో ఊరిలో వదిలిరావడానికి ప్రయత్నం జరిగింది. అంతలో యీ విషయం అమ్మకు తెలిసింది. అమ్మ ఆ ప్రయత్నం విరమించి వాటిని స్వేచ్ఛగా వదిలి వేయమని ఆదేశించింది.

అవి అమ్మగదిలో ఉండడంవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. అవి అటూ యిటూ దూకుతూ ఆడుకుంటుంటాయి. అది అందరికీ ముచ్చటగానే ఉంటుంది. కానీ మంచిచెడ్డలూ ఉచితానుచితాలూ తెలియని జంతువులు కనుక అవి అమ్మ మంచంమీద కెక్కుతాయి అమ్మ సింహాసనం మీదకు ఎక్కుతాయి. అయినా ఎలాగో సహించ వచ్చును. కానీ అవి వాటిపైననే మలమూత్ర విసర్జన చేయడం మొదలు పెట్టాయి. అమ్మగుడ్డలతో ఆడుకుంటూ చింపేవి. చివరకు పిల్లలకు ఆహారంకోసం రోజూ రాత్రిళ్లు ఆ పిల్లి ఎలుకలను చంపి అమ్మగదిలోకి తీసుకువచ్చేది. తెల్లవారేసరికి గది అంతా రక్తపు మరకలు; మాంసపు ముక్కలు ......

ఇక ఆ దృశ్యాలను చూడలేక, ఆ పరిస్థితిని సహించలేక మేము ఆ ఆలోచన చేశాము. అమ్మ అంగీకరించలేదు సరికదా–మీరు బజారుకు వెళ్ళారనుకోండి. అక్కడ మంచి పండ్లు కనుపిస్తాయి. వాటిని కొనుక్కువచ్చి మీ పిల్లలకు పెడదామను కోరూ? తోటలో మంచి కూరగాయలను చూస్తే కోసుకువచ్చి కూరచేసి మీ పిల్లలకు పెట్టాలని కోరుకోరూ? అవీ అంతే. దాన్ని గురించి యింత ఆలోచనా, అల్లరీ ఎందుకూ?" అని అమ్మ చురుగ్గా మందలించింది

రోజూ సరదాగా తన సాన్నిధ్యంలో ఆడుకునే ఆ పిల్లులుకూడా తనను వదిలి వెళ్ళిపోవడం అమ్మకు దుర్భర మనిపించింది. ఆ పిల్లుల యందుకూడా తనకు వాత్సల్యమే.

ఒకసారి తనకు నివెదన చేయబోయే అన్నాన్ని 'పిల్లి ముట్టుకున్న దమ్మా' అంటే "పిల్ల ముట్టుకున్నది" అని సరిచేసిన అమ్మ సర్వమాతృత్వం సర్వజగతినీ సమ్ముగ్ధులను చేస్తుంది.

అమ్మ ప్రతిమాటలోను ప్రతి చేతలోను-అవి ఎంత చిన్నవయినా పెద్ద వయినా-సర్వత్రానురాగ సుమధుర పరిమళాలు గుబాళిస్తుంటాయి. అయితే వాటిని ఆఘ్రాణించగల, అర్థంచేసుకొనగల, అనుభవించగల నేర్పు ఉండాలి. మరి - ఆ నేర్పును అమ్మే అనుగ్రహించాలి.

అందుకనే ఎవరు ఏ ప్రయత్నం చేసినా, ఏ సాధన చేసినా ఆ అనుగ్రహం సంపాదించడం కోసమే ననిపిస్తుంది.

అమ్మ - ఆ సాధనకూడా అనుగ్రహం ఉంటేనే సాగుతుంది-అంటుంది.

(జూన్ 1980)

ప్రాణేశ్వరి, ప్రాణదాత్రి

అత్యుత్సాహవంతంగా అమ్మ జన్మదినోత్సవాలకు కావల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొరతలున్న భవన నిర్మాణము పూర్తి అవుతున్నది. నీటిసరఫరాకు కావల్సిన కార్యక్రమం నడుస్తున్నది. పందిళ్ళు వేస్తున్నారు, అమ్మకు పూజావేదిక నిర్మిస్తున్నారు. పందిళ్ళకు విద్యుద్దీపాలు అమరుస్తున్నారు. ఎటు జూచినా ఎంతో సందడి; ఎవరిలో జూచినా చెప్పలేని సంబరం.

కానీ.... హఠాత్తుగా అశనిపాతం. కాలమే స్తంభించినట్లయింది. ఎక్కడివారి కక్కడ అన్ని అవయవాలు నిశ్చేష్టమయినాయి.

కాల మనండీ, దైవమనండీ, విధి అనండీ, అమ్మ అనండీ-- ఎంత విచిత్రమయినది ! ఈ రోజున మనం యీ ఉత్సవం జరుపుకుంటుంటే మన అందిరి రెండు కన్నులూ అశ్రుపూరితాలవుతున్నాయి. ఒక కంట ఆనందాశ్రువులూ, మరోకంట విషాదాశ్రువులూ జాలువారుతున్నాయి. ప్రేమమూర్తియైన అమ్మ మనల నందరినీ సముద్ధరించటానికి కరుణతో అవని మీదకు అడుగిడిన పర్వదినమని పొంగు దామా ? మన ప్రియసోదరి, మనహైమ నేడు మన మధ్యలేదని గుండెలు బాదు కుందామా? రెండూ తప్పటంలేదు. ప్రతి నాణేనికీ బొమ్మా, బొరుసూ ఎట్లా సహజమో -ప్రతి జీవితానికీ సుఖదుఃఖాలు రెండూ విడదీయరానివనీ అమ్మ అనవరతం బోధిస్తూనే ఉన్నది. తరచూ చేసి చూపించే ప్రయోగాలలో యిది మరింత బలమయి నదీ, గాఢమయినదీ.

జిల్లెళ్ళమూడిలో అమ్మ చరణసన్నిధిలో ఎప్పుడూ ఒక శుభమూ, అశు భమూ అబేధ్యంగానే జరుగుతూ వస్తున్నాయి. అయితే, ఒకదానికోసం మరొకటి ఏదీ ఆపబడటంగాని, వాయిదాపడటంగాని లేదు. సర్వమూ తానయిన అమ్మ అన్నివేళలా ద్వంద్వాతీతంగానే మనం నడిపిస్తున్నది. సంతోషమేగాక శోకాన్ని యిచ్చే అమ్మ శోక ఉపశమనమూ అనుగ్రహిస్తునే ఉన్నది.

అమ్మ సర్వశక్తిమంతురాలనటంలో, ఘటనా ఘటన సమర్థురాలనటములో మనకేమీ సందేహంలేదు. అమ్మ సన్నిధిన రోగరహితులైన వారితోపాటు రోగగ్రస్తులయినవారూ ఉన్నారు. అమ్మ సేవ వలన, అమ్మ ధ్యానం వలన ఆనందానుభూతిమే గాదు, దుఃఖానుభవమూ ఉంటున్నది. ఒకసారి ఒక విషయంలో ఒకరు-అమ్మ సన్నిధిలో అట్లా జరగటమేమిటి? అటువంటి దుర్ఘటన ఎందుకు జరుగుతుంది ? అని ప్రశ్నిస్తే-"జరుగుతుంది" అని చెప్పాను. అతనికి అర్థంకాక అయోమయముగా చూస్తూ కారణ మడిగితే-"అమ్మ దైవమే కనుక" అన్నాను. అమ్మ దైవమని మనం నమ్మినపుడు, దైవం సర్వవ్యాప్తమని మనం విశ్వసించినపుడు-అమ్మ సన్నిధి ఏమిటి? అమ్మలేనిది యెక్కడ ? మరి, లోకములో దుర్ఘటనలు జరగటంలేదా ? దుస్సంఘటన జరిగిన స్థలంలో అమ్మ లేదందామా ? అప్పుడు మన విశ్వాసాలు ఏమైనట్లు ?

అమ్మ జీవితచరిత్ర పరిశీలిస్తే-అనేక అద్భుత సంఘటనలు ద్యోతిత మౌతాయి. సామాన్య మానవులకు వారి దేహాలమీద కాని, మనసుల మీదగాని అధికార ముండదు. వారి మనసులు వారు చెప్పినట్లు ఆలోచించవు. ఆలోచనల ననుసరించి అవయవాలు పనిచేయవు. ఈ రెంటికీ వెనుక ఏదో అదృశ్యమైన శక్తి ఉండి నడుపుతుంది. కాని అమ్మ విషయంలో అట్లాకాదు. అనేక సంఘటనలు ఆధారంగా ఆలోచిస్తే -అమ్మకు తన శరీరంమీదా, మనసుమీదా పరిపూర్ణమైన అధికారమున్నట్లు వ్యక్తమవుతుంది. అమ్మ ఆహారం తీసుకోదు. కాని దేహ పోషణకు లోపం లేదు. శరీరకాంతి, ప్రసారంలో అవరోధం లేదు. అమ్మ నిద్రించదు. కాని అమ్మ కన్నులలోగానీ ముఖంలోగాని ఏ విధమైన ఆలసత్వమూ గోచరించదు. ఆ వదన మెప్పుడూ సద్యోవికసిత కుసుమంవలె ఉంటుంది. ఆ కన్నులు తేజో నిలయాలై కరుణాకరాలై దీపిస్తూ ఉంటాయి.

అమ్మ విషసదృశాలైన మూలికలూ, ద్రావకాలూ లోనికి తీసుకున్న సంఘటన లున్నాయి. అవి అమ్మను యేమీ చేయలేక పోయినాయి. పంచభూతాలూ అమ్మకు హాని చేయలేక తలవంచాయి. నిత్య జాగ్రత్తయేగానీ, స్వప్న సుషుప్తులు ఎఱుగని అమ్మకు మనసుమీద అధికారమున్నదనటములో అతిశయోక్తి యేమున్నది ?

ఇంతే గాదు. అమ్మకు ఇతరుల మనసులనూ, శరీరాలనూ, ప్రాణాలనూ శాసించే అధికార మున్నదని చెప్పడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. అమ్మ

మన ఆలోచనలను గ్రహించటమే గాదు, మన ఆలోచనలను తనకు అభీష్టమయిన, అవసరమయిన విధముగా చోదింపగలదనే విషయం అనేకులకు అనుభూతమైనదే. ఇతరుల శరీరాలను కీలుబొమ్మల్లాగ ఆడించగలదనేందుకు కూడా దృష్టాంతాలు అసంఖ్యాకంగానే వున్నాయి.

ఇక ప్రాణాల విషయము ఆలోచిద్దాము.........చిన్నతనంలోనే అమ్మ ఒక ముసలివానికి అతని మరణం విషయము ముందుగానే సూచించి, మరణించగానే పునరుజ్జీవితుని చేసి, తిరిగి మరణాన్ని యిచ్చింది. మరోసారి రైలులో ప్రయాణం చేస్తూ— ఒక పిల్లవాడు మరణిస్తే, అతనికి ప్రాణమిచ్చి తిరిగి తీసుకున్నది.

బామ్మ చరమదశకు వచ్చినప్పుడు – నాన్నగారు జమాబందికి బాపట్లలో ఉన్నారు. అప్పుడు అందరూ ఆందోళన పడుతూంటే - 'నాన్నగారు లేకుండా ఎట్లా పోతుంది?' అన్నది అమ్మ. అట్లాగే తరువాత నాలుగు రోజులకు నాన్నగారు వస్తే, వచ్చిన రోజునే (31–5–౬౬) బామ్మ మరణించింది. ఈ నాలుగు రోజుల్లో బామ్మ ప్రాణం వైద్యులకుకూడా ఆశ్చర్యకారణమే అయింది.

సీతాపతి తాతగారు మరణించారు. డాక్టరుగారు ధృవపరిచారు. అమ్మమ్మ ప్రభృతులు గొల్లుమన్నారు. తాతగారు పునరుజ్జీవితులయినారు. తారువాత నెల రోజులకు (15–10–65) తాతగారు విగతజీవులయినారు.

సోదరుడు పోతుకూచి రవీంద్రనాథ్ మరణశయ్యమీద ఉన్నాడు. అతనికి కొలది అడుగుల దూరములోనే మరో సోదరుడు వర్షా ప్రసాద్ కల్యాణ వేదికపై నున్నాడు. ఎట్లా ఈ వివాహము జరిగేనని అందరి గుండెలూ చిక్కబట్టాయి. రవి ఇక బ్రతకటానికి ఏ మాత్రమూ ఆస్కారం లేదనీ, శాస్త్రరీత్యా వివాహ వేదికను తరలించాలనీ పురోహితుడు,సూచించాడు. కాని అమ్మ అక్కడనే 'పెండ్లి జరిపించమన్నది. పెండ్లి నిర్విఘ్నంగా జరిగింది. మరునాడు (25–2–57) రవి అస్తమించాడు.

యార్లగడ్డ వెంకన్న మృత్యువు పరిష్వంగంలో ఉన్నాడు. అది మహా శివరాత్రి. రుద్రాభిషేకమయింది. పూజ అయింది. అమ్మ అతనికి తీర్థ ప్రసాదాలిచ్చింది. అతడు స్వీకరించాడు. అందరినీ వెంటనే భోజనాలు పూర్తిచేయమని

అమ్మ చెప్పింది. భోజనాలు పూర్తి అయ్యేటప్పటికి వెంకన్న (9-3-67) అంతిమ శ్వాస వదిలాడు.

కటికి హనుమాయమ్మ 22-6-68 న మరణించింది. ఆమె ఏకైక కుమారుడు కోటేశ్వరరావు ఆ సమయాన సమీపాన లేడు. తరువాత వచ్చి బాష్పరుమన్నాడు. అతని దుఃఖం చూచి అమ్మ 'ఒక్కసారి కళ్ళు తెరిచి కోటిని చూడు-' అన్నది. హనుమాయమ్మ కళ్ళు విప్పి కుమారుని చూచింది.

కోన వెంకాయమ్మ బాధపడుతూ ఉన్నది. ఆమెకు అప్పుడు మరణ మాసన్నమయినదని ఎవరూ ఊహించలేదు. కాని ఆమె బంధువులతోపాటు, పురోహితుడు ప్రభృతులనుకూడా పిలిపించి అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు చేయించడం చూచి అందరూ విస్మితులయినారు. తరువాత ఆ రాత్రి 8 గంటలకు 12 గంటలు దాటితేగానీ ఆమె పోదని చెప్పింది. 12 దాటింది. ఆమె మరణశయ్య నధిరోహించి కన్నులు తెరిచి చూస్తుంటే- 'ఇంకా ఏం చూస్తావు? కళ్ళు మూయ్' అని అమ్మ చెయ్యి విసిరింది. అంతే ఆ మూసిన కన్నులు ఆమె ఇక తెరవలేదు.

ఇట్లా ఆలోచిస్తుంటే అన్ని మరణాలలోనూ అదృశ్యంగా అమ్మ హస్తం, పని చేస్తున్నట్లుగానే ఋజువవుతుంది. ఒకసారి దేహం నుండి విముక్తిని కాంక్షించిన ఒకరితో అమ్మ అన్నది "ప్రాణం ఎట్లా చెప్పి యివ్వలేదో, అట్లాగే అవసరమయితే తీసుకుంటా" నని.

అపరిమిత మయిన అమ్మ అందరి జనన మరణాలకు తానే కారణమయినా పరిమిత మయిన అమ్మ అనేక జననాలకు కారణ మవడమేకాక అనేక మరణాలను తన యిచ్ఛానుసారం జరుపుతున్నట్లు మనకు అర్థమవుతుంది

ఏది ఎట్లా ఉన్నా .... అందరినీ ఎంతగానో ప్రేమిస్తూ, అందరిచే ప్రేమింపబడుతూ, ఎవరికి తలనొప్పి వచ్చినా తహతహ లాడుతూ, పిచ్చుక పిల్ల గూటినుండి జారినా జల జలా కన్నీరు కార్చే సుకుమార కరుణామయ హృదయ అయిన సోదరి హైమ యిట్లా అకాలంలో అసువుల బాయటానికి కారణ మేమిటని అందరికీ తెగని ఆలోచన. అనంత శక్తి మంతురాలయిన అమ్మ తన రక్తమాంసాదు లను పంచుకుని, తన గర్భవాసాన పుట్టిన బిడ్డను బ్రతికించలేక పోయిందా - అని

సందేహం. పైగా ఎన్నాళ్ళనుండో హైమకు 29 వ సంవత్సరం దాటటం క్లిష్టమని ప్రకటించింది ఇటీవల హైమ యిక ఉండదేమో అన్నది. తీరా, హాస్పిటల్‌కు తీసుకు పోయే సమయంలో ప్రముఖమయిన డాక్టర్లు ఎంత ఆశను వ్యక్తం చేస్తున్నా – అనవసర ప్రయత్నమని స్పష్టపరిచింది.

చివరకు అమ్మ అన్నదంతా అయింది. గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు తీసుకుపోవటమూ, హైమ తుదిశ్వాస వదలటమూ జరిగాయి. లోకమంతా చీకటి గ్రమ్మినట్లయింది. హాహాకారాలతో ఆవరణం ప్రతిధ్వనించింది.

ఒకసారి ఒకలాత "ఆపద్దారివనే అనుకున్నానుగాని నీవింత భయంకర సంహారకారిణి వనుకోలేదమ్మా–" అన్నమాటలు అందరి హృదయాల్లోనూ ప్రతి ధ్వనించాయి ఎవరికి వారు అమ్మ ఎంత 'నిర్దయ' అనుకున్నారు.

కాని ఆ చీకటిగుయ్యారంలో హృదయ విదారక హాహాకారాల్లో అమ్మ పరమాశ్చర్యకరమయిన కార్యక్రమం నిర్వహించింది. నిర్మాణంలో ఉన్న దేవాలయ ఆవరణంలో ప్రస్తుత తన నివాసగృహానికి ఎదురుగా ఒక తపోమందిరాన్ని సంభా వించింది. అది భావికాలంలో అసంఖ్యాక తపస్వులకు పుట్టిల్లు కావాలన్నది. మహర్షు లకు ఆలవాలం కావాలన్నది. యోగులకు నిలయం కావాలన్నది. అది ప్రేమకూ, కారుణ్యానికీ, త్యాగానికీ సర్వ మానవోత్తమ గుణాలకూ, దైవత్వానికీ 'ఆలయం' కావాలన్నది. అందుకు ఇది సుముహూర్తమట; ఇది పవిత్రక్షేత్రమట; అందుకు తాను శంఖుస్థాపన చేయాలిట. శంఖువు హైమట !

ఇది ఎంత క్రూరంగా, బాధాకరంగా, దయారహితంగా మనస్సు గోచరిస్తున్నా...అమ్మ నిర్వికారంగా ప్రకటించి కార్యక్రమాన్ని సమారంభించింది. ఒడిలో బిడ్డను పెట్టుకుని హాస్పిటల్‌కు వెళ్ళిన తల్లి ఒడి ఖాళీ చేసుకుని, కడుపున చిచ్చు పెట్టుకుని, గుండె రాయి చేసుకుని తిరిగి వచ్చి – ఎదురు వచ్చిన వారు పలక రించలేక శిలలవలె నిలబడితే వారిని ప్రతిఒక్కరినీ పరిశీలనగా ప్రేమతో పరికించి ఆప్యాయతా, అనురాగమూ పొంగులువార "అందరూ అన్నం తిన్నారా ? అందరూ కులాసా" అని నోరారా పలుకరిస్తూ...పూలూ, పళ్ళు, కొబ్బరికాయలూ చేత

బట్టుకొని బారులుతీరిన జనసందోహం మధ్యగా మందగమనంచేస్తూ వారి పూజలూ నమస్కారాలూ, నివేదనలూ అందుకుంటూ గృహప్రవేశం చేసిన దృశ్యం ఎంత దారుణమైనది! అమ్మ అంత నిస్స్వార్థ, త్యాగమూర్తి కనుకనే కన్నబిడ్డను, ప్రియాతి ప్రియంగా తనను చూడడమే గాదు, తన నీడలో అల్లారుముద్దుగా పెరుగుతున్న పసికూనను జగత్కల్యాణం కోసం నిర్వికారంగా అర్పించింది. ఒకసారి హైమను తన ప్రతిబింబంగా అభివర్ణించింది. మరొకసారి తన గుణాలన్నీ హైమలో పుణికి పుచ్చుకున్నా యన్నది.

హైమను సుకుమారమయిన తనువునూ, సున్నితమయిన హృదయాన్నీ ప్రసాదించి లోకానికి ఆదర్శవంతంగా పెంచింది. సాధన నిచ్చింది. తత్ఫలితంగానే హైమ – తుదిక్షణాల్లో దృష్టినిండా అమ్మను మాత్రమే నింపుకొని "అమ్మా వస్తున్నానమ్మా...." అంటూ తాను వెళ్ళేది అమ్మలోనికి మాత్రమే నన్న పరమ జ్ఞానంతో ఆసన్నమయిన మరణాన్ని దరహాసంతో ఆహ్వానించింది. మహర్షులకూ, మహా యోగులకూగానీ సాధ్యంగానటువంటి మహోత్కృష్టసిద్ధిని పొందిన హైమను క్షీరాభిషిక్తం చేసి భూగృహంలో పద్మాసనంతో ప్రతిష్ఠించి, సజీవం చేసి, చైతన్యం రగిలించి, తన పావన పాదాన్ని హైమ శిరోపరిభాగంపై నిలిపి, తాను కూడా అక్కడ ఉపవిష్టురాలయి అన్ని విధాలా ఆ మందిరానికి బలాన్నీ, పవిత్రతనూ ప్రసాదిస్తూ నవ్వుతూ అమ్మ చేసిన ప్రకటన సామాన్యుల కెంత బాధాకరమయినా చరిత్రాత్మకమూ, చిరస్మరణీయమూ అయినది.

అమ్మ ఏ చర్య ఎందుకు జరుపుతుందో ఎవరి కెఱుక ?

– ఏప్రిల్ 1968

ఈశ్వరత్వ విధాయిని

లోకంలో అప్పుడప్పుడు వింతలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి. ప్రళయాలు ప్రభవిస్తుంటాయి.

ఔషధాలు వ్యాధిగ్రస్తం కావచ్చును. అమృతానికి ఆయువు క్షీణించవచ్చును. సూర్యుడు చల్లబడవచ్చును. చంద్రుడు మంటలను విరజిమ్మవచ్చును.

వీటన్నిటికి కారణాలు ఉండవా ? అంటే – ఉండి తీరతాయి. కానీ సామాన్య జనానికి పూర్వాపరాలు అవగాహన కాకపోవచ్చును. విధి నిర్ణయమయిన ప్రతిదానిలోనూ వ్యక్తా వ్యక్తమై అంతరార్థముంటుంది

ఫిబ్రవరి 18 వ తేదీన తెల్లవారుఝామున షుమారు 3 గంటలకు అటువంటి విచిత్రమయిన దుర్ఘటన జిల్లెళ్ళమూడిలో జరిగింది.

సర్వసృష్టి స్థితి లయకారిణి, నిత్యసుమంగళి, నిత్యసువాసిని, ప్రతివ్రతా శిరోమణి, పాతివ్రత్య స్వరూపిణి అయిన అమ్మకు పతిదేవులు, మనందరకు ప్రియతమమైన నాన్నగారు శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు అసువులు వీడారు.

మేము గమనించే లోపల, వైద్యులు చికిత్సా ప్రయత్నం చేసేలోపల సర్వం ముగిసింది. ఒక మెరుపు మెరిసినట్లు, ఒక పిడుగు పడ్డట్లు అంతా క్షణాల్లో జరిగిపోయింది. గుండెపోటు రావడమూ, ప్రాణాలను హరించడమూ రెండు క్రియలుగా జరగలేదు – దీపం మలగడమూ, చీకటి వ్యాపించడమూలాగా.

ఇది – నాన్నగారి నివాస భాగంలో జరిగింది. వెంటనే అమ్మ నివాస మందిరానికి పైకి పరుగెత్తాము. సర్వశుభంకరి అయిన అమ్మకు ఈ దుర్వార్త నందించడం ఎలా ? అందులో యిటీవల అమ్మ ప్రమాదకరమైన అనారోగ్యానికి గురై ఇంకా పూర్తిగా స్వస్తత పొందలేదు. అమ్మ గుండెకూడా చాలా బలహీనంగా ఉందని వైద్యులు చెబుతున్నారు – అయినా అమ్మకు చెప్పకుండా ఎంతకాలం దాచగలం ??

గుండెరాయి చేసుకుని, దుఃఖాన్ని దిగమింగి - అమ్మ పాదాలు పట్టుకుని ఈ హాలాహలాన్ని అమ్మ చెవులో పోశాము. అమ్మ ఒక లిప్తపాటు నిర్విణ్ణమై, నిశ్చేష్టయైనట్లు కనిపించింది. కానీ వెంటనే నాన్నగారిని పైకి తీసుకురండి - అని ఆదేశించింది.

మేము గబగబా నాన్నగారిని పైకి తీసుకువచ్చి - అమ్మ మంచం పక్కనే మంచం వేసి ప్రక్కవేసి పడుకోబెట్టాము. అమ్మ తన మంచాన్ని నాన్నగారి మంచానికి ఆనుకునేటట్లు జరపమన్నది. జరిపాము.

మంచాలు రెండు తూర్పు - పడమరలుగా ఉన్నాయి. అమ్మ మంచం దక్షిణ దిక్కున, నాన్నగారి మంచం ఉత్తరపు దిక్కున ఉన్నాయి. అమ్మ తన మంచంపట్టెమీదకు జరిగి నాన్నగారి వైపు తిరిగి తన కుడిచేతిని నాన్నగారి గుండెలపై ఉంచింది. అప్పుడు గం. 3-5 ని అయింది. అప్పటినుండి అమ్మ మరునాడు ఉదయం 11 గంటలవరకు అలాగే పడుకున్నది. చూసినవాళ్ళకు నాన్నగారు నిద్రపోతున్నట్లున్నది. ముఖం తేజోవంతమై అతి ప్రశాంతంగా ఉంది.

అమ్మా, నాన్నగారలా ఒకరి సరసన ఒకరు పడుకుని ఉండే అదో చూడ ముచ్చటయిన దృశ్యం అయింది. కానీ - అంతలోనే జరిగిన దారుణ సంఘటన తలుచుకుంటే ప్రతి ఒక్కరికీ గుండెలు బ్రద్దలవుతాయేమో నన్నంత దుఃఖతీవ్రత కలుగుతోంది.

ప్రాణోత్క్రమణం జరిగిందని డాక్టర్ ఇనజకుమారి ప్రకటించినప్పటికీ - మాకు డాక్టర్ మాటపై నమ్మకం లేకపోవటం, ఆమె తెలివితేటలను శంకించటం కాదు కానీ, ఆ ప్రకటనను పూర్తిగా నమ్మటానికి మనస్సు అంగీకరించలేదు. అమ్మ శక్తి సామర్థ్యాలపై పరిపూర్ణమయిన విశ్వాసం కలవాళ్ళం కాబట్టి ఆ సంఘటన అలాగే సమాప్తం కాదని ఆశ. అమ్మ - తానెక్కిన కొమ్మను తానే నరుక్కుంటుందా - అని సందేహం. ఏదో క్షణంలో అమ్మ మహిమాతిశయ ప్రభావితులైన నాన్నగారిలో ప్రాణజ్యోతి తిరిగి ప్రభాసమానమవుతుందని నమ్మకం.

అమ్మను చూడడానికే మనసొప్పడం లేదు. ఇంత మందిని ఇన్ని కష్టాల నుండి గట్టెక్కించిన తల్లికే ఇంత కష్టమా ? ఎందరి మంగళసూత్రాలనో కాపాడిన సర్వమంగళకే అమంగళమా ? ఆపదుద్ధారిణి బదవతనానికే అపదా ? ఎందరి

కన్నీటినో తుడిచిన కన్నతల్లియే కన్నీటి కడలిలో మునిగిపోతున్నదా ? పరమేశ్వరి అయిన అమ్మ పసుపు కుంకుమలకే లోపమా ?

కాదు – ఇలా జరగడానికి వీల్లేదు. ఈ అగాధంనుండి అమ్మ తన్ను తానే ఉద్ధరించుకోవాలి. ఉద్ధరించుకుంటుంది. అలా అమ్మను ప్రార్థించాలి !

ఈ సందేహ విశ్వాసాల ఉత్తుంగ తరంగాలతో సంక్షుభితమయ్యే కాసారం వలే మనస్సులు కల్లోలితంగా ఉండగానే - తెల్ల వారింది.

అమ్మలో కదలిక లేదు. నాన్నగారిలో కదలిక లేదు. సర్వప్రకృతీ స్తంభించినట్లు అంతా నిశ్శబ్దంగానూ, నిర్జీవంగానూ ఉంది.

మా ఆశలు అడుగంటాయి. డాక్టరుగారి ప్రకటన నిజమైంది. మేము ఏమి చేయాలి ?

ఎవరికీ బుద్ధి పనిచేయడంలేదు. ఎవరిని చూసినా కదలని బొమ్మలవలే కూలబడి పోయారు.

బంధువులకూ, భక్తులకూ, అనుబంధం ఉన్నవాళ్ళందరికీ టెలిఫోన్లపై ఈ వార్తను అందజేయక తప్పింది కాదు.

మధ్య మధ్యలో అంతరంగంలో ఒకరయితే, బహిరంగంగా మరొకరూ– అమ్మను ప్రార్థిస్తూనే ఉన్నాము.

అమ్మలో ఉలుకూ పలుకూ లేదు. అలాగే పడుకున్నది. అంతా చైతన్యమే, జడమే లేదు–అనే అమ్మకు నాన్నగారిలో ప్రాణరాహిత్యమేమీ కనిపించ లేదేమో !

జడానికీ – చైతన్యానికీ భేదం చూసే మాలో క్షణక్షణానికీ అసహనం ప్రబలిపోతున్నది దుఃఖం రెచ్చిపోతున్నది

అమ్మను చూస్తే ఒక క్షణంలో జాలి కలుగుతున్నది మరో క్షణంలో కోపం వస్తున్నది.

ఏమిటీ అమ్మ తత్వం ? తన సంగతే తాను తెలుసుకోలేకుండా ఉన్నదా? మనపై రవ్వంత కరుణ కూడా లేదా ? లేక మన మొర వినిపించడం లేదా ? మన దుఃఖాగ్ని అమ్మ హృదయాన్ని కరిగించలేక పోతున్నదా ?

ఉదయం 10 గంటలయ్యేసరికి - ఈ వార్త తెలిసిన జనం రావడం మొదలుపెట్టారు. 12 గంటలయ్యేసరికి చాలామంది వచ్చారు. ఆవరణమంతా శోకమగ్నమై పోయింది. అయితే ఎక్కడా - ఏడుపులూ, పెడబొబ్బలూ వినపించ లేదు. అంతా మౌన రోదనమే. ప్రతి గుండె దుఃఖాగ్నిగుండమైపోయింది.

ఆ రోజున అక్కడ అమ్మ సన్నిధిలో రెండు ఉపనయనాలు, ఒక వివాహం జరగవలసి ఉంది. జిల్లెళ్ళమూడిలో ఏ శుభకార్యం అయినా అమ్మ చేతిమీదుగా జరగవలసిందే కదా! మరి, ఆ సమయంలోనయినా అమ్మను అడిగితే లేచి వచ్చి ఆ శుభకార్యాన్ని తనచేతిమీదుగా జరిపించి వాళ్ళను హృదయపూర్వకంగానే ఆశీర్వదించే దేమో! ఏమో, ఏముందీ - తప్పక ఆశీర్వదించేది. కానీ - ఎవరు సాహసించగలరు?

వాళ్ళు వెనుదిరిగి వెళ్ళిపోయారు.

అయినా ఆవరణంలో ఎందరో క్రొత్తజనం. కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, పెద్దలు, పిన్నలు....

అన్నపూర్ణేశ్వరి అయిన అమ్మ సన్నిధిలో జనానికి పస్తులా? అది అమ్మకు తెలిస్తే సహిస్తుందా? అందువల్లనే అన్నపూర్ణాలయంలో యథావిధిగా గాడిపొయ్యి మండింది. దుఃఖాగ్నితో మరింతగా మండింది.

వంటలయినాయి, గంటలు మ్రోగాయి. అయితే ఎవరికి అన్నం సహిస్తుంది? ఎవరు తింటారు? వేదనాగ్నిని జయించిన జఠరాగ్ని ప్రజ్వరిల్లినవారు అన్నం తిని ఒక మంటయినా చల్లార్చుకొనగలిగారు.

ఒక్కరొక్కొక్కరు గ్రామస్తులు వచ్చారు. వారి ప్రియతమ నాయకుని కడసారి చూడడానికి తహతహలాడి పోయారు.

అమ్మ నాన్నగారి ప్రక్కనుండి లేస్తే - తలుపులు తీసి అందరికీ నాన్నగారిని చూసే అవకాశం ఏర్పాటు చేయాలని ఆలోచించాము. కానీ, అమ్మ నాన్నగారిని వదిలేదే కదా! అమ్మను ఆ తన్మయ స్థితినుండి ఎవరు విడదీస్తారు? ఎవరు విడదీయగలరు?

సాయంకాలం మూడు గంటలయింది. జనం దుఃఖానికి తట్టుకోలేకుండా ఉన్నారు. నాన్నగారిని చూడకి నిలవలేకుండా ఉన్నారు. అప్పుడు అమ్మను అలాగే ఉంచి తలుపులు తీశాము.

ఇద్దరూ అలాగే నిశ్చేతనంగా పడుకుని ఉన్నారు. ఎవరిలో ప్రాణముందో- ఎవరిలో లేదో గూడా తెలీడంలేదు. నాన్నగారి ముఖంలో నిర్జీవకళా లేదు, అమ్మ ముఖంలో దుఃఖోద్విగ్నతా లేదు. ఇద్దరి ముఖాలూ తేజోమయమై ప్రశాంతంగా ఉన్నాయి.

దేవాలయానికి వెళ్ళి నమస్కారం చేసుకొని వచ్చినట్లు ఒక్కొక్కరూ నమస్కారం చేసుకొని తిరిగి వచ్చారు. ఎంతగానో శోకం పెల్లుబికి హాహాకారాలతో ఆవరణం ప్రతిధ్వనిస్తుందేమోనని భయపడ్డాం గాని అలా జరగలేదు. అందరిలోను విచిత్రంగా ఒక రకమయిన నిర్లిప్తత ఆవరించింది. నాన్నగారెక్కడకూ పోలేదు, మనలోనే ఉన్నారు-అనే భావం కలిగి బలపడటం మొదలయినది.

నెల్లూరు డాక్టర్ శ్రీ సుబ్బారావుగారు, శ్రీమతి గజేంద్రమ్మ మొదలయిన కొంతమంది అమ్మ చెవిదగ్గరకు చేరి తమ ప్రార్థనలు తీవ్రంగా వినిపించారు. ఒక్కొక్క సారి నిష్ఠురోక్తులతో పోట్లాడారుగూడా. ప్రాణం పోగొట్టుకున్న అనేకులను అమ్మ పునర్జీవులను చేసిన సంగతిని అమ్మకు గుర్తు చేశారు. ఇది ఉపేక్షకు సమయం కాదన్నారు ఇప్పుడు ఉపయోగపడకపోతే అమ్మ శక్తిసామర్థ్యాలు వ్యర్థమే నన్నారు.

లోగడ హైమవిషయంలోనూ యిలాగే జరిగింది. అప్పుడు మాత్రం అమ్మ జరిగిన దానిని ఏమి మార్చింది? ఏదయినా అమ్మకు తెలియకపోతేగదా - మనం చెప్పి చేయించగలగడం? దీనిని మరొకరు చేస్తేగదా - అమ్మ దీనిని ప్రతిఘటించడం, ప్రతి క్రియ జరపడం?

ఆరాత్రి, మరునాడు తెల్లవారి హైదరాబాద్, మద్రాసు, విశాఖపట్నం, విజయవాడ, మచిలీపట్నం, నెల్లూరు....పలు పట్నాల నుండి పల్లెలనుండి అనేకులు నాన్నగారి అంతిమ సందర్శనం కోసం వచ్చారు.

అమ్మమాత్రం నాన్నగారిని వదిలిపెట్టలేదు. అమ్మ ఎప్పుడు వదిలిపెట్టింది కనుక; ఒకసారి అమ్మ అన్నది - వారు నన్ను వదిలి పెట్టినా, నేను వారిని వదిలి పెట్టను-అని.

అన్న జీవితాన్ని పరిశీలిస్తే-అమ్మే నాన్నగారిని ఏరి కోరి పెండ్లి చేసు కున్నది. నాన్నగారు అమ్మకు మేనత్తకొడుకే అయినా ఆ పెండ్లికి అనేక అవాంతరాలు

ఉదయం 10 గంటలయ్యేసరికి – ఈ వార్త తెలిసిన జనం రావడం మొదలుపెట్టారు. 12 గంటలయ్యేసరికి చాలామంది వచ్చారు. ఆవరణమంతా శోకమగ్నమై పోయింది. అయితే ఎక్కడా – ఏడుపులూ, పెడబొబ్బలూ వినపించ లేదు. అంతా మౌన రోదనమే. ప్రతి గుండె దుఃఖాగ్నిగుండమైపోయింది.

ఆ రోజున అక్కడ అమ్మ సన్నిధిలో రెండు ఉపనయనాలు, ఒక వివాహం జరగవలసి ఉంది. జిల్లెళ్ళమూడిలో ఏ శుభకార్యం అయినా అమ్మ చేతిమీదుగా జరగవలసిందే కదా ! మరి, ఆ సమయంలోనయినా అమ్మను అడిగితే లేచి వచ్చి ఆ శుభకార్యాన్ని తనచేతిమీదుగా జరిపించి వాళ్ళను హృదయపూర్వకంగానే ఆశీర్వదించే దేమో ! ఏమో, ఏముందీ – తప్పక ఆశీర్వదించేది. కానీ – ఎవరు సాహసించగలరు ?

వాళ్ళు వెనుదిరిగి వెళ్ళిపోయారు.

అయినా ఆవరణంలో ఎందరో క్రొత్తజనం. కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, పెద్దలు, పిన్నలు....

అన్నపూర్ణేశ్వరి అయిన అమ్మ సన్నిధిలో జనానికి పస్తులా ? అది అమ్మకు తెలిస్తే సహిస్తుందా ? అందువల్లనే అన్నపూర్ణాలయంలో యథావిధిగా గాడిపొయ్యి మండింది. దుఃఖాగ్నితో మరింతగా మండింది.

వంటలయినాయి, గంటలు మ్రోగాయి. అయితే ఎవరికి అన్నం సహిస్తుంది ? ఎవరు తింటారు ? వేదనాగ్నిని జయించిన జఠరాగ్ని ప్రజ్వరిల్లినవారు అన్నం తిని ఒక మంటయినా చల్లార్చుకొనగలిగారు.

ఒక్కరొక్కొక్కరు గ్రామస్తులు వచ్చారు. వారి ప్రియతమ నాయకుని కడసారి చూడడానికి తహతహలాడి పోయారు.

అమ్మ నాన్నగారి ప్రక్కనుండి లేస్తే – తలుపులు తీసి అందరికీ నాన్నగారిని చూసే అవకాశం ఏర్పాటు చేయాలని ఆలోచించాము. కానీ, అమ్మ నాన్నగారిని వదిలలేదా ! అమ్మను ఆ తన్మయ స్థితినుండి ఎవరు విడదీస్తారు ? ఎవరు విడదీయగలరు ?

సాయంకాలం మూడు గంటలయింది. జనం దుఃఖానికి తట్టుకోలేకుండా ఉన్నారు. నాన్నగారిని చూడక నిలవలేకుండా ఉన్నారు. అప్పుడు అమ్మను అలాగే ఉంచి తలుపులు తీశాము.

వచ్చాయి. అమ్మ బాధలన్నింటినీ అధిగమించి చివరకు 1936 మే 5వ తేదీన నాన్న గారిని పెండ్లి చేసుకున్నది.

పెండ్లి అయిన తర్వాత-అమ్మలో అతిమానుష శక్తిని అంతకు పూర్వమే గమనించినవారు అనేకులు అమ్మను ప్రశ్నించారు. "అమ్మా-నీకి పెండ్లి ఎందుకూ!" అని.

"ఎన్ని వచ్చినా వాటికీ మనసుకీ సంబంధం లేదని చెప్పడం కోసమే యీ పెళ్ళి" అనీ, "పెండ్లిలో పెద్దపులి ఉందని భయపడే వారి భయం పోగొట్టడం కోసమే యీ పెండ్లి "అని అమ్మ వివరించింది. "చేసేదంతా దైవసేవ అని భావించ గలిగితే -సంసారం ఆధ్యాత్మిక సాధనకు భంగకరం కా" దని ఉద్ఘాటించింది. "పతిని ఆధారముగా చేసుకొని పంచభూతాలను జయించిందే పతివ్రత" "సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదే సాధ్వి" "స్త్రీకి పతియే దైవం" అని ప్రవచించింది.

అమ్మ తన గళంలోని మంగళసూత్రాలను నాన్నగారి పవిత్ర పాదాలు గానే సంభావనచేసి నిత్యమూ అభిషేకిస్తుంది; ఆరాధిస్తుంది. ఆ మంగళసూత్రాలే తనకు అన్ని సూత్రాలనూ అవగతం చేశాయట అనుదినము మంగళసూత్రాలను అభిషేకించిన తీర్థం స్వీకరిస్తుంది ఆ తీర్థమే అందరికీ తీర్థం పోసే అర్హతను ప్రసా దించిందట.

నిత్య జీవితంలో కూడా అమ్మ నాన్నగారిని అంటిపెట్టుకునే ఉన్నది, వెన్నంటే ఉన్నది-అని చెప్పడానికి నిదర్శనాలు కోకొల్లలుగా ఉన్నాయి అటువంటి ఘట్టాలనేకం నాన్నగారే స్వయంగా వెల్లడించారు. నాన్నగారు ఏదయినా పనిమీద గ్రామాంతరం వెళ్ళినా అమ్మ అభౌతికంగా అదృశ్యంగా నాన్నగారి వెంటనే ఉండేదట కొన్ని సమయాలలో అమ్మ కంఠం వినిపించడమూ, అమ్మ గోచరించడమూ జరిగేది.

1954 లో నాన్నగారు విజయవాడలో ఒక చోట కూర్చుని లేచి వెళ్ళుతూ - కూర్చున్నచోట తన సంచి మరిచిపోయి వెళుతుంటే ... అమ్మ గొంతు వినిపించిందట. సంచి మరచి వెళుతున్నారు, తీసుకోండి-అని. వెంటనే నాన్నగారు ఆ సంచీ తెచ్చుకున్నారు, ఆ సంచీలో అతి ముఖ్యమయిన కాగితాలు ఉన్నాయట.

1963 లో నాన్నగారు మొక్కపాడులో చాలీచాలని నులక మంచంపై పడుకుంటే - జిల్లెళ్ళమూడిలో ఉన్న అమ్మ శ్రీమతి వసుంధర వాళ్ళతో ఆ విషయం చెప్పి సరియైన ఏర్పాటు చేయమని ఆదేశించింది.

1972 లో నాన్నగారికి గుంటూరులో డాక్టర్ జె. వి. కృష్ణారావుగారి ఆసుపత్రిలో ఆపరేషన్ జరగబోతుండగా నాన్నగారు అమ్మకు ఒక ఉత్తరంలో "ఆపరేషన్‌ను తిలకిస్తూ, ఆ సమయంలో నీవు జిల్లెళ్ళమూడిలో యుండినను, నా చెంతనే ఉండగలవని యె నమ్మిక" అని వ్రాసుకున్నారు. మరి, అంతకు ముందు ఎన్ని సంఘటనలు ఆధారంగా నాన్నగారికి ఆ నమ్మిక ఏర్పడిందో ! అమ్మ నాన్నగారిని అనేక ప్రమాదాల నుండి, ప్రాణాపాయ స్థితులనుండీ కాపాడింది. ఒకసారి అలాగే ఒక బస్సు ప్రమాదంనుండి తప్పించింది. 1975 లో నక్సలైట్లు జిల్లెళ్ళమూడి ఆశ్రమంపై దాడిచేసినప్పుడు - అంతకు కొద్దినిమిషాలముందే నాన్నగారిని ఆ స్థలం నుంచి మరోచోటుకు పంపింది. లేనియెడల ఆనాడు నాన్నగారికి ప్రాణసంకటం ఏర్పడి ఉండేది.

16 వ తేదీ రాత్రి సోదరుడు రవి అమ్మవద్దకు వెళ్ళి కర్తవ్యోపదేశం కోరాడు. అప్పుడు అమ్మ తన సంకల్పాన్ని వివరించింది. 1956 లో శంకుస్థాపన జరిగి నిర్మాణం కొంతవరకు అయి ఆగిపోయిన దేవాలయంలో నాన్నగారిని భూస్థాపన చేస్తానన్నది. అందుకు అవసరమయిన ఏర్పాట్లను చేయమని ఆదేశించింది.

"నాన్నగారు ఎక్కడకు వెళ్ళలేదు, వెళ్ళరు. మనతోనే మన మధ్యనే ఉంటా"-రని చెప్పింది. ఆ ప్రకటనతో చాలమందికి దుఃఖోపశమనం కలిగింది. అదీగాక అమ్మ - "సృష్టిలో సహజమయిన పరిణామం జరిగింది. ఎవరూ దుఃఖ పడాల్సిన అవసరం లే"-దని ప్రకటించింది. దానితో అందరి కన్నీళ్ళు - ఎడారిలో వానవలె - ఇంకిపోయాయి.

లోగడ అనేకమార్లు అమ్మ "మరణమంటే పరిణామమే" అనీ, "దేవుడు పంపిన మనిషి దేవుడు పిలిస్తే - వెళితే - మధ్యలో ఏడుపు మనకెందుకూ?" అని ప్రవచించింది. కానీ - కేవలం తన గుండెపైననే పిడుగు పడ్డప్పుడుకూడా అమ్మ అలా నిర్వికారంగా అనుద్విగ్నమానసయై ఉంటుందని ఎవరూహించగలరు ?

లోగడనే అమ్మ మరో మాటనుకూడా అన్నది. ఎవరికైనా జబ్బు చేసినప్పుడు తనకూ ఆందోళనగా ఉంటుందట. మనిషి చనిపోయిన తర్వాత తనకు అంతా నిండుగా, పండగ్గా ఉంటుందట.

నిజమే - ఇతరుల మరణం అయితే ఎన్ని కబుర్లయినా చెప్పవచ్చును కేవలం తన భర్త, తాను ప్రాణాధికంగా ప్రేమించిన, తాను దేవుడని ఆరాధించిన పతి, తన జీవిత భాగస్వామి, తన సహచరుడు, తన సర్వస్వం శాశ్వతంగా తనకు దూరమైనప్పుడుకూడా ఎవరు ప్రశాంత చిత్తులై ప్రవర్తించ గలరు ?

తాను, నాన్నగారు వేరుకాదన్న భావమే అందుకు కారణమేమో !

17 వ తేదీ ఉదయం 11 గంటలకు అమ్మ నాన్నగారి వద్దనుంచి లేచింది. స్నానంచేసి వస్తానన్నది ఈలోగా నాన్నగారి భూస్థాపనకు అవసరమయిన ఏర్పాట్లను చేయమన్నది. క్రితం రాత్రే అవసరమయిన ఉప్పు, విభూతి తెప్పించాము. దేవాలయ గర్భంలో, అమ్మ సూచన ననుసరించి వామభాగంలో భూగృహాన్ని నిర్మించాము.

సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అమ్మ హైమాలయ వేదికపైకి విచ్చేసింది. ఆ ప్రదేశమంతా షామియానాలతో, రంగుకాగితాలతో, మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించబడి ఉంది. మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. అమ్మ సర్వాభరణ సంశోభితయై దివ్యదీధితుల వెలార్చుతూ ఉన్నది. విశాఖపట్నం సోదరులు అమ్మను పుష్పమాలాంకృతను చేసి లలితా సహస్రనామావళితో పూజించుకుని క్రొత్తగా ప్రచురించిన లలితా సహస్రనామ పుస్తకాలను సమర్పించారు

తన పాదాలను పూజించే సమయంలో అమ్మ తన మంగళసూత్రాలను ఎడంచేతిలో పెట్టుకుని కుడిచేత్తో పూజించింది. ఒక గ్లాసుతో నీళ్ళు తెప్పించి మంగళ సూత్రాలను ఆనీటిలో కడిగి ఆ తీర్థాన్ని త్రాగింది.

అంతలో నాన్నగారి పార్థివ దేహాన్ని మంచంపైనే పడుకోబెట్టి తీసుకుని వచ్చారు. అమ్మ ఆదేశంతో నాన్నగారిని హైమాలయమున్ముంగానికి ఆనించి తూర్పుదిశకు అభిముఖుల్ని చేసి ఆసీనుల్ని చేశాము. ఋత్విక్కులు అభిషేకరుద్రాలు పఠిస్తుండగా - గుమికూడిన జనం కన్నులింతలు చేసుకుని చూస్తుండగా - అమ్మ నాన్నగారి తలకు నూనె రాచి, సీకాయతో తల రుద్ది, క్షీరాభిషేకం చేసింది. తర్వాత ప్రజలందరూ క్షీరనీరాలతో నాన్నగారిని అభిషేకించారు. పిమ్మట అమ్మ నాన్నగారిని మళ్ళీ పంచామృతాలతో అభిషేకించింది. ఉష్ణోదకంలో స్నానం చేయించింది. పరిమళ

ద్రవ్యాలు అలిమింది. నూతన వస్త్రాలు కట్టింది. నాన్నగారి నుదుట శైవ, వైష్ణవ, శాక్తేయ సంప్రదాయాలు ప్రతిఫలించే విధంగా - విభూతితో కుంకుమతో అలంక రించింది. నూతనయజ్ఞోపవీతం వేసింది. తాను కట్టుకునే పీతాంబరం కప్పింది. మెడలో పూలమాలలు వెసి దోసిళ్ళతో రంగురంగుల రకరకాల పూలు నాన్నగారి తలపై కుమ్మరించింది. ఆ దృశ్యం చూస్తుంటే - అమ్మ పెండ్లి పీటలపై నుండి నాన్నగారికి తలంబ్రాలు పోస్తున్నట్లే ఉన్నది. మరి, ఆ ఉత్సాహమూ, సంరంభమూ అమ్మలో అలా కనిపించాయి.

అమ్మ నాన్నగారికి అభిషేకం చేస్తుండగా నాన్నగారి నాసికా రంధ్రాల నుండి ఎఱ్ఱని రక్తం స్రవించింది. ఆ రక్తస్రావం చూసిన మేము అమ్మ నాన్నగారికి పునఃప్రాణ ప్రతిష్ఠచేసినట్లే భావించాము.

గమనార్హమయిన యింకొక విషయం జరిగింది. 15 వ తేదీ నుండి 17 వ తేదీ ఉదయం 11 గంటలకు అమ్మసన్నిధి ఉన్నంతవరకు నాన్నగారి దేహం పరిశుభ్రంగా ఉంది. అమ్మ స్నానానికి లోపలకు వెళ్ళిన క్షణం మొదలుకొని శిథిలం కావడం ఆరంభమైంది

మధ్యాహ్నం గం. 2-00 ని.లకు అమ్మ నాన్నగారి దేహంతోపాటు గర్భాలయం ప్రవేశం చేసింది - ఋత్విక్కులు శ్రీసూక్త పురుష సూక్తులూ, పృథివీ సూక్తమూ, లలితా సహస్రనామావళి పఠించారు.

నాన్నగారి దేహం రబ్బరు బొమ్మవలె వంగగా-పద్మాసనంలో నాన్నగారిని భూగృహంలో ఆసీనులను చేయడం జరిగింది క్రమేణా లవణ భస్మరాసుల్లో నాన్న గారిని అమ్మ ముంచేసింది. అప్పుడు తన కాలివేలి, చేతివేలి ఉంగరాలు, చేతి బంగారు గాజులు, చెవుల దిద్దులు, ముక్కు బులాకీ తీసి అందులో వేసింది. చివరకు తాను కట్టుకున్న చీరె, రవికెకూడా తీసి అందులో సమర్పించింది.

ఈ కార్యక్రమం జరిగే సరికి గం. 2-40 ని. లయింది.

పై విషయం మైకులో చెప్పబడగానే - శ్రోతలందరూ ఒక్కసారిగా భయాందోళిత మనస్కులైనారు - అమ్మను నిరలంకారగా దర్శించడం ఎలాగునా - అని. కానీ మనందరి అదృష్టంకొద్దీ అమ్మ మళ్ళీ సర్వాభరణభూషిత అయి, పట్టుచీరె

కట్టుకుని దరస్మిత వదనయై బయటకు వచ్చి అందరి హృదయాల్లోనూ శాంతి సుధలను వర్షించింది.

అదొక విచిత్రమైన ఆసక్తికరమైన విషయం. తన జన్మ నక్షత్రమయిన పునర్వసులో నాన్నగారు మానవదేహాన్ని వదిలి - అమ్మ జన్మనక్షత్రమైన ఆశ్లేషా నక్షత్రంలో అనసూయేశ్వరులై ఆవిర్భవించారు. ఆలయానికి అమ్మ అనసూయేశ్వ రాలయమని నామకరణం చేసింది

ఆ మరునాటినుండి 1౹ రోజులు ఆలయంతో ఉదయం 11 మంది ఋత్విక్కులతో మహాన్యాసపూర్వకంగా మహారుద్రాభిషేకమూ, సాయంకాలం లలితా లక్షానామపూజ చేయడంకోసం నిర్ణయమైంది.

18 వ తేదీ ఉదయం ఆలయంలో నిత్యపూజను అమ్మ స్వయంగా ప్రారంభించింది. అక్కడ అఖండ దీపారాధన చేసింది. అభిషేకాన్ని ప్రారం భించింది. సాయంకాలంకూడా పూజలో స్వయంగా పాల్గొని నివేదన, నివాళి తానే యిచ్చింది. ఈ విధంగా అమ్మ పూజచేయడం ఇదే మొదటిసారి కావచ్చు.

28 వ తేదీవరకు ఆలయంలో నిత్యాభిషేకాలు, పూజలు సోదరులు సుబ్బారావు, రవి చేసుకున్నారు. శ్రీ అన్నవర్తి కృష్ణశర్మ ప్రధాన ఋత్విక్కుగా వ్యవహరించి అత్యంత సమర్థంగా క్రతువును నిర్వహించారు వారికి కళాశాల అధ్యాపకులూ, విద్యార్థులూ పూర్తిగా సహకరించారు.

18 వ తేదీన గ్రామంలో నాన్నగారి చిత్రపటానికి వైభవోపేతంగా ఊరేగింపు జరిగింది. ఉదయం 5 గంటలనుండి 8 గంటలవరకు మహారుద్రాభిషేకం జరిగింది. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 7 గంటలవరకు లలితా నామ పారాయణ జరిగింది. అందులో మొత్తం 250 మంది పాల్గొన్నారు. మొత్తం 13 రోజుల్లోను నాన్నగారి వయస్సు 68 సంవత్సరాలు కాబట్టి 68 లక్షల నామ పారాయణం జరగడం విశేషం.

ఆ సాయంకాలం సభ జరిగింది. అందులో ప్రధానవక్త శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులవారు. వారు అమ్మ నాన్నగార్లు ఒక్క శక్తియే ననీ, ఆశక్తి లోకంలో నష్టమై భ్రష్టమైపోతున్న దాంపత్య ధర్మాన్ని పునరుద్ధరించడంకోసం, భార్యయెడల భర్త, భర్త యెడల భార్య ఎలా నడుచుకోవాలో లోకానికి పాఠం చెప్పడంకోసమే దిగి వచ్చిందనీ వివరించారు.

నిజమే - నాన్నగారంటే అమ్మకు సాక్షాత్తూ దైవమే. ఆ విషయాన్ని అనేకపర్యాయాలు ప్రకటించింది. జీవితంలో ఆచరణలో చూపెట్టింది. నాన్నగారికి అమ్మంటే ఎనలేని గౌరవం. నాన్నగారి దృక్పథంలో అమ్మ దేవతయే. నాన్నగారు అమ్మను ధ్యేయంగా పెట్టుకుని జపమూ, ధ్యానమూ కూడా కొన్నాళ్లు చేసుకున్నారు.

అమ్మ అలౌకిక శక్తులను అనేకం నాన్నగారు స్వయంగా దర్శించారు. అమ్మ పొందిన యోగపరాకాష్ఠ స్థితులయిన భ్రూకుటీ విభేదనం, కపాలభేదనం నాన్నగారు చూశారు ఒకనాడు అమ్మ నాన్నగారికి అన్నం వడ్డిస్తుండగా భ్రూకుటీ భేదనం జరిగి రక్తం స్రవించిందట. ఆ రక్తం నాన్నగారి విస్తట్లో పడకుండా అమ్మ చెయ్యిపట్టింది. చేతిలో రక్తం భస్మంగా మారింది. ఆ భస్మాన్ని అమ్మ నాన్నగారికి పెట్టింది. నాన్నగారు దానిని తిన్నారు. ఈ విశేషం నాన్నగారు అనేకపర్యాయాలు అతి సంభ్రమాశ్చర్యాలతో చెప్పారు అమ్మ అతిమానవ సహనశక్తి గురించికూడా నాన్నగారు అనేక సంఘటనలు వివరించేవారు. అవసరమయితే అమ్మ ఎంత బాధ నయినా - చొక్కాను చిలక కొయ్యకు తగిలించినట్లు - తీసివేసుకొనగలదని చెప్పే వారు. ఇతరుల ఎంత బాధనయినా అమ్మ కేవలం తన స్పర్శతో నివారించగలదని నాన్నగారికి పూర్ణమయిన విశ్వాసం. అందుకే నాన్నగారికి ఎంత చిన్న జ్వరం వచ్చినా-తన చెయ్యి అమ్మకు అందించి నాడి చూడమనేవారు. అమ్మ ఆశీర్వచనంలో కూడా నాన్నగారికి అచంచలమయిన నమ్మిక. నాన్నగారు ఏపని చేస్తున్నా ముందు అమ్మకు చెప్పి అనుమతి పొందేవారు. ఎక్కడకు వెళుతున్నా ముందు అమ్మచేత బొట్టు పెట్టించుకునేవారు.

ఇటీవల నాన్నగారికి నిరంతరం అమ్మధ్యాసయే, అమ్మ ఆరోగ్యాన్ని గురించి ఆందోళనయే అమ్మమాటల ప్రకారం-ధ్యాసంటే ధ్యానమూ, ఆందోళనంటే ఆరాధనేగా!

అమ్మా-నాన్నగార్లు పరస్పర అవగాహనతో, అనురాగంతో, ఆరాధనతో లోకంలో ఆదర్శవంతులైనారు భర్త అంటే శరీరం కాదు, భావన - అన్నది అమ్మ. నాన్నగారి స్మరణ ఎప్పుడూ ఉన్నది అమ్మకు. ఒకసారి ఏదో ఆలోచిస్తున్న అమ్మతో-పరధ్యాసగా ఉన్నావమ్మా - అంటే పరధ్యాస కాదు, నాన్నా, పతిధ్యాస - అన్నది.

భర్తను గురించిన సజీవ భావన, నిరంతరస్మరణ ఉన్న స్త్రీ ఏనాటికీ భర్తృవిహీన – కాదని అమ్మ అభిప్రాయం. అందుకనే అమ్మ సుమంగళీ చిహ్నాలను వేటినీ విసర్జించలేదు.

ఈ విధంగా అమ్మ మహిళాలోకంలో ఒక మహావిప్లవానికి ఒరవడి పెట్టిందేమో–ననిపిస్తుంది.

ఒకప్పుడు స్త్రీకి సహగమనం సంప్రదాయం. ఎలాగో స్త్రీ అగ్నిగుండం నుండి బయటపడ్డది. స్త్రీ కి మరణంకంటే కూడా బాధాకరమయినది–మంగళ చిహ్నాలను విసర్జించడం.

అమ్మ– స్త్రీకి ఆ అవస్థను తప్పించదలచుకున్నదేమో – ఉత్తమమయిన భార్యగా, తల్లిగా ఎలా నడచుకోవాలో స్త్రీలోకానికి ఆదర్శమయిన అమ్మ ఈవిధంగా కూడా స్త్రీకి మహోపకారం చేసింది. మహాత్ములు ఏమి చేసినా లోకసంగ్రహార్థమే గదా! అందుకు వారు విమర్శలకు గురికావచ్చును, హింసలకు గురికావచ్చును.

హైమ విషయంలో "నేనే కన్నాను. నేనే పెంచాను, నేనే చంపాను, నేనే దైవత్వం యిచ్చాను" అని ప్రకటించిన అమ్మ వాక్యాలే నాన్నగారి విషయంలోనూ స్మరణకు వస్తున్నాయి.

నాన్నగారిని ఆధారం చేసుకునే అమ్మ పాతివ్రత్య శిఖరాగ్రం అధిరోహించినప్పటికీ – అమ్మలో మాతృత్వమూ, దైవత్వమూ సాక్షాత్కరింపజేసుకునే నాన్నగారు అమరులై అర్చామూర్తులయినారు.

కన్నీటిధారలనుండి దివ్యవిద్యుత్‌ను సృష్టించి అఖండజ్యోతిని వెలిగించింది. శోక సముద్రంనుండి అమృత కలశాన్ని వెలికితీసింది. వైపరీత్యంనుండి అనంతవైభవానికి శ్రీకారం చుట్టింది. రాలిన పువ్వునుండి ఒక దివ్యఫలాన్ని రూపొందించింది. ప్రళయంనుంచి నూతన సృష్టిని చేసింది. హాహాకారంనుండి ఓంకారాన్ని వినిపింపజేసింది అమ్మ.

అదే అమ్మ అఖిలలోకానికి అందజేసిన అసాధారణ ప్రసాదమూ, అనితరసాధ్యమయిన ప్రాసాదమూ – అనసూయేశ్వరాలయం.

—మార్చి 1981

అమ్మ సాధన

ఈ నాడు అమ్మ జన్మదినమహోత్సవం. అందుకే యిక్కడ యింత జనసమూహమూ, యింత ఆనంద సంరంభమూ. నిజమే మనందరకూ నేడు మహా పర్వదినమే. కాని యింత కోలాహలంలో ఒక్క క్షణం నిలుచుని ఆలోచిస్తే —యిది అమ్మకు ఏభై యవ జన్మదినమని స్ఫురణకు వస్తుంది. ఏభై సంవత్సరాలు అపార కాలసింధువులో ఒక బిందు ప్రాయమయినా కాకపోవచ్చు. కాని పరిమితమయిన మానవ జీవితంలో అది సుదీర్ఘమయిన గణనీయమయిన కాలమె కాగలదు.

ఈ ఏభై సంవత్సరాలుగా అమ్మ అవనీతలానికి అడుగిడినప్పటి నుంచీ లిప్తకాలం విశ్రాంతిలేకుండా నిద్రాహారాలు లేకుండా అహోరాత్రులూ మనకోసం తపిస్తూనే ఉన్నది.

ఒకరు నీ పూజ ఏమిటమ్మా? అంటే—మీరు కావాలనుకోవడమే నన్నది అమ్మ. ఒకరు నీ ప్రార్థన ఏమిటమ్మా? అంటే— మీ రంతా నేనే అనుకోవటమే నన్నది. ఒకరు మీ ధ్యేయ మూర్తులు లెవరమ్మా? అంటే—మీరే నా ధ్యేయ మూర్తులు అన్నది. ఒకరు నీవు సాక్షాత్తూ రాజరాజేశ్వరివమ్మా అంటే – మీరు కానిది నేనేదీ కాదు నాయనా అన్నది. ఒకరు మేము అజ్ఞానంలో పడి కొట్టుకుంటున్నాము అంటే కాదు నాన్నా, నా దృష్టిలో మీరు పరిపూర్ణమయిన జ్ఞాన స్వరూపులు అన్నది. మరొక సందర్భంలో మీరుకూడా భగవంతుడే నన్నది. ఇంకొక సందర్భంలో "మీ రంతా నా అవయవా లనుకుంటున్నాను. చెయ్యినొప్పి కాలికి తెలియదు. కాలి నొప్పి కంటికి తెలియదు. కాని అన్నిటినొప్పి నాకు తెలుస్తుంది" అన్నది. "నేను దేనికోసమూ, ఏదీ చేసింది లేదు. ఆరాధనకూడా ప్రత్యేకించి దైవ మొకడాన్నో ఉన్నదని ఆరాధించలేదు. మీ అందరినీ ఆరాధించటమూ, మీ రందరూ దైవ మనుకోవటమే —నన్నది. "నేను అమ్మను, మీరు బిడ్డలు" అని పలుమార్లు పదేపదే ప్రకటించింది. ఒకరు నీ సాధనఏమిటమ్మా? అంటే – బిడ్డల్ని కనటమే నన్నది.... ఎక్కడి ఎవరిని చూచినా తన బిడ్డయే అనిపిస్తుందట. తానే మనల నందరినీ కని మన తల్లులకు పెంపుడుకు యిచ్చిందట. అందుకే ఒకసారి అమ్మ

అన్నది. "మీ రెండరూ లేకుండా నేను వెళుతుంటే నా ఒళ్ళోనుండి పిల్లలను లాగి అవతల పారేసి నన్ను తీసుకు వెళ్ళుతున్నట్లుంది" అని

....అమ్మ ఎన్నో రీతుల్లో మనకూ అమ్మకూ గల అభేదస్థితిని ఎన్నో తీరుల్లో మనకూ అమ్మకూ గల మాతాశిశుబాంధవ్యాన్ని ప్రస్ఫుటం చేసింది.

అమ్మ మానవాకృతిని స్వీకరించటానికి హేతువుకూడా మన కోసమే. ఈ పరమసత్యాన్ని అమ్మ మనకు అనేక సమయాల్లో అవగతం చేసింది.

ఒకసారి "ఈ అవతారం చుట్టూ మీరు; మీకోసం యీ అవతారం" అని ఉద్ఘాటించింది.

ఒక సందర్భంలో ఒక వృద్ధురాలు నిష్ఠురంగా 'ఈ బొమ్మను' అని తనను ద్దేశించి 'నీ యిష్టం వచ్చినట్లు ఆడిస్తున్నావు' అని అంటే అమ్మ నవ్వి "ఆ బొమ్మలను ఆడించటానికి" అని తనను చూపుకుంటూ "ఈ బొమ్మ ఎన్ని ఆటలు ఆడాలో ఆలోచిస్తున్నావా?" అని అడిగింది.

మరొకసారి, సోదరులు రామరాజు కృష్ణమూర్తి 'బీరువాలు నీకు ఉపయోగ పడవుగా. పుస్తకాలకోసం అయితే నే నిస్తాను' అన్నాడు. అమ్మ వెంటనే అన్నది. "అట్లాగయితే ఏదీ నాకోసం కాదు. నేను చీరె కట్టుకోవడం, స్నానం చేయటం కూడా మీ కోసమే" అని.

ఒక అందమయిన సాయంకాలం అమ్మ ....సతులకై కొన్నాళ్ళు సుతులకై కొన్నాళ్ళు ....అన్న త్యాగరాజు కీర్తన వింటూ "నేనిప్పుడు అదే స్థితిలో ఉన్నాను. ఈ సంతానం కొరకేగా నా కిదంతా—" అనుకొన్నది.

ఇంకొక సందర్భంలో "మీ రనేకం ఆలోచిస్తూంటారు. కానీ నా కొకటే ఆలోచన. మీ గురించే" అన్నది అమ్మ.

అమ్మ అనారోగ్య విషయమూ, అమ్మకు గల జబ్బుల ప్రస్తావనా వచ్చి నప్పుడు "మీరు లేనప్పుడు ఇవీ ఉండవు" అని అసందిగ్ధంగా ప్రకటించింది.

అయినా అమ్మకు మనపై గల మమకారమూ, కరుణా, సానుభూతీ ఎనలేనివీ, ఎల్లలు లేనివీ, ఎక్కడా మనం మరో చోట అనుభవించలేనివీ.

ఒకసారి ఒక సోదరికి చేతికి దెబ్బ తగిలి, ఆ బాధలోనే అమ్మకు కాళ్ళు రాస్తున్నది. అప్పుడు అమ్మ కుంపటి, సీసా తెప్పించి "నువ్వు నాకు కాళ్ళు పిసుకు; నేను నీకు కాపు కాస్తాను" అన్నది. ఎందరికో ఎన్ని విధాలుగానో అమ్మ వాత్సల్యంతో పరిచర్యలు చేసింది.

మనం అమ్మ జీవిత చరిత్రను పరిశీలించినా, ఒక్కోరోజు అమ్మ పద సన్నిధిన ఉండగలిగినా అమ్మలో పొంగిపొరలే అనురాగ స్రవంతులు మనలను ఆశ్చర్య ఆనందాలతో ముంచెత్తుతాయి.

నిత్యమూ అమ్మ దర్శనార్థం అసంఖ్యాకులు అరుదెంచుతారు. ఇందులో అధికభాగం ఏదో విధంగా బాధా సర్పదష్టులూ, విధివంచితులే ఎందరో నష్ట జాతకులూ, భ్రష్ట జీవిత పథగాములూ, దురదృష్టదేవతా వరపుత్రులూ ఎందరో జీవితంలో పరాజితులూ, పరాభూతులయినవారే. అనేకులు కరాళకాల కబంధ పరిరంభంలో నలిగిపోయినవారే.

అందరూ అమ్మకు తమ తమ దీన గాధలూ, హీన చరిత్రలూ, దయనీయ పరిస్థితులూ, దుర్భర దుస్సహ వ్యధలూ విన్నవించుకుంటారు. తమ గుండెలనే కరిగించి రక్తాన్నే కన్నీటి ఏరులుగా ప్రవహింపజేసి అమ్మ హృదయ కేదారాన్ని తడిపివేస్తారు. భార్య భర్తకు చెప్పుకోలేనివీ, భర్త భార్యదగ్గర ఒప్పుకోలేనివీ, తల్లి దండ్రులకు పిల్లలు చెప్పుకోలేనివీ, పిల్లలకు తల్లి దండ్రులు చెప్పుకోలేనివీ కూడా అమ్మకు విన్నవించుకుంటారు.

"వాళ్ళు అనుమానంగా బాధగా వచ్చినప్పుడు వాళ్ళబాధ పోగొట్టాలి. సందేహం తీర్చాలి. కాని యింకొకటి చెప్పరాదు" అని అమ్మ కొందరికి వాచ్యంగానూ, కొందరికి క్రియారూపంగానూ సమాధాన మిస్తుంది.

పతితులకూ, పాపులకూ ప్రేమతో ఆదరంతో తన ఒడిలో స్థానమిచ్చి "శిక్ష అంటే మనిషిని సంహరించటం కాదుగా; గుణాన్ని సంహరించడమే" నంటూ "ఎవరే దారినపోతే వారిని ఆ దారిన పోనిచ్చి మెల్లగా యిటు త్రిప్పుకు రావాలి" అని లాలనతో వారిని సన్మార్గులుగా మార్చుకుంటుంది.

"నీ కేసీ ఫరవా లేదు. నేను ఉన్నాను. నీకు చేసేవాళ్ళు లేరు – అనుకోకు. నేను చేస్తాను. నాలోనే కలుపుకుంటాను. ముందు, నీకు ఎవరూ లేరన్న దిగులు పోగొట్టుకో. నీకు నేను చేస్తాను, అన్నానుగా–" అని ఒకరికే గాదు, ఎందరికో అభయప్రదానం చేసింది.

మనకు అన్నం పెట్టి, మనకు గుడ్డలు పెట్టి అమ్మ ఆనందిస్తూ "నీవు నాకు పెట్టుకుంటే ఎంత తృప్తో, ఎవరికన్నా పెట్టుకుంటే నాకు అంత తృప్తి" అనీ "నేను కట్టుకునే కంటే ఎవరయినా కట్టుకుంటేనే నాకు సంతోషం" అనీ అమ్మ అనేక పర్యాయాలు పలికింది.

అమ్మ అనేక రకాలుగా బాధ అనుభవిస్తూ "మీకు చెప్పుకుంటే తీరుతుందని మీరు నాతో చెప్పుకుంటారు. నేను చెప్పుకుంటే మీరు బాధ పడతారని నేనే పడతాను" అని అమ్మ తన బాధను మనకు తెలియనివ్వదు

ఇంతగా కష్టపడి మనను కని, కష్టపడి మనను పెంచుతున్నప్పటికీ యింకా పిల్లలకోసం ఆశా, చాలక అసంతృప్తీ అని బాధపడుతుంది.

"గుణభేదమే నా కుంటే ఏ ఒక్కరూ నా దగ్గరకు రాగలిగేవారుకారు." నేను నా దగ్గరకు తీయటం తప్ప మీరు దగ్గరకు రావటం కాదు." "నేను మీ గుణగణాలు చూసి ప్రేమించటం లేదు. నా కోసం నేను ప్రేమిస్తున్నాను." "నాకు ప్రేమించడం, మీకు ప్రేమించబడటం సహజం." –అని తన ప్రేమ తత్వాన్ని ప్రకటిస్తూ– "తనను కన్నవాళ్ళ మీదకంటే తాను కన్నవాళ్ళ మీద ప్రేమ ఎక్కువ" అని వివరించింది ప్రేమావతారమూర్తి అమ్మ.

"ధర్మంకోసం తల్లి కాదు తల్లి ధర్మం నిర్వర్తించటానికే వచ్చా"నని చెబుతూ అందరినీ శుచీ, శుభ్రం చేయటమే తన ఆగమనానికి పరమ ప్రయోజనంగా వ్యక్తం చేసింది అమ్మ.

అందుకనే సోదరులు సుదర్శనంగారు "మతాన్ని ఉద్ధరించటానికి కాదు. మానవుణ్ణి ఉద్ధరించటానికి అమ్మ అవతరించింది" అని వెల్లడించారు.

—మార్చి 1972

అమ్మ అనారోగ్యాలు

ఫిబ్రవరి 2 వ తేదీన అమ్మ సన్నిధిలో ఒక వివాహం జరగబోతున్నది. లగ్నం మహూర్తం మధ్యాహ్నం 12 గంటలకు. పందిట్లో అతిథులు వచ్చి ఉన్నారు. అమ్మ వివాహం చేయబోతున్నదంటే స్థానికులు కూడ పందిట్లో వస్తారు. ప్రాంగణ మంతా పెండ్లి సందడితో, మంగళవాద్యాలతో నిండిపోయింది—కానీ అమ్మ మాత్రం చాలా అనారోగ్యంగా ఉన్నది. మంచంపై పడుకున్న అమ్మ మంచంమీద లేచి కూర్చోటమే అతికష్టంగా ఉన్నది. మరి పెండ్లి వేదికనలంకరించాలంటే - అమ్మ రెండంతస్తులు దిగిరావాలి. రమ్మని అడగటం—స్వార్థపరత్వమే కాక అమానుషమని కూడ అనిపించింది. అందువల్ల అమ్మను అర్థించాము—కల్యాణం తన గదివద్దనే జరిపించమని. "పై అంతస్తులో పెండ్లి చేస్తే—నాకు సుఖమే. మరి, మీరంతరూ ఎక్కడ కూర్చుంటారు? అందరూ ఎండలో కూర్చోవలసివస్తుంది. అంతకంటే— నేను దిగి రావటమే నాకు హాయి ...." అని స్పష్టంగా చెప్పింది అమ్మ.

అంటే పై అంతస్తులో వరండా చిన్నది వివాహం ఆ వరండాలో జరగాలి. అది చాలక జనం బయట ఎండలో నిలుచో వలసి వస్తుంది. అది అమ్మ భరించలేదు. నిత్యమూ కూడా యిదే సమస్య ఎదురవుతుంది. వరండాలో అమ్మ దర్శనం ప్రసాదిస్తుంటే—ప్రజలు ఎండా, వానా లెక్కచేయకుండా నిలుచుని ఆనంద స్వరూపిణీ ఆనందదాయినీ అయిన అమ్మను చూస్తూ హాయిగా ఉంటారు, వారిని చూస్తూ అమ్మమాత్రం గిలగిలలాడుతుంది.

తరువాత మార్చి 7 వ తేదీన యింకొక వివాహం నిశ్చయమయింది. అమ్మ ఆరోగ్య పరిస్థితిలో ఏమీ మార్పులేదు. అందువలన క్రితంసారి అనుభవంతో యీ పెండ్లి సినాతి జరపటానికి లగ్నం నిర్ణయించి పైఅంతస్తులోనే పెండ్లి ఏర్పాట్లు చేశాము. ఇంకొక రెండు గంటల్లో పెండ్లి జరుగుతుందనగా— ఆ విషయం అమ్మకు విన్నవించాము. అమ్మ అంగీకరించలేదు, "అమ్మా—నీ చేతిమీదుగా పెండ్లి జరగాలని వాళ్ళ కోరికగానీ. నువ్వు ఎక్కడ జరిపితేనేం?" అని అమ్మను సమ్మతింపజేయాలని మేము ప్రయత్నిస్తే — అమ్మ అన్నది "నేను పెండ్లిచేస్తే సరిపోతుంది అనుకుంటే

ఆ వధూవరులు మాత్రమే వచ్చిన చాలు. మరి, యింతమంది బంధువులూ, ప్రేక్షకులూ వచ్చారు. పైన చేస్తే - వేదిక లేదు గదా. అందరికీ పెండ్లి కనబడదు. నేను పెండ్లి చేయటం చూడాలని కుతూహలముతో అనేకులు వచ్చి ఉంటారు. వాళ్ళందరూ ఆశా భంగం పొందుతారు. అంతెందుకు? - నేను క్రిందకు వస్తాను. వేదిక పైననే ఏర్పాట్లు చేసుకొనండి-" అని.

1975 మే 19వ తేదీన అమ్మ సన్నిధిలో ఒక వివాహం జరిగింది ఆ రాత్రి పెండ్లి. ఆ పగలల్లా అమ్మకు మంటలజ్వరం. అమ్మకు లేచిన రాచకురుపుకు ప్రారంభ దశ. కాలు కదిలించలేనంతగా బరువెక్కిపోయింది. లగ్నసమయం సమీపిస్తున్నది అమ్మ అమితంగా బాధపడుతుంది. పెండ్లి వారికి ఆ విషయం తెలియక త్వరపడు తున్నారు. ఏమి చేయటానికి మాకు స్ఫురించలేదు వాళ్ళు ఎంతో ఆశతో హైదరా బాద్ నుండి అమ్మ అమృతహస్తంతో పెండ్లి చేయించుకోవాలని వచ్చారు. అమ్మ పరిస్థితేమో, యిట్లా ఉన్నది. అమ్మ వద్దకు వెళ్ళి, చాలా బాధతోనే, అమ్మను సలహా అడిగాము, ఏమి చేయమంటావు-అని. పెండ్లి వాయిదా వేయటమా లేక అమ్మ లేకనే పెండ్లి జరిపించడమా-అని. అమ్మ వెంటనే అన్నది ... "అవేమీ వద్దు నాన్నా. నేను లేచి స్నానం చేసి వస్తాను. పురోహితుని ఏర్పాట్లు చూడమనూ-" అని. అమ్మ పలికిన ఆ మాటలు ఆనందాన్ని కలిగించలేదు. అమ్మ మనకోసం ఎంత బాధను సహించ వలసివస్తున్నది- అని దుఃఖం వచ్చి కారే కన్నీళ్ళతో "వద్దమ్మ నువ్వు యిప్పుడు లేవద్దు. లేవలేవు..." అని ప్రాధేయపడ్డాము. అయినా అమ్మ పడుకొన లేదు. లేచింది; స్నానం చేసింది; తెల్ల చీరె కట్టుకున్నది. తల్లో తెల్లని మల్లెపూలదండ పెట్టుకున్నది. అంతకంటే తెల్లగా నవ్వుతూ గదినుండి బయటకు వచ్చింది. బయట వెన్నెల అమ్మను చూసి మురిసిపోయింది. చల్లగా ఉండాల్సిన వెన్నెల అమ్మలోని జ్వరాన్ని తీసుకున్నదేమో, కొద్దిగా వేడెక్కింది. అమ్మ చెయ్యిపట్టుకుని అమ్మను వేదికవద్దకు నడిపిస్తున్నాను. వెంట మరెవ్వరూ లేరు. అమ్మ అడిగింది - "నాలో యిప్పుడు జ్వరలక్షణాలేమయినా కనిపిస్తున్నాయా?" అని. అమ్మ చెయ్యి వదలి దూరంగా రెండడుగులు వేసి - అమ్మవంక చూశాను. చంద్రునినుండి జారిపడిన వెన్నెలకిరణంవలే ఉన్నది, తప్తకాంచనరేఖవలే ఉన్నది. అనుగ్రహం మానవాకృతి ధరించినట్లున్నది. మృదువైన స్వరంతో అమ్మ అన్నది. "నాకు జ్వరం ఉన్నట్లు వాళ్ళకు తెలిస్తే వాళ్ళు బాధపడతారనీ..." అని. అమ్మను చూస్తూ పొంగిపోయే ఆనంద తరంగం కుప్పున కూలి పోయింది. వెంటనే లోగడ అమ్మ చెప్పిన ఒకవాక్యం

స్మృతికి వచ్చింది. "మీ బాధలు నాకు చెప్పుకుంటే, అవి తీరతాయని నాకు చెప్పు కుంటారు. నా బాధలు మీకు చెబితే బాధపడుతారని నేను దాచుకుంటాను" అన్నది ఒకసారి.

బిడ్డలపై అమ్మకు ఎంత ప్రేమ! అందుకనే అమ్మ యింకొక వాక్యంకూడా చెప్పింది. తనను కన్నవాళ్ళమీద కంటే-ఎవరికయినా తాను కన్నవాళ్ళమీదనే ప్రేమ ఎక్కువట! మనం మన సుఖమే ఆశిస్తాము. అమ్మ విషయం ఆలోచించము. అమ్మ మన సుఖంకోసం తాను బాధను సహిస్తుంది.

అయితే యితరుల సుఖంకోసం తన సుఖాన్ని త్యాగం చేయటం అమ్మకు చిన్నతనం నుంచీ అలవాటే ఇతరుల ఆకలి తీర్చటం కోసం తనకు పెట్టిన అన్నం తీసుకువెళ్ళి ఆకలితో నకనకలాడే బిచ్చగాళ్ళకూ, పందులకూ, కుక్కలకూ పెట్టటం అమ్మ బాల్యంతో పరిచయమున్న అందరికి తెలిసిన విషయమే. అందుకనే ఒక సందర్భంలో అమ్మ అన్నది-"అన్నం నన్ను వదిలిందికానీ అన్నాన్ని నేను వదల లేదు" అని. ఆ వాక్యంలోని యదార్థాన్ని విచారించి తెలుసుకుంటే – ఎవరికైనా మనసును పిండినట్లవుతుంది. మనిషి శరీర పోషణకు అత్యంతావశ్యకమైన అన్నాన్ని సంవత్సరాలపాటు వదిలి అమ్మ ఎట్లా జీవించగలిగిందా – అని ఆలోచిస్తే, సమా ధానం లభ్యంకాక చివరకు అమ్మ దివ్యత్వంలో ప్రశ్న కరిగిపోతుంది.

సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి. అని చెప్పిన అమ్మ "ఇతరులతృప్తి" అనే యజ్ఞంలో తన ఆరోగ్యం, తన సుఖం, తన తృప్తి, తన ఆనందం అనేవి సమిధలుగాచేసి–మనిషి ఏమి చేసినా తన తృప్తికోసమే చేస్తాడు అని నిర్వచించి–తనకు అందులోనే అనిర్వచనీయమైన తృప్తి ఉన్నదని వివరిస్తూ "అయినా అంతానేనే, మీరంతా నేనే అనుకుంటున్నప్పుడు యింకా యితరులెవరూ ?" అని మనసు ప్రశ్నించి నిరుత్తరులను చేయటం అమ్మ అద్వైత సిద్ధికి నిదర్శనం.

అమ్మ తన పెండ్లి సందర్భంలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం కూడా జ్ఞాపకం చేసుకొనదగినది. "శరీరానికి ఎన్ని కష్టాలు వచ్చినా, శరీరానికీ మనస్సుకూ సంబంధం లేదని లోకానికి తెలియజేసేందుకే పెండ్లి చేసుకుంటున్నాను" అని వివరించింది.

అమ్మ క్షేమ సమాచారం గురించి ఎవరు ఎప్పుడు ప్రశ్నించినా, అమ్మ "కులాసాగానే ఉన్నాను నాన్నా" అంటుంది. వారడిగేది అమ్మ ఆరోగ్యం గురించి; అమ్మ చెప్పేది కులాసా గురించీ. ఆరోగ్యం శరీరానికి సంబంధించినదైతే, కులాసా మనస్సుకు సంబంధించినది.

1969 దసరా ఉత్సవాలు జరుగుతున్నయ్. దసరా ఉత్సవాలలో అమ్మ దర్శన కార్యక్రమం కనీసం నాలుగు గంటలకు తక్కువ పట్టదు. కానీ అమ్మకు ఒక రోజున విపరీతంగా విరోచనాలు కావటం మొదలు పెట్టినయ్ గంటకు పదిసార్లు తక్కువ కావటంలేదు. అందువలన ఆనాడు పూజాకార్యక్రమం రద్దుచేద్దామని ఆలోచించాము. కానీ అందుకు అమ్మ అంగీకరించక - పూజాదికపైకి వచ్చింది. ఆనాటి కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది.

1971 అమ్మ జన్మదినోత్సవం నాడు అమ్మకు బాగా దగ్గు వస్తున్నది తీవ్రామంగా వగ్గుతున్నది. జన్మదినోత్సవం పూజలో అమ్మకు కిరీటాలంకరణ చేస్తాము. కానీ యీ దగ్గువల్ల మానుకుందాము అనుకున్నాము కిరీటం పెడితే ఆ సమయానికి దగ్గుతెర వస్తే అమ్మకు చాలా యిబ్బంది కలుగజేసిన వాళ్ళమవుతాము. కానీ ఆనాడు ఎందరో భక్తులు మా దేశాలు నుంచి కూడా అమ్మను సర్వాలంకార శోభితగా చూడాలని వచ్చారు. వాళ్ళను అసంతృప్తులను చేయటమూ యిష్టంలేదు. అదే అమ్మతో విన్నవించాము... ఆనాడూ అమ్మ కిరీటధారణ చేసింది; కార్యక్రమము యథావిధిగా జరిగిపోయింది

1973 జనవరిలో ఒక రోజున నా స్నేహితులు కొందరు అమ్మను దర్శించేందుకు వచ్చారు. వాళ్ళను అనేక పర్యాయాలు నేను ఆహ్వానించి ఉన్నాను. ఆనాడు అమ్మకు 103 డిగ్రీల జ్వరం. విపరీతమైన చలిగా ఉన్నది. ఇంట్లోవున్న దుప్పట్లు అన్నీ కప్పాము అప్పటికి అమ్మ మంచంమీద ఎగిరెగిరి పడుతున్నది. మాట్లాడుతుంటేంటే పెదవుల వణుకు వలన మాటలు తడబడుతున్నాయి. ఆడపిల్ల లందరూ అమ్మను గట్టిగా పట్టుకుని మంచంమట్టు కూర్చున్నారు. వచ్చినవాళ్ళు అమ్మను చూసి వెళ్ళాలని ఆందోళన చేస్తున్నారు ఏమి చెయ్యాలో తోచక నేను పచార్లు చేస్తున్నాను ఆ పరిస్థితిలో నాన్నగారు నన్ను చూసి "ఏమిటి!" అని విచారించారు. నేను చెప్పాను. "దానికింత ఆలోచన ఎందుకు ? మీ అమ్మగారికి చెప్పు. మీ అమ్మ గారు బాధలను గడ్డలను మీ కళ్ళెయ్యను తగ్గించినట్లు అనిపించగలుగుతుంది" అని

చెప్పారు. నేను వెళ్ళి అమ్మతో చెప్పాను. పదినిమిషాల్లో వాళ్ళను తీసుకురా-అన్నది అమ్మ. నేను వాళ్ళకు అమ్మ ఆరోగ్యపరిస్థితి తెలియజేసి, అయినా అమ్మ దయతో దర్శనం ప్రసాదిస్తున్నది, కానీ అమ్మతో మాట్లాడటానికి అవకాశంలేదు, అమ్మ మాట్లాడగలిగే పరిస్థితిలో లేదు - అని చెప్పాను. వాళ్ళు సరేనని సంతోషపడ్డారు. పది నిమిషాల్లో స్నానం ముగించుకుని అమ్మ మంచంపై కూర్చున్నది; వాళ్ళు లోపలకు వచ్చారు. అమ్మను చూడగానే నాకు ఆశ్చర్యం కలిగింది. అప్పుడే విరిసిన పువ్వువలె ఉన్నది అమ్మ. నేను ఆశ్చర్యపోతుండగానే సంభాషణ ప్రారంభము అయింది. చాలా మామూలుగా అమ్మ మాట్లాడుతున్నది. ఈసారి నాకు ఆశ్చర్యము కలుగలేదు భయమేసింది. కారణం - ఆ వచ్చిన నా స్నేహితులు నన్ను అపార్థం చేసుకుంటారేమో నని. అమ్మ అనారోగ్యంగా ఉన్నదని నేను అసత్యమాడా నను కుంటారేమోనని.

ఇటువంటి సంఘటనలు అసంఖ్యాకంగా ఉన్నయ్.

నాన్నగారు చెప్పినట్లు అమ్మ తన బాధలను చిలుకకొయ్యకు తగిలించటమే నిజమయితే - మంచిదే. కాని అమ్మ వాక్యం ప్రకారం అమ్మ తన బాధలను దాచు కొనటమే అయితే, అది అమ్మకు బాధ కాకపోవచ్చును కానీ మనకు బాధాకరమే.

ఇటీవల [illegible] వ తేదీన బాపట్ల ఆదాయపు పన్ను అధికారి శ్రీ వెంకటేశ్వర్లు గారు అమ్మను దర్శించుకుని అమ్మను అడిగారు. "అమ్మా! నా అర్హతబట్టి నాకు జీవితాన్ని ప్రసాదించు - అది సుఖంకానీ కష్టంకానీ కష్టాలూ, బాధలూ వద్దు-అనను గానీ అవి ప్రసాదించినప్పుడు వాటిని హాయిగా భరించే శక్తికూడా యివ్వు" అని. వెంటనే అమ్మ అన్నారు "హాయిగా భరించేటప్పుడు అవి కష్టాలూ, బాధలూ ఎట్లా అనిపించుకుంటాయి నాన్నా ?" అని.

అందుకనే అమ్మ అన్నారు "ఇష్టం లేనిదే కష్టం" అనీ, "భరించలేనిదే బాధ" అనీ.

ఏ మనిషి జీవితంలో నయినా అన్నీ ఇష్టమైనవే రావు; అన్నీ యిష్టం లేనివే జరగవు. అన్నీ భరించగలిగిన సంఘటనలే వుండవు; భరించకనూ తప్పదు. అనుకున్నవి జరగవు; తనకున్నవి తప్పవు. ఈ ద్వంద్వాలలో సమానస్థితియే మానవు నకు ఆదర్శం. ఈ ఆదర్శాన్ని లోకానికి ఆచరణాత్మకంగా ప్రబోధిస్తున్నది. అమ్మ

ఈ స్థితికే అమ్మ సహజ సమాధి అని నామకరణం చేసింది. ఈ స్థితి అమ్మలో మనం గుర్తించలేనంతగా సహజమైపోయింది.

కానీ - ఏది ఏమైనా మనకు పాఠంచెప్పటం కోసం అమ్మ అసామాన్యమైన బాధలకు గురికావటం మనం సహించలేని విషయం. డాక్టర్ సుబ్బారావుగారు చెప్పినట్లు - అమ్మ శరీరంపై మందులకంటే అమ్మ మనస్సుకే అత్యంతమయిన ప్రభావం ఉండటం నిర్వివాదం

కనుకనే - యీ 54వ జన్మదిన మహోత్సవం పురస్కరించుకుని - అమ్మ బిడ్డలమయిన మనమందరం సాగిలబడి అమ్మను అర్థిద్దాము - "అమ్మా నీ ఆరోగ్యాన్ని బాగుచేసుకో. నీకోసం కాకపోయినా మాకోసం నువ్వు ఆరోగ్యంగా ఉండు. నువ్వు యింకా వెయ్యేళ్లు చల్లగా ఉండు. నీ ఒడిలో మమ్మల్ని హాయిగా ఆదమరచి ఆడుకోనీ..." అని.

అమ్మ బహు సంతానవతే కాదు; సంతానప్రియ.

అమ్మ 'ఎంతో' మంచిది ; బిడ్డల కోరికను మన్నిస్తుంది.

—మార్చి 1977

బాధల భగవంతుడు

"నిజమే ననుకో అమ్మా - ఎదురుగా కనబడే బాధను చూచి మనస్సు నిబ్బరించుకోలేకపోతున్నాను. నీ స్థితి ఎక్కువ అనీ నాకు తెలుసు. నీ మనస్సు మా మనస్సుకంటే విశిష్టమయిందనీ తెలుసు. నీ శరీరము మా శరీరముకంటే విభిన్నమయిందనీ తెలుసు. నిన్ను ఎవరూ ఏవీ ఏమీ చేయలేరనీ తెలుసు. అయినా నీవు బాధపడుతూ కనపించగానే అంతకు ముందున్న భావాలూ, విశ్వాసాలూ కరిగిపోతున్నాయమ్మా. దీనికి కారణం మాత్రం నాకు తెలియటం లేదు..."

"ఇంత మాత్రానికే బాధపడితే, చలిస్తే ఎట్లా? ముందు ముందు ఉన్నదంతా అదే-"

"ఏమో, కొన్ని సందర్భాలలో నీవు సర్వశక్తిమంతురాలవనీ, సర్వజ్ఞురాలవనీ ఎంత నమ్మకమో, కొన్ని కొన్ని వేళల్లో నీ కేమవుతుందోననీ, నీ వేమవుతావోననీ నేను బాధపడుతుంటానమ్మా. మరి ఆ విశ్వాసానికీ, ఈ భయానికీ సమన్వయం ఎట్లాగో నాకు అర్థంగావటం లేదు-"

ఈ సంభాషణ అమ్మకూ, చిదంబరరావుతాతగారికీ - అమ్మకు పది సంవత్సరాల వయస్సులో తీవ్రంగా జ్వరం తగిలినప్పుడు జరిగింది. చివరకు అమ్మ "పిచ్చి తాతగారూ- నాకు నయం కాదనుకున్నారా? నేను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి" అని చెప్పింది.

"అదేనమ్మా- నేనూ కోరుకునేది."

"మీ కోరిక నెరవేరుతుంది తాతగారూ-" అని ఆనాడు అమ్మ హామీ నిచ్చింది.

తరువాత ఎన్నో సంవత్సరాలు గడిచాయి. అమ్మకు ఎన్ని జ్వరాలో, ఎన్ని ప్రమాదాలో, ఎన్ని గాయాలో, ఎన్ని గండాలో! ఎప్పటికప్పుడు ఏదో ఒకటి కొండవలే రావటమూ, దూదిపింజవలే తేలిపోవటమూ.

1956 లో ఒకసారి అమ్మ స్పృహలేకుండా, శరీరంలో ఏ మాత్రం చలనం లేకుండా నాలుగురోజులు పడుకున్నది. మొదటి రోజునే నాన్నగారూ, బామ్మ చాలా భయపడ్డారు. అప్పుడు వారికి అమ్మ హామీ నిచ్చింది. "నా కేమీ ఫరవాలేదు. మీ కేమీ ఆందోళన వద్దు. నాలుగు రోజుల తర్వాత నేనే లేస్తాను" అని. ఆ నాలుగు రోజుల తరువాత అమ్మ ఏమి అమృతం తాగిందో- ఆరోగ్యవంతురాలు కావటమే కాక దివ్యదీధితులతో ప్రకాశించింది.

ఒక్కొక్కసారి అమ్మ ఎవరి బాధనన్నా తానే తీసుకుని అనుభవిస్తున్నదా- అనిపిస్తుంది. అందుకు తార్కాణాలు కూడా అనేకము కనుపిస్తున్నాయి.

ఏమయినా అమ్మ బాధపడేటప్పుడు మాత్రం- అమ్మ భరిస్తున్నప్పటికీ- మనకు దుర్భరంగానే ఉంటుంది. పైగా మనకోసం బాధను ఏ మాత్రం పైకి కనుపించనివ్వకుండా- లేచి తిరుగుతూ, చిరునవ్వు వెన్నెలను చిందిస్తూవుంటే- అది మనకు మరింత కోతగా ఉంటుంది.

అందుకే అమ్మను చూస్తుంటే - మండుటెండల్లో తాను మాడుతూ మనకు నీడనిచ్చే మహావృక్షం మనసునంతా ఆక్రమిస్తుంది. మన మురికినంతా తాను తీసుకుని, మనను పవిత్రులను చేసే జాహ్నవి మనస్సులో ప్రవహిస్తుంది.

భక్తితోపాటు అమ్మపై జాలీ, సానుభూతీ కలుగుతాయి. వెంటనే మన ఆలోచనలకు మనకే నవ్వువస్తుంది.

ఇవ్వాల్టి (12-7-75) కి సరిగా 50 రోజులక్రితం అమ్మకు ఒక గడ్డ లేచింది. అది అమ్మను పెట్టేబాధ అంతా యింతా కాదు. పైగా "గడ్డకూడా బిడ్డే-" అని అమ్మ అంటుంటే- అమ్మ సర్వాత్మత్వానికి ఆనందం కలిగేకంటే, దుఃఖమే కలుగుతున్నది.

ఈ ఏభైరోజులనుండీ చేస్తున్న చికిత్సవల్ల ఫలితమేమీ కనుపించటం లేదు. డాక్టర్లు ఓడిపోతున్నారు. డాక్టరు యస్. వి. సుబ్బారావుగారు "అమ్మా- ఈ బాధలపై నీకు గల ప్రేమముందు, మా వైద్య విజ్ఞానం తలవంచింది" అంటూ అమ్మ పాదాలకు ప్రణమిల్లారు. అందుకనే మహర్షి రహీ ఎంతోకాలం క్రిందటనే అమ్మను "బాధల భగవంతుడు" గా అభివర్ణించారు.

ఈ అభివర్ణనలు, అభినందనలు ఎట్లా ఉన్నా - ప్రస్తుతం వైద్యులు పూర్తి విశ్రాంతి అవసరమని ఎంత నొక్కి చెబుతున్నప్పటికీ, "యింత" బాధతో క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా అనుక్షణం వచ్చిపోయే బిడ్డలకు దర్శనమిస్తూ, వారి కష్టసుఖాలు వింటూ, వారికి తృప్తినీ, హాయినీ, ఆనందాన్నీ రెండు చేతులా పంచిపెట్టే తల్లినిచూచి ఏమనాలి ? ఏమనుకోవాలి ?

"అమ్మా యీ బాధను తగ్గించుకోమ్మా- నువ్వు సుఖంగా ఉండమ్మా" అని మనమందరం ఏక కంఠంగా విలపించటం ఒక్కటే మార్గంగా కనుపిస్తున్నది.

కామితార్థ ప్రదాయిని, కరుణామయి అయిన అమ్మ గుండె మన విలాపాలాపాలకు ఏమాత్రం కరగకపోవటం చూస్తే- మనలోని ఆర్తికి బలం చాలటం లేదేమో అనిపిస్తుంది.

మరి, ఆర్తిని కలిగించవలసిందీ దానికి బలాన్ని ప్రసాదించవలసిందీకూడా అమ్మే !!

—జులై 1975

అమ్మ మనలాంటి దేనా ?

"నేనూ మీలాంటి దాన్నే. నాలో ప్రత్యేత ఏమీ లేదు" అని అమ్మ చెబుతూ ఉండడం మనం పదే పదే వింటూనే ఉంటాము.

అమ్మ తత్వమూ, ప్రతిభా, ప్రజ్ఞా, సర్వ శక్తి సామర్థ్యాలూ అనుభవ పూర్వకంగా అవగతం చేసుకున్నవాళ్లూ, అమ్మ యందు పరిపూర్ణమైన ప్రగాఢ మయిన విశ్వాసం కలవాళ్లూ అయితే అమ్మ మాటలకు తమలో తామే నవ్వుకుంటూ- అమ్మలోని నిరాడంబరతకు మరొక్క మారు సాగిలపడతారు. లేనివాళ్ళయితే 'ఔను. అంతే. అమ్మ కూడా మనలాంటిదే. మనమే వాళ్ళ మాటలూ, వీళ్ళ మాటలూ నమ్మి, ఏవేవో ఊహించుకుని, అమ్మను కొండెక్కించి కోటి దండాలు పెడుతున్నాం..." అని అనుకుని తమ తార్కిక వైభవానికి తామే మురిసిపోతారు

అయితే- మన నమ్మకాలనూ, నమ్మకాలపై ఆధారపడే మహిమలనూ, ఆలంబనంగా మనం రూపకల్పన చేసుకునే దైవత్వమూ ప్రక్కకుబెట్టి - నిత్య జీవితంలో, అనుక్షణం అమ్మ ఆలోచించే తీరులో, అమ్మ మాట్లాడే రీతిలో, అమ్మ యితరులతో వ్యవహరించే ప్రవర్తనలో.... ఏమయినా విలక్షణత, విశిష్టత, విశేషం ఉన్నాయా-అని మనం ఒకసారి పరిశీలిద్దాము. అమ్మకూడా సామాన్యుల వలెనే ఆలోచిస్తుందా ? అందరి పలుకులకూ అమ్మ మాటలకు, ఏమీ తేడా లేదా ? సగటు మనిషివలెనే అమ్మకూడా ప్రవర్తిస్తుందా ?

అమ్మ సాన్నిధ్యంలో ఉండి ఏమాత్రం పరిశీలనాసక్తి ఉన్నా పై ప్రశ్నలకు మనకు సంతృప్తికరమయిన సమాధానాలు దొరుకుతాయి.

ఎవరయినా ఒక వ్యక్తిని గురించి ఆలోచించేటపుడు, ఒక సంఘటనను చూచేటపుడు - అంతకుముందే మన మనస్సులో పేరుకుపోయిన పలు పొరలు పని చేస్తాయి అమ్మ ఆ వ్యక్తిని అవ్యక్తిగానూ, ఆ సంఘటనను ఆ సంఘటనవరకే చూస్తుంది.

ఉదాహరణకు ఒక వ్యక్తి మన యింటికి వచ్చాడు - అనుకుందాము. అతణ్ణి ఆదరించే తీరులో - అతని చరిత్ర, అతని స్థితి, అతనికీ మనకూ

గల సంబంధ బాంధవ్యాలు అనేకం ప్రాధాన్యం వహిస్తాయి. కొంతమందిని నుంచో పెట్టి మాట్లాడుతాము. కొందరిని కూర్చోమంటాము. ఆ కూర్చో పెట్టటంలో కూడా అనేక స్థాయిలు. మనకంటె తక్కువగా; మనతో సమానంగా; మనకంటె ఎక్కువగా. కొందరితో వచ్చిన పనివరకే మాట్లాడుతాము. కొందరిని మంచినీళ్లు కావాలా ? అని ఆదరిస్తాము. కొందరికి కాఫీ, ఫలహారా లిచ్చి మన ఆప్యాయతను చూపిస్తాము. కొందరికి భోజనం పెట్టి మన ఆత్మీయతను ప్రదర్శిస్తాము. ఈ విధంగా మన ఆదరణ అనేక రూపాలు ధరిస్తుంది.

కానీ-అమ్మ అందరినీ ఒక్క తీరుగానే ఆదరిస్తుంది. వాళ్ళ అవసరమే అమ్మకు కనిపిస్తుంది. కానీ వాళ్ళ స్థానాలూ, స్థాయిలూ దృగ్గోచరం కావు. ఒకసారి జిల్లెళ్ళమూడిలో అన్నపూర్ణాలయంలో భోజనం చేసే అర్హతను గురించి చర్చ వస్తే చివరకు అమ్మ తీర్మానించింది-ఆకలి కలిగి ఉండడమే భోజనం చేయడానికి అర్హత- అని.

ఒక రోజున ఒక ముసలమ్మ వర్షంలో తడిసి అమ్మ వద్దకు వచ్చింది. కట్టుకున్న చీరె నీళ్ళు గారుతున్నది. ఆమె చలికి గజగజా వణుకుతున్నది. ఆమెను చూడగానే అమ్మ లోపలినుండి చీరె తీసుకురమ్మని నన్ను ఆదేశించింది. నేను లోపలకు వెళ్ళి శ్రీమతి వసుంధరను అడిగాను. వసుంధర ఎందుకూ - అని అడిగింది. నేను చెప్పాను. వసుంధర బీరువా తీసి చూచి 'లేవు' అన్నది. నేను వెళ్ళి అమ్మకు చెప్పాను. అమ్మ ఆమె వంకా, నా వంకా చూచింది అమ్మ అభిప్రాయం గ్రహించి 'లేవమ్మా' అన్నాను మళ్ళీ. అమ్మ చివాలునలేచి పాదరక్షలయినా తొడుక్కోకుండా లోపలికి వచ్చి తానే స్వయంగా బీరువా తీసింది. అందులో మడత పెట్టి బహు అందంగా ఉన్న ఖరీదయిన పట్టుచీరె తీసుకుని బయలుదేరింది - ఆ ముసలమ్మకు యివ్వడానికి. "అదొక్కటే ఉన్నదమ్మా. అది కూడా యిస్తే నువ్వు స్నానంచేస్తే కట్టుకోవడానికి చీరె ఉండదమ్మా" అన్నది వసుంధర. అమ్మ వసుంధరను అదోలా చూస్తూ "నాకు చీరె ఉండదని ఆలోచిస్తున్నావా ? నాకు అవసరమైతే అదే వస్తుంది. అదీగాక - మనకున్నవి మనం యిస్తేగానీ మనకు క్రొత్తవి రావు" అన్నది అమ్మ మందహాసం చేస్తూ. నేనూ, వసుంధర మారుమాట లేక చూస్తూ ఉండిపోయాము. అమ్మ తన కర్తవ్యం నిరాఘాటంగా నెరవేర్చింది.

మనం మనిషి మంచివాడయితే ప్రేమిస్తాము; గౌరవిస్తాము. స్నేహం చేస్తాము; సన్నిహితుల మౌతాము కాకపోతే ద్వేషిస్తాము; అసహ్యించుకుంటాము. దూరంగా వెళ్ళిపోతాము. అమ్మ అట్లాకాదు. అందరినీ ఒక్కలాగానే ప్రేమిస్తుంది. ఎవరి వ్యక్తిత్వాలూ అమ్మకు ఆకర్షణనూ కలిగించలేవు; అసహ్యతనూ కలిగించలేవు. "గొప్ప కార్యం చేసినా, కొద్ది కార్యం చేసినా ఒకటే నడిపించేది ఒకటయినప్పుడు నీ గొప్పతనం లేదు. ఇది (మీా తప్పు) మీ దనిపించదు నాకు. మీరు ఆ స్వభావాన్నిచ్చి ఆ ప్రేరణ చేసిన శక్తి దనిపిస్తుంది" అంటుంది అమ్మ. అందువల్ల అమ్మ తనను గురించి తాను తెలుపుకుంటూ – "రాగద్వేషాలు రహితమైనదే అనసూయ" అని ప్రకటించింది.

మన ప్రేమ పరస్పరాశ్రయమై ఉంటుంది ఎదుటివారు ప్రేమిస్తేనే మనం ప్రేమిస్తాము. మన ప్రేమ కారణంతో కూడి ఉంటుంది అమ్మ ప్రేమకు కారణంతో సంబంధం లేదు. ఎదుటివారు తిరిగి ప్రేమిస్తున్నారా, లేదా-అన్న ఆలోచనే లేదు. అందుకే అమ్మ "ప్రేమ నాకు సహజం" అనగల్గింది. తనను ప్రేమించేవాళ్ళనూ, విమర్శించేవాళ్ళనూ, ద్వేషించేవాళ్ళనూ సమానంగా ప్రేమించగలుగుతున్నది.

మన ప్రేమ పరిమితులకు లోబడి ఉంటుంది. మన కుటుంబమనో, మన బంధుమిత్రులనో, మన కులం అనో, మన మతం అనో, మన భాష అనో, మన దేశం అనో – అనేక పరిమితులూ, పరిధులూ మనకు. కాని అమ్మకు యివేమీ లేవు. ప్రక్క శోణితాల కేది కులమో- అదే నా కులం అని ప్రవచించింది. సర్వసమ్మతమైనదే నా మతం అని ప్రకటించింది. గుణభేదం లేదని సుస్పష్టంగా చెప్పింది. ఎవరిని చూచినా తనకు తన బిడ్డే అనిపిస్తుంది-అంటూ వాత్సల్యపు సరిహద్దులను చెరిపేసింది. సృష్టి నాది – అని విపరిస్తూ మమకారపు పరిధులను తుడిపేసింది.

ఒకసారి మా గ్రామంలో కారుక్రింద ఒక పిల్లవాడు పడ్డాడు. ఆ వద్దని మా పిన్నిగారి అబ్బాయి-అని అందరూ అరిచారు. ఆ కేకలు విని మా పిన్ని గుండెలు బాదుకుంటూ అక్కడకు పరుగెత్తింది. ఆ పిల్లవాడు నెత్తుటిమడుగులో స్పృహకోల్పోయి ఉన్నాడు. దృశ్యం హృదయ విదారకంగా ఉన్నది. కానీ ఆ పిల్లవాడు మా పిన్ని కొడుకు కాదు. ఆ విషయం మా పిన్ని గ్రహించింది. ఆ క్షణంలోనే ఆమె కన్నీళ్ళు ఆరిపోయాయి. ఆమె దుఃఖం ఆగిపోయింది. పైగా పకపకా నవ్వుతూ 'మా పిల్లవాడు కాదు' అని అరిచింది. మరి-అమ్మ ఎవరికి ఏమాత్రం

కష్టం కలిగినా–వారితోపాటు తానూ విచారిస్తుంది. ఎవరికి ఏమాత్రం ఆనందం కలిగినా తానూ పాలుపంచుకుంటుంది

మనకు అందరి యందు అనుమానాలే. అందరిలో మనకు లోపాలూ, దోషాలే కనుపిస్తాయి. ముందు మనం ప్రతివాడినీ అనుమానించి తర్వాత కాదని ఋజువు చేసుకుంటాము. అమ్మ అందరిలోనూ మంచితనాన్నే చూస్తుంది. సర్వత్రా పూజ్య భావాన్నే చూస్తుంది చివరకు. ఒక్కమాటలో చెప్పింది "తల్లికి తప్పే కనిపించదు" అని

మనమూ అనేక సిద్ధాంతాలు వల్లిస్తాము. వ్యాసాలు రాస్తాము ఉపన్యాసాలు యిస్తాము. ఇతరులకు ఉపదేశాలు చేస్తాము. కానీ మనం మాత్రం అట్లా ఆచరించము. మన మాటకూ చేతకూ ఎక్కడా సామ్యం ఉండదు. కానీ–అమ్మ విషయంలో వేరు. అమ్మ తానేది ఆచరిస్తుందో–అదే యితరులకు ఉపదేశిస్తుంది. తానేది అనుభవిస్తుందో–అదే వివరిస్తుంది అమ్మ వాక్కుకూ క్రియకూ అంతరం ఉండదు.

ఈ విధంగా మనం అవలోకించ గలిగినంతవరకూ, ఆలోచించగలిగినంత వరకూ – అమ్మకూ మనకూ భౌతికంగా తప్ప మరి యేవిధమైన పోలికా కనిపించదు. అమ్మకూడా సాధారణ స్త్రీవలే చీర కట్టుకుని, సామాన్యమయిన కరచరణాదులతో కనుపిస్తూ "నేనూ మీవంటి దానినే" అంటూంటే ఆ మాట మనను మాయలో ముంచేస్తూ ఉంటుంది.

– మార్చి 1980

ఇదీ అమ్మ అంటే

1970 నవంబరు 22వ తేదీన శ్రీ లక్ష్మణయతీంద్రులు జిల్లెళ్ళమూడి వచ్చారు. వారు సుప్రసిద్ధులయిన యతీంద్రులే కాదు; రససిద్ధులైన కవీంద్రులు కూడా. వారి కవితారచన ఆపాతమధురమూ, ఆలోచనామృతమూనై రసస్ఫోరకంగానూ, రమణీయముగానూ ఉంటుంది వారి కవిత్వమువలెనే కంఠంకూడా మనోజ్ఞమై గంభీరమై నినదిస్తుంది. అందువల్ల జిల్లెళ్ళమూడి వాసులకే కాక అమ్మకు కూడా వారి కంఠం వినాలని ప్రగాఢమయిన ఆసక్తి, వింటే పరమానందమూ.

ఆ సాయంకాలం అమ్మసన్నిధిలో వారి కవితాగానం ఏర్పాటు చేయబడింది. వారు లోగడ ప్రచురించిన 'క్వణత్కింకిణి' అన్న కావ్యం నుండి కొన్ని రసవద్ఘట్టాలను గానం చేస్తున్నారు. యతీంద్రులవారు వారి ఆరాధ్య దైవం అయిన 'కన్నయ్య' ను గురించే పాడుతున్నప్పటికీ – 'కన్నమ్మ' పాదాల మ్రోల ఉన్నందున తత్ప్రభావితులై పరమానందభరితులై కన్నయ్య-కన్నమ్మలకు అభేదంగా ప్రవచనం చేస్తున్నారు.

కృష్ణుడు – గోపికల సంబంధం వర్ణిస్తూ ఒక పరమ రహస్యం బహిర్గతం చేశారు.

"కొందరు మేము ఎక్కడో ఉన్నాం; యిక్కడ అతుక్కున్నాం అనుకుంటున్నారు భ్రాంతితో. అందరూ ఉన్నది యీ పాదాల దగ్గరే. అందరం యిక్కడే పుట్టాం. ఇక్కడనుండి కొనలు సాగుతున్నాం అనుకుంటున్నాం. మన ద్వారా యీ శరీరంద్వారా కొనలు సాగుతున్నది అమ్మలోని చైతన్యమే."

శ్రీ యతీంద్రులవారు చమత్కరిస్తున్నట్లు కనిపించినప్పటికీ, ఆ ప్రసంగంలోనే ఒక విచిత్ర సత్యాన్ని ఆవిష్కరించారు.

"ఏదో మైలురాయి దాటి వచ్చినవాడికి స్వంతయిల్లు ఉండే యోగం లేదు. వాడిల్లు అందరిల్లే అవుతుంది. తప్పదు అది."

శ్రీ యతీంద్రులవారు తన్మయులై పాడుతున్నారు; ప్రసంగిస్తున్నారు. శ్రోతలు పరవశులై ఆలకిస్తున్నారు; ఆనందిస్తున్నారు.

అంతలో అమ్మ యతీంద్రులవారి మెడలోనున్న పుష్పహారాన్ని తీసి క్రింద ఉంచింది. అది బరువుగా ఉన్నందువల్ల వారికి శ్రమ కలుగుతుందని అమ్మ ఆలోచన. వెంటనే చిరునవ్వుతో యతీంద్రులవారు అన్నారు "అమ్మ అంటే అది. అమ్మ అంటే నిర్వచనం కోసం డిక్షనరీ చూడకండి. ఇక్కడ చూడండి...ఇదీ అమ్మ అంటే" అని.

సంఘటన చిన్నదా, పెద్దదా అన్నది విచికిత్స కాదు. అమ్మ ప్రతి కదలికలో ప్రతి క్రియలో మాతృత్వం పరిమళిస్తూంటుంది.

అనుక్షణం వచ్చిన ప్రతివారు అన్నం తిన్నదీ, లేనిదీ అమ్మ స్వయంగా విచారిస్తూ ఉంటుంది. కొందరు అన్నం తిని వస్తే వారికి అమ్మ యేదైనా తినిపిస్తూ ఉంటుంది. ఆ తినిపించేటపుడు అమ్మ తీసుకునే జాగ్రత్తలూ, చూపించే శ్రద్ధా మనను ఆశ్చర్యచకితులను చేయడమేకాదు మన గుండెను కదుపుతాయి. అరటిపండు తినిపిస్తే - అది మెత్తగా ఉన్నదా, గట్టిగా ఉన్నదా, అని వత్తిచూసి మరీ తినిపిస్తుంది. బత్తాయితొనలైతే గింజలను తానే తొలగిస్తుంటుంది.

అన్నం పెట్టేటప్పుడు అయితే ఎవరికి ఎట్లా కావాలో విచారిస్తూ, కొందరికి కారం ఎక్కువగా, కొందరికి ఉప్పు తక్కువగా కలుపుతూ, కబుర్లు చెబుతూ కొసరి కొసరి పెడుతూంటుంది. ఆ మధుర సమయాల్లో ఎవరికి వారికి - వారి వయస్సుతో గుణాలతో నిమిత్తం లేకుండా - తాము పసివాళ్ళు అయినట్లు తమ కన్నతల్లుల ఒడిలోనో, చంకలోనో ఉన్నట్లు అనుభూతి కలుగుతుంది.

మరి, అమ్మ - ఎవరికనీ ? ఎందరికనీ !

—డిశంబరు 1979

అమ్మవాక్కు

ఏప్రియల్ 1౬వ తేదీన అమ్మ జన్మదిన మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆ మరునాటికి వచ్చిన జనం క్రమంగా సర్దుకున్నారు.

నేను అంతకుముందు కొన్ని నెలలుగా అప్పికట్ల వెళ్ళలేకపోయాను. అక్కడ అత్యవసరంగా చేయాల్సిన లెక్కల పనులు కొన్ని నాకోసం ఎదురుచూస్తు న్నాయి. మా అధికారులకు కూడా 16 వ తేదీ నుండి లెక్కలు చేస్తానని వాగ్దానం చేశాను.

అమ్మ అనుమతి నడిగాను - అప్పికట్ల వెళ్ళి కొన్ని రోజులుండి మళ్ళీ వస్తానని. అమ్మ అంగీకరించింది నాకు చాలా ఆనందం కలిగింది. ఇవ్వాళనే వెళతానమ్మా - అన్నాను. రేపు వెళ్ళు - అన్నది అమ్మ. ఇవ్వాళనే లెక్కలు మొదలు పెడదామనుకుంటున్నానమ్మా - అన్నాను. వారం రోజులుగా రాత్రింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా ఉన్నావుగా, యీ రాత్రికి విశ్రాంతి తీసుకో రేపటినుంచి లెక్కలు చేసుకుందువుగానీ - అని అమ్మ సలహా నిచ్చింది.

అట్లా కాదమ్మా - రాత్రికే లెక్కలు మొదలుపెట్టాలి. నేను అట్లా అధికారులక్కూడా మాట యిచ్చాను - అన్నాను, నా దృఢనిశ్చయం తెలియజేస్తూ.

సరే, నీ యిష్టం - అన్నది అమ్మ.

నేను మా శ్రీమతిని తీసుకుని అప్పికట్ల బయలుదేరాను. అప్పుడు సాయంకాలం 6 గంటలయింది. అమ్మచేత బొట్టు పెట్టించుకుని ప్రసాదం తీసు కుందామని అమ్మవద్దకు వెళ్ళాము. భోజనంచేసి రాత్రివానులో వెళ్ళకూడదూ? - అన్నది అమ్మ. ఎందుకమ్మా ? అప్పికట్ల ఎంతసేపట్లో వెళతామూ ? వంట ఎంత సేపట్లో అవుతుందీ? త్వరగా వెళితే యీ రాత్రికే ఎంతో లెక్కపని చేసుకోవచ్చు నమ్మా - అన్నాను.

సరే, నీ యిష్టం - అన్నది అమ్మ.

అమ్మను ఒకరు నీవు - జీవితంలో అనుష్ఠించిన మంత్రం ఏమిటమ్మా? అని అడిగితే, సరే మంత్రం అని అమ్మ నిర్ద్వంద్వంగా సమాధానం చెప్పింది.

ఎందుకూ, ఎవరికీ ఎదురు చెప్పడం అమ్మకు అలవాటు లేదు. ఇంకొక సందర్భంలో అమ్మ చెప్పింది - ఎవరినీ ఎదురు తగిలి పట్టుకోకూడదు. వారివెంట మనమూ పరుగెత్తి, వాళ్ళు అలసటవచ్చి ఆగినప్పుడు పట్టుకోవాలి - అని. ఈ వాక్యములో అమ్మకుగల లోకానుభవ పరిణతి ప్రస్ఫుటంగా వెల్లడవుతున్నది.

ఈ రాత్రికి మీరు వెళ్ళి అన్నం వండుకున్నా - మజ్జిగ కావాలి గదా. అక్కడ వాటికోసం ఏం వెదుక్కుంటారు? ఇక్కడనుండి తీసుకువెళ్ళండి - అని అమ్మ యింకొక సలహా యిచ్చింది

అమ్మకు మన తిండి తిప్పలయందు గల శ్రద్ధకు, జాగ్రత్తకు, ముందు చూపుకు ఉక్కిరి బిక్కిరి అవుతూ 'సరేనమ్మా' అన్నాను. ఈసారి అమ్మ మంత్రం నేను ఉపయోగించుకున్నాను.

బస్సుకు బయలుదేరాము. బస్సులు అనుకున్నట్లుగా అందలేదు. సకాలంలో అప్పికట్ల చేరలేక పోయాము. చేరేసరికి రాత్రి 9 గంటలు దాటింది. వాకిట్లోకి వెళ్ళగానే గడియకు తగిలించిఉన్న తాళం కనిపించి వెక్కిరించినట్లనిపించింది.

మా యింటికి ఎవరు ఎప్పుడు తాళం పెట్టినా తాళం చెవి మా యింటి ప్రక్కనగల మా బాబాయిగారింటిలో యివ్వడం అలవాటు. అందుచేత వాళ్ళయింటికి వెళ్ళాను. వాళ్ళ యింటి వాకిట్లో తాళమూ నన్ను చూసి వికటాట్టహాసం చేసింది.

సాధారణంగా వాళ్ళ యింటికి తాళంపెట్టి అందరూ కలిసి ఎప్పుడూ ఎక్కడకూ వెళ్ళరు. కాని ఆ రోజున అట్లా జరిగింది.

విచారిస్తే - వాళ్ళందరూ కలసి బాపట్లలో వాళ్ళ కుమారుని దగ్గరకు వెళ్ళారని తెలిసింది. ఎవరిని విచారించినా మా యింటి తాళంచెవులు ఎవ్వరికీ యివ్వ లేదని రూఢి అయింది.

ఏం చేయలేక, ఎవరి యింటికి వెళ్ళడానికి మనస్సు అంగీకరించక - జిల్లెళ్ళమూడి నుండి తెచ్చుకున్న మజ్జిగ త్రాగి, వాకిట్లోనే పడుకున్నాము. ఆ రాత్రే మా మోతాదును పిలిపించి - బాపట్ల పంపాను తాళంచెవి తీసుకురమ్మని. వాడు ఆ రాత్రి బస్సులు లేక తెల్లవారి వచ్చాడు.

అప్పుడు మేము గృహప్రవేశం చేశాము. ఆ తర్వాత తీరిగ్గా లెక్కల పుస్తకాలు తెరిచాను.

ఆ రాత్రి పడుకున్నాను. కానీ క్రితం సాయంకాలం అమ్మ యిచ్చిన అన్ని సలహాలు మనస్సులో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. వ్యర్థంకాని అమ్మ వాక్కులు మనస్సులో పునరావృతమవుతూనే ఉన్నాయి. ఎన్ని అనుభవాలు కలుగుతున్నా చెరగని అజ్ఞానానికి మనసు సిగ్గుతో కుంచించుకుపోతూనే ఉన్నది. ఎంత ఉతికినా తెల్లబడని ఎలుకతోలువంటిది మనస్సు అనిపించింది. కుక్కతోక వంటిది అనిపించింది. దాలిగుంటలో పడుకున్న పిల్లి వంటిది అనిపించింది.

అసలు మొట్టమొదట అమ్మ యిట్లా యిచ్చిన ఒక అనుభవానికే మనస్సు ఆకర్షితమయింది.

అది 1963. శరన్నవరాత్రులు మొదలైనాయి. అప్పుడు మా పెద్ద కుమారునికి 5 సంవత్సరాలు. నేను జిల్లెళ్ళమూడి వస్తుంటే వాడూ అప్పికట్లనుండి నాతో జిల్లెళ్ళమూడి వచ్చాడు. దసరా ప్రారంభమయింది. వాడు వాళ్ళ అమ్మకోసం, బామ్మకోసం దిగులుపడి ఏడవడం సాగించాడు. వాడిని సముదాయించడం వాడితో నేను అక్కడ ఉండడం అసాధ్యం అనుకుని వాడిని అప్పికట్లలో దించి రాదలుచుకున్నాను.

అదే అమ్మకు విన్నవించాను. అమ్మ "సరే" నంటూ దసరా వెళ్ళగానే వస్తావా ?– అని అడిగింది. అదేమిటమ్మా ? దసరా వెళ్ళడం అంటే యింకా తొమ్మిది రోజులున్నది. నేను ఈ రాత్రికి వెళ్ళి వీడిని అక్కడదించి, రేపు ఉదయమే తిరిగి యిక్కడకు వస్తానమ్మా– అన్నాను.

రేపే వస్తావా ?– అని అమ్మ అడిగింది.

నాకు ప్రస్తుతం అక్కడ పనేమీ లేదమ్మా. రేపే వస్తాను. తెల్లవారేసరికి వస్తాను– అన్నాను.

నాలుగు మైళ్ళు వెళ్ళడం ఎంతలోకి ? తిరిగిరావడం ఎంతలో ? అని నా అభిప్రాయం. సరే– వెళ్ళిరా... అని అమ్మ పంపింది.

ఆ రాత్రి అప్పికట్ల నిర్విఘ్నంగా చేరాను.

ఆ రాత్రి అకస్మాత్తుగా కుంభవృష్టి కురిసింది. కాలువలు పొంగాయి. చేలూ చెరువులూ ఏకమైనాయి. అప్పికట్లకూ జిల్లెళ్ళమూడికీ మధ్య నాలుగుమైళ్ళు కాదు; నాలుగు సముద్రాలైనాయి. ఎవరిని విచారించినా జిల్లెళ్ళమూడి చేరడం

అసాధ్య మన్నారు. అమ్మకు యిచ్చిన మాటప్రకారం జిల్లెళ్ళమూడి చేరాలని శత విధాల ప్రయత్నించాను. అహాఁ నావల్ల కాలేదు.

ఆ రోజల్లా - అమ్మ మాటలోని సత్యానికీ, బలానికీ ఆనందించేకంటే - అమ్మకు యిచ్చిన మాటను నిలుపుకోలేకపోయానే అని అమితంగా విచారించాను. అప్పట్లో ఎవరికైనా ఏమైనా మాటనుయిస్తే తప్పడం అలవాటు లేనందున, ఆరోజంతా మనస్సు చాలా కలతజెందింది. అన్నం సహించలేదు. అందులో అమ్మకు యిచ్చిన మాటను మొదటిసారిగా నెరవేర్చలేకపోయినందున మనస్సు కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆ రాత్రి అసలు నిద్రపట్టలేదు. చివరకు తెల్లవారుజామున- అది నిద్రో, మెలుకువో, స్వప్నమో.... నిర్ణయించలేను. అమ్మ కనుపించింది. నన్ను చూసి నవ్వింది. అందులో పరిహాసమే ఉందో, జాలే ఉందో, ప్రేమే ఉందో యిప్పటికీ నాకు తెలీదు.

అనుకున్నది జరగదు, మనకున్నది తప్పదు- అని అర్థమయింది. మనం చేద్దామనుకున్నా ఏమీ చేయలేమని బోధపడింది. మన క్రియలకు కర్తలం మనంకాదని ఋజువయింది. మన క్రియలన్నిటికీ కర్త మరొకరు అనీ, అది అమ్మ అనీ ఒక నమ్మకం ఏర్పడింది.

తర్వాత అమ్మ అన్నట్లుగానే దసరా తర్వాతనే జిల్లెళ్ళమూడి వెళ్ళగలిగాను. పదిరోజుల వియోగం తర్వాత అమ్మను చూశానని ఆనందమో, పదిరోజుల ఎడబాటుకు కలిగిన దుఃఖమో, అమ్మకు యిచ్చినమాట ఓడిపోయిందని బాధో .... కారణం ఏమయినాగానీ అమ్మ ఒడిలో వాలిపోయి వెక్కివెక్కి ఏడ్చాను.

అమ్మ నా కన్నీళ్ళు తుడుస్తూ, నా వీపు నిమురుతూ, నా జుట్టు సవరిస్తూ నా చెక్కిళ్ళు పుణుకుతూ, నా గడ్డం పట్టుకుని, నా ముఖం పైకెత్తి, నా కళ్ళలోకి చూస్తూ... "అనుకున్నది జరగదు, మనకున్నది తప్పదు, నాన్నా మన క్రియలకు కర్తలం మనంకాదు అని తెలుసుకుంటే - జీవితంలో ఒడిదుడుకులు ఉండవు. సుఖ దుఃఖాలుండవు. అంతా ఆనందమే. అంతా తృప్తే...." అన్నది.

నేను అప్పికట్లలో విన్నమాటలే తిరిగి అక్షరశః అమ్మనోటినుండి వినేసరికి నా మెదడులో ఏదో భూకంపంలాంటి కదలిక కలగటమేకాదు, ఒక నమ్మికకు బీజం పడ్డది.

అదే నాకు మంత్రోపదేశం అనుకున్నాను. కాని ఏం ఉపయోగం ? అది నిశ్చలంగా ఎక్కడ ఉంటున్నది? ఉండకపోవడానికి కారణంకూడా అమ్మేననుకుంటూ ఉంటే అదొక తృప్తి.

ఈ 18 సంవత్సరాలలో... అమ్మ ఏదో అనడమూ, యిట్లా ఎందుకు జరుగుతుందిలే- అనుకోవడమూ, చివరకు అమ్మ అన్నట్లుగానే జరగడమూ, నేను ఆశ్చర్యపడిపోవడమూ అలవాటయిపోయింది

మళ్ళీ మళ్ళీ యిదే చక్రభ్రమణం! దీనికి అంతం ఎప్పుడో !

ఒకసారికాదు వందలసార్లు అడిగాను- అమ్మా నువ్వు అన్నట్లుగా జరుగుతుందా ? జరిగేదాన్ని నువ్వు అంటావా ? అని.

వాటిలో భేదం నాకు తెలీడంలేదు- అని తమాషాగా నవ్వుతుంది అమ్మ. ఆ నవ్వే కోటి అమృత వర్షాలై నన్ను నిలువెల్లా తడిపేస్తుంది ప్రతిసారీ.

అమ్మనోరు తాలనోరు కాదుకదా- తాలుమాట రావడానికి. అమ్మనోరు రతనాల గని. అమ్మ నోరుతెరిస్తేచాలు- రతనాలు జలజలా రాలుతాయి. ఆ కాంతులకు పుడమియే పులకించిపోతుంది.

అమ్మ ఒక్కమాట అంటే చాలు, అది అయితీరుతుంది. పంచభూతాలూ అందుకు సహాయపడతాయి.

అందుకే అమ్మ నోటివెంట తమకు అనుకూలమైన ఒక్కమాట రాబట్టుకో డానికి అందరికీ అంత ఆరాటం ! ?

—మే 1981

వాక్సిద్ధి

1971 మే 4 వ తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. 5 వ తేదీన అమ్మకు సమర్పింపబడి ఆవిష్కరణ పొందవలసిన గ్రంథం "అర్కపుర విశేషాలు" ముద్రణ పూర్తిచేసి ఉల్లెళ్ళమూడి చేరాము.

5 వ తేదీన అమ్మ కళ్యాణదిన మహోత్సవంలో జరుగవలసిన నరసింహరావూ, శేషుల వివాహ సందర్భంలో వారిని పెండ్లికుమారునీ, పెండ్లికుమార్తెనూ చేయవలసి ఉన్నది.

మేము బాపట్లనుండి వెళ్ళి అమ్మ సన్నిధిలో సుఖాసీనులమై - జరిగిన విషయాల గురించీ జరుగబోయే సంగతుల గురించీ, అప్పుడే అమ్మ దర్శనార్థము వచ్చిన శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి గురించీ మాట్లాడుతున్నాము. ప్రస్తుతం జరుగవలసిన కార్యక్రమం గురించి ఏమాత్రమూ ఆలోచించకుండానూ ఉపక్రమించకుండానూ.

ఆ సమయంలో అక్కడనే ఉన్న సోదరి "ఇంత ఆలస్యంగా వచ్చారూ, యిక లేచి జరుగవలసిన కలాపం చూడండీ-" అన్నది.

"అప్పుడే ఎక్కడ? నాకు వడదెబ్బ తగిలితేగానీ వాడికి తెలీదు" అన్నది అమ్మ చిన్నగా.

"వడగాలే లేనిది వడదెబ్బ ఏమిటమ్మా? మేము యిప్పుడేగా బాపట్లనుండి వచ్చింది!.. వాతావరణం హాయిగా ఉన్నది" అన్నాము.

అట్లా అన్నప్పటికీ వెంటనే వెళ్ళి ఆనాటి కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లన్నీ క్షణాల్లో పూర్తిచేశాము. సుస్నాతయై, సర్వాలంకార సంశోభితయై అమ్మ బయటకు వచ్చింది. అంతలోనే ఎండ నిప్పులు చెరుగుతుంటే పడమటి శాంబరం పరవళ్ళు త్రొక్కింది.

ఎల్లప్పుడూ చీకటినీ, చల్లదనాన్నీ కోరుకునే అమ్మ ఆ వడగాడ్పులోనే కార్యక్రమం పూర్తిచేసి వధూవరులను ఆశీర్వదించి లోపలకు వచ్చింది. అంతే- అమ్మకు వడగాడ్పు తగలనే తగిలింది. అప్పటినుండీ మంటల జ్వరమే.

అయినా అమ్మ మరునాడు దేవాలయ మొదటి భాగానికి అధిరోహించింది. వందల గుమ్మడికాయలూ, కొబ్బరికాయలూ పగలకొట్టింది. ప్రజానీకానికి పసుపు కుంకుమలూ, పూలతోబాటు ప్రేమనూ ఆశీర్వచనాన్నీ పంచింది. వైద్యాలయానికి శంకుస్థాపనా, వనమహోత్సవమూ జరిపింది. తొమ్మిదిమంది వటువులకు బ్రహ్మోప దేశాలు గావించి, నరసింహారావూ శేషుల వివాహం అతివైభవంగా జరిపించింది.

కానీ తనకు జరుగవలసిన అర్చనకుమాత్రం ఎవరికీ అవకాశం ప్రసాదించ లేదు. ఒక్కరినీ తన మృదుపాదాలను స్పృశించనీయలేదు. అది అందరికీ బాధాకర మయిన విషయమయినా అనివార్యమే అయింది.

అందరూ అమ్మను అంతదూరంనుండే దర్శనం చేసుకుని బాధగా సెలవు తీసుకుంటున్న సమయాన అమ్మ 4 వ తేదీ మధ్యాహ్నం అన్నమాటలూ, అవి అప్పుడు అసంభవాలు అనిపించినా అవి నిజమయిన తీరును గమనిస్తుంటే- అమ్మ తన 4 వ ఏట తనను గురించి తానే "తోలునోరు కాదుగదా- తాలుమాట రావటానికి" అని చేసిన ప్రకటన జ్ఞప్తికివచ్చి- అటువంటి సంఘటనలు ఎన్నెన్నో స్మృతిపథంలో మెదిలాయి.

ఒక సందర్భంలో అమ్మ ఒక విధంగా అన్నప్పుడు ఆ విషయం అట్లా జరగటానికి వీలులేదు అని మనం అనుకున్నా- తీరా జరిగే సమయానికి అమ్మ అన్నట్లే జరగటమూ, మనలను ఆశ్చర్యపరచటమూ నిత్యమూ జరుగుతూనే ఉన్నా ఎప్పటికప్పుడు అది నిత్యనూతనంగానే ఉంటూ మనలను ప్రభావితులను చేస్తూనేఉంది.

—మే 1981

సర్వమాతృత్వం

1974 డిశంబరు రెండవ వారమంతా ప్రచురింపబడిన అమ్మ వాక్యాల గురించి చర్చలతోనే అమ్మసన్నిధిలో కాలక్షేపం అయింది. స్వర్ణోత్సవాల సందర్భములో ప్రచురించిన "అక్షర దీపాలు" ను హైదరాబాద్ సోదరులు శ్రీ వీరమాచనేని ప్రసాదరావుగారు యింగ్లీషులోనికి అనువదించే సందర్భంలో ఆ వాక్యాల గురించి పునరాలోచన వచ్చింది. సోదరులు డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు చెప్పినట్లు అమ్మ ఒక పర్యాయం అన్నట్లు అమ్మ వాక్యాలన్నింటికీ పరమార్థం "అంతా అదే" ననే.

కానీ కొన్ని వాక్యాలు ఆ అర్థానికి భిన్నంగా ఉన్నాయేమో నని మాకు స్ఫురించి వాటిని అమ్మదృష్టికి తీసుకురాగా అమ్మ - అవేవీ ఆ "సంపూర్ణత్వా" నికి ఏ మాత్రమూ విరుద్ధంగా లేవని వ్యాఖ్యానిస్తే - ఆ మేధాసంపత్తికీ, ఆ బోధనా కౌశలానికీ ఆశ్చర్యచకితులమయినాము.

అయినప్పటికీ ఒకటి, రెండు వాక్యాలవద్ద మాకు సంశయ నివృత్తికాక "పునర్ముద్రణలో ఆ వాక్యాలను తొలగిస్తాం మమ్మా" అన్నాము. "ఎందుకూ!" అని అడిగింది అమ్మ. ఆ వాక్యాలు అట్లాగేవుంటే- అవి "నీ తాత్త్విక ప్రవచనాల స్థాయిని తగ్గిస్తా యమ్మా" అని నసిగాము.

"అయితే ఏమవుతుందీ ?" అని అమ్మ మళ్ళీ అడిగింది. ఏమి చెప్పటానికి తోచక మేము దిక్కులు చూస్తున్నాము. "నా ప్రతిష్ఠకు భంగం వస్తుందని మీ ఆలోచనా !" అని తిరిగి అమ్మే ప్రశ్నించింది. మేము ఏమని సమాధానం చెప్పమూ? మేము జవాబు యిచ్చే లోపలనే అమ్మ అన్నది- నాన్నా.... ఒకటి అడుగుతాను.... ఆలోచించండి. ఒక తల్లి ఉన్నది. నలుగురు కొడుకులను కన్నది. అందులో ముగ్గురు కొడుకులు మీ ఆలోచన ప్రకారం బుద్ధిమంతులూ, తెలివిగలవాళ్ళు. ఒకడు మాత్రం దుర్మార్గుడూ, మందబుద్ధీ. మరి- ఆ ముగ్గురిసల్లా ఆ తలిదండ్రులకు పరువు ప్రతిష్ఠలు కలిగితే - ఆ ఒక్కడి వలనా వారికి అపకీర్తి వస్తున్నదికదా అని ఆ

ఒక్కడినీ తమ సంతానం కాదంటారా ? లేక ఆ సంతానాన్ని రూపుమాపుదామను కుంటారా ?" ఆ చివరి మాటలు పలుకుతుంటే అమ్మ కంఠస్వరంలో మార్పు గమనిస్తూ మేము నివ్వెపోయాము.

అంటే– అమ్మ ఆ వాక్యాలకూ, ఆ పదాలకూ, ఆ అక్షరాలకూ తల్లి అన్నమాట :

పూర్వం ఒకసారి సోదరులు శ్రీ అచ్యుతుని రామకృష్ణశర్మగారు "నీ వెవరవు ?" అని ప్రశ్నిస్తే – "నేను అమ్మను" అన్నది. "ఎవరికి" అని పునః ప్రశ్నిస్తే "నీకూ, మీకూ, అందరికీ" అంటూ పశుపక్ష్యాదులకూ అని విపులీకరించింది. మాటల్లోనే కాకుండా అనేక సందర్భాలలో అమ్మ ఆ విషయాన్ని ఋజువు చేసు కున్నది. స్వర్ణోత్సవాల సమయంలోకూడా అమ్మ ఆ మహానందాన్ని మనుషులకేగాక పశుపక్ష్యాదులకూ పంచి తానూ ఆనందించింది.

ఒకసారి అమ్మ "రావణాసురుడు దుర్మార్గుడని ఆ తల్లి అతణ్ణి ప్రేమించ కుండా ఉంటుందా ?" అని అడిగింది. అట్లాగే ఈ వాక్యాల విషయంలోకూడా అమ్మ తన సర్వ మాతృత్వాన్ని మరోసారి ప్రకటించింది.

–డిసెంబరు 1974

నూతన శబ్ద ప్రయోగాలు

ఈ నెల (ఆగష్టు) 27 వ తేదీ ఉదయం విశాఖపట్నం సోదరులు శ్రీ కేశవవర్మ, శ్రీ నరసింహారావుగారలు అమ్మవద్ద ఆసీనులై ఉన్నారు. విశాఖపట్నం మాతృశ్రీ అధ్యయన పరిషత్ పనిమీద హైదరాబాదు వెళుతూ అమ్మ ఆశీస్సులను అర్థిస్తున్నారు. ఆ సందర్భంలో కోదండరామయ్యగారి ప్రస్తావన వచ్చింది. ప్రక్కనున్నవారు గుర్తులు చెప్పి ఆ 'కోదండం' యేనా ? - అని అడిగారు. మరొకరు 'ఆయనే కోదండం' అన్నారు. అమ్మ వెంటనే "ఆయనకో - దండం అనండి, మీ పనులు అవుతాయి" అన్నది. "కోదండం" అన్న పదాన్ని అమ్మ విరిచిన తీరుచూసి మేము గలగలా నవ్వుకున్నాము.

పదాలతో ఆడుకోవడ మనేది అమ్మకు అతిబాల్యంనుండి సరదా. అందులో అమ్మ అత్యంత ప్రవీణ. పదప్రయోగంలో అమ్మ చూపే నేర్పు అందరినీ ఎప్పుడూ విస్మితులను చేస్తూ ఉంటుంది,

జగన్మాత - అంటే మనం సాధారణంగా ఏమి అర్థం చెప్పుకుంటామూ ? జగత్తుకు లేక జగత్తుయొక్క మాత అని చెబుతాము. కానీ అమ్మ ఆ అర్థాన్ని ఖండిస్తూ "జగత్తు అనే మాత; జగత్తే మాత" అని ప్రవచిస్తున్నది. సమాసంయొక్క రూపాన్నే మార్చేస్తున్నది అమ్మ. తత్పురుషసమాసం అమ్మస్పర్శలో "రూపకం"గా పరిణామం పొంది తళుక్కుమంటున్నది.

"బ్రహ్మజ్ఞానం" విషయంలో మనం బ్రహ్మను గురించిన జ్ఞానం లేక బ్రహ్మయొక్క జ్ఞానం - అని వివరిస్తాము. కాని అమ్మ "జ్ఞానమనే బ్రహ్మ" అని అర్థం చెబుతూ మనం రెండర్థాల్లో చెప్పుకునే బ్రహ్మకూ, జ్ఞానానికీ మధ్యగల అంతరాన్ని అంతంజేసి - జ్ఞానమే బ్రహ్మ అని నిర్వచించి మనలను చకితులను చేసివేసింది

అట్లాగే "దైవశక్తి" విషయంలోనూ. దైవశక్తి ఏమున్నది ? శక్తియే దైవం" అన్నది.

అట్లాగే "దైవసంకల్పం" విషయంలోనూ. "దైవ సంకల్పం ఏమున్నదీ? సంకల్పమే దైవం" అన్నది.

అట్లాగే "భగవద్భక్తి" విషయంలోనూ. "భగవద్భక్తి ఏముందీ? భక్తే భగవంతుడు" అన్నది.

అట్లాగే "తల్లి రక్షణ" అని మనం అంటే "రక్షణే తల్లి" అని అమ్మ అంటుంది.

మనం "కఠోర సత్యం" అంటే - అమ్మ "సత్యమే కఠోర" మంటుంది. మనం "మధురస్మృతి" అంటే - అమ్మ "స్మృతే మధురం" అంటుంది. మనం "ఆదర్శ ప్రేమ" అంటే - అమ్మ "ప్రేమే ఆదర్శం" అంటుంది.

"పంచామృతాలు" అంటే - అయిదు అమృతాలు అని అర్థం చెబుతాం. అమ్మ "పంచబడ్డ అమృతాలు" అని విడగొట్టింది. ఒకే అమృతం పంచబడ్డదట - పాలుగా, పెరుగుగా, మీగడగా, వెన్నగా, నెయ్యిగా.

అట్లాగే "పంచ భూతాలు" ఒకే భూతమే పృధివిగా, వాయువుగా, నిప్పుగా, నీరుగా, ఆకాశంగా పంచబడ్డదట.

"మిథ్య" అంటే లేనిది అని కాదుట; మారుతూ ఉండేదట. "దుష్ట సంహారం" అంటే - దుష్టలను అంతమొందించడం కాదుట; దుష్టత్వాన్ని సంహరించడ మట.

"రూపరహితుడు అంటే - రూపంలేనివాడు కాదట. అన్ని రూపాలూ తానైనవాడట. నామరహితుడు అంటే - అన్ని నామాలూ తనవైనవాడట. గుణరహితుడు అంటే - అన్ని గుణాలూ కలిగినవాడట. అమ్మ పదాల అర్థాలనే మార్చివేసింది.

కరుణ అంటే - ఆ యా సమయాలలో ఆ యా పనులు చేయించడమేనట. మనం మనకు అనుకూలంగా అయిన పనులనే కరుణ అనుకుంటాము. అమ్మ "అయిన పనీ అనుగ్రహమే; అవని పనీ అనుగ్రహమే" అంటున్నది విరాగం అంటే మన భావనలో అన్నిటినీ వదులుకోవడం. మరి, అమ్మ - "సర్వానురాగమే విరాగం" అనేసరికి చీకటి గుహలో పండువెన్నెల విరిసినట్లయింది.

రాగం అంటే – "కావాలి" ద్వేషం అంటే – "వద్దు" అన్న భావాలకు ప్రతిరూపాలని భావిస్తాము. కానీ అమ్మ –"రాగమూ, ద్వేషమూకూడా "కావాలి" అన్నదానిమీదనే ఆధారపడి ఉన్నాయి" అంటుంది.

"సంకల్పరాహిత్యం" విషయంలోనూ అమ్మ క్రొత్త అర్ధాన్ని ప్రసాదించింది. "తనకు వచ్చే సంకల్పాన్నీ వాడిచ్చినవే – అని గ్రహించడమే సంకల్ప రాహిత్య" మట. ఈ వివరణ సాధకు మార్గంలో గొప్ప పరిణామానికి దోహదం కలుగజేస్తున్నది. గగన కుసుమం అయిన సంకల్పరాహిత్యం కోసం ప్రయత్నించి ప్రయత్నించీ ఆ స్థితి లభించక విసిగిపోయే సాధకుడికి యీ వివరణ అమృతోపమాన మయింది

"మృత్యుంజయు" డన్న పదానికి అమ్మ యిట్లాగే చక్కని వ్యాఖ్యానం చేసింది. అసలే మృత్యువు లేనివాడు కాదట. మృత్యువును గురించిన భయంలేని వాడే మృత్యుంజయుడట.

ఒక్కొక్కసారి మనం వాడిన పదాన్నే తీసుకుని ఒక్క అక్షరం మార్పుతోనో, తారుమారుతోనో, అమ్మ క్రొత్త అర్ధాలను అందిస్తుంది.

మనం "కైవల్యం" అంటే – అమ్మ "వైకల్యం లేనిదే" అంటుంది. "స్వర్గం" అంటే – "నర్గం లేనిదే" నట. "హింస" అంటే – "సహించలేనిదే" నట. "కష్టం" అంటే ఇష్టం లేనిదే" నట.

కొన్ని నిర్వచనాలు వింతగా వినిపిస్తాయి. "కలవరింత" అంటే– "ఒకడి కలవరం మరొకడి వింత" అట. "ఆవలింత" అంటే– "ఆవలి వింతకుపోయే సూచన" అంటుంది అమ్మ. "ఆపదుద్ధారి..." అంటే "ఆపదలనుండి ఉద్ధరించడం కాదు, ఆపదలను ఉద్ధరించడం" అని చమత్కరించింది.

అమ్మ యిచ్చిన కొన్ని నిర్వచనాలు మనను ఆశ్చర్యచకితులను చేయడమే కాదు, అవి అపూర్వమయినవీ, అనన్యసాధమైనవీకూడ.

'మంచితనం' అంటే – సర్వత్రా మంచినే చూడటమట. 'పవిత్రులు' అంటే – అందరినీ పవిత్రులుగానే భావించేవారట. 'పతివ్రత' అంటే – పతిని ఆధారంగా చేసుకుని పంచభూతాలనూ జయించినదట. 'సాధ్వి' అంటే – సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదట.

"దయలేనివాళ్ళే దయ్యా" లనడంలో మనను శబ్దచమత్కారమే ఆకట్టుకుంటుంది కానీ అమ్మ ఆ నిర్వచనం ద్వారా మనలోని మూఢమయిన నమ్మకానికి గొడ్డలిపెట్టు పెడుతూ; మనలో ఒక క్రొత్త ఆలోచనా ధోరణికి పునాదులు వేయడం మనం గ్రహించాలి. అట్లాగే – "మన భ్రమే బ్రహ్మరాక్షసి" అంటుంది మరొకసారి.

"గురువు అంటే తెలియ చెప్పేవా"డట. "దైవం అంటే తెలియజేసేవా"డట. తెలియ చెప్పడానికీ తెలియజేయడానికి ఎంత సూక్ష్మమైన అంతరం! అట్లాగే – జీవుడికీ, దేవుడికీ భేదం భావమే–నట. అంతా ఒకటిగానే తోచేవాడు దేవుడు; అనేకంగా తోచేవాడు జీవుడూ–నట.

"గురువు అంటే గుర్తు చూపించిన వాడే"
"సత్రం అంటే సర్వులకూ స్వతంత్రమయినది."
"సంస్థ అంటే సమస్తమూ చేరింది.
"మనుడు – అంటే, పొడవూ వెడల్పులే కాక గుండెలోతు కలవాడు."

మనం కొన్ని పదాలను పర్యాయపదాలుగానే ప్రయోగిస్తాము. అమ్మ వాటిని వేరుచేసి వేరు వేరు అర్థాలు చెప్పింది.

కోపం – తాత్కాలికమైన వైరభావమట.
క్రోధం – శాశ్వతమయిన కక్ష సాధింపట.
భ్రమ – లేనిదానిని ఉన్నదని ఊహించడమట
భ్రాంతి – ఉన్నదానిని లేదని భావించడమట.
ఆరోగ్యం – శారీరక మయినదట.
కులాసా – మనసుకు సంబంధించినదట.

అందుకనే అమ్మ ఎవరడిగినా – "ఆరోగ్యం లేమూ, కులాసా లేకుండానూ లేదు" అని సమాధానం చెబుతూ ఉంటుంది.

"అమ్మా – భగవంతుడి మీద నిరంతర ధ్యాస ఉంటుందికానీ ధ్యానం చేయలేకపోతున్నాను" అని బాధపడే సాధకుడితో వెంటనే అమ్మ "ధ్యాసే ధ్యానం నాన్నా–" అంటుంది. అట్లాగే "ఆవేదనే ఆరాధన" ట. "దిగులే జిజ్ఞాస" ట. "తపనే తప" మట "తృప్తే ముక్తి."

అమ్మ ఒక్కొక్కప్పుడు మనం అన్న మాటలోనే ఒక అక్షరం మార్చేస్తుంది దానితో మనలో ఒక దీపం వెలిగి నట్లు - మనకో సత్యసందర్శనం అవుతుంది.

ఒకరు అమ్మకు కొబ్బరికాయ కొడితే - అది కుళ్ళిపోయింది. అతడు బాధ పడుతూ వచ్చాడు అమ్మ అతడి వాలకం చూసి "ఏమయిందీ?" అని అడిగింది. 'కుళ్ళిపోయింది' అన్నాడతడు విచారంగా. "కుళ్ళిపోయిందీ కాదు, నాన్నా - కుళ్ళు పోయింది," అన్నది అమ్మ. వెంటనే ఆ వాక్యంతో అతని బాధను తుడిచివేయడమే కాక అతనికో క్రొత్త భావాన్ని అందించింది అమ్మ

ఒకసారి నాన్న గారింట్లో ఆబ్దికం జరుగుతున్నది. ఆ వంటను పిల్లి ముట్టుకున్నది ఎవరో ఆదుర్దాగా అమ్మ వద్దకు వచ్చి "పిల్లి ముట్టుకున్నది, వంట మళ్ళీ చేయాలి" అన్నారు. "పిల్లి ముట్టుకున్నదన్నా" అని - వారనుకునే తప్పును అమ్మ ఒప్పుగా మార్చేసింది. ఇందులో ఒక్క అక్షరం మార్పు మాత్రమే మనకు వినిపిస్తుంది గానీ జాగ్రత్తగా ఆలోచిస్తే అందులో అమ్మయొక్క విశాల హృదయం, సర్వమాతృత్వం మనకు విరాడ్రూపంతో సాక్షాత్కరిస్తాయి.

అట్లాంటి వాక్యమే "ఎప్పుడో కనిపెంచాను; యిప్పుడు కనుపించాను" అనేది.

ఒకరు "రిక్తహస్తాలతో వచ్చానమ్మా-" అంటే "(అను) రక్తహస్తాలతో వచ్చావు నాన్నా-" అని సముదాయించింది.

ఒకరు "పరధ్యాసగా ఉన్నావమ్మా"- అంటే "పరధ్యాస కాదు నాన్నా, పతిధ్యాస" అన్నది అమ్మ.

వాళ్ళ అబ్బాయి కేశ ఖండనం కోసం వచ్చిన కేశవుడిని అడిగింది అమ్మ "కేశఖండనమా ? క్లేశఖండనమా?" అని.

నాన్నగారు "అక్కడ (ఆ శరీరంలో) బల మేముందీ ? భావ బలమే గానీ" అంటే అమ్మ వెంటనే "భావ బలం కాదు; బావ బలం" అన్నది. బావ అంటే నాన్నగారు, అమ్మ మేనత్తకొడుకు.

అమ్మ హాస్యప్రియ. అమ్మ చేసే పదచమత్కారాలు మనకు గిలిగింతలు పెడతాయి.

"అమ్మా - నీ రహస్యం తెలిసింది - చెప్పనా?" అన్నారు ఒకరు. "రహస్యం అయితే ఎట్లా చెబుతావు?" అన్నది అమ్మ.

"అమ్మా-నీతో ఏకాంతంగా మాట్లాడాలి" అన్నారు మరొకరు. "ఏకాంతం అంటే సంభాషణకు అవకాశ మెక్కడా?" అని ప్రశ్నించింది.

"అమ్మా-సందేహం తీరడంలేదు" అన్నారు యింకొకరు. "దేహం ఉన్నన్నాళ్ళూ సందేహమూ ఉంటుంది నాన్నా-" అన్నది.

"చిక్కుతీసేదా, అమ్మా?" అని ఒక అక్కయ్య అప్పుడే తలంటిపోసు కున్న అమ్మను అడిగింది. "నా చిక్కు ఎవ్వరూ తియ్యలేరు. అందరూ చిక్కుల్లో పడేసేవారే" అన్నది అమ్మ నవ్వుతూ. "చిక్కు" అని ఆ అక్కయ్య ఆశించిన అర్థం వేరు. అమ్మ చెప్పిన అర్థం వేరు.

"చెప్పమ్మా-" అని అడిగాడు ఒక అన్నయ్య. "నేను చెప్పమ్మను కాను. ఒక్క చెప్పులకే అమ్మను కాను. మీ కందరికీ అమ్మనే." "చెప్పు-" అని అడిగిన ఒకరితో "తొడుక్కుండే దెవరూ?" అన్నది.

"పీటలమీద కూర్చున్న వాళ్ళందరూ పీఠాధిపతులే!" నట.

అమ్మ ఒకసారి నాతో అన్నది "నీవు మీ ఊరికి కరణమేమోగానీ నాకు మాత్రం ఉపకరణానివే-" కరణానికి అనుసంబంధించిన ఉపకరణం అంటే అసిస్టెంట్ కరణం అనీ, అమ్మకు ఉపకరణం అంటే పనిముట్టు అనీ. "ఉపకరణం" అన్న పద ప్రయోగంలోని శబ్దచమత్కృతికన్నా - అమ్మకు నాయందలి ఆత్మీయ తకు నేనెంతగా మురిసిపోయానో!

"మెప్పించుకుంటే భక్తి, రప్పించుకుండే శక్తి - నాకు రెండూ లేవు" అన్న ఒక అన్నయ్యతో "తప్పించుకుండే యుక్తి" అన్నది అమ్మ.

ఒకరు "ఇంటరెస్టు లేదమ్మా-" అంటే - అమ్మ "ఇంట (ఇంటియందు) రెస్టు లేదా?" అని ప్రశ్నించి అతణ్ణి ఆశ్చర్య పరిచింది.

అమ్మ చిన్నతనంలోనే ఒకరు ఒక సందర్భంలో "లోపలగానా?" అని ప్రశ్నించగా "లోపల గానా; బయట బజానా" అని అమ్మ పలికితే విన్నవాళ్ళందరూ నివ్వెరపోయారు. ఆ వ్యక్తుల్లో చిదంబరరావుతాతగారు కూడా ఉన్నారు. ఒకే పదం

భాష మారేసరికి మరొక అర్థాన్నిస్తుందిగదా! చిన్నతనంలోనే భాషను అట్లా వాడుకోవడంలో అమ్మకు ఉన్న అధికారం తెలుస్తుంది.

ఒక అత్తగారు అమ్మతో "మా కోడలు మీకు ప్రెజెంట్ చేయాలనుకున్నదమ్మా-" అంటే - అమ్మ అడిగింది "మరి నేను ఆబ్సెంట్ అయ్యానని మానుకున్నదా?" అని. ఆ అత్తగారు ప్రెజెంట్‌ను నామవాచకంగా ఉపయోగిస్తే - అమ్మ దానిని క్రియగా తీసుకుని దానికి వ్యతిరేక పదమైన ఆబ్సెంట్‌ను ఉపయోగించింది

"జైలు కావాలా?" అని చిన్నతనంలో అమ్మను అడిగిన పోలీసుతో "జైలు కొడతావా? అప్పుడే వద్దులే" అన్నది అమ్మ. అతడు జైలుకు కారాగారం అన్న అర్థంలో ప్రయోగిస్తే అమ్మ "జయ జయ ధ్వానాలు" అన్న అర్థంలో వాడింది. ఆ శబ్ద చమత్కారానికి మాత్రమే ఆనాడు ఆ పోలీసు విభ్రాంత చేస్కుడైనాడు కానీ - అమ్మ మాటలోని భావిసూచకార్థాన్ని గ్రహించలేదు.

మరి, అమ్మది తోలునోరు కాదు కదా, తాలుమాట రావడానికి. ఈ మాట కూడా అమ్మే స్వయంగా ప్రకటించింది. అసలు ఆ మాటలు మనకు అందుతాయా- తోలునోరు, తాలుమాట-అని.

"సమస్యల తోరణం" అన్న పదాన్ని "సమస్యలతో-రణం" అని అమ్మ విరచినప్పుడు గానీ మనకు స్ఫురించదు.

"నాన్న" అన్న పదాన్ని "నా-అన్న"గా విరిచి వినిపిస్తే ఎంత తమాషాగా ఉన్నదీ—అని మనం అనుకుంటాము.

"అవినాభావ సంబంధం" అన్న పదాన్ని "అవి, నా, భావ సంబంధం"గా అమ్మ విరిచింది.

"చేతలు చేతుల్లో లేవు." "తిథులు విధిని మార్చలేవు." "అనుకున్నది జరగదు; మన కున్నది తప్పదు." "సంకల్పమే సంసారం." .... అన్న వాక్యాల్లో ఎంతెంత అర్థాన్ని అమ్మ ఎంత సూక్ష్మంగా ఎంత తక్కువ మాటల్లో చెబుతుందో మనకు అర్థమవుతుంది.

అట్లాగే "అంతా అయిందీ, అర్థం కానిదీ అద్వైతం."

అదేవిధంగా కొన్ని స్థితి భేదాలనుకూడా అమ్మ బహుసూక్ష్మంగా వివరించింది

"లక్ష్మణుడు రామునిదగ్గర ఉన్నాడు. భరతుడు రాముని తన దగ్గర ఉంచుకున్నాడు.". "రుక్మిణి–నేను కృష్ణుని భార్యను అన్నది. సత్యభామ– కృష్ణుడు నా భర్త అన్నది "

అట్లాగే – "సిద్ధులందరూ ప్రసిద్ధులూ కారు " ప్రసిద్ధులందరూ సిద్ధులూ కారు." "వక్తలందలూ ప్రవక్తలూ కారు. ప్రవక్తలందరూ వక్తలూ కారు."

అమ్మ కొన్నిచోట్ల పద స్వరూపాన్నే మార్చివేసినప్పుడు అమ్మ ఘటనా ఘటన సామర్థ్యం అభివ్యక్తమవుతుంది.

"కృష్ణుడు కాదు గృష్ణుడు" అంటూ "గృష్ణుడు అంటే గుణముల కాధారమయినవాడు" అని వివరించి మనను చకితులను చేసింది

"రామం అంటే విరామం లేనిదే."
"రాధ అంటే ఆ'రాధన' భావమే".

అట్లాగే ప్రసిద్ధయిన 'ధన మూల మిదం జగత్' అన్న సూక్తిని "తన మూల మిదం జగత్" అన్నది ఒక్క అక్షరం మార్పుతో సామాన్యమయిన ఒక లౌకిక సూక్తిని ఒక ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరించే మహావాక్యంగా మార్చివేసింది అమ్మ.

'జగన్మిథ్య బ్రహ్మసత్యం' అన్న వాక్యాన్ని తారుమారుచేసి "బ్రహ్మ మిథ్య జగత్సత్యం" అని ప్రకటించింది

ఒకసారి ఒక పిచుక నోట గడ్డి కరచుకుని వెళుతూ ఒక పరకను అమ్మపై వదిలింది. అపుడు అమ్మ అన్నది. "పిచ్చుకపై బ్రహ్మాస్త్రం కాదు; అమ్మ (బ్రహ్మ) పై పిచ్చుకాస్త్రం" అని.

"మానవుని నడక నవగ్రహాలమీద ఆధారపడిలేదు. రాగద్వేషాలనే రెండే గ్రహాలమీద. ఆ రెంటికి ఆధారం నేనే" అని ఒకసారి, "మానవ జీవితం నవ గ్రహాలపై కాదు, ఒకే గ్రహంపై ఆధారపడిఉంది అదే దైవానుగ్రహం" అంటుంది ఆ గ్రహం తెలిసి అనుగ్రహ స్వరూపిణి.

కొన్ని భావాలను బలంగా చెప్పదలచుకొన్నప్పుడు అమ్మ వాక్య విన్యాసాన్ని మనం గమనించాలి.

మీరూ, నేనూ, ఒకటే, – నన్న భావం అమ్మ చెప్పాలి. అందుకు "మీరు కానిది నేనేమీ కాను నాయనా" అంటుంది.

శ్రీ వాసుదాసుగారితో మాట్లాడుతూ అమ్మ 9 సం॥ వయస్సులోనే "ఏమి కావాలనేది అక్కర లేకుండా కావాలి" అన్నది. ఏమీ వద్దు—అంటే సరిపోతుందిగదా! అట్లాగే–అంతా అదేగా కనుపిస్తున్నది–అనడానికిగాను "అది కానిది కనుపించడం లేదు" అంటుంది.

"గణనకు అందనిది గండ"మట.
"సవరణ అవసరం లేనిది వివరణ"మట.
"తనను తాను విమర్శించుకోవడం–వివేక"మట.
"ఇతరులను విమర్శించడం అవివేక"మట.
"తనకొరకు చేసేది రాగ"మట.
"ఇతరులకొరకు చేసేది త్యాగ"మట.
"నిగ్రహం కొరకే విగ్రహారాధన"మట.
"నిగ్రహం ఉంటే ఏ గ్రహాలూ ఏమీ చేయలే"వట."
"ఇతరులతో తగాదా ఆడడం పోరాడట"మట.
"తనలో తాను, తనతో తాను పోరాడడమే ఆరాట"మట.

—యిట్లా రెండు రెండు పదాలు అమ్మ రసనాగ్రం నుండి బంతులవలే వెలువడి ఆడుకుంటాయి. ఆ వాక్యాలలో ఎంతో కవితా సౌందర్యమూ, అర్ధ గాంభీర్యమూ ఉంటాయి.

"అప్పులు, తప్పులు చేయనివారు లోకంలో ఎవరుంటారూ ?" అన్నది అమ్మ. అప్పులు, తప్పులు – అనడంలో మాటసొగసే కాదు, ఎంత లౌకిక నిశిత పరి శీలన యిమిడి ఉన్నదీ ? మానవతావాదం ప్రఫుల్లమనలేదూ ? అమ్మకు మానవునిపై గల అపారమయిన సానుభూతిని ప్రస్ఫుటం చెయ్యడం లేదూ ? అప్పులు తప్పులు

చేయడం నేరంగా భావించేవారికి-అవి మానవ సహజాలే నని తీర్పుజెప్పడం అమ్మకు మనిషిపైగల కారుణ్యానికి చిహ్నం కాదూ ?

అటువంటిదే మరో వాక్యం. "తప్పు అని తెలిసీ మనిషి తప్పులు ఎందుకు చేస్తాడూ ?" అని అడిగితే అమ్మ అన్నదీ.... "తప్పించుకో లేకనే" అని. మనిషి గుండెకు గురిచూసి వస్తున్న బాణాన్ని అమ్మ విధివైపుకు మళ్ళించలేదూ ?

"సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి" ఈ వాక్యం రూపాలంకారానికే అపూర్వమయిన ఉదాహరణం.

అమ్మ తనను గురించి చెప్పుతున్న కొన్ని వాక్యాలుకూడా కేవలం అమ్మ గురించి తెలియజేయడమేకాక అందులో ఎంత అందం కూడా కనిపిస్తుంది.

"నాకు శిష్యులెవరూ లేరు. అందరూ శిశువులే".

"నాకూ భక్తులేవరూ లేరు. అందరూ బిడ్డలే."

"తల్లికి తప్పదు కాదు— తల్లికి తప్పే కనిపించదు."

"తల్లి అంటే తరింప చేసేది."

"తల్లి అంటే తొల్లి" ఈ వాక్యంలో కేవలం తల్లి, తొల్లి – అనే పదాలలో సారూప్యమూ, ఆ రెండు పదాల కలయికవల్ల ఉద్భూతమయ్యే సౌందర్యమే కాక – ఎంత అర్థం గర్భితమై ఉందీ !

అట్లాగే "నేను నేనైన నేను."

అమ్మ పదాల అర్థాలతో ఆడుకోవడమే కాక పదాలను వ్రాసే పద్ధతి (వర్ణక్రమం) ని గూడా మార్చిన ఘట్టాలున్నాయి.

"అమ్మ" అనే మాటను "అంమ" అనీ అంఆ" అనీ వ్రాస్తూ 'అంఆ' అంటే – అంతులేనిదీ, అడ్డులేనిదీ, అన్నిటికీ ఆధారమైనదీ – అని అపూరమయిన నిర్వచనం ఇచ్చింది.

అమ్మ ఒక సందర్భంలో తనను గురించి తెలియజెప్పు కుంటూ– "నాది సర్వసామాన్య స్థితి" అన్నది. అంటే మనం అనుకుంటామూ ... అమ్మది అతి సామాన్యమయిన స్థితి అని. కానీ దాని అర్థం అదికాదుట. అమ్మ మరొక సందర్భ

ములో వివరించింది - "సర్వమూ సామాన్యమయిన స్థితి" అది. అర్థంలో ఎంత మార్పు ! హస్తిమశకాంతరం ! సర్వమూ సామాన్యమైన స్థితి సిద్ధిత్వమే కదా !

"అందరిల్లు" అనే పదం అమ్మ హృదయ క్షీరాబ్ధినుండి ఆవిర్భూతమయిన కల్పవృక్షం ! అందరు, యిల్లు - అనే రెండుపదాలు మనందరికీ చిరపరిచితాలే అయినప్పటికి - ఆ రెంటి కలయిక సామ్యవాదానికి మకుటాయమానమూ, అమ్మ విశ్వజనీన తత్వానికి ప్రతిబింబమూ అయిన ఆ అపూర్వపదం పదకోశానికే మహోజ్వల మణిదీపమయింది.

అమ్మ పదాలెంత కోమలమూ, సుందరములో - అమ్మ ప్రయోగించే పదాలూ, వాక్యాలూ ఆపాతమధురములూ, ఆలోచనామృతములూ. మనం అమ్మను ప్రాథమిక పాఠశాలకు కూడా వెళ్ళని ఒక సామాన్య స్త్రీగా భావించినపుడు మనకీ ప్రయోగాలన్నీ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కానీ —

శారదా స్వరూపిణి అయిన అమ్మకు భాషపై అధికారం ఉండడంలో ఆశ్చర్యమేమి ఉన్నదీ ?

—ఆగష్టు 1982.

సర్వవ్యాపకత్వం

1971 జూన్ 4 వ తేదీ రాత్రి పన్నెండు గంటలు దాటింది. అప్పుడే గుంటూరునుండి వచ్చిన సామాను నంతనూ సర్దించి అమ్మ నివాసానికి వెళ్ళాను - అక్కడనే నేనూ పడుకోవటం అలవాటు కనుక. కాని తలుపు వేసి ఉన్నది. తలుపు తట్టాను. ఎవరూ పలకలేదు. పెద్దగా పిలిచాను. ఎవరూ జవాబివ్వ లేదు.

అంతలోనే అడుగుల సవ్వడి మెత్తగా వినిపించింది. ఆశగా నిలుచున్నాను. క్షణంలో తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా అమ్మ ! నా ఆనందానికి ఆశ్చర్యానికి అవధుల్లేవు.

"అదేమిటమ్మా ? నీవు వచ్చావు ! ఎవరూ లేరా?" అని ప్రశ్నించాను.

"అందరూ నిద్రపోతున్నారా. వాళ్ళను లేపటం ఎందుకూ - అని నేనే వచ్చాను. అదీగాక వాళ్ళు పగలల్లా ఆ పనీ ఆ పనీ చేసి చేసి ఉంటారా.... అలసట చెంది వళ్లుమరచి నిద్రపోతారు. ఈ నిద్రలేకపోతే వారికి పగలల్లా మత్తుగా ఉంటుంది. నే నంటావా ? పనీ పాటా లేనిదానను కనుక అలసటా ఉండదూ, ఆకలీ ఉండదూ; నిద్రా ఉండదూ. నీరసమూ ఉండదూ...." అని అమ్మ చెబుతుంటే నాకు అనేకానేక స్మృతులు మనస్సులో మెదిలాయి.

లోగడ ఒకసారి ఒకరు రాచవుసిరికాయలు అమ్మకు నివేదన చేశారు. పళ్ళన్నీ అమ్మ ఒక్కతే తింటున్నది. అదేమిటమ్మా - ఎదురుగా ఉన్న సంతానాన్నే విస్మరించావా? - వని అడిగితే అమ్మ అన్నది "అసలే మీ కందరికీ జలుబుచేసి ఉన్నది. ఇక ఆ పళ్లు తింటే మీరు మరీ బాధ పడవలసి వస్తుందని అన్నీ నేనే తింటున్నాను" అని.

నా నయనాలూ సజలమయినాయి. అది అతిశయించిన ఆనందంవల్లనో, అమ్మలోని అతి మంచితనం వల్లనో ?

అమ్మ మామూలుగ ఆరుబయట దొడ్లో పడుకుంటుంది. నేను లోపల గదిలో పడుకుంటాను. అమ్మ దొడ్లోకి వెళ్ళింది. నేను నా పడకగదికి వెళ్ళి – ఎంత మంచిదానవమ్మా... అన్న 'రాజా పాటను' నెమరు వేసుకుంటూ పడుకున్నాను.

తెల్లవారింది. రాత్రి అమ్మకు కలిగించిన శ్రమకు అక్కడ రాత్రి పడుకున్న సోదరీ సోదరులను మందలించాను. వారు నా మాటను ఈషణ్మాత్రమూ అంగీకరించక – అమ్మ రాత్రి గాఢంగా నిద్రపోయిందనీ, తాము వంతులవారీగా ఒకరి తరువాత ఒకరు మెలుకునే ఉన్నామనీ, అమ్మ మంచం దిగటం జరగనే లేదనీ– వక్కాణించారు.

నా ఆశ్చర్యానికి అంతులేదు.

క్షణంలో అనేక అద్భుత సంఘటనలు స్మృతిలోకి వచ్చాయి. పూర్వం సోదరి భవానికి అమ్మ – తన గదిలో మంచంమీద కూర్చుని శేషగిరిరావన్నయ్యతో మాట్లాడుతూ చాల దూరంలో నిద్రించే భాస్కరరావన్నయ్య ప్రక్కన నిలుచుని కనుపించింది.

అట్లాగే డాక్టరు సాంబయ్య గారికీ, హైదరాబాదులో ఒక హోటలు కుఱ్ఱవానికీ, మహాబలిపురంలో ఒక పాల మనిషికీ .... ఇంకా ఎందరో యిటువంటి మహిమాన్విత సంఘటనలు అనేకం నివేదిస్తున్నారు.

ఔను – అమ్మ కొందరికి వాసన రూపంగానూ, కొందరికి శబ్దరూపం గానూ, కొందరికి స్ఫురణ రూపంగానూ, కొందరికి స్వప్నంలోనూ అనేకవిధాల కనిపిస్తున్నా – యిట్లా రక్త మాంసాలతో ప్రత్యక్షమవటం అరుదు కాకపోయినా ఎప్పటికప్పుడు ఏ సంఘటనకాసంఘటన నిత్యనూతనమే. ఆనందదాయకమే.

ఒకే సంఘటనలో ఒక క్షణంలో సంపూర్ణ మానవతా లక్షణాన్నీ మరు క్షణంలోనే అతి మానవ ప్రతిభనూ అనుభూతం చేయగల ఘటనా ఘటనాద్భుత సమర్థ కనుకనే అమ్మకు మనమందరమూ అనుక్షణమూ చేతులు ముకుళిస్తున్నాము.

– జూన్ 1971

సర్వశక్తిమత్త్వం

ఒకనాడు అమ్మా, శేషూ, శాస్త్రీ, భవానీ కలిసి వైకుంఠపాళీ ఆడుతున్నారు. అమ్మ మొదటి పందెం వేసింది. శాస్త్రి అమ్మపావు కదిలించబోతుంటే భవానీ 'అమ్మ దేముడిపందెం వెయ్యాలి' అన్నది. వెంటనే అమ్మ "దేముడిపందెం ఏమున్నదీ ? దేముడే పందెం వేస్తుంటే–" అన్నది సన్నగా నవ్వుతూ.

అమ్మ అవతార విశేషం చాలా విచిత్రంగానూ రమణీయంగానూ ఉంటుంది ఒక దిక్కున సర్వజ్ఞత్వమూ మరొక దిక్కున అమాయకత్వమూ...ఒక ప్రక్కన సర్వసామర్థ్యమూ, మరొక ప్రక్కన ఏమీ చేతకానితనమూ....ఒక వైపున సర్వవ్యాపకత్వమూ, మరొకవైపున పరిమితత్వమూ .... ఒక్కొక్కసారి ద్వంద్వాల కతీతంగానూ ఆధారంగానూ; ఒక్కొక్కసారి ద్వంద్వాల్లో మెలుగుతూనూ నలుగుతూనూ .... మాధవతా మానవతల విచిత్ర సమ్మేళనతో నవరసభరితమయిన విశిష్ట వ్యక్తిత్వంతో మధురస్వభావంతో అమ్మ జగత్తుతో ఆడుకుంటూ జనులను అలరిస్తూ తాను వినోదిస్తూ ఉన్నది.

సాధారణంగా అమ్మ "నేనూ మీలాంటి దాన్నే" అనీ "నేనేమీ చేయలే" ననీ "నాది తెలిసీ తెలియని స్థితి" అనీ "మీరు ఎక్కడ ఉన్నారో నేనూ అక్కడే ఉన్నా"ననీ సామాన్య మానవమాత్రురాలిగానే మాట్లాడుతుంది.

అమ్మ ఏమీ మహత్తుల ప్రకటన చేయదు. ఒకవేళ అమ్మ సన్నిధిలో అటువంటివి సంభవించినా వాటికి తన కర్తృత్వం అంగీకరించదు. కాని అటువంటి నిరాడంబరమయిన వ్యక్తిత్వంగల అమ్మ కొన్ని కొన్ని సుముహూర్తాలలో తన యధా స్థితిని ప్రకటిస్తూనే ఉన్నది. అయితే అది మన మనస్సుకు అందుతున్నదా అంటే అది అమ్మ కరుణపై మాత్రమే ఆధారపడి ఉన్నది.

అమ్మ అతిబాల్యంలోనే తన నాలుగవ ఏటనే "అమ్మలేకపోతే నేనే అమ్మగా ఉంటానుగా" అనీ, "సర్వానికీ నేనే మూల"మనీ, "ఈ కనుపించేదంతా నేనే" ననీ, "నేను సర్వసిద్ధాంత సార్వభౌమను" అనీ "అన్నీ నేనే" ననీ పలుమార్లు ఉద్ఘాటించింది.

ఒకసారి ఒకరు "మీ నామస్మరణ చేస్తూ మద్రాస్ మవుంట్ రోడ్డులో నడిచిపోతున్న నా మీద మీ ప్రభావం ఎట్లా ఉంటుంది?" అని అడిగితే - "ఏమంది నాన్నా - నా ముందు రోడ్డుమీద వెళుతున్నట్లు కనుపిస్తుంటావు" అన్నది అమ్మ.

ఒక విషయంలో "నీకు యిక్కడికి వినిపించిందా ? నీవు అక్కడకు పోయి విన్నావా?" అని అమ్మను ఒకామె అడిగితే - "ఎట్లాగయినా ఒకటేనమ్మా-" అన్నది అమ్మ.

మరొకరు "మేము మాట్లాడుకున్నది నీకు ఎలాగా వినపడిందమ్మా?" అని ప్రశ్నిస్తే — "మీరు మాట్లాడుకున్నది మీకు వినపడటంలేదా ?" అని తిరిగి ప్రశ్నించి "అట్లాగే అంతా వినపడుతుంది" అని విశదీకరించింది అమ్మ.

ఇంకొకరు "మా చర్యలన్నీ నీ కెట్లా తెలుస్తాయమ్మా?" అంటే - "నా ప్రవర్తన నాకు తెలియదూ?" అన్నది అమ్మ.

ఇంకొకరు "మాలో ఒకరివై మాట్లాడుతా వేమిటీ?" అని అడిగితే- "మీరు కాకుండా నేను లేను" అని ఉద్ఘాటించింది.

ఒకసారి ఒక సంభాషణలోని ఒక విషయాన్ని అమ్మ ప్రస్తావించింది. "నీ కెట్లా తెలిసిందమ్మా!" అని అందులో ఒకరు అడిగారు. "నాకు యోగయ్య చెప్పాడు" అన్నది అమ్మ. "మేము ముగ్గురమూ కలిసే వచ్చాము. నీకు ఎప్పుడు చెప్పాడమ్మా?" అని వారు అడిగారు. "అయితే మీ ముగ్గురితోబాటు నాలుగోదాన్ని నేను లేనుట్రా?" అని అమ్మ నవ్వింది.

ఒకరు 'అమ్మల్ని' అనటమా? నిన్ను అనుకోవటమా?' అని సందేహ పడితే "రెండూ ఒకటే నాన్నా" అన్నది అమ్మ నిర్లిప్తంగా.

ఒక సోదరి "మీరు నన్ను పరీక్ష చేస్తున్నారు" అంటే - "నిన్ను పరీక్ష చేయటమంటే నన్ను నేను పరీక్ష చేసుకోవటమే" అని ఆమెకు అభయప్రదానం చేసింది అమ్మ.

అమ్మ స్మృతిని పరిశీలిస్తే అది మేధాసంపన్నతకు సంబంధించిన విషయంగా గోచరించదు. ఆ విషయంలో ఒకసారి అమ్మ "నాకు గుర్తు ఉంటాయంటే

నాకు అవి ఎప్పుడో జరిగినట్లు ఉండవు. అన్నీ యిప్పుడే జరిగినట్లు ఉంటుంది" అన్నది.

ఈ విషయాన్నే సోదరులు భరద్వాజ "నీకు మూడు కాలాలూ వర్తమానమే కదమ్మా" అని అడిగినప్పుడు - అమ్మ అసందిగ్ధంగా "అవును" అని ప్రకటించింది.

ఒకసారి సోదరి భవానీ కీర్తిశేషులయిన "చిదంబరరావుతాతగారు ఎక్కడ ఉంటా?" రని అడిగితే - "నాలోనే ఉంటాడు ఇంకెక్కడ ఉంటాడు?" అని జవాబు యిచ్చింది అమ్మ.

"అందరూ నా ఒడిలోనే తిరుగుతున్నారు. ఒడి విడిచి ఎవరూ లేరు" అన్నది అమ్మ యింకొకసమయంలో.

"ఎక్కడ ఎవరిని చూచినా నా బిడ్డయే ననిపిస్తుంది" అంటూ "మీ రందరూ పిల్లలే కాదు, నా అవయవాలు" అన్నది ప్రేమగా.

ఒకరు "మీ దృష్టిలో మనుషులూ యితర జంతువులూ ఒకటిగానే ఉన్నాయి" అని అంటే - "అవి యితర మనిపించటంలేదు; అన్నీ నేనే అనిపిస్తున్నది" అన్నది అమ్మ.

సృష్టిని గురించిన ప్రస్తావనలో "సృష్టినాది" అన్నది నిర్నిబంధంగా.

"మీరు చూస్తే నేను కనపడను. నేను కనబడితే మీరు చూస్తారు" అనీ "నన్ను చూడటమే పుణ్యం" అనీ "నేను దగ్గరకు తియ్యటంతప్ప వాళ్లు దగ్గరకు రావటం కాదు" అనీ "ఎప్పుడయినా ఏమయినా ఎవరికయినా నేనే యివ్వవలసిన దానిని" అనీ సందర్భానుసారంగా అమ్మ వెల్లడించింది.

"వక్రించిన యుగధర్మాన్ని మార్చగూడదా" అని ఒకరు అడిగినప్పుడు "అవసరమయితే మారుస్తాను" అన్నది అమ్మ.

"నా కబురు సరాసరి చేరుతుంది. మీ కబుర్లు పోస్టాఫీసులో ముద్రలు పడితేగానీ ఎక్కడి కయినా చేరవు" అనీ "నేను మిమ్మల్ని ఎప్పుడూ చూస్తూనే ఉన్నాను; మీరు యిక్కడకు వచ్చి నన్ను చూస్తారు" అనీ ఋజువుచేసింది అమ్మ.

ఒకసారి సోదరుడు బాలయ్య "నేను పాపాలు చేస్తున్నానమ్మా; కానీ అన్నీ మోయవలసింది మీరేగా?" అని అంటే – "నేనే భరిస్తాను నాన్నా" అని వాగ్దానం చేసింది అమ్మ.

"మీరు బురదపూసుకు వచ్చినా, ఎట్లా మురికి చేసుకున్నా శుభ్రం చేయవలసింది నేనేగా-" అని హామీ యిచ్చింది అమ్మ.

"చెప్పుకుంటే తీరుతుందని మీరు చెప్పుకుంటారు. నేను చెప్పుకుంటే మీరు బాధపడతారని నేనే పడతాను" అన్నది అమ్మ ఆర్ద్రహృదయంతో.

అమ్మ ఎన్ని రీతుల్లో ఎన్ని తీరుల్లో తననుగురించి తాను వాస్తవం ప్రకటించుకున్నది ?

అవును, మరి–

ఎవరికి చెప్పుకున్నంత మాత్రాన ఎవరి బాధలయినా తీరుతాయి ? ఎవరికి కాలాలన్నీ సమానంగా ఉంటాయి ? ఎవరు అన్నిటికీ కర్త ? ఎవరు అందరిలో అందరితో అహరహం ఉండగలరు ? ఎవరు యీ సృష్టిని నాది అనగలరు ? ఎవరు అంతా నేనే అనగలరు ? అందరి పాపాలూ ఎవరు భరించగలరు ? యుగధర్మాన్నే ఎవరు మార్చగలరు ?

ఒక్క దైవం మాత్రమే పలుకగల మాటలవి !

ఇంత స్పష్టంగా అమ్మ చెబుతున్నా మనం యింకా సందేహాల్లోనూ సంశయాత్మతోనూ సంచరిస్తున్నామంటే కారణం ఏమిటి ?

"వాడి కరుణ లేకపోతే వాడు ఎదురుగా ఉన్నా మనం గుర్తించలే"మని అమ్మయే సమాధానం చెప్పింది.

కనుకనే అమ్మ కరుణ కోసం మనం అమ్మను ప్రార్థించాలి.

– ఏప్రిల్ 1971

సర్వజ్ఞత్వం

అమ్మ మహోజ్వల జీవిత చరిత్రనూ, అమ్మ వాక్యాల సంపుటాలనూ పరిశీలిస్తే తోలునోరుకాని, తాలుమాటలుకాని అమ్మ తీయని నోటినుండి చాలా తరచుగా విలక్షణంగా వినిపించే మాటలు నాలుగున్నాయి... "నాకేమీ తెలీ" దనీ, "నే నేమీ చేయలే" నని, "మీ యిష్ట" మనీ, "సరే" ననీ. ఈ నాలుగు వాక్యాలూ నాలుగు మంత్రాల్లాగా అమ్మ నిత్యమూ పునశ్చరణచేస్తూ ఉంటుంది.

ఏమీ తెలియని మనం, లేక కొంత తెలిసిన మనం మనకు తెలియని విషయ ప్రసక్తి వచ్చినప్పుడు కూడా "నాకు తెలీదు" అని అంగీకరించడానికి మన మనస్సు యిష్టపడదు. అదేదో మన ప్రతిష్ఠకూ పరువుకూ సంఘంలో మన స్థానానికీ న్యూనత కలిగించేదిగా బాధపడుతూ తెలియని విషయాలన్నీ తెలిసినట్లు నటించటానికి ప్రయత్నిస్తుంటాము.

ఏమీ చేయలేని మనం, ఏమీ చేతగాని మనం, చేతలు మనచేతలేని మనం ప్రతిపనీ మనమే చేశామనీ చేస్తున్నామనీ భ్రమపడుతూ యితరులకు అది చేస్తాను, యిది చేసిపెడతాను- అని వాగ్దానాలు ప్రసారంచేస్తూ, అవి నిర్వర్తించలేక నిర్వహించ లేక బాధపడుతూ ఉంటాము.

ఏదయినా ఒక సమస్యలో చర్చ వచ్చినప్పుడు, ఒక క్రియాచరణలో వివాదం ఏర్పడినప్పుడు మనం ఎప్పుడూ "మీ యిష్టం" అని ఎదుటివారిమీద వదల లేము. ఒకవేళ ఎవరయినా ఏ విషయంలో నయినా సలహా అడిగితే "మీ యిష్టం" అని వారికి స్వేచ్ఛనివ్వలేము.

ఎవరయినా ఒక విషయం మనకు చెబితే వెంటనే "సరే" నని ఎప్పుడూ అనలేము. ఎంతసేపటికీ ఎదుటివారు చెప్పినది "కాదు" అంటూ బలం లేకపోయినా అందులో సత్యం లేకపోయినా మన వాదాన్నే నెగ్గించుకోవాలని నిరంతరం తాపత్రయ పడుతుంటాము.

కాని అమ్మ చాలా సునాయాసంగా, ఏమీ ఆలోచించకుండా, ఏమీ బాధపడకుండా నా కేమీ తెలీదనీ, నే నేమీ చేయలేననీ, మీ యిష్టమనీ, సరేననీ

పలుకుతూ ఉంటుంది. అమ్మ నోటివెంట ఆ మాటలు మాత్రమే వింటూ అమ్మ మనలను జయించే తీరు చూస్తే మనంకూడా ఆ అస్త్రాలనే ప్రయోగించి జీవితంలో విజేతలం కాకూడదా- అని మనకు ఆశ కలగడం సహజం.

ఏమీ తెలియని అమ్మ, ఏమీ చేయలేని అమ్మ యింత మహాద్భుత చరిత్రను ఎట్లా నడుపుతున్నదీ, యింత మహోజ్వల జీవితానికి ఆధారమేమిటీ అని మనకు విస్మయంతోబాటు అమ్మ అసత్యమాడుతున్నదా అన్న సందేహమూ కలుగుతుంది.

కాని అమ్మ జీవితమహోదధి లోతులకు వెళ్ళి పరిశీలిస్తే .... అందులోని రహస్యం మన కవగతమై మన మనస్సు అమ్మ చరణాల ముందు విన్రమమై, మన చేతులు ముకుళిత మవుతాయి.

అమ్మ కొన్ని నిర్వచనాలు చేసింది. నామరహితుడు అంటే అన్ని నామాలూ కలవాడనీ, గుణరహితుడు అంటే అన్ని గుణాలూ కలవాడనీ, రూప రహితుడు అంటే అన్ని రూపాలూ కలవాడనీ. అట్లాగే ఏమీ తెలియనివాడు అంటే అన్నీ తెలిసినవాడనీ, ఏమీ చేయలేనివాడు అంటే అన్నీ చేయగలిగినవాడనీ అర్థం. ఇక- మనకు ఆ మాట అనటానికి అర్హత ఏదీ ? అమ్మ అసత్యమాడుతున్నదని శంకించటానికి అవకాశమూ లేదు.

"మీ యిష్ట" మని, "సరే" నని అన్నింటికీ మన అభిప్రాయానికే అమ్మ స్వేచ్ఛనిస్తున్నట్లు కనిపిస్తున్నది. కానీ ఆలోచిస్తే, అదీ యదార్థంకాదు. అమ్మయే ఒకసారి అన్నది- నేను మీ యిష్టప్రకారమే నడుస్తున్నట్లు కనుపిస్తానుగానీ నిజానికి నా యిష్టప్రకారమే మిమ్మల్ని నడుపుకుంటాను- అని. అనేక సంఘటనలలో అది ఋజువయింది కూడ. అమ్మ ఒక విషయంలో మన సలహా అడిగినట్లు కనుపించినా, తన అభిమతం ప్రకారమే మనచేత పలికించి, మనం చెప్పినట్లు తాను చేశానంటుంది. మరి, యిన్ని మనస్సులనూ, యిందరు మనుష్యులనూ తన అభీష్టానుసారమే నడుపు కొనడమంటే సామాన్యమయిన విషయమా ? అది మనకు సాధ్యమయ్యే సంగతా ?

కనుకనే మనమూ అట్లా అనాలనో, ప్రవర్తించాలనో అనుకుంటే పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లే అవుతుంది.

— ఫిబ్రవరి 1872

అతిలోక సామర్థ్యం

కృష్ణాజిల్లా పర్యటన సందర్భంలో అమ్మ విజయవాడలో మకాంచేసినప్పుడు పత్రికా విలేఖరులుకొందరూ, వార్తాసంస్థల ప్రతినిధులు కొందరూ అమ్మను సందర్శించి సందేహాలు కొన్ని వెలిబుచ్చి సమాధానాలు పొంది సంతృప్తిని పొందారు.

ఆ సందేహాలలో ఒకటి మహిమల విషయం. ఆ మాహాత్మ్యాల ప్రస్తావన చేయగానే అమ్మ చాలా నిరాడంబరంగానూ, నిసర్గ మనోజ్ఞంగానూ తన మధుర స్వభావానికి అనుగుణంగానూ మహత్తుల విషయమే తనకు తెలియదనీ, వాటినిగురించి తానెప్పుడూ ఆలోచించననీ చెప్పింది.

అమ్మకు ఆ మహత్తుల విషయం తెలుసునో, తెలియదో, అమ్మ వాటిని చేస్తుందో, లేదో- కానీ అమ్మ సమక్షంలో అమ్మప్రభావం వల్ల అనేక అద్భుతాలు జరుగుతున్నట్లు మనకు విదితమవుతూనే ఉంటాయి. అయితే వాటి కర్తృత్వానికీ, తనకూ ఏమీ సంబంధం లేదని అమ్మ ప్రకటిస్తూ ఉండటమూ సామాన్య విషయమే.

తరువాత అమ్మలో మరొక విశిష్టగుణమూ, విలక్షణమూ ఉన్నాయి. అమ్మను ఎవరయినా ఏమయినా ప్రశ్నిస్తే- వీలయినంతవరకు వాటికి సమాధానం మాటల్లోకంటే క్రియలోనూ, ప్రత్యక్షంగాకంటే పరోక్షంగానూ, వాచ్యంగాకంటే ధ్వని ప్రధానంగానూ చెప్పటం అమ్మకు అలవాటు.

గుడివాడలో అమ్మ పేదల కాలనీలు అనేకం సందర్శించి ప్రేమతో వారందరినీ పలకరించి కరుణతో ప్రసాదం పంచింది ఓపిక లేకపోయినా నడియెండలో శరీరం స్వేదసిక్తమవుతున్నా ఓర్పుతో వాడవాడలా తిరుగుతూ ఏ ఆడంబరాలూ లేకుండా రోడ్డుప్రక్కల చెట్టునీడన కుర్చీలో కూర్చుని వాళ్ళ యోగక్షేమాలు విచారించి ప్రసాదం పంచుతూ వారికి ప్రమోదం కలిగిస్తుంటే అమ్మలో శతపత్రమై విరిసే మాతృత్వపు పరిమళాలలో ఆ వాతావరణమే పులకించిపోయింది.

అట్లా అమ్మ పాదస్పర్శతో పునీతమైన ప్రదేశాల్లో మందపాడు ఒకటి. అప్పుడు అమ్మ వెంట ఉన్న సోదరీసోదరుల్లో ఒక వార్తాసంస్థ ప్రతినిధి ఒకరు. వారు విజయవాడలో అమ్మను మహత్తుల గురించి ప్రశ్నించిన సోదరులేకావటం గమనార్హం.

మందపాడు హరిజనవాడ. అక్కడ ఒక కన్య కొన్నాళ్ళుగా మతిభ్రమణంతో బాధపడుతూ, నిరాహారియై మృత్యుశయ్య చేరింది. ఆమె ప్రక్కనే ఒక ముస్లిం గురువూ, క్రైస్తవ గురువూ చేరి వారి వారి మతానుసారం ఆమె ఆత్మశాంతికై అంతిమ ప్రార్థనలు చేస్తున్నారు. ఆ సమయంలో అమ్మ ఆ సమీపంలోకి వెళ్ళింది. కొందరు ఆమెను అమ్మవద్దకు తీసుకురావటానికి ప్రయత్నించారు. కాని ఆ గురువు లందుకు అంగీకరించలేదు.

వారు అమ్మను అక్కడకు రమ్మని అభ్యర్థించారు. మహాప్రస్థానానికి సన్నద్ధయై ఉన్న ఆ ప్రాణివద్దకు అమ్మ వచ్చింది. ఆదరంతో ఆ కన్య కరగ్రహణం చేసింది. నాడి చూచింది. ప్రేమగా నొసటన నిమిరింది. ఆ జీవి నిర్లిప్తంగా ఒకసారి కనులెత్తి చూచి రెప్పలు దించుకున్నది.

అమ్మ వెనుదిరిగి వచ్చి తన కార్యక్రమంలో నిమగ్న అయింది

అంతే- ఆ క్రియ అత్యంత నిరాడంబరంగా జరిగిపోయింది. వెంట ఉన్న వారెవరూ ఏమీ ఊహించలేకపోయారు.

కాని- మరునాటికి ఆ కన్య సుస్థిరమతీ, ఆరోగ్యవతీ అయి అందరికీ ఆశ్చర్యం కలిగించటమేకాక అమ్మ అతిలోక సామర్థ్యానికి సజీవ పతాకమై నిలిచింది.

ఇది- విజయవాడలో అమ్మను అడిగిన ప్రశ్నకు- గుడివాడలో క్రియా రూపేణా అమ్మ యిచ్చిన అద్భుత సమాధానం కాదా ?

—అక్టోబరు 1973

సాక్షాత్కారం

1972 నవంబరు 2 వ తేదీన వరంగల్ సోదరుడు శ్రీ శేషయ్య లింగం గారు అమ్మ సన్నిధిన కూర్చుని అక్టోబరు 29 వ తేదీన ఘనపూర్‌లో జరిగిన అమ్మ స్వర్ణోత్సవ విశేషాలను గురించి వివరిస్తూ ఆ సభలో హైదరాబాద్ నుండి వచ్చిన వక్త శ్రీ వీరమాచనేని ప్రసాదరావుగారు తమ కోడలుకు జరిగిన అత్యంత ప్రమాదకరమైన దుర్ఘటన విపులీకరించిన విషయం వెల్లడించారు.

సికిందరాబాద్‌లో ప్రసాదరావుగారి కుమారుడూ కోడలూ ఒక జీపులో ప్రయాణం చేస్తుండగా అది ఒక లారీని ఢీకొని ప్రమాదం జరిగింది. కుమారునికి కొద్దిగాయాలు కాగా కోడలుకు ప్రాణాపాయకరమైన ప్రమాదం జరిగింది. ముఖం వికృతమై పాలభాగములోని ముఖ్యమైన శల్యాలు శిధిలమైనాయి. ఆ శకలాలు గుచ్చుకొని మెదడు దెబ్బతిన్నది, స్పృహ తప్పింది. హాస్పిటల్‌లో చేర్చారు. ఆమెకు ఆపరేషన్ జరపటానికి నిశ్చయమయింది. ఆ తరుణం సమీపిస్తున్నకొద్దీ బంధువులకు ఆతురత అధిక మవుతున్నది. క్షణాలు యుగాలుగా గడుస్తున్నాయి డాక్టర్లూ ఆశావహంగా లేరు. అయినా మానవ ప్రయత్నం చేయాలి కనుక బాధ్యతా నిర్వహణలో నిమగ్నులయినారు. బంధువులూ, ఆప్తులూ మాత్రం ప్రాణాలు అరచేత పట్టుకొని కూర్చున్నారు. ఆ క్లిష్టసమయములో సోదకులు శ్రీ జమ్మి వెంకటరత్నం గారు అమ్మవద్దనుండి ప్రసాదమూ, తీర్థమూ తీసుకుని వెళ్ళారు. ఆ తీర్థం చూచేటప్పటికి ప్రసాదరావుగారికి సంజీవని చూచినంత ధైర్యం వచ్చింది. శ్రద్ధతో ఆ తీర్థం నోటిలో పోశారు. స్పృహ లేకపోయినా ఆమె ఆ తీర్థం త్రాగింది. ప్రసాదరావుగారికి కొంతంత ఆశ కలిగింది.

క్షణాలు బరువుగా దొర్లిపోతున్నాయి. డాక్టర్లు నిర్లిప్తంగా విధినిర్వహణలో స్థిరచిత్తులై ఉంటే, ఆప్తులు ఉద్విగ్న మానసులై ఉన్నారు.

ప్రసాదరావుగారికి ఒకదృశ్యం దృగ్గోచరమై వారి మేను పులకరించింది. వారు ఆనంద, ఆశ్చర్యాలలో తలమునకలయినారు.

అమ్మ డాక్టర్ డ్రస్సులో ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళింది. ఆ నడక, ఆ నడకలోని ఠీవి వారిని చకితులను చేశాయి. అమ్మ వెనుకనే వారి కోడలిని స్ట్రెచర్ మీద థియేటర్‌లోకి తీసుకు వెళుతున్నారు.

వారు స్వస్థచిత్తులై విచారింపగా వారి కోడలిని థియేటర్‌లోకి ఆ సమయం లోనే తీసుకువెళ్ళటం వాస్తవం. మరి, వారు నిద్రించనూలేదు; కలగననూలేదు; ధ్యానావస్థలోనూ లేరు; అతిమానసికావస్థలో దూపదర్శనమూ కాలేదు.

మరి, అమ్మ ఎట్లాదృశ్యమాన మయింది? అదే వారికి ఆశ్చర్యకరము అయిందీ, ఆశాకిరణ సహస్ర ప్రభా భాసమానమూ అయింది.

అమ్మయే స్వయంగా ఆపరేషన్ జరుపుతున్నట్లు వారికి ప్రగాఢ విశ్వాసం కలిగింది. ఆపరేషన్ జయప్రదమయింది బంధువులకేకాక వైద్యులకూ ఆ విజయం విస్మయం కలిగించింది. మరి అటువంటి శస్త్రచికిత్సల్లో లక్షకు ఒకటికానీ సఫలం కాదట. ఒకవేళ రోగి బ్రతికినా, మెదడు సరిగా పనిచేయటమూ, జ్ఞాపకశక్తి సక్రమముగా రావటమూ, మాట్లాడటమూ, చాలా అరుదట.

కాని అన్నీ సక్రమముగా జరిగాయి. అష్టావక్రవికృతమయిన వదనం సౌష్ఠవోపేతమూ, సుందరమూ అయింది. నయనాంచలాలకు వచ్చిన కనుగుడ్లు స్వస్థానంచేరి గతస్మృతిగల్గి మాటలు వచ్చాయి. అందరి ఆనందానికీ, అనుపమ సామర్థ్యానికి నిదర్శనమేనని భావించి అమ్మకు అంజలి ఘటించారు.

ఈ సంఘటన ప్రసాదరావుగారు వివరిస్తే - అచ్చటి ఒక మాజీ కమ్యూనిస్టు పార్లమెంటు మెంబరు విస్తుపోయారట. మరి ప్రసాదరావుగారుకూడా ఒకప్పుడు కమ్యూనిస్టు పార్లమెంటు మెంబరు. హేతువాది ఇదేమిటి, యిట్లా మారి పోయాడు? అని. అదే వారిని అడిగితే ప్రసాదరావుగారు-"పూర్వం ఏ అనుభవమూ, ఏ దర్శనమూలేదూ...ఏమీ నమ్మలేదు. ప్రస్తుతం ఎన్నో అనుభవాలూ, నిదర్శనాలూ నిరూపణలూ. మరి, నమ్మకపోతే ఎట్లా? ఏమీలేక నమ్మితే ఎట్లా మూఢత్వం అని అనుకున్నానో ఎన్నో అవలోకిస్తూ, అనుభవిస్తూకూడా నమ్మకుంటే - అంతే మూర్ఖత్వమేమోనని భావిస్తాను..." అని చెప్పారట ఏ ప్రకోపమూ లేకుండా.

ఔను - మంచం దిగి అడుగు వేయటానికి ఆయాసపడే అమ్మ మద్రాసు వెళ్ళి, గుంటూరు వెళ్ళి...ఎన్నిచోట్లకు వెళ్ళి ఎందరిని అపత్సమయాల్లో ఆదుకుని ఆదరించి అనురాగం కురిపించలేదూ ?

—నవంబరు 1972

కారుణ్య కేతనం

ఈ సంవత్సరం దేవీనవరాత్రి ఉత్సవాలు హైమాలయంలో అత్యద్భుతంగానూ, అత్యంత వైభవోపేతంగానూ జరిగాయి.

సాధారణంగా దసరా ఉత్సవాలకు, దేశంలో అన్ని విద్యా సంస్థలకు వలేనే, జిల్లెళ్ళమూడిలోని ప్రాచ్యపాఠశాల, కళాశాలలకూ సెలవులు యివ్వబడతాయి. సెలవుల్లో సామాన్యముగా అధ్యాపకబృందము వారి స్వంత పనులపై ఎక్కడికైనా వెళతారు. ఈ ఏడు అట్లా కాకుండా అందరూ జిల్లెళ్ళమూడిలోనే ఉండి - హైమాలయంలో తొమ్మిది రోజులూ దీక్షగా పూజ చేసుకునేటట్లు నిర్ణయం జరిగింది.

ఆ కారణంగా హైమాలయంలో పూజకు ప్రత్యేకత, నిండుదనం రావడమే కాక-ఆ పూజలకు ఎంతో అందమూ, ఆకర్షణా వచ్చాయి.

తొమ్మిది రోజులు మూడు పూటల చేసిన అర్చనవల్ల హైమ విగ్రహం పూలతో నడుంవరకు మునిగి హైమసౌందర్యం వెయ్యింతలై కనులపండువుగా ఉంది.

మహర్నవమితో పూజ పూర్తి అవుతుంది. విజయదశమి రోజున ఆ పూలరాసి నిర్మాల్యమై పోతుంది. అందాకా ఎంతో పవిత్రంగా చూడబడిన కుసుమ సమూహం నదిలో నిమజ్జనం చేయబడుతుంది.

అందువల్ల ఆ తొమ్మిది రోజులూ దీక్షగా అర్చన చేసుకున్న వాళ్ళు - నవమినాడు హైమాలయానికి వచ్చి ఆ వైభవాన్ని చూడవలసిందిగా అమ్మను అభ్యర్థించారు. అమ్మ అంగీకారం తెలిపింది.

నవమినాడు ఉదయాన్నే అమ్మ స్నానం చేసి బయలుదేరింది. అమ్మ ప్రయాణానికి కారు సిద్ధం చేయబడింది. మంగళవాద్యకారులు మార్గదర్శకులవలె ముందు నిలబడి అందిస్తున్న శ్రావ్యమూ శివంకరమూ అయిన గానలహరిలో వాతావరణం పులకరిస్తోంది. పరిసరాల్లోని చెట్లు చేమలూ కూడా ఆకులన్నీ కళ్ళుగా అమ్మ కోసం నిరీక్షిస్తున్నాయి.

హైమాలయంలో, అనసూయేశ్వరాలయంలో పూజ చేసుకుంటున్నవాళ్ళు దండలూ, కొబ్బరికాయలూ, హారతికర్పూరాలూ పట్టుకుని అమ్మకోసం ఉత్సాహులై వున్నారు.

అమ్మ మేడ దిగింది. కారు ఎక్కి కూర్చుంది. కారుముందు కొబ్బరికాయ పగిలింది. హారతి వెలిగింది. కారు సాగింది.

కారు పది గజాలు ముందుకు సాగిందో, లేదో – కారును ఆసుపత్రికి పోనివ్వమన్నది అమ్మ. సన్నాయివాళ్ళను ఆగిపోమన్నది. కారువెంట వచ్చే ప్రజలందరినీ ఆలయానికి వెళ్ళమని ఆదేశించింది.

ఆ సమయంలో రాకపోతే – జరిగిన పూజల అనంత వైభవాన్ని, జగన్మోహన సౌందర్యాన్ని చూసే అవకాశం లేదు అమ్మకు. అదీగాక దేవీనవరాత్రి ఉత్సవాలలో "నవమి"కి అనన్యమైన ప్రాధాన్యం ఉంది. అమ్మ అక్కడకు వచ్చి కేవలం పూజలను చూడడమే కాదు, పూజలను అందుకోవాల్సి ఉంది. ఆ ఆకాంక్షతో, ఆశతో అక్కడ ఎందరో అమ్మకోసం ఎదురు చూస్తున్నారు.

కారు మాతృశ్రీ మెడికల్ సెంటర్ ముందు ఆగింది. అమ్మ మామూలుగా మంచం దిగి నాలుగు అడుగులు సరిగా వేయలేని అమ్మ, కారు దిగి చకచకా లోపలికి నడిచింది. వెళ్ళి ఒక మంచంవద్ద ఆగింది.

ఆ మంచంపై పడుకున్న రోగి అమ్మను చూసి లేచి కూర్చోనడానికి ఆదుర్దా పడుతుంటే – అమ్మ అతని దగ్గరకు వెళ్ళి కూర్చుంది.

అమ్మ అతణ్ణి నఖశిఖ పర్యంతం పరిశీలించింది. ఎక్కడా అతనిలో జీవం కనబడడంలేదు. చాలా శుష్కించి ఉన్నాడు. ఎముకల పోగుమాత్రం మిగిలింది కళ్ళు గుంటలుపడిపోయి పచ్చగా వున్నాయి. శరీరమంతా పసుపుపచ్చగా మారిపోయింది. నాడి చూసింది. ప్రబంధనాయిక నడుంవలె ఉన్నదా, లేదా అన్నట్లు ఉంది. పొట్టపై చెయ్యి వేసింది. లివర్ బాగా పెరిగి గుండెదాకా వ్యాపించింది. అందువల్ల ఆయన మాట్లాడుదామని ప్రయత్నిస్తే – మాటకంటే ఆయాసం ఎక్కువగా కనపిస్తున్నది.

ఆయన-జిల్లెళ్ళమూడిలో అమ్మ దగ్గరవుండే శ్రీ గరుడాద్రి సుబ్రహ్మణ్యం గారి అన్నయ్య, శ్రీ వెంకటసుబ్బయ్య. ఆయన మహబూబ్‌నగర్ దగ్గర పెద్ద మారూరులో ఉపాధ్యాయ వృత్తి చేసుకుంటున్నాడు. ఇటీవలనే భార్యావియోగం జరిగింది. బహుసంతానం ఉన్నది. అందులో యేడేళ్ళవాడు కొడుకు. ఒక్కడే వాళ్ళ నాన్నని వదిలిపెట్టి ఉండలేడు. వాడు ఆ మంచందగ్గరే తారాడుతున్నాడు.

అమ్మ వాడిని దగ్గరకు పిలిచింది. ఒక పండు వాడిచేతికి యిచ్చింది. వాడిని ఒళ్ళోకి లాక్కుంది. వాడు అయోమయంగా అమ్మవంకా, వాళ్ళ నాన్నవంకా మార్చి మార్చి చూస్తున్నాడు. అమ్మ కళ్ళు జలజలా వర్షించాయి. వాడి మూర్ధం అమ్మ పావనాశ్రుసిక్తం అయింది. అమ్మనుచూసి అంతదాకా ఎంతో ధైర్యంగా స్థైర్యంగా ఉన్న వెంకటసుబ్బయ్య కళ్ళు శ్రావణ మేఘాలై కన్నీటిని కురిశాయి. ఇక ఆ ప్రక్కనే ఉన్న వెంకటసుబ్బయ్య చెల్లెలు, ఎందరో- వచ్చే దుఃఖపు పోటును ఆపుకోలేక కుస్తీపడుతూ, చివరకు పరాజితు లవుతున్నారు.

ఆయనకు ఆరు నెలలకుపైగా పచ్చకామెర్లు. అంతకుముందు ఎంత కాలంనుంచో మలేరియా. అందుకు ఎంతమంది దగ్గరో ఎన్ని చికిత్సలో పొందాడు. ఏమీ లాభం లేకపోయింది.

ప్రస్తుతం కామెర్ల జబ్బు అతణ్ణి పీల్చివేసింది. వంట్లో రక్త మాంసాలు మిగల్చలేదు. లివర్ పూర్తిగా చెడిపోయింది. ఆహారం నరాలద్వారా తప్ప లోపలకు వెళ్ళడంలేదు. అతనిలో ప్రాణహాని లక్షణాలు రాశీభూతమైనాయి. అతని బ్రతుకుపై ఆశ వదులుకోబడింది.

అమ్మ హాస్పిటల్‌నుండే నెల్లూరు డాక్టరుగారు శ్రీ సుబ్బారావుగారికి ఫోను చేయమన్నది. ఫోనులో ఇనజకుమారి జబ్బునుగురించి వివరిస్తుంటే- అమ్మ ఫోను తీసుకుని- వెంటనే రా నాన్నా, నాకోసం వచ్చినట్లు రా నాన్నా- అని చెప్పింది అమ్మ గొంతులో ధ్వనించిన ఆప్యాయత, అనురాగం, వాత్సల్యం, కారుణ్యం- చాలవూ అతడికి అమృతం పోయడానికి, అతడికి జీవితాన్ని ప్రసాదించడానికి !

అమ్మ తిరిగి రోగివద్దకు వచ్చి- నెల్లూరునుంచి డాక్టరుగారు వస్తున్నారు. ఇక నీకేమీ ఫరవాలేదు ధైర్యంగా ఉండు అన్నది. "నీ దయ చాలు. నీవుండగా

భయమెందుకూ ?" అని గొంతు పెకల్చుకుని అతను పలుకుతుంటే అమ్మ కళ్ళు తుడుచుకుంటూ బయటకు వచ్చింది.

ఆ రాత్రికే నెల్లూరునుంచి డాక్టరుగారు వచ్చారు. మందులు యిచ్చారు. అంతకు ముందు ఏ హాస్పిటల్లోనూ, ఏ డాక్టరూ నిర్ణయించలేని అతి క్లిష్టమై గుప్తమై ఉన్న అతని పొట్టకు సంబంధించిన క్షయవ్యాధి కనుగొనబడింది. అతను వ్యాధి విముక్తుడైనాడు.

శ్రీ వెంకటసుబ్బయ్య పునర్జీవితుడైనాడు.

అమ్మ జీవితం పరిశీలిస్తే.... మరణశయ్యపై ఉన్నవాళ్ళనూ, మరణించిన వాళ్ళనూ కనికరించడం అన్నది సామాన్య విషయమే.

కాని ఇందులో యింకొక గమనించదగ్గ అంశం ఉన్నది. నవమినాడు పూజ లందుకొనటానికి బయలుదేరిన అమ్మ ఆసుపత్రికి వచ్చిన విధానం చూస్తే- గజేంద్రుణ్ణి కాపాడిన కారుణ్యమూర్తి మనసులో మెదలడమేకాక అమ్మలోని అయాచిత అవ్యాజ వాత్సల్యవృష్టి మనల్ని అమ్మ శ్రీచరణాలకు బంధితుల్ని చేస్తుంది.

ప్రస్తుతం శ్రీ వెంకటసుబ్బయ్య ఆవరణలో అటూ యిటూ తిరుగుతుంటే అమ్మ సామర్థ్యపతాకం, కారుణ్యకేతనం గాలికి రెప రెప కొట్టుకుంటూ లోకానికి అందాలు, ఆనందాలు పంచుతున్నట్లుంది.

- నవంబరు 1981

నామ మహిమ

1978 డిసెంబరు 31 వ తేదీ రాత్రి....

ప్రతి సంవత్సరం డిసెంబరు 31 వ తేది రాత్రి సరిగ్గా 12 గంటలకు అమ్మ దర్శనం యిస్తుంది. ఆ దర్శనం చేసుకుని గత సంవత్సరానికి వీడ్కోలు పలికి రాబోయే సంవత్సరానికి స్వాగతం చెప్పటానికి అనేకులు జిల్లెళ్ళమూడి వస్తారు. క్రొత్త సంవత్సరాన్ని ఆనందప్రదంగా చేయమని కాలస్వరూపిణియైన అమ్మను అర్థిస్తారు.

ఆ రోజున వచ్చిన బిడ్డల పూజలు అందుకొని అమ్మ అందరికీ బిస్కట్లు, రస్కులూ, టీ అందజేస్తుంది. అందరూ కలిసి టీ త్రాగుతుంటే వాళ్ళను చూచి అమ్మ తానూ ఆనందపడుతుంది.

ఆ ఉత్సవంకోసం ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయి. వేదిక అలంకృత మయి సోయగాలను విరజిమ్ముతున్నది. పూజాద్రవ్యాలన్నీ వేదికవద్దకు తీసికొని రాబడుతున్నాయి.

గం. 11-45 ని. లయింది. అందరూ అమ్మకోసం ఎదురుచూస్తున్నారు. అమ్మ నామసంకీర్తన చేసేందుకు మైకు అమర్చాలని ఆంగ్లసోదరుడు జేమ్సు ఆ పరికరాలన్నీ సిద్ధంచేశాడు. వాటిని ఒక్కొక్క దానినే కనెక్టు చేస్తున్నాడు. అంతలో దభీమని పడిపోయాడు. ఆదుర్దాగా అందరూ చుట్టూ చూశారు. ఏముంది ? కరెంటు వైర్ అతని చేతిలో మంటలు విరజిమ్ముతున్నది. చేతిలోనుండి దానిని ఎవరు వేరు చేయగలరు ? పొరపాటున అందుకు ఎవరయినా ప్రయత్నిస్తే - వారికీ ఆ షాక్ తగులుతుందిగదా. కొందరు నిశ్చేష్టులైపోతే - మరికొందరు కర్రలతోనూ, పై గుడ్డలతోనూ ఆ మండే వైరును అతనిచేతినుండి తప్పించటానికి సతమతమై పోతున్నారు.

ఆ ప్రయత్నంలో ఎవరూ సఫలీకృతులు కాలేదు.

సరిగ్గా ఆ సమయంలో మచిలీపట్నంనుంచి సోదరులు శ్రీ యార్లగడ్డ ప్రసాద్ వచ్చాడు. అతడు ఎలక్ట్రికల్ యింజనీరు. వెంటనే పరిస్థితిని అర్థంచేసుకుని ఆ వైరుస్త్రు మూలంలో ఏరుఉన్న ప్లగ్‌ను వేరుచేశాడు అతడు చెప్పాడు... జేమ్సుచేతిలో కరెంటువైరు అగ్నిశిఖలను విరజిమ్ముతున్నా అతడు నేలపై పడిపోయాడు కానీ స్పృహను ఏమాత్రం కోల్పోలేదు. పైగా "అమ్మా...అమ్మా...." కాని నామం చేస్తున్నాడట. ముఖంలో భయంగానీ, ఆందోళనగానీ ఛాయామాత్రంగా నయినా కనిపించలేదట. అతని శరీరంలో దాదాపు రెండు నిముషాలు విద్యుత్తు ప్రసారమయిందట. మామూలు పరిస్థితులలో మరెవరయినా అయితే తప్పక మరణించవలసిందే నట.

వైర్ చేతినుంచి విడిపడిన తర్వాత చూస్తే – చెయ్యి కాలి గుంటలుపడ్డది. తర్వాతకూడా అతని మానసికస్థితిలో ఏమాత్రమూ చలనం కలగకపోవడం అత్యంత విశేషం. ఆ దుర్ఘటన జరిగిన సమయంలో అతని మనఃస్థితి ఎట్లా ఉన్నదని అతణ్ణి అడిగితే – అతనికేమాత్రమూ భయంగానీ విచారంగానీ వేయలేదని చెప్పాడు. ఆ సమయంలోకూడా అమ్మనామం మరుపుకు రాకపోవటమే అతని అదృష్టం. జేమ్సు సోదరుడు బుద్ధిమంతుడితో మాట్లాడుతూ " అమ్మ గోపాలన్నయ్యను రక్షించిందీ; బుద్ధిమంతుడన్నయ్యకు ప్రాణదానం చేసిందీ అని అంటుంటే నాకు అర్థమయ్యేదికాదు. ఇవ్వాళ నాకు అనుభవపూర్వకంగా అవగతం అయింది. అమ్మ కరుణామయి .. అమ్మ ప్రాణదాత్రి ... "అని వివరించాడు.

12 గంటలకు అమ్మ చిరునవ్వులు చిందిస్తూ వేదికపైకి వచ్చింది; పూజలూ వేడుకలూ నిర్విఘ్నంగానూ ఆనందంగానూ గడిచిపోయాయి. అందరూ అమ్మ కారుణ్యానికి అంజలి ఘటించారు.

ఇటువంటి సంఘటనే 1968 లో జరిగింది. అది మే 10 వ తేదీ. జిల్లెళ్ళమూడిలో అమ్మ సన్నిధిలో స్థిరపడిపోయిన కుటుంబాలలో శ్రీ పోతుకూచి విద్యాసాగర్‌గారి కుటుంబమొకటి. ఆ కుటుంబంలోని సభ్యులందరూ అమ్మపై ఎనలేని భక్తి విశ్వాసాలు కలవారు. ఎల్లప్పుడు అమ్మనామం చేస్తూ ఉంటారు.

శ్రీ సాగర్‌గారి కుమార్తె కుమారి ఝాన్సీ. ఆ అమ్మాయికి హఠాత్తుగా పెద్దప్రమాదం జరిగింది. తిరిగే మోటారుచక్రంలో ఆ అమ్మాయి జుట్టు ఇరుక్కుంది. ఆ చక్ర భ్రమణవేగానికి చక్రంలో యిరుక్కుపోయిన ఆ అమ్మాయి జుట్టు - తలపై

చక్రాన్నికూడా లాగేసింది. కేవలం దైవలీలలే అనుకోవాలి - హఠాత్తుగా ఎక్కడి నుండో ఎవరో వచ్చి స్విచ్ ఆఫ్ చేశారు; చక్రం ఆగిపోయింది. కాని ఆ అమ్మాయి స్పృహలేని స్థితిలో నెత్తురు మడుగులో పడిపోయింది. వెంటనే కారులో ఝాన్సీని గుంటూరు ఆసుపత్రికి తీసుకువెళుతున్నాము. మా కందరికీ చాలా ఆందోళనగావుంది. ఆ అమ్మాయి బ్రతుకుతుందా - అని సందేహంకూడా ఉంది. కానీ - విచిత్రమేమిటంటే.... స్పృహలేని పరిస్థితిలో కూడా ఆ అమ్మాయి శరీరంలో ప్రతి అణువూ కూడా నామాంకితామైపోయింది. ఇక - సర్వశక్తివంతమయిన ఆ నామం ఆ అమ్మాయిని ఎందుకు రక్షించదూ ?

ఆ స్థితిలో ఆ అమ్మాయిని చూస్తున్న మాకు దుఃఖం వచ్చింది, అంటే ఆ అమ్మాయికి జరిగిన ప్రమాదానికి కాదు. ఆ అమ్మాయి గాఢ భక్తికి. అటువంటి ప్రమాదస్థితిలో కూడా స్పృహలేని స్థితిలోకూడా లయ తప్పకుండా రాగం చెడకుండా నామించేస్తున్నదంటే ఆ శరీరంలో నామం ఎంతగా జీర్ణించుకుని ఉండాలి ?.... ఆ ఆలోచనతో మా కళ్లు అశ్రుపూరిత మయ్యాయి.

తర్వాత వైద్యులు ఊహించనంతగా ఆ అమ్మాయికి ఆ గాయం నయం అయింది. అతి త్వరలో కోలుకున్నది. అప్పుడు ఆ అమ్మాయి బ్రతికినప్పటికీ - ఆ అమ్మాయి మెదడు దెబ్బతినవచ్చునూ, జ్ఞాపకశక్తి నశించవచ్చునూ, లేక బాగా తగ్గిపోవచ్చునూ - అన్నారు వైద్యులు. కానీ అత్యాశ్చర్యకరంగా ఝాన్సీ విద్య నభ్యసించి, జాతీయస్థాయిలో అనేక బహుమతులు గెల్చుకుని, సాహిత్య విద్యాప్రవీణలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై ప్రస్తుతం జిల్లెళ్ళమూడి కళాశాలలోనే అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తూ అమ్మ కారుణ్యానికీ అమ్మ నామమహిమకూ సజీవ తార్కాణంగా నిలిచింది.

కనుకనే కొందరు ఎంతసేపూ అమ్మను చూస్తూ, ఆ మూర్తిలోని అలౌకిక తేజస్సుకు ముగ్ధులవుతూ, అమ్మ మృదు మధుర వాక్కులు వింటూ, ఆ వాక్ వైభవమునకు సమ్మోహితులవుతూ, ఆ వచ సౌందర్యానికి అబ్బురపడుతూ, ఆ సన్నిధిలో అనంతరం అనేక విధాల ప్రకటితమయ్యే దివ్యత్వాన్ని ఆస్వాదిస్తూ కాలంగడప ఉవ్విళ్ళూరుతుంటే - కొందరు నిరంతరం నామం సంకీర్తన చేస్తూ తన్మయత్వం చెందుతారు. అమ్మనామ మధువును త్రాగుతూ పరవశిస్తారు. క్రమేణా నామమంత్రం వారి శరీరంలో అణువణువునా, రోమరోమానా జీర్ణమైపోతుంది. అపుడు అమ్మ

వారివెంట వుండడం కాక వారిలోనే అమ్మ ఉన్న అలౌకిక అనుభూతి వారికి కలిగి వారి జీవితాన్నే మధురమం చేస్తుంది. ఆ నామశక్తి వారిలో ఎల్లప్పుడూ ఒక దివ్య ప్రభవలే జ్వలిస్తూ వారిని నిరంతరం రక్షిస్తూ ఉంటుంది. వారు పాడుతూ ఉంటే అది కాపాడుతూ ఉంటుంది.

అట్లా నామాన్ని జీర్ణం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్న వాళ్ళలో సోదరుడు జేమ్సు ముఖ్యుడు. అతడికి అదే సాధన; అదే తపస్సు. కనుకనే అంత విద్యుత్తు శరీరంలో అంతకాలం అప్రతిహతంగా ప్రవహించినప్పటికి అతడు స్పృహ కోల్పోకపోవడమే కాక మనోస్థైర్యాన్ని కూడా ఏ మాత్రమూ కోల్పోలేదు.

అతడు నామాన్ని వదలలేదు. నామం అతడిని వదల్లేదు.

నామంలో ఎంతో మాధుర్యం ఉంది. ఎంతో మహిమ ఉంది. అనంత మైన శక్తి ఉంది. అపరిమితమయిన ప్రభావం ఉంది. మనస్సుకు శాంతి లభిస్తుంది. మనస్సును ఆనందంతో నింపుతుంది.

మనం కోరినప్పుడల్లా మూర్తి తనకు అందుబాటులో లేకపోవచ్చును. కానీ నిజంగా అమ్మ చెప్పినట్లు అడ్డులేనిది నామమే.

"జయహో మాతా శ్రీ అనసూయా
రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి...."

—జనవరి 1979

పరమదయాళువు

1973 జూన్ 17 వ తేదీ ఉదయం అన్నపూర్ణాలయమంతా సందడిగా ఉన్నది. గాడిపొయ్యి మహోత్సాహంగా మండుతున్నది. పాకశాసనులు పరుగులు తీస్తున్నారు. అన్నం రాసులుపడుతూ వేడిపొగలు కక్కుతూన్నది. దద్ధ్యోదనం సువాసన లీను తున్నది. ఆవరణలోని సోదరీసోదరు లందరూ ఆ అన్నపురాసిని అతి వేగంతో అత్యంత సామర్ధ్యంతో ప్యాకెట్లలో యిముడుస్తున్నారు.

ఈ కార్యక్రమం అంతా అమ్మ స్వయంగా దగ్గరుండి జరిపిస్తున్నది. అమ్మ కన్నుల్లోని కరుణామయ దృక్కులూ, పెదవులపైని దరహాసరోచిస్సులూ పోటీ పడుతున్నాయి.

"అమ్మా-" అమ్మకు ఎదురుగా వచ్చి సాగిలపడి ఒక సోదరుడు పిలిచాడు. అమ్మ ప్రసన్నయై అతనిని చూచింది.

"నా కేదయినా సందేశం ప్రసాదించమ్మా-" అతను వినమ్రుడై అంజలి ఘటించి అర్థించాడు.

అమ్మ మౌనంగా అతనిని చూస్తున్నది.

అతను మళ్ళీ ప్రాధేయపడ్డాడు.

అమ్మ చిరునవ్వుతో "నీవూ వారితో కలిసి పనిజెయ్యి–" అని అన్నపు ప్యాకెట్లు కట్టేవారిని చూపింది.

జూన్ 14, 15 తేదీల్లో బాపట్లలో దారుణమయిన అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు 600 కుటుంబాల ప్రజలు యిళ్ళూ వాకిళ్ళూ, అగ్నిదేవునికి అర్పించుకుని నిర్వాసులై వీధుల పాలయినారు.

ఆ దుస్సంఘటన విని అమ్మ వెంటనే వారికి ఆహార సదుపాయం కలుగ జేయమని శ్రీ విశ్వజననీ పరిషత్‌ను ఆదేశించింది.

పరిషత్ తత్ ప్రజాహిత కార్యక్రమాన్ని ఆనందంగా స్వీకరించింది. బాధితులందరూ పదిమైళ్ళ దూరాన ఉన్నందున అన్నం జిల్లెళ్ళమూడినుండి పొట్లాలలో రెండు రోజులు వారి వారి యిండ్లకు అందజేయటానికి నిశ్చయింపబడింది.

ఆ కార్యక్రమమే అప్పుడు సాగుతున్నది. అది ఆపదలోనున్న తమ సహోదరులను అనురాగమయులైన మరికొందరు అనుజులు ఆదుకునే సత్కార్యం. అది విపద్వాహినిలో పడి వెర్రికేకలు పెడుతున్న ఆర్తసోదరులకు తమ సహకార హస్తాన్ని అందించే కరుణామయ సంఘటన. అది హఠాత్తుగా వ్యాపించిన గాఢ తమస్సులో దీపారాధన జరిపే పవిత్రక్రియ. అది దావాగ్నికీలలలో దగ్ధమవుతున్న జీవరాశికి నవజీవనప్రద అతిశీతల అమృత కరస్పర్శ!

అమ్మ ఆ కార్యక్రమంలో ఆ సోదరుని పాల్గొనమని సూచించింది. అతనికి అర్థం కాలేదు. మరి, అతను అడిగింది సందేశం కదా. అతనికి అందులో దాగి ఉన్న సూచనా, సందేశమూ బోధపడలేదు. అనుకనే అతను ఒకసారి అమ్మ పాదాలవంకా, మరొకసారి అమ్మ పెదవులవైపూ చూస్తూ ఉండిపోయాడు

అప్పుడు అమ్మ వివరించింది – "వాళ్ళు అక్కడ ఆకలితో ఎదురుచూస్తూ ఉంటారు; నలుగురూ కలిసి త్వరగా వారికి అన్నం అందించండి..." అని. అమ్మ

ఆ మాటలు పలికేటప్పుడు కంఠంలో గాద్గద్యం స్ఫురించింది. ప్రేమా, సానుభూతీ తొణికిసలాడాయి.

అమ్మ సామాన్యంగా పాపం, పుణ్యం లేవంటుంది; కష్టం సుఖం అన్నీ వాడిచ్చినవే నంటుంది. కానీ అమ్మకు పాపులయెడ సానుభూతి మెండు; పతితుల యెడ కరుణ జాస్తి; కష్టంలో నున్న వారియెడ కనికరం మిక్కుటం; దుఃఖితులయెడ ప్రేమ అధికం.

లేవలేని కుక్కను చూస్తే అమ్మ తానే పరుగెత్తుతుంది. అప్పుముందు మేత కనుపించకపోతే మేత వేసేంతవరకూ ఎవరినీ ఎదురుగా కనుపించనివ్వదు. ఆకలితో నున్నవారిని అన్నం తినేంతవరకూ వెంటబడుతుంది. ఎవరే విషాద గాథను విన్నవించుకున్నా అమ్మ హృదయం విచారసాగరమే అవుతుంది.

అమ్మ పరమదయాళువు.

మానవి - మాధవి

అమ్మలో ఒకే మనిషికి ఒక క్షణంలో సర్వశక్తిమంతమయిన మాధవత్వమూ సాక్షాత్కరిస్తుందీ, మరోక్షణంలో సామాన్యమయిన మానవత్వమూ గోచరిస్తుంది. ఒకే సమయంలోనే ఒకరికి అపరిమితత్వం స్ఫురించడమూ మరొకరికి పరిమితత్వమే కనుపించడమూ కద్దు అమ్మలోని యీ విలక్షణం మనకు అగ్రాహ్యమే అయినప్పటికీ అది అమ్మయెడల మన విశ్వాసానికి దోహదకారియే అవుతున్నది.

అమ్మలో మనం ఏమయినా అసాధారణతను చూచి అమ్మ సమక్షంలో ఆ ప్రస్తావన తీసుకువస్తే "నాకేమీ తెలీదు నాన్నా, నేనూ మీవంటి దానినే" అంటుంది. కాని మళ్ళీ ఒక క్షణంలో "నేను యీ మంచంమీద కూర్చున్నాననుకుంటున్నారేమో, అమ్మ అంటే అంతటా ఉన్నది" అనీ... "నాకు యీ గోడలు అడ్డు అనుకుంటున్నారేమో నేను అంతటా చూడగలను" అనీ .... "నీవు ఎక్కడ ఉన్నా నేను నీ వెంటనే ఉంటాను" అనీ ... "అయితే అక్కడ నేను లేనంటావా?" అనీ...ఆ యా సందర్భాల ననుసరించి వివరిస్తూ అమ్మ తన సర్వాంతర్యామిత్వాన్ని ప్రకటిస్తూనే ఉన్నది.

మాటలలో ప్రకటించటమే కాదు, అందుకు అనేకమయిన నిదర్శనాలు కూడా అమ్మ మనకు ప్రసాదించింది. అయితే అమ్మ సర్వవ్యాపకత్వానికి నిరూపణలు బహువిధాలుగా ప్రసారం చేస్తుంది. కొందరికి ప్రేరణ రూపేణా, కొందరికి స్ఫురణగా, కొందరికి లీలగా, కొందరికి స్వప్నం, కొందరికి ధ్యానంలో.

కాని కొందరు అదృష్టవంతులకు అమ్మ రక్త మాంసాలతో భౌతిక రూపంలో జిల్లెళ్ళమూడికి వందలమైళ్ళ దూరంలో దర్శనమొసగి అనుగ్రహించిన సంఘటన లున్నాయి.

ఈ నెల 5 వ తేదీన తమిళనాడులోని పిచ్చనూర్‌నుండి ఒక సోదరుడు బి. ఏ. చంద్రన్ వచ్చాడు. ఆయనకు తిరుపతిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో అమ్మ కనుపించి ప్రసాదం యిచ్చింది ఆయన అమ్మను అంతకుపూర్వం ఎప్పుడూ చూచి ఉండలేదు. జిల్లెళ్ళమూడి పేరయినా వినివుండలేదు. అందువలన ఆయనకు అప్పటికి ఆ ఉదంతంతో వైచిత్రిగానీ, వైశిష్ట్యంగానీ స్ఫురించలేదు.

తరువాత ఆయన వ్యాపారరీత్యా మంగళగిరి వెళ్ళాడు. అక్కడ తన మిత్రుని గృహంలో అమ్మఫొటో చూచి విచారణ చేశాడు. వారు అమ్మను గురించి వివరించారు. ఆయన వెంటనే జిల్లెళ్ళమూడికి పరుగెత్తుకు వచ్చాడు. అక్కడ విచారిస్తే అమ్మ ఎప్పుడూ తిరుపతి వెళ్ళలేదని తెలిసింది. ఆయన ఆశ్చర్యానికి మేరలేదు. స్థానిక సోదరులు అమ్మను "అమ్మా – నీవు ఆయనకు ఏమి ప్రసాదం యిచ్చావు?" అని అడిగితే – "నాదగ్గర ఏముంటుందీ ఎవరికయినా యివ్వటానికి ? షుగరే యిచ్చి ఉంటాను" అన్నది నవ్వుతూ. వారు వెళ్ళి ఆ సోదరుని విచారిస్తే ఆయన "అమ్మ పంచదార పెట్టింది" అన్నాడు.

అక్కడ ఉన్న అందరూ ఆ సంఘటనకు ఆశ్చర్యపడేకంటే అమ్మ అతనియందు చూపిన అవ్యాజకరుణకు ఆనందించారు.

ఇటీవల సెప్టెంబరులో ఒకనాడు వరంగల్‌లో ఒక సోదరుడు ఆర్థిక బాధలతో ఉండగా వారింటికి అమ్మ వెళ్ళి ఆయన భార్యకు రూ. 116/– లు

ప్రసాదించింది. ఆ పైకాన్ని వారు యిప్పటికీ పూజామందిరంలో భద్రపరుచుకుని నిత్యార్చన చేసుకుంటున్నారట.

ఆ సోదరుడు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మను అడిగితే "ఇక్కడ డబ్బు ఎక్కువై నీకు యిచ్చానంటావా ? ఇక్కడ వీళ్ళు డబ్బుకోసం యింత యాతన పడుతుంటే ఏమీ చేయలేక చూస్తూ ఉన్నాను. నేనేమయినా యివ్వగలిగితే వీళ్ళకూ యిచ్చేదానినే కదా" అన్నది.

అమ్మలోని యీ మాయచేసే ధోరణే, యీ తెరలువేసే ప్రకృతియే, యీ మేలిముసుగే మనలను ఆడిస్తూ మనతో ఆడుకుంటున్నది.

కొందరికి అమ్మలోని యీ ద్వైధీవిధానం విడ్డూరంగా కనిపించవచ్చును గానీ అమ్మలోని ప్రత్యేకతయే అది. అందులకే కరుణామయి అయిన అమ్మ మనం శాశ్వతంగా పొరబడకుండా ఉండేందుకే "మరుగే నా విధానం" అని సుస్పష్టంగా ప్రకటించింది.

— నవంబరు 1971

పర్వతానురాగం

1970 జనవరి 11వ తేదీ మధ్యాహ్నం గరికపాడునుంచి వచ్చిన ఒక సోదరునితో అమ్మ భాషిస్తూ ఉన్నది- కొద్ది రోజుల క్రితమే జరిగిన అతని సోదరుని దుర్మరణం గురించి.

ఇంకా నయం, అట్లా జరగకుంటే శవంకూడా దొరక్కుండా సముద్రం పాలయ్యేది- అన్నాడతడు. ఆ పలుకుల్లో అతని హృదయాక్రోశం ధ్వనించింది. అందుకు కారణం- అతని అనుంగు సోదరుడు, భావిలో ఎంతో అభివృద్ధిలోకి రావలసినవాడు అట్లా అకాలమృత్యువు పాలపడటమే.

అది ద్వంద్వావస్థలోనున్న ఒక సామాన్య వ్యక్తికి సహజమే కావచ్చును. కాని సర్వజ్ఞ అయిన, సర్వ సృష్టి స్థితి లయకారిణి అయిన అమ్మ కనులలోసైతమూ అశ్రువులు కనుపించటం ఆశ్చర్యకరమే!

అది విషాద ఘటనా? ఆ విషాదాగ్ని వేడిమికి అమ్మ నవనీత హృదయం కరిగిందా? అమ్మకు ఆ విషయం అప్పుడే తెలిసిందా? ఆ ఘటనకు వెనుక అమ్మ చెయ్యి లేదా?

ఇంకొక విధంగా అమ్మను భావించడానికి మన విశ్వాసమూ, పూజ్యభావమూ అంగీకరించక పోవచ్చును, అది సత్యం కాకపోవచ్చును. కాని అమ్మ కనుకొలకుల్లో నీరు చేరటం మాత్రం వాస్తవం. అందుకనే తరువాత అమ్మను అడిగాము- ఏమిటమ్మా- నీవూ- అని.

అప్పుడు అమ్మ అన్నది- వాడు పోయాడని కాదురా ఆ సంఘటన చెప్పేటప్పుడు వీడు అనుభవించిన వ్యథ నన్ను కదిలించింది- అని.

ఆ సానుభూతియే, ఆ ఆదరమే, ఆ అనుబంధమే మనము అమ్మకు సన్నిహితులను చేస్తుంది. మన కష్టసమయంలో లాలనతో అమ్మ పలికే ఒక్క- అనునయ వాక్యమో, అనురాగపూర్ణమయిన క్రియో- మనం ఆర్తితో అమ్మ ఒడిలో వాలిపోయి భోరున ఏడిచేలా చేస్తుంది. అమ్మ తనకు ఏమీ తెలీనట్లు మన కష్టాలను గురించి ప్రశ్నిస్తుంది. మనం ఆ కడగళ్ళనుండి ఎట్లా విముక్తి పొందుతామోనని తానూ మనలో ఒకరై ఉపాయాలు అన్వేషిస్తుంది. అమ్మ మనతోపాటే మనవలే మనకోసం దుఃఖిస్తుంది. ఒక్కొక్కసారి ఆ కన్నీరు కట్టలు తెగిన వాహినియై ప్రవహించటమూ ఎఱుగుదుము.

ఈ సామాన్య లక్షణమే, యీ మానవ దౌర్బల్యమే- యీ లోకపు కష్టాల సుడిగుండంలో చిక్కిన మనలో, బాధల ఎడారిలో వడగాడ్పుల దెబ్బతిన్న మనలో- చల్లని మాటతో, చల్లని చూపుతో సేదతీర్చి ఆదరించి, మనస్సుకు శాంతినీ, జీవితానికి మార్గప్రబోధాన్నీ ప్రసాదించే అమ్మపై ప్రేమను అంకురింపజేసి మనలను అమ్మ వైపుకు ఆకర్షించుకుని అమ్మకు మనలను అత్యంత సన్నిహితులను చేసి చివరకు అమ్మలో విలీనం అయిపోవాలనే కాంక్షదాక తీసుకువెళ్ళుతుంది.

ఇటువంటి బలవత్తరమయిన అనుబంధమో, అనురాగమో మనకు మన జీవితంలో ఒకరితోనో యిద్దరితోనో ఉంటుంది. అమ్మకు తన సన్నిధికి వచ్చే అసంఖ్యాకులలో ప్రతి ఒక్కరితోనూ ఉంటుంది.

మనలో పరిమితంగా ఉండే యీ మమతానుబంధమే అమ్మలో అపరిమితమై సర్వసృష్టికీ పరివ్యాప్తమైంది. అమ్మలో సర్వప్రకృతిపై సర్వవేళలా సానుభూతి వెల్లివిరుస్తూ ఉంటుంది.

మరి- ఏ విషయంలోనయినా పరిమితులు లేకపోవటమే దైవత్వం!
- అందుకే అమ్మను జగజ్జననిగా కొలుచుకుంటున్నాము.

—జనవరి 1970

తెర

1970 అక్టోబరు 18 వ తేదీ సాయంకాలం కొందరం అమ్మ పదపంకేరుహ సౌరభాల నాఘ్రాణిస్తూ ఉపవిష్టులమై ఉన్నాము.

అంతలో తిరువూరునుండి వచ్చిన సోదరు లొకరు వారి అనుభవ అనుభూతులను వివరించి వారి సందేహాలను విన్నవించి అమ్మ ఏ అవతారమో స్పష్టపరచి భక్తులకు సందేశం ప్రసాదించమని అమ్మను వేడుకున్నారు.

అమ్మ తనకు భక్తులు ఎవ్వరూ లేరనీ అంతా బిడ్డలు మాత్రమేననీ పునరుద్ఘాటిస్తూ తాను ఏ దేవత అవతారమూ కాదని తాను అమ్మను మాత్రమేనని ప్రకటించింది.

వెంటనే మేము అడిగాము —

అమ్మా- నీవు ఏ దేవత అవతారమూ కాకపోతే ఎందరికో వివిధ దేవతా మూర్తులతో దర్శనమిస్తున్నావు కదా. వారు చూస్తే నీవు కనపడటం కాదు. నీవు కనుపిస్తేనే వారు చూస్తారాయె- మరి- దానిలోని అంతర్యమేమిటి ? అని.

మరి- అమ్మ తన బాల్యంనుండీ ఎందరికో వివిధరీతుల దర్శనం ప్రసాదించింది. లక్ష్మణాచార్యులుగారికి బాలాత్రిపురసుందరిగా, ప్రఖ్యాసుబ్బయ్యగారికి లలితగా, మూల్పూరి సుబ్రమణ్యశాస్త్రిగారికి పార్వతిగా, లక్ష్మీకాంత యోగిగారికి గాయత్రిగా, కాశీకృష్ణాచార్యులుగారికి రాజరాజేశ్వరిగా, మన్నవ రామబ్రహ్మంగారికి సీతగా, యేర్లగడ్డ రామయ్యగారికి దుర్గగా, ప్రసాదరాయకులపతిగారికి చండచండికగా, మన్నవ బుచ్చిరాజుగారికి భూదేవిగా, విద్యాసాగర్‌గారికి శ్రీదేవిగా, భవానీప్రసాద్ గారికి సరస్వతిగా వివిధ దేవ్యవతారాలతో సాక్షాత్కరించటమే కాక గంగరాజు పున్నయ్యగారికి మురళీధరుడుగా, గుండేలురావుగారికి కోదండరాముడుగా, తురుమెళ్ళ వెంకటప్పయ్యగారికి సత్యనారాయణస్వామిగా, ముద్దన రామయ్యగారికి వెంకటేశ్వర స్వామిగా.... మరెందరికో మరెన్ని దైవస్వరూపాలుగానో అమ్మ ప్రత్యక్షమయింది.

"నేనూ మీలాంటి మనిషినే" అని "నేను అమ్మను మాత్రమే" నని అమ్మ మాటల్లో వినిపింపజేసినా అమ్మ చేసే ప్రతి క్రియలో అమ్మ ప్రసాదించే ప్రతి దర్శనంలో అసాధారణత, అసామాన్యతలతో కూడిన దైవత్వమే ప్రస్ఫుట మవుతుంది.

నిత్యమూ అసంఖ్యాకులు అమ్మను అర్చించుకుంటున్నప్పటికీ దేవీనవరాత్ర ఉత్సవాలలో అమ్మకు జరిగే పూజలు బహుధా విశేషంగా ఉంటాయి. ఆప్తమిత్రునివలే ఆత్మబంధువువలే ఎంతో ప్రసన్నంగా ఎంతో సన్నిహితంగా మనతో మనలో మెసలే అమ్మ గంభీర వదనయై ఉన్నతాసీనయై దుర్గమయై దుర్లభయై విరాజిల్లుతుంది. ఆ సమయంలో నిరంతరం ఆ బింబాధరాలపై లాస్యం సలిపే కమనీయ దరహాసం కనుపించదు. ఆ కందోయినుండి వెల్లివిరిసే శరశ్చంద్రికలు దృగ్గోచరంకావు ఆ వచస్సులో వినిపించే అనురాగం ద్యోతితం కాదు. ఆ కరస్పర్శలో లాలన స్ఫురించదు.

ఆ దరహాసంలో దర్పమూ ప్రతిఫలిస్తుంది. ఆ శరశ్చంద్రికలో భాను కిరణమూ ప్రతిబింబిస్తుంది. ఆ అనురాగంలో అధికారమూ ప్రతిధ్వనిస్తుంది. ఆ కరచాలనంలో అప్రతిహతమైన పాలనా తాండవిస్తుంది. ప్రతి అవయవంలోనూ భాసించే మధుర మాతృత్వ స్థానంలో మహిత దైవత్వం జాజ్వల్యమానమై ప్రకాశి స్తుంది. ఆ దీప్తిముందు ప్రతి శిరస్సూ అవనతమవుతుంది. ఆ మూర్తిమోల ప్రతి కరయుగళీ ముకుళిత మవుతుంది.

ఈ సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రతిసంవత్సరంకంటే అతి వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో అష్టమినాటి రేయి జరిగిన పూజ ప్రత్యేకస్థాయి నందుకున్నది. ఆనాడు అమ్మ రక్తవర్ణ దుకూలధారిణియై కిరీట సంశోభితయై త్రిశూల చక్ర హస్తయై ప్రసాదించిన దర్శనం అపూర్వమూ నిరుపమానమూ అయినది. ఆ రాత్రి స్వామి పూర్ణానంద సశిష్యులై అమ్మను అర్చించుకున్నారు.

పూజ జరుగుతున్నది. రత్నఖచితమయిన కిరీటం అమ్మ శిరస్సును అలంకరించగా కరయుగళి త్రిశూలమూ చక్రమూ అందుకొనగా అమ్మ దర్శనం ఆహ్లాదకరమే కాదు, దుర్నిరీక్ష్యమూ అయినది. క్షణాల్లో అమ్మ రూపంలోనే పరిణామం గోచరించింది. నయనద్వయంలో సంధ్యారుణదీప్తి వ్యాప్తమయింది. వదన మండలంలో గులాబీ గుత్తులు విరిశాయి. కరయుగళిలోని త్రిశూలమూ చక్రమూ వివిధరీతుల తాండవం చేశాయి. పరివేష్టిత ప్రజాసందోహం భయ భ్రాంతి చకిత మయింది. అంతలో స్వామీజీచే అందాకా అర్చింపబడిన కలశాన్ని త్రిశూలపు మొనతో అమ్మ చివాలున పైకియెత్తింది. ఆ కలశం జలప్రపూర్ణమైవున్నా ఆ కలశాన్ని తలక్రిందులుగా పైకియెత్తినా అందులోని ఒక్క నీటిబిందువూ క్రిందపడకపోవటం అత్యాశ్చర్యకరమయినా.... అప్పటి అమ్మ మూర్తి, అమ్మ చేతిలోని త్రిశూలమూ, ఆ త్రిశూలపు చివరన ఊగే కపాలం పోలిన కలశమూ అవలోకించిన ప్రజలు భయ కంపితులవుతుండగా అమ్మ ఒక్క మెరుపు మెరిపినట్లు లేచి నిలుచున్నది. సామా న్యంగా వామనమూర్తివలే పరిధవిల్లే అమ్మ క్షణంలో గగన పరిచుంబితగా ప్రవృద్ధ మైందా అనిపించింది. అందాకా దుర్గవలే దుర్నిరీక్ష్య అయిన అమ్మ వైకుంఠపురీ నివాసుడయిన సాక్షాత్ శ్రీమన్నారాయణునివలె ప్రత్యక్షమయింది. ఆ ముహూర్తంలో ఆ పందిరిలో ఆనందమో, ఆశ్చర్యమో, భయమో– ఆ మూడు ముప్పిరిగొన్న మరి యే భావమో సర్వవ్యాప్తంకాగా ప్రజలు స్థాణువులే అయినారు.

ఆ ఉత్సవాలూ అప్పటి అమ్మ రూప వైభవమూ స్ఫురణకువచ్చి అమ్మ లోని మానవతా మాధవత్వాల స్వర్ణ వారధిని స్మరిస్తూ అమ్మతో ప్రసంగం చేస్తూ ఉండగా స్వామీ పూర్ణానంద గదిలోకివచ్చి ఆసీనులయినారు.

వెంటనే సోదరులు దుర్గాప్రసాదరావుగారు అమ్మను గురించిన వారి అభి ప్రాయాన్ని అర్థించారు. "అమ్మ" అనటంలోనే సర్వదేవతలకూ ఆధారమయినదన్న భావం ఉన్నదిగదా అన్నారు స్వామీజీ. "Please clear whether Amma is

Mother or Father" అని మళ్ళీ అడిగారు ప్రసాదరావుగారు. వెంటనే స్వామీజీ "Mother of Father" అన్నారు. ఆ సమాధానం మమ్మల్ని సమ్మోహితులను చేసింది. కాని దుర్గాప్రసాదరావుగారు "Father of Mother కూడానా !" అని అడిగారు. "No. Mother of all. Mother means Origin of everything" అన్నారు స్వామీజీ.

అమ్మ – అన్నిటికీ అంతకూ ఆధారభూతమయిన పరబ్రహ్మ మయివుండీ అమ్మ అనే ఈ మేలిముసుగు ఎందుకో ?

మనలను మాయామోహితులను చేసేందుకా ? మన చక్షువులకు తెరలు వేసేందుకా ? మనలను పరీక్షించేందుకా ?

అనుకుంటూ అడిగాము –

అమ్మా, నీవు దైవానివని పరోక్షంగానూ, అపరోక్షంగానూకూడా విశద పరుస్తూ యింకా అమ్మ అనే తెర ఎందుకమ్మా – అని.

"మనం నిర్భయంగా ఆ ఒడిలో చేరటానికేమో. అమ్మ దైవంగానే కనుపిస్తే మనం దరిజేరగలమా ? దైవం అమ్మగా కనుపిస్తున్నాడు కనుకనే మన యీ ఆటలూ పాటలూ..." అన్నారు ప్రసాదరావుగారు నవ్వుతూ నయనయుగళి అశ్రుపూర్ణంకాగా.

నిర్ధారణకోసం అమ్మవంక చూచాము మేము. సమాధానంగా అమ్మ కన్నుల్లో పెదవులపై దరహాసద్యుతులతో కూడిన వాత్సల్యజ్యోత్స్నలు వెల్లివిరుస్తూ కనుపించాయి.

మనం ఏమంటే కాదంటుంది అమ్మ ?

— అక్టోబరు 1970

అందరికీ అమ్మ

"అమ్మా – మీ కోడలును తీసుకువచ్చానమ్మా చూడు – నీకు నచ్చిందా?" అని అడిగాడు మురళి అమ్మకు నమస్కారం చేస్తూ 1977 జూలై 6 వ తేదీన.

మురళి ఎంతోకాలం నుంచి అమ్మవద్దకు వస్తున్న భక్తుడు. అతడంటే అమ్మకు ఎంతో ప్రేమ. అతడు యిటీవలనే పెండ్లి చేసుకోబోతూ, పెండ్లికి అమ్మను ఆహ్వానించాడు. పెండ్లికి రావటం తనకు సంతోషమేనని చెబుతూ – రాలేని తన అనారోగ్య స్థితిని వ్యక్తం చేస్తూ – పెండ్లి చేసుకుని వధూవరులిద్దరూ జిల్లెళ్ళమూడి వచ్చి కనిపించి వెళితే తనకు ఆనందముగా ఉంటుందని సూచించింది అమ్మ.

మామూలుగానే పెండ్లిండ్ల రోజులలో అనేక నూతన వధూవరులు అమ్మ వద్దకు వచ్చి ఆశీస్సులు పొందుతారు. కొందరు పెండ్లికి ముందువచ్చి అమ్మకు పూజ చేసుకుని అమ్మచేత పెండ్లికూతురునూ, పెండ్లికొడుకునూ చేయించుకుంటారు. కొందరు పెండ్లి అయిన తరువాత వచ్చి దంపతులిద్దరూ కలిసి పూజ చేసుకుంటారు. ఎలాగయినా పార్వతీదేవి అవతారమైన అమ్మను అర్చించుకుని తమ కాపురం సుఖప్రదం కావాలని కోరుకుంటారు అందరూ.

ఇక, అమ్మయే రమ్మని కోరితే ఎవరు రాకుండా ఉండగలరు? పెండ్లి చేసుకున్న మురళీ దంపతులు అమ్మవద్దకు వచ్చారు. పెండ్లికూతురు అదే మొదటిసారి అమ్మను చూడటం అయినందున అమ్మ వదన మండలంలో ప్రకాశించే ఉజ్జ్వల దీప్తిని కన్నార్పకుండా చూస్తున్నది. అమ్మకూడా – తప్పిపోయిన తన బిడ్డ ఎన్నేళ్ళ తర్వాతనో తనవద్దకు వచ్చినట్లుగా ఆప్యాయంగా చూస్తున్నది.

తనమాట అమ్మ వినలేదు - అనుకుని మురళి మళ్ళీ అన్నాడు "అమ్మా మీ కోడలును తీసుకువచ్చాను" అని. అమ్మ ఆ పెండ్లి కూతురుని ప్రేమగా తన దగ్గరకు తీసుకుంటూ "ఇది కోడలు కాదురా - నా కూతురే" అన్నది. అదే అమ్మ సాన్నిధ్యంలో అతివిచిత్రమైన విషయం: తండ్రి కొడుకూ అమ్మదగ్గరకు వస్తే - అమ్మకు తండ్రీ కొడుకే, కొడుకూ కొడుకే. తాతా, మనవడు వస్తే - అమ్మకు ఆ తాతా కొడుకే, ఆ మనవడూ కొడుకే. అత్తా, కోడలు వస్తే-అమ్మకు అత్తా కూతురే, కోడలూ కూతురే. భార్యాభర్తలు వస్తే - అమ్మకు భర్త కొడుకూ, భార్య కూతురూ, అమ్మను అందరూ "అమ్మా" అనే పిలుస్తారు.

ఇంకా విచిత్ర విషయం ఏమిటంటే - యితరుల విషయంలో సరే తన బంధువుల సంగతిలోనూ అంతే. అమ్మను బంధువులందరూ 'అమ్మా' అనే పిలుస్తారు. తన తండ్రి "అమ్మా" అనే పిలిచేవాడు. ఇపుడు పినతల్లి "అమ్మా" అనే పిలుస్తుంది. ఇతర సన్నిహిత బంధువులందరూ "అమ్మా" అనే పిలుస్తారు. అత్తగారూ "అమ్మా" అనే పిలిచేది. అమ్మ పెద్ద కుమారుడు సుబ్బారావు పెండ్లి అయినప్పుడు కోడలుకూడా "అమ్మా" అనే పిలవటం మొదలుపెట్టింది. అనేకులు ఆ అమ్మాయి చేత "అత్తయ్యా" అని పిలిపించాలని ప్రయత్నించారు. కాని ఆ అమ్మాయిససేమిరా అంగీకరించలేదు. ఇపుడు కోడళ్ళిద్దరూ "అమ్మా" అనే పిలుస్తారు. అందుకనే అమ్మ అన్నది. "నాకు ఎవరిని చూసినా - నా బిడ్డే అనిపిస్తుంది" అని. కనుకనే అమ్మను చూచిన ప్రతివారికీ—అమ్మ తమ అమ్మే అనిపిస్తుంది. భావనలో, ఆప్యాయతల్లోనేకాక ఎందరికో అమ్మ రూపురేఖల్లోకూడా తమ అమ్మనే తలంపింప జేస్తూ ఉంటుంది.

ఇపుడు నాన్నగారు మినహా అందరూ అమ్మను "అమ్మా" అనే పిలుస్తారు. కాని అమ్మ ఒకసారి "పతివ్రత" ను వివరిస్తూ, "పంచభూతాలనూ జయించినదే పతివ్రత" అని నిర్వచిస్తూ, "భర్తచేతకూడా "అమ్మా" అని పిలిపించుకున్నప్పుడే ఆ స్థితికి పరాకాష్ఠ" అని ప్రవచించింది.

— జూలై 1977

మూగ జీవాలు

లోగడ యీ ఊళ్ళో ఖగ్గా ముసలయ్య అని ఒకాయన ఉండేవాడు. ఆ రోజుల్లోనే ఒక ఆంబోతు ఉండేది. దానిని ఆయన చాలా ప్రేమగా చూసుకొనేవాడు. అదికూడా ఆయనను అధికంగా ప్రేమించింది.

ఒక రోజున ఆ ఎద్దు వాగుదాటి ప్రక్కనే ఉన్న పూండ్ల గ్రామం వెళ్ళింది. అక్కడ ఎవరి దొడ్లోనో ఉన్న వామిలో గడ్డి మేసిందట. అందువల్ల ఆ రైతుకు కోపం వచ్చి విపరీతంగా కొట్టాడు. మెడంతా బాగా వాచింది. నల్లబడి పోయింది. నోటివెంట చొంగ కారుతున్నది. ఎద్దు ప్రాణావసాన దశకు వచ్చింది. వారు అప్పుడు దానిని వదిలేశారు.

అది నడవలేక నడుస్తూ రొప్పుతూ రోజుతూ చేలుదాటి వాగులుదాటి ఎలాగో జిల్లెళ్ళమూడి చేరింది. ముసలయ్యగారింటికి వెళ్ళింది. అక్కడ ఆయన ఎక్కువగా వుండే వారి నారింజతోటకు వెళ్ళింది.

అక్కడ ఆయన మరోవైపు తిరిగి తాళ్ళు పేనుకుంటూ కూర్చున్నాడు. ఎద్దు వెనుకగా వెళ్ళి అయన భుజంపై తల అన్చింది. అది ఆ ఎద్దుకు అలవాటే. ఆయన వెనుదిరగకుండానే చేత్తో దాని ముట్టె నిమిరాడు. చేతికి తడి తగిలింది. బరువైన శ్వాస చెవికి తగిలింది. అర్థంగాక వెనుదిరిగాడు.

దాని దారుణమైన ప్రమాదకరమైన పరిస్థితి అర్థమైంది. అతనికి దుఃఖము ఆగక దాని మూపురం కౌగిలించుకుని కన్నీరు కార్చాడు. ఆ ప్రమిత్రుని చూచిన దానివలె—అప్పటిదాకా దాగిన ఆగిన కన్నీళ్ళు ఆ ఎద్దు రెండు కన్నులా జలజలా రాలేయి.

కొన్ని క్షణాలు ఏమి చేయాలో తెలియక అయోమయమై పోయినప్పటికీ- వెంటనే ఆయన తెప్పరిల్లి బండి కట్టించి అతి కష్టంపై దానిని ఆ బండిపై పడుకోబెట్టి యింటికి తీసుకువచ్చాడు.

ఎన్నో చికిత్సలు చేయించాడు. కానీ ఫలితం లేకపోయింది. ఆ మర్నాడే అది అసువుల వీడింది – అని చెబుతుంటే అమ్మ కంఠం రుద్ధమైంది. కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి.

అమ్మ మళ్ళీ అన్నది "యీ సంఘటనబట్టి మనకు ఏమి అర్థమవుతుంది ? ఆ ఎద్దుకు ఎంతో ఆలోచన ఉన్నదని తెలియడంలేదా ? దానికీ ప్రేమ ఉన్నదని అర్థంగావడంలేదా ?"

అక్కడ కూర్చున్న మేమందరమూ ఆలోచనలో పడిపోయాము. మా ఆలోచనకు అంతరాయం కలుగజేస్తూ అమ్మ మరో సంఘటన చెప్పింది.

"అవి 1947 రోజులు. ఈ గ్రామములో రెండు పార్టీలుండేవి. నాన్న గారు ఒక పార్టీ పక్షాన ఉండేవారు రెండో పార్టీవాళ్ళు నాపై అత్యాచారాలు చేయాలని ప్రయత్నం చేస్తుండేవాళ్ళు.

ఆ రోజుల్లో ఒకనాడు నేను ఊరిబయటకు ఒంటరిగా వెళ్ళాను. ఒక తుంటరి నా దారికి అడ్డువచ్చాడు. నన్నేదో అవమాన పరచాలని అతని ఉద్దేశ్యం. అంతలో ఎక్కడనుండి వచ్చిందో మా గుడ్డిబఱ్ఱె ...ఆ కాలంలో మా దగ్గర ఒక గుడ్డిబఱ్ఱె ఉండేది....మా ఇద్దరి మధ్యకి వచ్చి నిలుచుని అతనెంత గింజుకున్నా అతను నన్ను సమీపించకుండా చేసింది, అప్పుడేకాదు అదేమిటో నిరంతరమూ నేను ఎక్కడకు వెళ్ళినా రక్షకభటునివలె నన్ను వెన్నంటి ఉండేది.

మరి-పశువులకు ఆలోచన లేదని ఎలా అనగలం?

అమ్మ ఒక్కొక్క సంఘటన చెబుతుంటే – అందరం చెవులు "ఇంతలు" చేసుకుని వింటున్నాం.

1956 శ్రీరామ నవమినాడు—

జిల్లెళ్ళమూడి గ్రామస్థులు రేటూరునుండి ఒక కోడె దూడను తీసుకువచ్చి ఆబోతును చేయదలచుకుని ముందుగా స్నానం చేయించటంకోసం చెరువులో దించారు. అక్కడ ఆ క్రతువు పూర్తిఅయి దానిని గట్టు ఎక్కించటంకోసం ప్రయత్నించారు. కానీ అది చెరువులోనుండి బయటకు రాలేదు. ఎన్నో విధాల ప్రయత్నం చేశారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. చివరకు "నిన్ను అమ్మవద్దకు తీసుకువెళ్ళి అమ్మ చేత ముద్రవేయిస్తా" మని దానికి చెప్పారు ఆ మాటలు విని అది బుద్ధిమంతుడైన కుఱ్ఱవాడువలె ఒడ్డుకు వచ్చింది.

మఱి...జంతువులకు మన మాటలనూ, భావాలనూ అర్థంచేసుకొనగల సామర్థ్యం లేదని ఎలా అనగలం ? అయితే – అవి వాటి భావాలను మనలాగా భాషలో వ్యక్తం చేయలేక పోవచ్చును."

మా ఉత్సుకతను గమనించిన అమ్మ మళ్ళీ మొదలు పెట్టింది.

"ఆ ఎద్దు ఎంత జాగ్రత్తగా ప్రవర్తించేదని ? రాత్రివేళ నా దగ్గరకు వచ్చి పడుకునేది. అలా రాత్రిళ్ళు వచ్చేటపుడు నా మంచం చుట్టూరా నేలపై పడుకుని ఎందరో నిద్రపోతుండేవాళ్ళు, అది వాళ్ళను ఎవరినీ తొక్కకుండా మనిషి మనిషికీ మధ్యనున్న కొద్ది స్థలంలో అడుగులు వేసుకుంటూ నా దగ్గరకు వచ్చి పడుకునేది."

అమ్మ యీ జంతువుల మనోగతుల పరిశీలనలోకూడా ఎంత శ్రద్ధ తీసుకుంటుంది–అని ఆశ్చర్యపోతూ వింటున్నాము.

"మీలో కొందరికి గుర్తు ఉండి ఉంటుంది...లోగడ నేను పూరింట్లో ఉండే కాలంలో ఒక కుక్క ఉండేది. అది ఎప్పుడూ నా మంచం క్రిందనే పడుకునేది. నేను దర్శనం యిచ్చే సమయంలో అందరిలాగా అదికూడా నా ఎదురుగా కూర్చునేది. నే నేదన్నా మాట్లాడుతుంటే శ్రద్ధగా వినేది. కొందరు దానిని అక్కడినుండి తోలటానికి ప్రయత్నించినా అది కదిలేది కాదు అప్పుడు కొందరనేవాళ్ళు – అది క్రితం జన్మలో ఏ ఋషో అయి ఉంటుందని. ఎప్పటి సంగతో ఎందుకూ, యిప్పుడు కాకపోతేగదా–

అంటాను నేను. ఋషులంటే మనుషులే అయి ఉండాలని మీ భావం. నేను అలా అనుకోను."

ఒక ఋషి స్మరణలో అమ్మ కన్నులు జ్వలించాయి.

"కౌముదీ/కామ్మూరి డాక్టరుగారూ, ధర్మయ్యగారూ మొదటిసారి నా దగ్గరకు వచ్చినరోజు 1956 మే 9 వ తేదీ. నేను క్రింద కూర్చుని ఉన్నాను. డాక్టరుగారు.... మరి, ఆయన డాక్టరుగదా ... కుర్చీపైన కూర్చున్నారు. ధర్మయ్యగారు మంచంపై కూర్చున్నారు. వాళ్ళు నాతో మాట్లాడుతూ ఉండగా ఒక పిల్లీ, ఎలుకా కలిసి నాదగ్గరకు వచ్చినయ్. నేను నా పమిటచెంగు నేలపై పరిచాను. దానిపై అవి ఆడు కోవటం మొదలు పెట్టాయి వాళ్లు అదేమిటి అని అడిగారు. నేను చెప్పాను. వారిద్దరూ వెంటనే వాళ్ళ ఆసనాలు దిగి నాతోపాటు క్రింద కూర్చున్నారు

మా యింట్లో ఒక కుక్క పిల్లి పిల్లలకు పాలివ్వటం ఎందరో ఎరుగుదురు. ఆ దృశ్యం అందరూ వింతగా చూసేవారు. సహజీవనం అంటే - అదే గదా!"

అది నవంబరు 1978, 10 వ తేదీ మధ్యాహ్నం. అమెరికానుండి వచ్చిన సోదరుడు డేవిడ్ అమ్మతో మాట్లాడుతుండగా జంతువుల మనస్తత్వ ప్రసక్తి వచ్చింది - అతడు మనస్తత్వ శాస్త్రంలో ఆచార్యుడట. అందువల్ల ఎంతో ఆసక్తిగా అమ్మను అడిగాడు.

అమ్మ ఎంతో ఆప్యాయంగా ఆ విషయాన్ని చెబుతూ "మనకు తెలీదు గాని, జంతువులకూ‌డా ఆలోచనలూ, గుణాలూ, ప్రేమలూ, ద్వేషాలూ .... అన్ని మనిషికి లాగానే ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా నిశితంగా పరిశీలిస్తే మనకు అవగత మౌతాయి" అని వివరించింది. ప్రక్కన ఉన్న మనుషుల మనస్తత్వమే కాదు, మన ఆత్మీయులు. ఆప్తులు అనుకునేవారి మనస్తత్వమే మనకు అర్థంకాదు. ఇక - పశు పక్ష్యాదుల మనస్సేమి అర్థమౌతుంది ?

అమ్మ తాను అందరికీ అమ్మను అని వివరిస్తూ "పశు పక్ష్యాదుల కూడా-" నని ప్రకటించింది.

అమ్మ స్వర్ణోత్సవ సందర్భంలో పశువులకూ, పక్షులకూ, జలచరాలకూ కూడా విందు చేయమని ఆదేశించింది.

అందువల్లనే మనం అమ్మను "సర్వజనని"గా ఆరాధిస్తున్నాం.

—నవంబరు 1978

"మీరు నా అవయవాలు కాదా"

1976 అక్టోబరు 12 వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు సోదరులు శ్రీ పన్నాల వేణుగోపాల కృష్ణమూర్తి, వారి కుటుంబమూ అమ్మవద్ద కూర్చున్నారు. ఆనాడు వారు హైమాలయంలో అభిషేకం చేసుకుందామనే ఉద్దేశ్యంతో వచ్చి అమ్మ అనుమతి కోరటానికి అమ్మవద్దకు వచ్చారు. వారిని తిలకంతో ఆశీర్వదిస్తూ కాఫీత్రాగి వెళ్లుదురుగాని కూర్చోండి-అని చెప్పింది అమ్మ.

అమ్మ గదిలో సేవచేసే అమ్మాయి, సువర్ణ కాఫీ తీసుకువచ్చి వారికి యిచ్చింది. వేణుగోపాల్ కాఫీ కప్పు చేతిలో పట్టుకుని - అమ్మ త్రాగకుండా మేమెట్లా త్రాగటం? - అన్నాడు అమ్మతోనే. వెంటనే అమ్మ అతని చేతిలోని కప్పును తన చేత్తో తాకింది.

"నువ్వు కొంచెం త్రాగమ్మా-" అతను మళ్ళీ అర్థించాడు

"తాకేనుగా నాన్నా-" అన్నది అమ్మ నవ్వుతూ.

అతనికి అర్థంగాక - ప్రసన్నతకు నిలయమైన అమ్మ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"తాకితే త్రాగినట్లే నాన్నా-తాకటమంటే త్రాగటమే" అమ్మ వివరించింది.

ఈ వాక్యార్థం అతనికి అర్థంగాక అతను అట్లాగే కాఫీ కప్పు చేతిలో పట్టుకుని కూర్చుంటే – అమ్మ అతని చేతిలోని కప్పు తానూ పట్టుకుని అతని నోటికి అందించింది.

ఇక. అతను ఆ కాఫీ, కాదు, అమ్మ వాత్సల్యామృతం త్రాగటానికి క్షణమయినా ఆలస్యం చేయటానికి యిష్టంలేక గటగటా త్రాగేశాడు.

అతను ఆ కాఫీ త్రాగి కప్పు క్రింద పెడుతూండగానే అమ్మ చిన్నగా త్రేన్చింది.

అమ్మ మన నివేదనలను స్వీకరించటంలో అనేక మార్గాలున్నాయి. అవన్నీ అతి విచిత్రంగానూ, అత్యద్భుతంగానూ, మహిమాన్వితంగానూ ఉంటాయి. మనం నివేదనచేసిన పదార్థాలు మనవలెనే అమ్మ నోటితోనే భుజించాలని లేదు. స్పర్శతో, దృష్టితోకూడా అమ్మ ఆహారం తీసుకొనగలదని అనేక సంఘటనల ద్వారా మనం తెలుసుకున్నాము.

ఎవరైనా నివేదన తెచ్చినప్పుడు – ఒక్కొక్కసారి అమ్మ అలా చూచి – యిక తీసుకువెళ్ళండి – అంటుంది. ఒకసారి గుంటూరునుంచి వచ్చిన మా మిత్రునితో అమ్మను గురించి చెబుతూ యీ విషయం వివరించాను. అతను నమ్మలేనట్లుగా – అదెట్లా సాధ్యం? – అని అడిగాడు. ఆరోజుననే మేమిద్దరమూ అమ్మదగ్గర కూర్చుని ఉండగా – మహానివేదన అమ్మవద్దకు తీసుకురాబడింది. తెచ్చిన సోదరి పైనకప్పబడిన ఆకును తొలగించింది. అమ్మ దానిని ఒకసారి తృప్తిగా చూచి ఆమెను తీసుకువెళ్ళమని చెబుతూ – సన్నగా త్రేన్పుతూ మా మిత్రునివంక చూచి నవ్వింది. సర్వజ్ఞ అయిన అమ్మ అతని సందేహం నివృత్తి చేసినందుకు అతను పరమానంద భరితుడైనాడు.

మద్రాసులో కృష్ణమూర్తిగారు అని ఒక దేవీ ఉపాసకులు ఉన్నారు. అతనికి అవతారవ్యక్తులపై ఏ మాత్రమూ విశ్వాసం లేదు. కాని ఒకసారి – అయినా చూడటంలో నష్ట మేముందీ? – అని అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మదర్శనంతో ప్రభావితులై, అనేక స్తోత్రాలుచేసి తనదగ్గర ఉన్న పండును అమ్మకు నివేదన చేశారు. అమ్మ దానిని తిన్నది. అతను – అమ్మా, నేను రోజూ నీకు యిలా నివేదన చేసుకునే భాగ్యం కలిగించు – అని ప్రార్థించారు. అపుడు అమ్మ అన్నదీ – "నిత్యం నీవు పూజచేసుకుంటావుగదా. ఆ పూజ కాగానే ఆ స్థలానికి ఒక

బల్లి వస్తుంది. నీవు పెట్టదలుచుకున్నది దానికి పెట్టు. దానికి పెడితే నాకు పెట్టినట్లే-" అయితే, యిక్కడ మనకు మరొక ప్రశ్న ఎదురవుతుంది. ఆ బల్లికి పెడితే అమ్మకు అందుతుందా? అమ్మ ఆ బల్లి రూపంలో అక్కడకు వెళుతుందా?- అని. ఆ ప్రశ్నను అమ్మను అడిగితే ఒక చిరునవ్వును మాత్రమే మనం సమాధానంగా పొందగలుగుతాము.

ఒకసారి సోదరులు శ్రీ కాశీరావు అమ్మకోసమని ఆపిల్ పండ్లు తీసుకురాగా, అమ్మకు సమర్పించకముందే వాటిని ఒక ఎలుక కొరికింది. ఈ విషయం అమ్మకు చెబుతూ అతను విచారిస్తుండగా అమ్మ అన్నది "నేనే ఎలుకరూపంలో వచ్చి తిన్నాను నాన్నా - విచారించకు-" అని ఇది కేవలం ఓదార్పు అని భావించటానికి వీల్లేని విషయం.

అనేకులు తమ తమ యిళ్ళలో అమ్మ ఫొటోకు నివేదనలు చేస్తారు. అవన్నీ అమ్మ స్వీకరిస్తూ ఉన్నదనుకోవటానికి ఎవరికి వారికే అనేక అనుభవాలూ, అనుభూతులూ ఉన్నాయి.

అమ్మ తానేమీ తినకుండానే, మనకు అన్నపుముద్దలు పెడుతూ తాను తృప్తిగా త్రేన్చటం మనలో అనేకులు ప్రత్యక్షంగా చూచారు. "ఇదేమిటమ్మా ? మాకు పెడుతూ, నీవు త్రేన్చుతావు?" అని ఆశ్చర్యంగా అడిగితే "మీరు తింటే నేను తిన్నట్లే నాన్నా-" అని చెప్పింది అమ్మ. అందుకనే అమ్మ "మీరు నా బిడ్డలే కాదు, నా అవయవాలుకూడా" అని చేసిన ప్రకటన ఎంతో అర్థవంతంగా కనుపిస్తుంది.

— అక్టోబరు 1976

మాతృ ప్రేమ

"అమ్మా: ప్రేమంటే అర్థం కావటంలేదమ్మా" అన్నాను, 1976 ఏప్రిల్ 15వ తేదీన ఉదయం 5 గంటలకు అమ్మతో పాటే నడుస్తూ. ఆ సమయంలో మేడపైన అమ్మ నివాసానికి ప్రక్కనే ఉన్న ఖాళీస్థలంలో కొంతసేపు నడవటం అమ్మకు అలవాటు. పశ్చిమదిశలో క్రిందికి జారిపోతూ క్షణక్షణానికి ఎఱ్ఱబారుతున్న చంద్రుడు దీనంగా కనిపించాడు. ఆ చంద్రుడ్ని చూస్తుంటే - ఆరు నెలలకు పైగా అమ్మ సన్నిధిలో ఉండి నిన్న వాళ్ళ దేశానికి బయలుదేరుతూ అమ్మదగ్గర సెలవు తీసుకుంటున్న గ్రీకు సోదరుడు పౌలో కనిపించాడు. వాతావరణం శీతలంగా అత్యంత ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ అతిభారంగా అడుగులు వేస్తూ చంద్రుడ్ని చూస్తున్న అమ్మ కన్నుల్లో విషాదఛాయలు గోచరించాయి. "ఏమిటమ్మా ?" అన్నాను.

"పౌలో మళ్ళీ వస్తాడా, నాన్నా-" అని అడిగింది అమ్మ.

భవిష్యత్‌కు సంబంధించిన ఆ ప్రశ్నకు సమాధానం అమ్మకు తెలుసునా? నాకు తెలుసునా? కాని ఆ విచిత్ర ప్రశ్న అమ్మ నోటినుండి వెలువడడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. అందుకు జవాబు నే నేమివ్వగలను?

అమ్మ అతని మంచి గుణాలు వివరిస్తూ "చాలా మంచివాడు చాలా పేదవాడు. మళ్ళీ రావాలంటే కష్టంకదా..." అన్నది

ప్రస్తుతం అమ్మదగ్గర అనేక విదేశీ సోదరులు స్థిరనివాసం ఏర్పరచుకొని ఉన్నారు. మరెంతమందో వస్తూ పోతూ ఉంటారు. వారందరికి ఎవరికి ఎప్పుడు ఎట్లాంటి ఆహారం కావాలో అమ్మ స్వయంగా విచారించి చేయించి పెడుతుంది.

"అమ్మా - యింకా యింతమంది ఉన్నారుగా ఒక్కరు వెళ్ళితే యింత బాధపడుతున్నా వేమిటి?" అన్నాను.

నడిచే అమ్మ ఆగి నావంక చూచింది. ప్రేరణరూపిణి అయిన అమ్మ ఏమీ మాట్లాడకపోయినా - వెంటనే నా మనస్సులోకి అనేక సంఘటనలు ఒకదాని తరువాత ఒకటిగా వచ్చినయ్.

అమ్మ చిన్నతనంలో ఒకనాడు – అందరూ భోజనానికి వచ్చారు. కానీ రాఘవరావు మామయ్య రాలేదు. అందుకు అమ్మ బాధపడుతుంటే–కారణం అడగ్గా–ఎందరు తిన్నా ఒక బిడ్డ తినకపోయినా తల్లికి బాధేకదా–అన్నది.

రోజూ అమ్మను చూడటానికి వచ్చే వందలాది జనాన్ని చూస్తూ ఒక్కొక్క–రిని "అన్నం తిన్నారా?" అని స్వయంగా కనుక్కుంటూ అందరికీ ప్రేమతో ఆదరంతో ఆనందంతో అన్నంపెట్టే అమ్మ – ఒక్కొక్కరు వెళ్ళిపోతుంటే ఎంతో బాధపడుతుంది. స్వర్ణోత్సవంనాడు ఉదయం లక్షకు పైగా జనాన్ని తీసుకు వచ్చిన బస్సులను చూచి ఆనందపడిన అమ్మ సాయంకాలం అందరినీ తీసుకువెళ్ళే బస్సుల వంక దిగులుగా చూస్తూ–"ఆ బస్సులను చూస్తుంటే కోపంగా ఉన్నది. తల్లీ బిడ్డలను వేరు చేస్తున్నయ్" అన్నది.

అమెరికానుంచి వచ్చి తిరిగివెళ్ళే మార్వాను కౌగిలించుకుని ఆమెతోపాటు అమ్మకూడా వెక్కి వెక్కి ఏడ్చింది.

అనేక సంఘటనలు గుర్తుకువచ్చి–ఏమిటీ పిచ్చి అమ్మ! వాళ్ళకూ ఈమెకూ సంబంధం ఏమిటి? వాళ్ళకోసం తానెందుకు బాధపడాలి–అనిపిస్తూ అవ్యాజమైన ప్రేమంటే యిదేనేమో అన్న ఆలోచన కలిగింది.

"ప్రపంచంలో ఏ మూల ఏ కొంచెం ప్రేమ కనిపించినా–దానికి మూలం ఒకటే. ఆ మూలం ఇండియాలో ఉన్నది వెళ్ళిచూడు–" అని ఒక స్నేహితురాలు పౌలోకి సలహా యిచ్చిందట.

ఆ ప్రేమను చూడటమే కాదు, ఆ అమృతాన్ని పుక్కిటిబంటిగా త్రాగి యివ్వాళో రేపో స్వదేశానికి చేరుకోబోతున్నాడు పౌలో.

పయనమైన పౌలోనిక నిన్న సాయంకాలం చెంత కూర్చోబెట్టుకుని ఒక చేతితో అన్నం కలిపి ముద్దలు పెడుతూ, మరొక చేతితో చెక్కిళ్ళు పుణుకుతూ వీపు నిమురుతూ అతని అణువణువునూ వాత్సల్య పులకింతం చేస్తున్న అమ్మ మనసులో మెదులుతుండగా – అమ్మ అడిగింది– "ఏమిటిరా– యిందాక అడిగావు? "అని. భానుదయ కాంతులతో ఎఱ్ఱబారుతున్న తూర్పు దిక్కును చూస్తూ–"ఏమీ లేదమ్మా" అన్నాను.

—ఏప్రిల్ 1976

బిడ్డల తృప్తే తల్లి సంతృప్తి

ఆయన ఒక డాక్టరు. అతడు తన వైద్యవృత్తిని ప్రత్యేకంగా ప్రారంభిస్తూ అందుకు అమ్మ అనుమతిని అర్థించాడు. అమ్మ అంగీకరించింది. ఆ సమయంలోనే అతడు మొక్కుకున్నాడట - తన వృత్తిలో తాను ప్రగతిని సాధిస్తే అమ్మకు ఏమయినా సమర్పించు కుంటానని.

అతని ఆకాంక్ష ఫలించింది. అతని చేతిమీదుగా ఎందరికో ప్రాణదానం జరిగింది. అతడు "బతకరు" అనుకున్న రోగులు బతికారు. "తగ్గవు" అనుకున్న జబ్బులు తగ్గాయి. ఎన్నో సంఘటనలు రోగులతోపాటు వైద్యుడినీ విస్మయ పరిచాయి. రోగులు "డాక్టరుగారి చేతిచలువ" అని ఆనందించారు. డాక్టరు తన ఆరాధ్య దైవ మయిన అమ్మ కరుణతో నిరంతరం తనను కాపాడుతున్నదని భావించి మనసంతా కృతజ్ఞతతో నింపుకున్నాడు.

కృతజ్ఞతకు రూపం యివ్వాలని సంకల్పించాడు. తనను అమ్మ ఆశీర్వదించినట్లే తానూ అమ్మను ఆనందపరచాలని అభిలషించాడు.

అమ్మకు కారులో ప్రయాణం చేయటమంటే ఎంతో యిష్టమని విన్నాడు. వెంటనే తన అంబాసిడర్ కారును అమ్మకు సమర్పించి అమ్మను సంతోషపరచి తాను తృప్తిచెందాలని ఆశించాడు.

1972 జనవరి 14 వ తేదీన భోగి పండుగనాడు అతడు జిల్లెళ్ళమూడి వచ్చాడు. ఆయన ఉద్దేశం ముందుగా మాకు వివరించాడు. మేమూ ఆనందించాము. ఎన్నాళ్ళనుండో అమ్మ మమ్మల్ని అడుగుతున్న కోరికను మేము తీర్చలేకపోయినా, అది ఈ విధంగా తీరుతున్నది గదా – అని.

తరువాత ఆయన అమ్మ వద్దకు వచ్చి తన సత్సంకల్పాన్ని అమ్మకు విన్నవించాడు. అమ్మ ఏమీ మాట్లాడలేదు. అతడు అతివినయంగా అంజలి ఘటించి– "అమ్మా నీకు కారు అంటే చాలాయిష్టం అని విన్నాను. ఈ కారు నీవు సరదాగా వాడుకో అమ్మా" అని వేడుకున్నాడు.

"నిజమే. నాకు కారు అంటే యిష్టమే. కానీ కారు నావరకే ఉపయోగిస్తుంది. నీ వేదయినా చేయదలచుకుంటే చాలా పనులున్నాయి" అన్నది అమ్మ.

"నీ యిష్టమమ్మా – నీవెట్లా ఆజ్ఞాపిస్తే అట్లాగే చేస్తాను. ఇది నీవు నాటిన చెట్టు – నీవు పోషిస్తున్న చెట్టు. కనుక ఈ పూలూ, పండ్లు అన్నీ నీవే."

"అయితే ఒక పనిచెయ్యి నాన్నా....పదిమందికి పనికివచ్చే పనిచెయ్యి. ప్రస్తుతం పిల్లలు భోజనం చేయటానికి సరయిన వసతిలేక ఏదో షెడ్డు వేయించాలనుకుంటున్నారు. అందుకు నీకు తోచినంత ఇవ్వు."

అతడు అందుకు ఆనందంగా అంగీకరించాడు.

మాకు వెంటనే బాధ కలిగింది. అమ్మ కోరిక తీరకుండానే మిగిలిపోయిందే–అని. కాని వెంటనే అమ్మ సూచనలో ప్రఫుల్లమయిన మాతృత్వానికి మా మనసు ఆనంద తరంగిత మయింది.

అది నిజంగా అమ్మకే చెల్లుతుంది. ఆ సమయంలో ఆ మాట అమ్మ మాత్రమే అనగలుగుతుంది–అనిపించింది.

తన ఆనందంకోసం ఒకరు కారును సమర్పిస్తే-"నాకు సరదాలెందుకు నాన్నా! పిల్లల అవసరం చూడండి. వారి యిబ్బందులు తీర్చండి-" అని ఒక్క తల్లి తప్ప మరి ఎవరు అనగలరు ?

పూర్వము ఒకసారి సోదరి మార్గ్యా అమెరికా వెళుతూ "అమ్మా నేను కొన్ని నెలలు ఉద్యోగంచేసి కొంతడబ్బు నిలువచేస్తాను. ఆ పైకముతో నీకు కారు పంపమంటే పంపుతాను. లేకపోతే నేను మళ్ళీవచ్చి నీ దగ్గర కొంతకాలం గడుపుతాను" అంటే అమ్మ ఆమెనే రమ్మన్నది.

కారు పంపిస్తే తనకు తృప్తి. తాను వస్తే తనకే తృప్తి. మరి, తల్లి తన తృప్తి చూసుకుంటుందా? బిడ్డ తృప్తికే ప్రాధాన్యం యిస్తుంది. పైగా బిడ్డ తృప్తినే తన సంతృప్తిగా సంభావిస్తుంది.

లేకపోతే - ఒక్క గ్లాసు మజ్జిగ త్రాగితే తగ్గిపోయే తన కడుపులోని మంటను-అవి తాను త్రాగితే తన పిల్లలకు ఎక్కడ తరిగిపోతాయోనని ఆ మంటను అట్లాగే సహించటం తల్లికి తప్ప ఎవరికి సాధ్యమవుతుంది?

—జనవరి 1972

"నక్సలైట్లూ నా బిడ్డలే"

1975 డిశంబరు 30 వ తేదీ అర్థరాత్రి హఠాత్తుగా జిల్లెళ్ళమూడిలోని హైమాలయంపై అందరింటిపై నక్సలైట్లు దాడి, దోపిడి చేశారన్న దుర్వార్త అందరికీ యీపాటికి తెలిసినదే. వారు షుమారుగా యిరవై మంది మాత్రమే ఉన్నప్పటికీ దాదాపు ఒక వందమంది ఉన్నట్లూ, వారి వద్ద ఎక్కువగా ఆయుధ సామాగ్రి లేకపోయినప్పటికీ అసంఖ్యాకంగా మారణాయుధాలు ఉన్నట్లూ భ్రమకల్పించి భయపెట్టి....ఆ ప్రాంగణమంతా స్వేచ్ఛగా వీరవిహారం సల్పి, తాళాలు పగలగొట్టి, తలుపులు ముక్కలుచేసి, బీరువా బద్దలుజేసి, బాంబులు ప్రేల్చి, కారుకూతలు కూసి ఆశ్రమ ప్రశాంత వాతావరణాన్ని కలుషితమూ, కల్లోలితమూ చేసి పశువులకంటే హీనంగా రాక్షసులకంటే నీచంగా అతిక్రూరంగా అమానుషంగా ప్రవర్తించారు.

నక్సలిజానికి ప్రధానలక్ష్యం – సాంఘిక దురన్యాయానికి ఆధారభూతమైన వ్యక్తులను రూపుమాపి సమసమాజాన్ని నిర్మించటమంటారు. మరి జిల్లెళ్ళమూడిలో ఏమి సాంఘిక దురన్యాయం జరుగుతున్నది? అక్కడ ఏ రాజకీయ పక్షానికీ, ఏ మత ప్రచారానికీ, ఏ వర్ణానికీ, ఏ వర్గానికీ సంబంధంలేని సర్వసమ్మతమైన ఆదర్శమైన పవిత్రమైన వాతావరణంతో ఒక ఆశ్రమం ఉన్నది. పగలతో, పట్టుదలలతో, అసూయలతో, ద్వేషాలతో అనేకవిధాల కుళ్ళిపోయిన సమాజానికి ప్రేమామృతం అందించటానికి భువిపై అవతరించిన ప్రేమమూర్తి అమ్మ అక్కడ అందరికీ ఆరాధ్యమూర్తి. అమ్మకు కులంతోనే కాదు, గుణంతోకూడా ప్రమేయంలేదు. తల్లి కి తప్పే కనుపించదు. అని అసందిగ్ధంగా ప్రకటించింది అమ్మదృష్టిలో మంచిచెడ్డల విచక్షణే లేదు. పతితులు, పాపులుకూడా అమ్మ ఒడిలో పసిపాపలూ, ప్రేమాస్పదులే. ఎవరిని చూసినా అమ్మకు తన బిడ్డయే అనిపిస్తుంది ఈ నగ్నసత్యాలు జిల్లెళ్ళమూడి వచ్చి ఎవరు పరిశీలించినా స్పష్టంగా తెలుస్తాయి. మరి, యీ నక్సలైట్లుకూడా యీ దాడికి ముందుగా అనేక పర్యాయాలు జిల్లెళ్ళమూడి వచ్చి ఆ ప్రేమమూర్తిని దర్శించటమూ, అక్కడ నిత్యం వందలాదిగా భోజనంచేసే యాత్రికులతోపాటు తామూ కడుపారా భోజనం చేసినట్లూ తెలుస్తున్నది.

మరి, ఏ తేడాలు చూడని ఆశ్రమ విధానం దోషభూయిష్టమా ? అందరినీ కన్న బిడ్డలుగా ప్రేమించే తల్లి తత్వంలో తప్పున్నదా? వచ్చిన వాడి కెల్లా ఆశ్రయ మిచ్చి అడిగినవాడికెల్లా అన్నం పెట్టటమే నేరమా ?

రాసులకొద్దీ నిలవచేసిన ధనాన్ని దోచి నలుగురికీ పంచి సమాజంలో సమానత్వాన్ని సాధించటంకూడా వారి ధ్యేయాల్లో ఒకటి అంటారు. మరి జిల్లెళ్ళ మూడిలో ధనరాసులేమీ లేవే. అక్కడ రోజూ వందలకొద్దీ ప్రజలకు భోజనం పెట్టటానికి అక్కడి కార్యకర్తలు అనుక్షణమూ అనుభవించే ఘర్షణ ఎవరికైనా సానుభూతి కలిగిస్తుందే! ఈ సత్యం వాళ్ళకు తెలీదా ?

మరి అక్కడ మణుగులకొద్దీ బంగారం ఉందనుకున్నారా ? అమ్మ ధరించే నగలు వారిని భ్రమింపచేశాయా ? అమ్మ దివ్యశరీరంలోని కాంతులే ఎన్నో నగలుగా వారికి భ్రాంతిని కలుగ జేశాయా ? యదార్థవిషయాలేమీ తెలుసుకొనకుండా, వివేక రహితంగా ప్రవర్తిస్తే దోపిడి దొంగలకూ, వీరికీ భేదమేమిటి? మరి, వీరు వల్లించే ఆదర్శాల గతి ఏమిటి ?

దయామయి అయిన అమ్మ, ఎంతటి దుర్మార్గుడి నయినా 'వాడూ నాబిడ్డే' నని చెప్పగలిగిన అమ్మ తన నిరవధికమయిన ప్రేమను సర్వజన విస్మయకరంగా మరొకసారి చూపింది. ఎవ్వరికీ ప్రాణహానీ, ఏ ప్రమాదమూ లేకుండా కాపాడింది. నన్ను ఆనాడు అప్పికట్లలో న్రిదచేయించింది. వరండాలో దుండగులు బీభత్సంచేసిన స్థలంలో రోజూ నిద్రించే నాన్నగారిని మూడవ అంతస్తుకు పంపించింది. ధీరోదాత్తుడయిన గోపాలకృష్ణమూర్తిని రణస్థలంలో నిలిపి మారణకాండకు అడ్డుపడింది. తల్లికి బిడ్డసొమ్ము, బిడ్డకు డబ్బుసొమ్ము – అని ఎన్నడో వివరించిన అమ్మ తన బిడ్డలను కాపాడుకుని, ఆకతాయి బిడ్డలకు కావలసిన సొమ్మును సమకూర్చి "కొందరు పిల్లలు అడిగి తీసుకుంటారు. కొందరు పిల్లలు అడక్కుండా తీసుకుంటారు. కొందరు పిల్లలు అదరగండంచేసి తీసుకుంటారు. వీరు ఈ రకం పిల్లలు...." అని అతి విలాసంగా అభివర్ణించింది.

— జనవరి 1970

"గడ్డకాదా బిడ్డే"

హమ్మయ్య! ఎంత గండం గడిచింది! కాలం మానవాళినే కనికరించింది. భగవంతుడు భక్తులయెడ తన కారుణ్యాన్ని మళ్ళీ ఒకసారి ఋజువు చేసుకున్నాడు. బిడ్డలపై అమ్మ వాత్సల్యామృతాన్నే కురిపించింది. ఉరుములు, మెరుపులు భయంకరంగా చెలరేగి ఏ క్షణాన పిడుగుపాటును కలిగించగలవో అని వెరపించినప్పటికీ - చిరుజల్లులు మాత్రమే పడి ప్రకృతిలో ప్రశాంతికి ఏ మాత్రమూ భంగం కలిగించలేదు. రేడియోలు, పత్రికలు వాయుగుండంతోబాటు పెనుతుఫానునే సూచించినప్పటికీ- వాయుగుండం తీరంచేరకుండానే సముద్రగర్భంలోనే సమసిపోయింది.

సరిగ్గా నాలుగునెలల క్రితం - 1975 జులై 17 వ తేదీన

అంతకుముందు మూడునెలలుగా అమ్మను బాధిస్తున్న రాచకురుపు తీవ్ర స్థాయికి చేరుకుంది. అమ్మ ఆ బాధను మౌనంగా సహిస్తున్నప్పటికీ చూచేవాళ్ళకు మాత్రం భరించరానిదైంది. వెంటనే నెల్లూరు డాక్టర్ S. V. సుబ్బారావుగారికి. నరసాపురం డాక్టరు కేశవరావుగారికి, మదనపల్లి డాక్టర్ (శ్రీమతి) R. జానకీదేవి గారికీ టెలిఫోన్లు వెళ్ళాయి. ముగ్గురూ రెక్కలు కట్టుకువాలారు. అమ్మను చూచారు. గడ్డ తాటికాయ ప్రమాణంలో బయటకు కనిపిస్తున్నది. ఇక లోపల ఎంత ఉన్నదో, అది అమ్మను ఎంత బాధపెడుతున్నదో! అమ్మ మంచంపై పడుకుని అటునుండి

యిటు పొర్ల లేకుండా ఉన్నది. కాలంతా బరువెక్కి కదిలించలేని స్థితిలో ఉన్నది. అయినప్పటికీ – అమ్మ దర్శనకార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతూనే ఉన్నది. ఆ 19 వ తేదీన తొలిఏకాదశి. దాదాపు నాలుగువందలదాకా యాత్రికులు వచ్చారు. అమ్మ బయటకువచ్చి కుర్చీలో కూర్చొని నాలుగు గంటలసేపు దర్శనం ప్రసాదించింది. వచ్చిన డాక్టర్లు అమ్మలో తరగని తేజఃపుంజాన్ని చూచి ఆనందించారు; అమ్మలోని సహనశక్తికి ఆశ్చర్య చకితులైనారు; అమ్మ ఎంత బాధపడి ఉంటుందా– అని తామూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

తెల్లవారేసరికి గడ్డ పక్వమయింది. ఆపరేషన్ తప్పనిసరి అయింది. డాక్టర్లు ముగ్గురూ కలిసి అమ్మను జిల్లెళ్ళమూడినుండి ఎక్కడికయినా అన్ని సౌకర్యాలు కలిగిన హాస్పిటల్‌కు తరలించడానికి ఏకగ్రీవంగా నిర్ణయించారు. అందుకు అమ్మనుండి అంగీకారం తీసుకోవటానికి ఉదయంనుండి సాయంకాలందాకా పట్టింది. చివరకు నాన్నగారు చెప్పినమీదట అమ్మ ఒప్పుకుంది.

డాక్టర్ సుబ్బారావుగారు అమ్మను నెల్లూరు తీసుకువెళ్ళి తమ యింట్లో ఉంచుకుని చికిత్సచేసి పంపుతామన్నారు. అందరూ సరే నన్నారు.

అమ్మ ప్రయాణం కావాలంటే – మూడు అంతస్తులు దిగిరావాలి కాలు కదిలించలేని అమ్మ, అడుగుతీసి అడుగువేయలేని అమ్మ అన్ని మెట్లు ఎలా దిగుతుంది? ఎందరో బల సంపన్నులయిన బిడ్డలు ముందుకువచ్చి అమ్మను చేతులమీద దించుతా మన్నారు. కుర్చీలో కూర్చోపెట్టుకుని తీసుకువెళతా మన్నారు. ఎన్నెన్నో ఉపాయా లాలోచించారు. అమ్మ అన్నిటినీ ససేమిరా అన్నది. కారణం – అలా తీసుకువచ్చి తనను కారులో పడుకోబెడితే, చూచిన బిడ్డలు తట్టుకోలేరని. తుదకు తానే డాక్టర్లకు ఉపాయం చెప్పింది. అక్కడనే గడ్డను ఆపరేషన్‌చేస్తే–తానే మెట్లు దిగుతా నన్నది. మరి– గడ్డను ఆపరేషన్ చేయటమెలా? ఏ డాక్టరూ యీ పరిస్థితిని ఊహించి అవసరమైన పరికరాలు తీసుకురాలేదు. అయినప్పటికీ ఒక బ్లేడును స్టెరిలైజుచేసి కోసేయమని అమ్మ సలహా చెప్పింది. చివరకు అమ్మ యిచ్చిన ధైర్యంతో డాక్టర్ సుబ్బారావుగారు విద్యుద్దీపమైనా లేని గదిలో కరదీపిక సహాయంతో మత్తుమందు యివ్వకుండా (లేదు) ఒక బ్లేడుతో ఆ గడ్డను కోసేశారు.

ఆ తర్వాత ఒక గంట విశ్రాంతి తీసుకొని అమ్మ మెట్లన్నిదిగి బారులుతీరి నిలుచున్న జనసందోహానికి ధైర్యం చెబుతూ, ఆశీర్వదిస్తూ చిరునవ్వులు చిందిస్తూ

బరువుగుండెలతో, తడికళ్ళతో వీడ్కోలు చెప్పే జనంనుండి నమస్కారాలు అందు కుంటూ బయలుదేరింది.

అప్పటినుండి ఒకటేమిటి ? - అమ్మకు ఎన్ని బాధలో, రాచపుండు నయమైంది. గానీ - డయాబిటీస్, బ్లడ్ ప్రజర్, హార్టు పెయిన్, గాస్ట్రిక్ ట్రబుల్ ... ఒక దానివెంట ఒకటి. అమ్మ వాటిని బిడ్డలవలెనే చూసుకున్నప్పటికీ డాక్టర్లకు మాత్రం అన్నీ పరీక్షలే! అనుక్షణము సవాలే!

ఈ నాలుగు నెలలనుండీ భక్తులకు అమ్మ దర్శనం లభ్యంకాక తపన చెందుతున్నారు. ఎక్కడివాళ్ళు అక్కడ అమ్మ ఆరోగ్యంకోసం తీవ్రమైన వ్యథతో ప్రార్థనలు చేశారు. దయాళువైన అమ్మ అందరి విన్నపాలు, విలాపాలు ఆలకించింది. పరిపూర్ణంగా కాకపోయినప్పటికీ అమ్మ ఆరోగ్యవంతురాలయింది.

ఆ నెల 24 వ తేదీన జిల్లెళ్ళమూడిలో జరిగే హైమ జన్మదినోత్సవానికి తానూ వస్తానన్నది. అందరిని రమ్మన్నది.

సర్వ ప్రపంచాన్నీ చల్లగాచూచే అమ్మ - మనకోసం మళ్ళీ యింకోసారి తన్ను తాను చల్లగా చూచుకొన్నది. మన శ్రేయస్సుకోసం తన కోమల శరీరాన్ని కంటకావృతమైన పథంలో నడిపించవానికి యిష్టపడ్డది. ఇక ఆ శరీరాన్నీ పువ్వుల కంటే పదిలంగా చూచుకోవాల్సిన బాధ్యత మనకెంతయినా ఉన్నది. ఎన్నో పరీక్షలకు గురై, ఎన్నో శ్రమలకు ఓర్చి - ఆ దేహదీపాన్ని మనమధ్య నిలబెట్టిన వైద్య సోదరులకు యావజ్జగతీ జీవితాంతమూ ఋణగ్రస్తమై ఉంటుంది.

— నవంబరు 1975

మాతృ దర్శనం

1973 మే నెల 23 వ తేదీన సోదరులు శ్రీ సత్యనారాయణగారు బాపట్ల నుండి తమ కాపురం తణుకుకు మారుస్తూ జిల్లెళ్ళమూడి వచ్చి ఆ విషయాన్ని అమ్మకు నివేదించి - అమ్మా, ఒక్కసారి తణుకు రా-అని అర్థించారు.

"ఎక్కడికయినా నేను వచ్చి ఏమి చేస్తాను నాన్నా? ఉపన్యాసాలివ్వగలనా ? సంకీర్తన చేయగలనా ? మూగదానివలె కాసేపు కూర్చునో నిల్చునో రావలసిందేగా?" అని అడిగింది. కొన్ని క్షణాలాగి "మొన్న రేపల్లెలో ఏమి చేశాను?" అని ప్రశ్నించింది.

ఔను - అమ్మ రేపల్లెకు వచ్చి ఏమి చేసింది ? ఆ ప్రశ్నకు ముందు "నిత్యమూ అమ్మ జిల్లెళ్ళమూడిలో ఏమి చేస్తున్నది?" అని ప్రశ్నించుకోవాలి. అమ్మే ఒకసారి - నాకు పని అంటూ ఉంటే మీకు కనబడటమే-నన్నది.

నిత్యమూ అమ్మ ఎందరికో దర్శనం ప్రసాదిస్తున్నది. అందులో అమ్మ వాక్కు అరుదుగా వినిపిస్తుంది. అనేకులకు ఆ అవసరం కనిపించదు కూడా.

అమ్మరూపం సుందరం అయినదే కాదు మనోరంజక మయినది. అమ్మను దర్శిస్తుంటేనే మనస్సుకు ఆహ్లాదకరంగా ఉంటుంది. అమ్మమూర్తిలో ఆపాదమస్తకము, ప్రజ్వరిల్లే దివ్యరోచిస్సులూ, నయనయుగళిలో భాసిల్లే కారుణ్యప్రభలూ, పెదవులపై నిరంతరం లాస్యం చేసే దరహాసరేఖలూ, సువర్ణాభరణాల దీప్తిని పరిహసించే దివ్యచరణ రాజీవ రామణీయకమూ, వివిధ వర్ణ విలసిత బహుకంకణ పరిశోభితాలయి, అఖిలజనులకూ అనవరతమూ అభయప్రధానం చేసే అతి మృదుకరాలు... ఒకటేమిటి, సకల అవయవాలలోనూ జాలువారే సౌందర్యమూ, ప్రకాశమూ, దివ్యస్ఫూర్తీ ఎవరి హృదయంలోనైనా చెరగని ముద్రను వేస్తాయి. కంచి పట్టుచీరె కట్టుకుని, జడలో పూలు పెట్టుకుని, భ్రుకుటిలో "యింత" బొట్టు పెట్టుకుని వచ్చి అమ్మ కుర్చీలో ఆసీన అయితే, కుర్చీలో కూర్చున్నట్లుండదు: అమ్మ సరాసరి మన హృదయ సింహాసనం పైననే సుస్థిరంగా ఆసీన అయినట్లుంటుంది. మన హృదయం అమ్మ బొమ్మతో నిండినట్లుండదు; ఆనంద ప్రపూర్ణమవుతుంది. ఒక దివ్యప్రభ మన మనస్సునంతా ఆవరిస్తుంది.

అమ్మ దర్శనం సర్వార్థ సాధకమయింది. దర్శనమాత్రం చేతనే మనస్సులోని సందేహాలు నివృత్తి అవుతాయి. మనస్సుకు హాయీ శాంతీ లభ్యమవుతాయి. ఆ మౌనంనుంచే మనకు దివ్యసందేశం అందుతుంది.

ఒక్కసారి అమ్మను వీక్షించినా ఆ మూర్తి మన హృదయమే దేవాలయంగా సుప్రతిష్ఠిత మవుతుంది. ఆ మూర్తి జడప్రాయమయిన చిత్రమో-విగ్రహమో కాదు. సజీవమయినదీ, సర్వసమర్థమయినదీ అయి ప్రభాసిస్తూ మనకు సదారక్షయై విరాజిల్లుతుంది. అవసరంలో మనం విస్మరించినా ఆ మూర్తి మనను ఆదుకొనటానికి సర్వసన్నద్ధయై ఉంటూ అహర్నిశమూ మనకు మార్గనిర్దేశం చేస్తూ మన చేయి పట్టుకుని నడిపిస్తూ ఉంటుంది.

ముఖ్యముగా అమ్మ దర్శనములో మనకు ఇంకొక ముఖ్య ప్రయోజనం గోచరిస్తుంది. అదే సమయంలో అమ్మ దృష్టి మనపై ప్రసరిస్తుంది. మనం వేలాదిగా ఉన్నా అమ్మకూడా తన సహస్ర నేత్రాలతో ప్రతి ఒక్కరినీ వివరంగా వీక్షిస్తుంది. కనుకనే ఎంతమందిలో ఎవరు వచ్చినా అమ్మ స్మృతిలో వారి స్థానం సురక్షితంగా ఉంటుంది.

కనుకి మన హృదయసామ్రాజ్య మహారాజ్ఞియై అమ్మ మన జీవితాలను పరిపాలించటమే కాదు, తన మనస్సులో మనను భద్రపరచుకుంటుంది.

అమ్మ దర్శనం మహత్తర ప్రయోజనాత్మకమయినది. కనుకనే పలు ప్రాంతాలనుండి అనేకులు బహుకాలంగా అమ్మను - తమ తమ పట్టణాలలో సామూహిక దర్శనం ప్రసాదించమని ప్రార్థిస్తున్నారు కాని అందరితోనూ అమ్మ స్వర్ణోత్సవాల అనంతరం ఆలోచిద్దామని వాయిదావేస్తు వచ్చింది.

ఇప్పుడు స్వర్ణోత్సవం అయింది. [మనం] అనుకోకుండా రేపల్లెలో అమ్మ దర్శనం ప్రసాదించింది. వేలాది జనం అమ్మ దర్శనం చేసుకుని సంతృప్తు లయినారు.

తిరిగి-ఎన్ని ప్రాంతాలనుండో ఆహ్వానాలు విరివిగా వస్తున్నాయి. మరి, ఏ ప్రదేశాలు అమ్మ దివ్యచరణ స్పర్శకు నోచుకున్నాయో, ఏ ప్రజలు అమ్మదర్శన పరమ భాగ్యాన్ని పొందనున్నారో...

--మే 1973

అంతా అదే

"అమ్మా- మేము క్రీస్తును దైవం అని నమ్ముతున్నాము. కాని క్రీస్తు తాను దైవంయొక్క కుమారుడ్ని మాత్రమే అని చెప్పుకున్నాడు. మీ విషయమై మీరేమంటారు?" అని యిజ్రాయిల్‌కు చెందిన ఒక క్రైస్తవ సోదరుడు అమ్మనే సూటిగా ప్రశ్నించాడు.

"నేను అట్లా అనుకోవడంలేదు. నాకంటే పైన మరొకరు ఉన్నారని అనుకోవడమూ లేదు. నాకంటె క్రింద ఉన్నారని అనుకోవడమూ లేదు-" అమ్మ చాలా ఉదాసినంగా జవాబిచ్చింది

అంటే-ఉన్నదంతా తాను మాత్రమేనని గదా! "అహం బ్రహ్మాస్మి" అన్న ఉపనిషత్ వాక్యాన్ని ఎంత నిర్లిప్తంగా అమ్మ చెప్పింది!

అమ్మలోని విశేషమే అది. ఎన్ని రకాలుగా అడిగినా, ఎన్నిసార్లు అడిగినా, ఎప్పుడు అడిగినా, ఎందరు అడిగినా - అమ్మ నుండి ఒకటే సమాధానం.

"అంతా అదే" నని-

"అన్నీ నేనే" నని.

అమ్మ అద్వైతసిద్ధి అపూర్వమయినదీ, అనితరసాధ్యమయినదీ, అనుపమానమయినది అమ్మ ఏమి చెప్పినా, తన స్వానుభవం నుండి మాత్రమే చెబుతుంది. కనుకనే అమ్మ పలుకుల్లో అంత సౌందర్యమూ, సౌఖల్యమూ వెల్లి విరుస్తుంటాయి.

ఒకరు "అమ్మా మీరు సాక్షాత్తు రాజరాజేశ్వరి అవతారమమ్మా-" అంటే "మీరు కానిది నేనేమీ కాను నాన్నా" అన్నది.

ఒకరు "మిమ్మల్ని గురించి ఆలోచించుకుంటున్నారా? మమ్మల్ని గురించి ఆలోచిస్తున్నారా?" అని అడిగితే "ఏదైనా ఒకటే నాన్నా. మీరు నేను కాకపోతేనేగా" అని అమ్మ సమాధానం చెప్పింది.

"అమ్మా - మీలోకి చూచుకుండేకంటే మా గురించిన ఆలోచనలోనే మీ కాలమంతా వృథా అవుతున్నది" అన్న సోదరునితో "తానే అయివున్న లోకంవైపు చూచినా, ఈ వ్యాపారంలో లాభనష్టాలు లేవు" అని ఉద్ఘాటించింది అమ్మ.

"కనబడే జగత్తూ, కనబడని బ్రహ్మ-వేరు కావు" అని అనేక పర్యాయాలు ప్రకటించింది అమ్మ.

"అంతా నేనే అనుకుంటున్నప్పుడు ప్రత్యేకించి భక్తులెవరూ?" అని ప్రశ్నించింది అమ్మ.

"మీరంతా నా అవయవాలనుకుంటున్నాను. చెయ్యి నొప్పి కాలికి తెలియదు. కాలినొప్పి కంటికి తెలియదు. కాని అన్నిటి నొప్పి నాకు తెలుస్తుంది."

"బాధ ఎవరిదైనా అనుభవం నాదే."

ఒకసారి అమ్మ సృష్టిని గురించి వివరిస్తూ "సృష్టి అనాది" అంటూ "నాది" అనికూడా స్పష్టంగా చెప్పింది.

ఎన్నో రీతుల్లో అమ్మ-తనకూ, దైవానికీ, తనకూ, ఈ సర్వసృష్టికి అభేదాన్ని అభివ్యక్తం చేసింది. దైవంతో తాదాత్మ్యస్థితిని అంగీకరిస్తూనే "నేనూ మీలాంటిదాన్నే" అని మన సరసనూ నిలుచుంటున్నది.

ఆ రోజుల్లో అమ్మ నివసించే గది ప్రక్కనే "దర్శన మందిరం" నిర్మించాలని ఆలోచనచేసి కారణాంతరాలవల్ల ఆ స్థలంలో అందరకూ పనికివచ్చే గదులు కట్టుబడి చేయాలని ఆలోచిస్తుండగా - సోదరుడు జేమ్సు "అమ్మతో సమానంగా మనం నివసించడమా?" అని ప్రశ్న వేశాడు. అమ్మ వెంటనే "నేను మీతో సమానంగా ఉంటున్నప్పుడు-మీరు నాతో సమానంగా ఉండటానికి ఏమిటి?" అని ప్రశ్నించింది.

ఎవరైనా సరే-సామాన్య మానవ సరిహద్దులు దాటిన తరువాత-దైవంతో తాదాత్మ్యస్థితిని ప్రకటించుకొనవచ్చును, నాకంటె పైన ఎవరూ లేరనీ ప్రవచించవచ్చును కానీ - ఆ స్థితిలోనుండి "నాకంటే క్రింద ఎవరూ లే"రనీ "నేనూ మీలాంటి దాన్నే" ననీ చెప్పుకొనగలగడం అపూర్వమయిన విషయం. అదే అమ్మలోని అద్భుతమైన విశేషం.

—ఏప్రిల్ 1978

"నా వునికే కొండంత ధైర్యం"

1977 నవంబరు 19 వ తేదీ కాలం కసిగా తెలుగు ప్రజలను కబళించిన రోజు. ప్రకృతి పగబట్టినట్లు విజృంభించిన రోజు.

తీరప్రాంతంలోని అన్ని గ్రామాలవలనే జిల్లెళ్ళమూడికూడా ఆనాడు వాయువు చేసిన విలయతాండవంలో విలవిలలాడి పోయింది. ఫలితంగా జిల్లెళ్ళమూడి గ్రామంలోని పూరిళ్ళన్నీ నేలమట్టమయినాయి. ఆశ్రమంలోని పర్ణశాలలన్నీ పతనమయినాయి. కళాశాల పాకలు విధ్వంసమయినాయి. అధ్యాపకబృందం నివాసంచేసే యిళ్ళన్నీ కూలిపోయినాయి. సిమెంటు రేకులతో కప్పిన భోజనమందిరం రేకులన్నీ వాయు వేగానికి ఎక్కడికో ఎగిరిపోయి నేలకూలి తునాతునకలయినాయి.

మరి మిగిలిన దేమిటి ?

అమ్మ నివసించే భవనమూ, అన్నపూర్ణాలయమూ.

అందుకే గ్రామస్థులూ, ఆశ్రమవాసులూ, కళాశాల అధ్యాపకులూ, విద్యార్థినీ విద్యార్థులూ.... అందరూ "అమ్మా... అమ్మా ..." అని ఆర్తనాదాలూ, హాహాకారాలూ చేస్తూ ప్రచండ వాయుఘాతాలనూ, ప్రళయ వర్షపాతాన్నీ తప్పుకుంటూ కట్టుబట్టలతో, కడబట్టిన ప్రాణాలతో – అమ్మపాదాల నాశ్రయించినట్లుగా కొందరు అమ్మ నివసించే భవనంలోని క్రింది అంతస్తులోకీ, అమ్మ ఒడిలోకి చేరినట్లుగా కొందరు మధ్య అంతస్తులోకి సర్దుకున్నారు.

బయట వాయువు కాలనాగై బుసలు కొట్టినప్పటికి, వరుణుడు కాలరుద్రుడై విలయతాండవం చేసినప్పటికీ - కరుణామయి అమ్మ సాన్నిధ్యంలో ఆ రాత్రి అందరూ సురక్షితంగా కాలం గడిపారు.

తెల్లవారి చూస్తే గ్రామం మరుభూమివలే కళావిహీనమై విపన్నమై విషణ్ణమై ఉన్నది. చెట్లన్నీ కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలన్నీ మెలికలు తిరిగి పోయాయి. ఇళ్ళన్నీ నేలకూలి రణరంగంలో పరాజితులై క్షతగాత్రులై నిహతులైన వీరుల్లాగ కనిపించాయి.

ఆనాడు అమ్మ అన్నపూర్ణాలయంలోనే వంట చేయించి అందరికీ అన్నం పెట్టించింది.

ఏడాది పొడుగునా కడుపునింపే పంట నీటిపాలై పోగా, కాపురం వుండే యిళ్లు నేలకూలిపోగా గ్రామస్థులు నిర్వాసులై నిరాశ్రయులై నిరాధారులై నిరాశా నిస్పృహలకు లోనై నిస్తేజులై నిశ్చేతనులై ప్రాణం కడబట్టి ఉండగా మరునటి రాత్రి - కసి తీరనట్లుగా - కాలం మరోసారి గర్జించింది. అంబరం చిల్లి పడ్డట్టుగా వర్షం కురిసింది. జిల్లెళ్ళమూడిని పరవేష్టించి ఉన్న వాగులు పొంగి వెల్లువైనాయి. చుట్టూ జాలార్ణవం. మధ్యలో ద్వీపం వలె జిల్లెళ్ళమూడి.

మిగతా లోకంతో జిల్లెళ్ళమూడికి ఏవిధమయిన సంబంధమూ లేకపోయింది. జిల్లెళ్ళమూడినుంచి వార్తలే బయటకు రాలేదు.

అమ్మ భవనం మినహా అంతా జలమయమే. అందువల్లనే ఆ భవనము అందరికి ఆశ్రయమయింది.

ఆ విపత్సమయంలో ఆపద్బాంధవి అమ్మ "నేనున్నాను" అన్నది. వరద తగ్గేంతవరకూ వారి నివాసాలు బాగుచేయించుకునే వరకూ వారంరోజులు గ్రామస్థులందరూ ఆ ఒక్క భవనంలోనే తలదాచుకొని పునర్జీవనం పొందారు.

ఆనాడు ఆ భవనమే లేకపోతే ఆ గ్రామంలో ఎన్ని వందలమంది అసువులు గోల్పోయేవారో ? పూర్వం 1969 వ సంవత్సరం వేసవిలో అత్యంత భయానకంగా వచ్చిన వరదలోకూడా యీ భవనమే వేలాది ప్రజలకు ఆశ్రయమయింది.

ఆ వారం రోజులు 2, 3 వేల జనం ఆ ఒక్క భవనంలోనే నివాసం. భవనం చుట్టు వరద. ఆ వరదలో కొట్టుకువచ్చిన కళేబరాలూ, కుళ్ళిపోయిన గడ్డి గాదమూ, అక్కడనే సర్వజన మల మూత్ర విసర్జన. అంతా దుర్వాసన. అసహ్యకర వాతావరణం. అయినా ఆ నీళ్ళే అందరూ త్రాగాలి. అవే నీళ్లు స్నానానికి; అవే నీళ్లు వంటకూ.

అహో ! ఏమి దుర్గతి ! ఎంత దుర్భర పరిస్థితి ! ఏ క్షణాన అయినా ఏ ఉపద్రవమయినా అక్కడ ముంచుకురావచ్చు.

అయినా – అమ్మ త్రాగటానికీ, స్నానానికికూడా అంతకంటె నీళ్లలేవు. అది ఆశ్రమ నిర్వాహకు లెవ్వరికీ యిష్టం లేకపోయింది. "అమ్మా ? కొన్నాళ్లు మళ్ళీ కరెంటు వచ్చి మోటారు పనిచేసి నీళ్ళు వచ్చేంతవరకూ నువ్వు ఏ మద్రాసో, హైదరాబాదో, నరసాపూరో.... అక్కడినుండి ఎట్లాగూ ఆహ్వానాలు ఉన్నాయి కాబట్టి – వెళితే మంచిదమ్మా..." అని సూచించారు.

"నిజమే నాకు బాగానే ఉంటుంది. నన్నయితే ఎవరైనా ఆహ్వానిస్తారు; తీసుకు వెళతారు; సర్వ సౌకర్యాలు చేస్తారు. కనీ, యీ వేలాది జనం మాటేమిటి ? వీళ్ళందరినీ ఎవరు భరిస్తారు ? ఈ క్లిష్టసమయంలో నా చుట్టూ వున్న యీ ప్రజలను వదిలేసి నా సుఖం నేను చూసుకునేదా ? అది నా వల్లకాదు. మీ అందరికీ పనికి వచ్చిన నీళ్ళు నాకు పనికిరావా ? మీ అందరితో నేనూ: నాతో మీరందరూ. అంతే.

ఈ పరిస్థితుల్లో నేను లేకపోతే యీ జనం యిక్కడ ఉండగలరా ? అంటే నేనుండి ఏదో చేస్తాను – అని కాదు. నా ఉనికే కొంత ఊరట; కొండంత ధైర్యం

కష్టమో సుఖమో – మీతోనే నేను.

"ఈ కష్టాలక్కరలేదు – సుఖాలే కావాలనుకోవటం లేదు" అని నెమ్మదీగానూ ఖండితంగానూ పలికిన పలుకులు విని నిర్వాహకులు ఏమీ చేయలేక అమ్మకు ఎదురు చెప్పలేక మౌనం దాల్చారు.

ఔను నిజమేకదా! మనందరితోపాటు ఉండాలనుకొని, సుఖదుఃఖాల సమ్మిశ్రితమైన మానవ జీవితం మీది మమకారంతోనే అమ్మ దివినుండి భువికి దిగి వచ్చింది. ఆ సత్యాన్ని అమ్మ అనేక రీతుల్లో ఉద్ఘాటించింది. అట్లా కాకపోతే "అవతారవ్యక్తు" లనేవారుండరు.

తర్వాత వరద తగ్గింది. అయినా విద్యుత్ సరఫరా రాలేదు. అధ్యాపకులూ విద్యార్థులూ ఎద్దులబండిమీద నీళ్ళు తోలటం జరుగుతున్నది. వాళ్ళ కష్టం అమ్మకు భరించలేనిది అయింది.

దివిసీమలో సాంత్వనయాత్ర ముగించుకుని వస్తూ అమ్మ బాపట్లలో దిగి- "అక్కడి పిల్లల కష్టం చూడలేకుండా ఉన్నాను. ఆ ఎద్దులు - నోరులేనివి కనుక అవి చెప్పుకోలేకపోయినా, మనకు వాటి కష్టం కనిపిస్తూనే ఉన్నది. కరెంటు వచ్చినాక వస్తాను" అన్నది.

మన సుఖంకోసం తాపత్రయమే కాదు, మన కష్టంతో అమ్మకెంత సానుభూతి! తానెన్ని కష్టాలనయినా సునాయాసంగా భరించుతూ "సహనదేవతగా" ప్రశస్తిని పొందిన అమ్మ - మన కష్టాన్ని కించిత్ కూడా భరించలేక క్షణంలో కన్నీరు పెట్టుకుంటుంది.

సర్వ సృష్టి స్థితి లయాలకు అధారభూతమయిన శక్తియే అమ్మగా రూపు దాల్చిందని ప్రగాఢంగా విశ్వసించే మనకు – అమ్మ లీలావినోదం మాత్రం ఏనాటికీ అర్థంగాదు. అమ్మ వివరించదు.

–జనవరి 1978

ఉపకరణాలు

1982 1982 జనవరి 29 వ తేదీన అమ్మదగ్గర కూర్చున్నాం.

అమ్మతో సంభాషణ ఎట్లా ప్రారంభించాలా? - అని ఆలోచిస్తున్నాం.

మామూలుగా సంస్థలో ఏ విశేష కార్యక్రమం జరుపుతున్నా ఉత్సవాలు జరుగుతున్నా...అమ్మే స్వయంగా సలహాల నిస్తుంది. ఒకవేళ ఏకారణంచేత నయినా అమ్మ పిలిచి చెప్పకపోతే-మేమే వెళ్ళి అడుగుతామూ, అమ్మ చెబుతుందీ. ఒక్కోసారి అప్పటికీ అమ్మ అభిప్రాయం వ్యక్తం చేయని యెడల - మేము అమ్మసన్నిధిలో కూర్చుని చర్చించుకుంటూ ఉంటే, అమ్మ మా మాటల్లో ద్యోతకమయ్యే అమాయకత్వానికి జాలిపడి తానూ సంభాషణలో పాల్గొని మా సమస్యలకు పరిష్కారం చూపుతుంది.

ఈ రోజున కూడా అట్లాగే చేరాము.

ఫిబ్రవరిలో అనసూయేశ్వరాలయంలో ఉత్సవాలు కదా! అనసూయేశ్వరాలయ ప్రాదుర్భావమే క్రొత్త విషయం. ఇది శాస్త్ర నిబద్ధమయిన విధానం కాదు. ఇది అమ్మ అపూర్వసృష్టి అందులో ఇటువంటి ఉత్సవాలుకూడా ఇదే మొదటిసారి. ఇక - మనమేమి ఆలోచించగలం? ఏం నిర్ణయించగలం ?

అందుకే అమ్మ దరిజేరాము.

ఈ విషయంలో కూడా నేనే చెప్పాలా? – మీ రందరూ కలిపి ఆలోచించు కుని నిర్ణయించుకోనండి – అన్నది అమ్మ.

నిజమే. ఇది అమ్మ ఆలోచించ తగిన విషయం కాదు. మనమూ అమ్మను అడగదగిన సంగతి కాదు. కాని, మనం ఏం చేయగలం ? ఏ విషయాన్నయినా ఆలోచించాలంటే – ఆ విషయమంత గొప్పతనం మనలో కూడా ఉండాలిగదా !

ఉల్లెళ్ళమూడిలో ఏ విషయమయినా హిమాలయోన్నతమయినదీ, సాగర గంభీరమైనదే. మరి, ఆ విషయాలపై నిర్ణయాలు చేయడానికి ఎవరికయినా ఆ అర్హతా, అధికారమూ, యోగ్యతా, సామర్థ్యమూ, పరిజ్ఞానమూ, ప్రతిభా ఉండొద్దూ? ఉండడం అంటే – అమ్మ ప్రసాదించడమే కదా ! అందుకనే అమ్మ ఒకసారి అన్నది-స్థితులు పొందేవి కావు, యివ్వ బడేవి మాత్రమే- నని. నిజమే, ఈ సూక్తి ఒక్క ఆధ్యాత్మిక స్థితుల విషయంలోనే కాదు, మన జీవితాల్లో సర్వత్రా అనుభూతమయ్యే పరమ సత్యం. మనకు ఏం అనుగ్రహించిందో అమ్మకు తెలియని విషయం కాదు కాబట్టి మనలను యిబ్బంది పెట్టడం, యిరుకున పెట్టడం అమ్మకు యిష్టం ఉండదు. అమ్మ సంతానప్రియ కదా ! అందువల్లనే – ప్రశ్నలకు సమాధానాలు లభించకనూ, సమస్యలకు పరిష్కారాలు దొరక్కనూ మనం ఉక్కిరి బిక్కిరి అవుతుంటే దయానిధి అమ్మ చూస్తూ ఊరకుండ గలదా ?

మన విషయాల్లోనే కాదు, అమ్మ విషయాల్లోనూ అమ్మే మనకు మార్గదర్శకత్వం వహించవలసిన పరిస్థితి గమనార్హం. అమ్మ జీవితంలో అత్యంత విషాదకర సన్నివేశాల్లో కూడా–అమ్మే సలహా ఇవ్వవలసి రావడం, మనం అడగడం నిజంగా దురదృష్టకరమైన విషయమే. కాని అనివార్యమే అవుతున్నది.

అమ్మకు ఆరోగ్యం భంగ మయితే – ఏ వైద్యునికి చూపించాలో అమ్మే సలహా యివ్వాలి. ఏ ఔషదం యివ్వాలో ఆ వైద్యునికి అమ్మే సూచించాలి. హైమ మానవతా పరిధుల నధిగమించి పాంచ భౌతిక శరీరాన్ని పరిత్యజించిన వేళ ఆ గర్భశోకాగ్నిలో తప్తమవుతూకూడా మనకు కర్తవ్యాన్ని అమ్మే ఉపదేశించింది. అమ్మకు జీవితసహచరులై, జీవిత భాగస్వామియై, అత్యంత ప్రేమాస్పదులై, ఆరాధ్యమూర్తి అయిన నాన్నగారు

మానవతాసీమలను దాటి మహాప్రస్థానం చేసినప్పుడు - కటికచీకటిలో కకావికలమైన మనదారిలో మన అమ్మే కాంతిరేఖలను ప్రసారితం చేసింది.

అమ్మ స్వర్ణోత్సవ సమయంలో ? అపూర్వమైన ఆ శతాధిక సహస్ర ప్రజ ఏక పంక్తి భోజన రమణీయ దృశ్యాన్ని ఎవరు ఊహించగలరు ? ఎవరు సంభావన చేయగలరు ? ఆద్యంతమూ ఆ అపురూప మహోత్సవానికి రూపురేఖలు దిద్దినదెవరు ? ఆ కార్యక్రమ నిర్వహణలో మన చేయిపట్టి నడిపిన దెవరు ? మన నావకు చుక్కాని పట్టిన దెవరు ? అడుగడుగునా భయపడే మన వీపును తట్టిన దెవరు ?

సంతోషంలో, సంతాపంలో అన్నివేళలా అమ్మే మనకు గురువు, ఉపదేష్ట, మార్గదర్శి. జగత్ గమనానికీ, సర్వజీవుల కార్యకలాపాలకూ ఆధారభూత మయిన ప్రేరణ అమ్మ వీక్షణే కదా !

ఈ సత్యం అమ్మకూ మనకూ కూడా అనుక్షణమూ అనుభూతమవుతూ ఉన్నా - ఎప్పటికప్పుడు క్రొత్తగానే ఉంటుంది. అందువల్లనే ఆ సన్నివేశాలు కష్ట సుఖాలకు అతీతమై పరమ సుందరమై భాసిస్తాయి.

అసలు అమ్మే ఒకసారి అన్నది .... మీరు అనుకునేదయినా, అనేదైనా, ఆచరించేదయినా నేను అనుకుంటేనే – అని. ఎంత నిజం అది ? అమ్మ అప్పు డప్పుడూ తెరలు తొలగించుకుని మనకు నిజస్వరూప ప్రదర్శనం చేసే పవిత్ర సమయాలలో ఆ మాటలను పలికిన క్షణాలు మానవజాతికే చిరస్మరణీయమైనవి ! అమ్మ యదార్థ స్థితిపై కాంతి వెల్లువలు ప్రవహించిన శుభసమయం అది !

అయినప్పటికి ఇది మనకు ఇంద్రియగోచరం కాక మన విశ్వాసంపై ఆధారపడిన విషయం.

ఈ అధ్యాత్మిక సత్యం జిల్లెళ్ళమూడిలో మనకు ప్రత్యక్షంగా నిత్యాను భవమవుతుంది, మనం ఎప్పుడూ అమ్మ ఒడిలో కళ్ళ తెరవని పసికందులమే. అమ్మ దృష్టిలో మనం ఎల్లెప్పుడూ ఉపకరణాలమే. అమ్మ ఏది చెబితే అది చేయవలసిన వారమే మన జీవితాలు అమ్మ చేతిలో ఆటబొమ్మలు.

–జనవరి 1982

అన్నపూర్ణాలయం

1971 ఆగష్టు 15 వ తేదీన జిల్లెళ్ళమూడిలో "అన్నపూర్ణాలయ" వార్షికోత్సవము జరిగింది. సరిగ్గా పదమూడు సంవత్సరాల క్రితం అవతారమూర్తి అమ్మ సంతానకోటి మీది అవ్యాజానురాగంతో అపరిమిత వాత్సల్యంతో అన్నపూర్ణాలయానికి ఆకృతి కల్పించింది. అప్పటినుండి యిప్పటికి ఆ అన్నపూర్ణాలయంలో ఎన్నో లక్షల ప్రజలు భోజనం చేసి తమ క్షుద్బాధను తీర్చుకొని ఉండవచ్చును. ఏంతో సంతృప్తిని పొందివుండవచ్చును. ఆ అన్నాన్నీ, ఆ పదార్థాలనూ, ఆ రుచినీ, ఆ పాకప్రవీణులనూ ప్రశంసించి ఉండవచ్చును. ఆ భోజనం అమృతంవలే ఉన్నదని ఆనందం అనుభవిస్తూ అభినందించి ఉండవచ్చును. నిజమే. అది భోజనం కాదు అమృతమే. కానిచో ఆ అన్నానికీ ఆ రుచి రాదు.

అక్కడ ఎవరు చేశారన్న ప్రశ్నా లేదు; ఏ పదార్థమన్నది సమస్యా కాదు. అక్కడ ఎవరు వండినా, ఏం వడ్డించినా ఆ భోజనంలోనే ఆ రుచి ఉన్నది. కారణం ఏ వ్యక్తి గాడిపొయ్యి ప్రక్కన నిలబడినా ఆ అమృతహస్తం మాత్రం అమ్మదే. పదార్థా లేమయినా అందులో పొదగబడేది మధురాతి మధురమయిన అమ్మ అవ్యాజానురాగామృతం మాత్రమే.

ఆర్తులకు తన కరుణనుకూడా యీ అన్నం ద్వారానే అమ్మ ప్రసారం చేస్తున్నదేమో ననిపిస్తున్నది. ఎవరు వచ్చి తమ ఏవిధమయిన బాధలను అమ్మకు

నివేదన చేసుకుంటున్నా వెంటనే అమ్మ అడుగుతుంది - భోజనం చేశావా నాన్నా - అని. వారు చేశామంటే - సరే, వెళ్ళిరా - అంటుంది. లేదంటే - అయితే వెళ్ళి భోజనం చేసిరా నాన్నా - అంటుంది. చేసి వచ్చామంటే-అయితే కొంచెమయినా.... ప్రసాదంగానే .... తీసుకొనివెళ్ళు నాన్నా - అని ఆదరంగా ఆదేశిస్తుంది వెంటనే మనకు అర్థం కాకపోయినా - కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఆదరణతోపాటు, ఆప్యాయతతోపాటు, అనురాగంతోపాటు బాధకు నివారణ, వ్యాధికి ఔషధం, సమస్యకు పరిష్కారం, ప్రశ్నకు సమాధానం, అభీష్టానికి సిద్ధి... అన్నీ ఆ అన్నపు ముద్దలోనే నిక్షిప్తమై ఉన్నవని అవగతమై తీరుతుంది. లేకపోతే - ఎంతో బాధతో, ఎంతో ఆశతో అమ్మ దర్శనంకోసం ఎవరు వచ్చినా అమ్మ వెంటనే వారికి అన్నపూర్ణాలయానికి దారి చూపించదు. మరి, అమ్మ అభిప్రాయం వాళ్ళు అమ్మను దర్శించడం వారి అభీష్టప్రాప్తి, కష్టాల విముక్తి కోసమే ననియేమో.

ఏ మహిమనూ ప్రకటించడానికి యిష్టపడని నిరాడంబరమయిన అమ్మ అన్నపూర్ణాలయ నిర్వహణంద్వారా తన అపారమయిన ప్రతిభనూ, మహిమనూ లోకానికి అభివ్యక్తం చేస్తూనే ఉన్నది నిత్యమూ, ఏ వేళలో ఎందరు జనులు వచ్చినా అక్కడ అన్నం వడ్డింపబడుతూనే ఉంటుంది ఏ పండుగలో ఎన్నివేలమంది వచ్చినా ఏ పదార్థానికీ లోటు వుండదు. అక్కడ ఎప్పుడూ భోజనాలవేళ సందడితో నిత్య కల్యాణంగానే ఉంటుంది. గాడిపొయ్యి నిరంతరమూ మండుతూనే ఉంటుంది. వందల టన్నుల కట్టెలు కాలుతూనే ఉంటాయి. పుట్లకు పుట్లు ధాన్యం బండ్లమీద మరకు వెళ్ళివస్తూనే ఉంటాయి. మరి యింత పదార్థం ఎక్కడనుండి ఎట్లా వస్తున్నదీ అని ఆలోచించుకుంటే - అందులో అమ్మయొక్క దివ్యశక్తి, అద్భుతమహిమావిశేషమూ మాత్రమే కనుపిస్తాయి. కాని అమ్మ ఎప్పుడూ, ఏ విషయంలోనూ తాను ప్రత్యక్షంగా ఏమీ చేయదు. అంతా పరోక్షంగానే ఉంటుంది. కనుకనే గాడిపొయ్యి కట్టెలులేక మండదు. గుండిగలో బియ్యం పోయక అన్నం తయారు కాదు. ఎవరో పదార్థాలు తేవలసినదే; ఎవరో వంట చేయవలసినదే; ఎవరో వడ్డించవలసినదే, కానీ ఆ పదార్థాలను తెచ్చినవారినీ, తెచ్చినతీరునూ, వంటచేసిన వ్యక్తులనూ, చేసిన విధానాన్నీ, పదార్థాలనూ, వాటి రుచినీ-పరిశీలిస్తే మాత్రం అడుగడుగునా అమ్మప్రేరణ మనకు అవగతమై, అన్నిటా అందరిలోనూ అంతస్సూత్రంగా అమ్మసంకల్పబలమూ, మహిమావిశేషమూ మాత్రమే స్పష్టంగా గోచరిస్తాయి.

అమ్మ వేదాంతప్రబోధంకూడా ఈ అన్నపూర్ణాలయం ద్వారానే చేయటం గమనార్హం. ఎవరయినా వచ్చి - అమ్మా, యింత అన్నదానం ఎట్లా చేయగలుగుతున్నారని ప్రశ్నిస్తే - ఎవరి అన్నం వారు తింటున్నారు ఇందులో ఒకరికి ఒకరు పెట్టటం ఏముంది? వాడి అన్నం యిక్కడ ఉన్నదీ, ఎక్కడవుండో వచ్చి తింటున్నాడు. లేదూ, యిక్కడనే ఉన్నా తినలేడు - అని సమాధానం చెబుతుంది అమ్మ.

ఎప్పుడూ ఎవరికీ ఏ విషయంలోనూ సందేశంగానీ ఆదేశంగానీ ప్రసాదించని అమ్మ ఒక సందర్భంలో అన్నది–నీకు యిచ్చింది తృప్తిగా అనుభవించటం, నీకున్నది నలుగురికీ ఆదరణంగా పెట్టటం, ఇదే నా సందేశం – అని. ఆదరణగా పెట్టటమంటే అన్నమనే అమ్మ ఉద్దేశం.

తన సమదృష్టినీ, సమసిద్ధాంతాన్నీ నిర్వచించటానికీ, నిరూపించటానికీ కూడా అన్నపూర్ణాలయాన్నే రంగస్థలంగా అమ్మ ఎంచుకున్నది. కనుకనే అక్కడ కుల, మత, వర్గ, వర్ణ, భాషా భేదరహితంగా సర్వులకూ ఒకే పంక్తిన భోజనం ప్రసాదింపబడుతున్నది.

సారాంశ మేమంటే– తన అనురాగం ప్రసారం చేయటానికీ, అనుగ్రహం ప్రసాదించటానికీ, మహిమను ప్రకటించటానికీ, వేదాంతం ప్రబోధించటానికీ, లౌకిక సందేశాన్ని ప్రవచించటానికి - అన్నిటికీ అమ్మ అన్నాన్నీ, అన్నపూర్ణాలయాన్నే ఉపకరణం చేసుకున్నది.

కనుకనే అన్నపూర్ణాలయం అంటే అనురాగక్షీరాబ్ధి అయిన అమ్మ అద్భుత హృదయానికి బాహ్యాకృతి మాత్రమే! అక్కడ ప్రసాదింపబడేది అన్నం కాదు, అమృతమే! అన్నపూర్ణాలయం నుంచే అమ్మ తన సంతానకోటి సర్వానికీ సురాసుర భేద రహితంగా సమంగా సహస్రబాహువులతో అమృతం పంచిపెడుతున్నది.

కానీ యింతమందికి యింత ఆదరంగా అన్నం పెట్టే అమ్మ తాను మాత్రం - మీరు తింటే నేను తిన్నట్లే - నంటూ తాను నిరాహారియై, మనను కడుపునిండా తినిపిస్తూ, తాను తృప్తిగా త్రేన్చుతూ ఉంటుంది.

— ఆగష్టు 1971

సంస్కరణ

1978 జనవరి 2 వ తేదీ ఉదయం సోదరుడు తూనుగుంట్ల త్రిలోక అప్పారావు మరొక సోదరుని వెంటబెట్టుకుని అమ్మవద్దకు వచ్చాడు.

ఆ సోదరుని అమ్మకు పరిచయం చేశాడు. పేరు బిపిన్‌కుమార్ బెహరా. కటక్ వాస్తవ్యుడు, స్మగ్లింగ్‌లో సిద్ధహస్తుడు. వంచనలో ప్రవీణుడు, చౌర్యంలో చతురుడు. సకల దుర్వ్యసనాల్లో సముద్దండుడు. అతని రూపమే మోటుదనానికీ, మొరటుదనానికీ ప్రతీకగా ఉన్నది. అతని కళ్ళల్లో క్రౌర్యం ఎఱ్ఱటి చారలుకట్టి కనిపిస్తున్నది.

పరిచయం చేయగానే అతడు అమ్మకు నమస్కరించి అతనిలోని దుర్గుణాలన్నీ ఏకరువుపెట్టాడు. ఆ సమయంలో అతని రాతిగుండె కరుగుతున్నట్లుగా అతని కళ్ళల్లో చెమ్మ కనిపించింది. అతని స్వరంలో స్పందన వినిపించింది.

"అబద్ధంకూడా ఆడుతావా, నాన్నా?" అని ప్రశ్నించింది అమ్మ లాలనగా.

"అదొక్కటే నమ్మా - నాలో లేనిది. ఏమి తప్పు చేసినా బహిరంగంగానే చెప్పేస్తాను" అన్నాడు వినయంగా.

"ఆ ఒక్కటి చాలు నాన్నా. ఎందరిలోనో లేనిదే అది. నీలో ఉన్నదే అది. నీ వనుకునే అన్ని అవగుణాలు ఆ ఒక్క సుగుణం ముందు మరుగున పడిపోతయ్."

"నన్ను బాగుచేయమ్మా-" అని వేడుకున్నా డతడు.

"ఇప్పుడు నువ్వు బాగానే ఉన్నావు నాన్నా. ఇప్పుడే కాదు, ఎప్పుడూ బాగానే ఉన్నావు" అంటూ అమ్మ తన దగ్గర ఉన్న కమలాఫలం వలిచి తొనలు అతని నోట్లో పెట్టింది. అతణ్ణి దగ్గరకు పిలిచి అతని వీపు నిమిరింది. ఆ స్పర్శలో ఎంత అనురాగం ఉన్నదో. ఎంత లాలన ఉన్నదో. ఎంత దివ్యత్వం ఉన్నదో! ... అతడు విచలితుడయ్యాడు. విభ్రాంతు డయ్యాడు. అనురాగ స్రవంతీ మగ్ను డయ్యాడు. ఆనందపరవశు డయ్యాడు.

ఆ అనుభవం అతనికి అపూర్వం. అతనికి పరిచయమున్న లోకము, మనుషులూ యిందుకు పూర్తిగా భిన్నమయినవారు కనుకనే ఆ పవిత్ర స్థలమూ, అమ్మ ఆప్యాయతా, ఆదరణా అతనికి ఒక వినూతన అనుభవాన్ని ప్రసాదించాయి.

అమ్మను చూస్తూ ఆ మమతామృతాన్ని తనివిదీరా పానం చేస్తూ అమ్మ చేతిలోని పండునే తీసుకుని వణికే తన చేత్తో అమ్మ నోటికి అందించి తినమని ప్రాథేయపడ్డాడు. అమ్మ కాదనకుండా ఆ తొనను చప్పరిస్తూ కరుణ తొణికిసలాడే కనులతో అతణ్ణి చూసింది. అమ్మ పరిపూర్ణ కృపామృత ధారల్లో తడిసిన అతను - ఎంత అదృష్టవంతుడో - అనుకున్నా రక్కడ కూర్చున్న అందరూ.

అతడు అమ్మ సన్నిధికి చేరిన ఉదంతం ఆశ్చర్యకరమైనది.

తూనుగుంట్ల త్రిలోక అప్పారావు ఏలూరు వాస్తవ్యుడు. అమ్మసన్నిధికి చిరకాలంనుంచి వచ్చేవారిలో ఒకడు. అమ్మను పరిపూర్ణంగా విశ్వసించి అనుక్షణం అమ్మనే స్మరిస్తూ ధ్యానించే వ్యక్తి. సర్వంలోనూ అమ్మనే చూట్టానికి ప్రయత్నించే ఉపాసకుడు. జీవితంలోని ప్రతిఘట్టంలోనూ అమ్మసూక్తులను సమన్వయం చేసుకునే సాధకుడు. అమ్మ కటాక్షాన్ని పొందిన భక్తుడు.

అతడు వేరుశనగనూనె వ్యాపారం చేస్తున్నాడు. 1977 జూన్ 20 వ తేదీన ఎమ్మిగనూరులో రూ 70,000/- లకు 40 పీపాల నూనె కొనుగోలుచేసి లారీపై ఏలూరుకు ఎగుమతి ఏర్పాటు చేశాడు.

ఆ లారీ A A T 2197. దాని స్వంతదారూ, డ్రైవరూ కూడా పైన ఉదహరించిన బిపిన్‌కుమార్ బెహరా. అతని వృత్తి ప్రవృత్తి ననుసరించి అతనికి యీ నూనెను దొంగతనంచేసి డబ్బుచేసుకోవాలనే దురూహ కలిగింది. దారిలో విజయవాడ వచ్చి – కొబ్బరికాయలు కొని నూనెపీపాలు కనుపించకుండా కప్పివేసి 'కనకదుర్గ'కు – తనను సురక్షితంగా గమ్యస్థానం చేర్చు–మని మ్రొక్కుకున్నాడు. అతని ప్రార్థన ప్రకారమే అతడు ఏ ఆటంకమూ లేకుండా గమ్యం చేరుకున్నాడు. నూనెను డబ్బు చేసుకున్నాడు.

నిర్ణీత కాలంలో లారీ ఏలూరు చేరకపోయేసరికి అప్పారావుకు అనుమానమూ, ఆందోళనా కలిగి వెంటనే ఎమ్మిగనూరు వెళ్ళి – అక్కడ పోలీసు రిపోర్టు యిచ్చాడు.

తిరిగివస్తూ – విజయవాడలో నటరాజ్ హోటల్‌నుండి అమ్మకు ఫోనుచేసి జరిగిన దుర్ఘటనను వివరించాడు.

అతను ఆ వ్యాపారంలో ఒక భాగస్తుడు మాత్రమే అయినప్పటి– అతనికి ఉన్న డబ్బునంతా అందులో పెట్టుబడి పెట్టాడు. క్రితం సంవత్సరాల్లో అతనికి ధాన్యంవ్యాపారంలో నష్టం వచ్చింది. అతని యింట్లో దొంగతనం జరిగి రూ 20,000/-లు పోయినయ్. గోరుచుట్టుపై రోకటిపోటుగా యిప్పుడు యీ విషాదోదంతం. అందువల్లీ అతని మనస్సు బాగా దెబ్బతిన్నది. అతని మనస్సు పూర్తిగా చంచల మయింది.

అతని మొరను ఫోనులో విన్న అమ్మ అన్నది "నాన్నా – అవతల మనిషి ఎంత అవసరంలో ఉండి అట్లా చేశాడో. అదీగాక యిప్పుడు నీకంటే అతడే ఎక్కువ బాధపడుతూ ఉంటాడు."

"మరి, యిప్పుడు నన్ను ఏమి చేయమంటా వమ్మా–"

"నువ్వు చేసే దేమున్నది? ఏదో ఒకటి అదే జరుగుతుందికదా. జరిగే దాన్ని చూస్తూ ఉండు."

అమ్మ సలహా విన్న అప్పారావుకు అమితమైన బాధతోపాటు కోపం కూడా వచ్చింది. తాను యిన్నేళ్ళుగా అమ్మనే నమ్మి కొలిచినందుకు యిదా ఫలితం! ఇదా సమాధానం? జరగవలసినదేదో జరగక తప్పనప్పుడు, జరిగేది చూస్తుండవలసి నప్పుడు - యిక యీ దేవుళ్ళెందుకు? ఈ పూజ లెందుకు? ఈ ప్రార్థన లెందుకు? అయినా, తాను యింత బాధలో జ్వలిస్తూ తెలియజేస్తే - తన సంగతి ఆలోచించడం, తనకు సానుభూతి అందజేయడం లేకపోగా, పైగా తనను మోసంచేసిన వ్యక్తి కష్టాల గురించి సానుభూతి కనుపరుస్తూ అతనిపై కరుణను క్రుమ్మరించడం అప్పారావుకు విస్మయాన్ని కలుగజేసింది. అయినా అమ్మను ఏమనగలడు ?

"అమ్మా-నే నీ బాధనూ, నష్టాన్నీ తట్టుకునే శక్తి నయినా ప్రసాదించు" అని వేడుకున్నాడు.

"నేను ప్రసాదించేది ఏముంది నాన్నా. ఆ శక్తి నీలోనే ఉన్నది...." అన్నది అమ్మ స్ఫుటంగా.

విచిత్ర మేమిటి అంటే - ఆ క్షణం వరకూ ఆందోళనతో అలమటించి పోతున్న తనలో ఆ క్షణంనుండి ఒక విధమయిన స్థిమితం ఏర్పడిందీ - అంటాడు అప్పారావు.

"సరే నమ్మా - నేనెట్లాగో సర్దుకుంటాను. మా ఆవిడకు ఏలూరు ఫోనుచేసి కొంచెం ధైర్యం చెప్పమ్మా -" అని బతిమిలాడుకున్నాడు; ఏలూరులో అతని భార్య గుండె నిబ్బరం కోల్పోయి కుప్పకూలి పోయింది. దిగులుతో నిద్రాహారాలు మరచి పోయింది.

అమ్మ వెంటనే ఏలూరు ఫోనుచేసింది. ఆవిడతో మాట్లాడింది. ధైర్యాన్ని ప్రసారం చేసింది "నువ్వేమీ భయపడొద్దు. నే నున్నాను, అన్నీ నేను చూసు కుంటాను" అని.

ఆ వాక్కూ- హామీ విన్నప్పటినుంచీ ఆమెలోకూడా ఆందోళన తగ్గిందట.

అప్పటినుంచీ అమ్మ దివ్యశక్తి ఈ విషయంలో పనిచేయ నారంభించిందని అప్పారావు అభిప్రాయం. ఎందుకంటే బెహరా కథనం ప్రకారం - అతను లోగడ ఎన్ని దొంగతనాలు చేసినప్పటికీ, ఎంత పెద్ద మొత్తాలు హరించినప్పటికీ - అతనిలో

మున్నెన్నడూ కలుగని కొన్ని అపూర్వమయిన భావసంచలనాలు ప్రారంభమయినా యట. అనిర్వచనీయమూ, అదృశ్యమూ అయిన ఏదో దివ్యశక్తి ఒకటి తనను వెంటాడుతున్నట్లు అనుభూతి కలిగేవట.

తత్ఫలితంగా జులై 12 వ తేదీన విజయవాడ వచ్చి తన తప్పును ఒప్పుకుని, తాను కాజేసిన డబ్బుకుగానూ తన లారీని అప్పారావుకు యిస్తానని వాగ్దానం చేశాడు. తనను తన తమ్మునిగా భావించి కోర్టులో కేసు లేకుండా కాపాడ మన్నాడు. అతనికి కొద్దికాలం క్రితమే వివాహ మయిందట. కానీ యీ వ్యసనాలకు లోనై భార్యతో ఎక్కువకాలం గడపలేదట. భార్యకూ, సంసారానికీ తాను దూరమై పోతాననే భావం ఏర్పడినప్పుడుగానీ అతనికి దాని విలువ అర్థంకాలేదు.

ఈ జాలిగాథ వినేసరికి అప్పారావులో అనురాగం పొంగి పొరలింది. తన తమ్ముడే ఏదయినా తప్పుచేస్తే అతణ్ణి తాను పోలీసులకు అప్పచెబుతాడా, కటకటాల వెనక్కు పంపుతాడా? వెంటనే అప్పారావుకు – అమ్మతో తాను ఫోనులో మాట్లాడినప్పుడు అమ్మ పలికిన పలుకులు స్ఫురణకు వచ్చినయ్. అమ్మ అతనిపై అపారమైన ప్రేమను కరుణనూ కనపరచింది.

మరి, అమ్మకు అందరూ బిడ్డలే కదా. మంచివాడూ బిడ్డే, చెడ్డవాడూ బిడ్డే దొంగా బిడ్డే దొరా బిడ్డే. బిడ్డలు ఏం చేసినా తల్లికి తప్పే కనుపించదు. మరి, అమ్మకు అతడు బిడ్డ అయినప్పుడు తనకు సహోదరుడే గదా. మరి, యిక తన తమ్మునిపై తనకు కక్షసాధింపు ఎందుకు? అదీగాక అమ్మ అనేక పర్యాయాలు చెప్పింది– "ఎవరు ఏమి చేసినా అందుకువారేమీ బాధ్యులు కారు అందరినీ నడిపే ప్రేరణ ఒకటి ఉన్నది. కనుక ఒకడు మంచి చేసినా వాడిని పొగడ నవసరం లేదు. ఒకడు తప్పు చేసినా నిందించ నవసరం లేదు" అని. మరి, భగవన్నిర్ణయమయిన కార్యక్రమంలో అతడూ ఒక సాధనం మాత్రమే అయినప్పుడు అతనిపై విరోధం ఎందుకు? – ఎప్పుడూ అమ్మతత్వాన్ని అమ్మ వాక్యాలనూ పునశ్చరణ చేసుకుంటూ యితరులకు బోధించే తాను తన విషయం వచ్చేసరికి జారిపోతే ఎలా?

అమ్మకు అందరూ బిడ్డలయినపుడు లోకంలో అందరూ తనకు సోదరులే కదా అసలు, అమ్మ మనలో విశ్వసహోదర భావం కలిగించేందుకే తాను 'విశ్వజనని' సంభావనను ప్రపంచానికి ప్రసాదించిందా? మరి, అమ్మ ప్రసారంచేస్తున్న యీ

మహాసందేశాన్ని తాను ఏమి అర్థం చేసుకున్నట్లు? ఆచరణలేని ఆదర్శానికి ప్రయోజన మేమున్నది?

.... ఇట్లా ఆలోచనలు అంతరంగంలో తరంగిత మయ్యేసరికి – అప్పారావులో బెహరాపై అభిమానం ఏర్పడింది. అతడిని ఎలాగైనా రక్షించాలనే అభిప్రాయం కలిగింది. అలా అతనికి వాగ్దానం చేశాడు.

ఈలోగా బెహరా అన్నదమ్ములు చాలా వక్రగతుల్లో ఆలోచనలు చేసి–లారీ అప్పారావుకు యివ్వవద్దని సలహా యిచ్చారు. కానీ బెహరా వారి సలహాను సమ్మతించలేదు.

జులై 21వ తేదీన బెహరా ఆదోని మేజిస్ట్రేట్ కోర్టులో లారీని అప్పగించాడు. అంతకుముందే 407 వ సెక్షన్ క్రింద కేసు రిజిష్టరు అయినందువలన బెహరాను ఆదోని తాలూకా జెయిల్లో బంధించారు.

అక్కడ అతనికి ఒక అనుభవం అయింది తనతోపాటు కారాగారంలో ఉన్న యిద్దరు ఖైదీలు మాట్లాడుకుంటూ ఉండగా అతను విన్నాడు. ఒక ఖైదీ మరో ఖైదీని అడిగాడట–తాను ఏమి తప్పు చేస్తే శిక్ష విధించబడిందని. తన కుటుంబం వస్తులతో ఉంటే చూడలేక అతడు అరబస్తా ధాన్యం మాత్రం దొంగతనం చేశాడట. రెండో అతనుకూడా చాలా చిన్న దొంగతనం–అదీ అత్యవసరమై చేశాడట.

ఆ సంభాషణ విన్న బెహరాలో పశ్చాత్తాపం రగిలింది. వాళ్ళు అత్యవసర పరిస్థితుల్లో చాలా చిన్న దొంగతనాలు చేస్తేనే వాళ్ళకు శిక్ష తప్పలేదు. మరి – తాను ధన ప్రలోభంతో, విలాస జీవితంపై వ్యామోహంతో ఒక ఉత్తముని మోసంచేసి ధనం అపహరించాడు. కనుక తాను శిక్ష అనుభవించడం న్యాయం. మరి, తాను శిక్ష అనుభవిస్తూ బందిఖానాలో ఉంటే తనను నమ్మి తన జీవితాన్ని పంచుకున్న ఉత్తమురాలయిన భార్య గతి ఏమిటి?

దుస్సహమైన యీ ఆలోచనలతో కన్నీటిధారలతో అప్పారావును వేడుకున్నాడు. అప్పారావు యిచ్చిన హామీవలన బెహరా తాత్కాలికమైన విడుదల పొందాడు.

డిశంబరు చివరివారంలో ఆదోని కోర్టులో విచారణ. బెహరా, అప్పారావు యిద్దరూ ఆదోని వెళ్ళారు.

క్షణక్షణానికీ అప్పారావులో సోదరభావం ఉత్తుంగ తరంగితమై అతణ్ణి నిలువెల్లా ఆక్రమించి అతని రక్తంలోని కణకణాన్నీ మధురభావ ప్రభావితంచేసి అతని సమస్త నాడీమండలాన్నీ సముత్తేజ పరచి కర్తవ్యోన్ముఖంచేసింది. బెహరాను ఎట్లాగైనా గత మార్గాన్నుంచి మళ్ళించి ఉత్తమ మానవునిగా సత్పౌరునిగా తీర్చి దిద్దాలనే పట్టుదల మనసంతా నిండిపోయింది. కనుకనే బెహరాను వెంటబెట్టుకుని మహానంది, మంత్రాలయం వగైరా పుణ్యక్షేత్రాలన్నీ చూపించాడు. ఎన్నో కథలూ, గాథలూ వివరించాడు. సమయం దొరికినపుడెల్లా అమ్మ గురించి తెలియజేశాడు. అమ్మ ప్రేమమార్గాన్ని విపులీకరించాడు.

పాపులయెడల, పతితులయెడల అమ్మకుగల ఔదార్యమూ, క్షమా, అనురాగమూ సోదాహరణంగా బోధించాడు. పుణ్యశీలురనూ, పావన చరితులనూ సన్మార్గులుగా ప్రేమించే గౌరవించే వ్యక్తులు ఎక్కడైనా ఎందరైనా ఉండవచ్చును గానీ-పాపులనుకూడా "నాబిడ్డలే" అని అనుకోవడమే కాక బాహాటంగా ప్రకటించి వారినీ తన ఒళ్ళో చేర్చుకుని ఓదార్చే వ్యక్తులను జీవితంలోగానీ, లోకంలోగానీ, చరిత్రలోగానీ మరెక్కడా చూడలేదని ఉద్ఘాటించాడు. తనకు అమ్మే ఆదర్శమన్నాడు. అమ్మే ఆరాధ్య మన్నాడు అమ్మే సర్వస్వ మన్నాడు. తన జీవితానికి ఆధారమూ ఆలంబనమూ గమ్యమూ అమ్మేనన్నాడు. తనకే కాదు సర్వ లోకానికీ సమస్త జీవులకూ, సర్వ సృష్టి స్థితి లయాలకూ మూలం అమ్మేనని తన విశ్వాసమన్నాడు.

బెహరా అన్నీ విన్నాడు. అంతా జీర్ణించుకున్నాడు. అతనికి తానొక క్రొత్తలోకానికి వచ్చినట్లుగా ఉన్నది. వీళ్ళందరూ మానవులుగా కనుపించడం లేదు. దేవతలుగా దర్శనమిస్తున్నారు. అపకారులకూ ఉపకారం చేయడం 'నేర్పరి' లక్షణంగా తాను విన్నాడుగనీ అది సహజగుణంగా కలవారిని తానింతవరకూ చూడక పోవటమే కాదు. వినన గూడా లేదు. సాధారణ మనుషుల్లో యింత గొప్పగుణం అదృశ్యమే ననుకున్నాడు గానీ లోకంలో యిటువంటి వ్యక్తులను తాను ఎరుగనన్నాడు. కనుకనే అవినీతి పూరితమైన గత నికృష్ట నీచ జీవితమంటే తనకు అసహ్యమనిపించింది. నిజాయితీ జీవితంలోని సుధామాధుర్యం తనను ఆకర్షించింది. శేషజీవితం పవిత్రంగా గడపాలనేదృఢ నిశ్చయం కలిగింది.

డిసెంబరు 31 వ తేదీన తీర్పు చెప్పారు. బెహరాకు ఆనాడు కోర్టు ముగిసేవరకూ నిర్బంధమూ, రూ 2000/-లు అపరాధమూ విధించారు. బెహరావద్ద

పైకం ఏమీ లేదు. తన బంధువులు ఎవరూ తనకోసం రాలేదు. ఆ సమయంలో అప్పారావు తానే ఆ పైకాన్ని న్యాయస్థానంలో కట్టి అతణ్ణి విడుదల చేయించాడు.

ఇక, అతను ఒక్క క్షణం వృధాపోనీయక – అమ్మను చూపించమని అప్పారావును వేడుకున్నాడు. ఇద్దరూ కలిసి జిల్లెళ్ళమూడి వచ్చారు.

అనుక్షణమూ అమ్మసూక్తులను అధ్యయనంచేసే తనకు ఒక క్లిష్ట పరిస్థితిలో అమ్మ సందేశాన్ని ఆచరణలో పెట్టగలిగిన హృదయాన్ని ప్రసాదించి నందుకు అప్పారావు అమ్మ పాదాలకు ప్రణమిల్లాడు. తన కొక క్రొత్త మార్గాన్ని చూపి క్రొత్త జీవితాన్ని ప్రసాదించినందుకు బెహరా అమ్మముందు మోకరిల్లాడు.

ఇద్దరినీ చెరొక చంకలోకి తీసుకుని ఆనందపరవశురాలయిన 'విశ్వజనని' నయన యుగళిలో వెలిగిన కాంతిరేఖలతో ఆ గది అంతా దివ్యదీప్తి భాసితమయింది. ప్రతివాడూ అప్పారావువలే ప్రతి తోటి వాడినీ తోడబుట్టువుగా భావించి ప్రేమించ గలిగితే అమ్మను 'విశ్వజనని'గా ఆరాధించే మన పూజలకు సార్థకత కలుగుతుంది. అవతార మూర్తి అయిన అమ్మ అందరినీ తన బిడ్డలుగా చూడటంలో ఆంతర్యం 'మన మందరం ఒక తల్లి బిడ్డలమే' అన్న భావం మనలో పాదుకొల్పడమే కదా! అది మనం అర్థంచేసుకుని ఆచరించగలిగితే – ఆ భావం మన రక్తగతమైతే–అప్పుడు మనందరం అమ్మకు నిజమైన వారసుల మవుతాం. ఆ రక్తమాంసాల్ని పంచుకు పుట్టినవాళ్ళ మవుతాం.

అప్పుడు యీ లోకం నాకమే కాదూ?

— ఫిబ్రవరి 1978

అమ్మ వేసిన ప్రశ్న

1973 జనవరి 17 వతేదీ రాత్రి పదకొండు గంటలయింది. చిలకలూరి పేటనుండి యిద్దరు సోదరులు వచ్చారు. వారిలో ఒకరు జ్యోతిష్కులు. అందునా ప్రశ్న భాగంలో దిట్టలు. వారు తత్ శాస్త్రం ఎంత విశిష్టమైనదో, వారింతవరకు ఎన్ని ప్రశ్నలకు ఎంత నిర్దుష్టమయిన సమాధానాలు చెప్పారో సోదాహరణంగా వివరిస్తూ అమ్మను ఒక ప్రశ్న అడగమని అర్థించారు అమ్మ తనకేమీ ప్రశ్న లేదన్నది. వారు బతిమాలారు, అమ్మ తనకు ప్రశ్న స్ఫురించడం లేదన్నది. "ఒక్క ప్రశ్న అడుగమ్మా" అని వారు మరీ మరీ ప్రాధేయపడ్డారు. చిట్టచివరకు అమ్మ అంగీకరించింది.

"ప్రపంచంలో అందరూ కడుపునిండా తినాలి. ఎవరూ ఎప్పుడూ ఆకలి బాధకు గురికారాదు. ఆ తరుణం ఎప్పుడు ? అది సాధ్యమేనా ?" అని అడిగింది అమ్మ.

ఆ జోతిష్కులు వెంటనే ఆ ప్రశ్నకు లగ్నంకట్టి చక్రంవేసి ఫలితము గుణించే ఆలోచనలో పడ్డారు. మేము పకాపకా నవ్వి "నీకెప్పటూ మా తిండి గొడవేనా ?" అని అడిగాము.

ఒక్క క్షణం విరామం లేకుండా అమ్మ స్పష్టం చేసింది- "ఔను నాన్నా- నా కేదయినా ఆలోచన ఉంటే మీరు తినటం గురించే, ఎవరు తిన్నారో ఎవరు తినలేదో నని, నాకేదన్నా విచారమంటూ ఉంటే మీకు తృప్తిగా పెట్టుకోలేక పోతున్నాననే."

జిల్లెళ్ళమూడిలో టెలిఫోను పెట్టిన మొదటిరోజున అమ్మ అందుకు ప్రారంభోత్సవం చేస్తూ ఎవరిని పిలిచినా అడిగిన ప్రశ్న "భోజనం చేశావా ?" అని

తనను దర్శించ వచ్చిన వారిని అమ్మ మొదటగా అడిగే ప్రశ్న "భోజనం చేశావా నాన్నా-" అని.

ఈ ప్రశ్నలూ, విచారణలు - అమ్మకు మానవజాతిపైగల అపార సానుభూతినీ, ప్రేమనూ వ్యక్తం చేయవచ్చునుగానీ మనను అపమార్గం పట్టించడానికి అవకాశం ఉన్నది. సర్వజ్ఞ అయిన, సర్వ సమర్థ అయిన అమ్మనుండి అరీతి విచారణా, విచారమూ మనకు సంభ్రమాశ్చర్యాలను కలిగించటమే కాదు, తికమక పెడతాయి కూడా.

సర్వ సృష్టికీ ఆధారం అమ్మేనని మన విశ్వాసమూ, అమ్మ అంగీకారము కూడా. మరి తాను అమ్మనని చెబుతూ అమ్మ అంటే అంతులేనిదీ, అడ్డులేనిదీ, అన్నిటికీ ఆధారభూతమయినదీ అని వివరించింది కదా. ఆకలికీ, అన్నానికీ, దుఃఖానికి ఆనందానికీ.... సర్వానికి మూలకారణమైన శక్తి ఒక్కటేనని ప్రబోధించే అమ్మ మాటలలో కనుపించే కిరుణ అర్థం కాదు.

అందువలననే ఒకసారి శేషగిరిరావు అన్నయ్య "జగమేలే పరమాత్మ - ఎవరితో మొరలిడుదువు ?" అని ప్రశ్నిస్తే వెంటనే అమ్మ జవాబు "నాతో నేనే" నని.

తానే సృష్టి స్థితి లయాలు, తానే కష్టసుఖాలు, తానే నవరాత్రులు - ఔను, అన్నీ తానే నన్నది అమ్మ. ద్వంద్వాలు తానేనని తెలియటమే జ్ఞానం. ఆ జ్ఞానమే భగవంతుడు!

ద్వంద్వాలలో నలగడమే మానవత్వం. అంటే కష్టంలో విషాదమూ, సుఖంలో ఆనందమూ, నష్టంలో కృంగిపోవటమూ, ఫలంలో పొంగిపోవటమూ – మానవనైజం.

మరి అమ్మలోనూ యీ ద్వంద్వాలు లాస్యం చేయడమూ, ఆ ద్వంద్వాల్లో అమ్మ ఊయలలూగటమూ మనకు కనిపించి మన ఊహకు భ్రాంతి కలిగిస్తున్నాయి.

ఆ సమయంలోనే అమ్మ అంటుంది- "నేనూ మీవంటి దాననే. ప్రత్యేకత ఏమీ లేదు" అని. కానీ ఒక్క విశేషం మనం అవగతం చేసుకోవాలి. మనకూ విషాదముంటుంది, అమ్మకూ విషాద ముంటుంది. అయితే మన ఖేద మోదాలు సంకుచిత పరిధులకే పరిమితమై ఉంటాయి. అమ్మ ఖేదమోదాలు సర్వసృష్టినీ ఆధారం చేసుకుని అల్లుకుని ఉంటాయి,

కనుకనే మమకారమే భ్రాంతియనీ. దుఃఖానికి కారణమనీ పలికిన అమ్మ అపరిమితమయిన మమకారం దైవమని ఉద్ఘాటించింది.

ఔను – ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండు !

–జనవరి 1973

తప్పొప్పులపట్టికలేదు

"అమ్మా - పెద్ద తప్పు చేశానమ్మా. అప్పటినుండీ మనస్సుకు శాంతి లేదు. ప్రభుత్వపు చట్టానికి అందే తప్పు అయితే - కోర్టు విచారించేది ; శిక్ష విధించేదీ. దానితో సరిపోయేదీ ..."

అమ్మ మౌనంగా వింటున్నది. చుట్టూరా ఎంతోమంది కూర్చున్నారు "ఇది అట్లాంటి తప్పు కాదమ్మా - నేను నోరు తెరచి ఎవరికీ చెప్పుకోలేను. అది నిరంతరం నన్ను వెంటాడుతున్నది ఆ జ్ఞాపకం నాలో ఆరని కాష్టమై నన్ను నిలువెల్లా కాల్చివేస్తున్నది."

అతని గొంతు వణికింది. అతని కళ్ళు కాలువలు గట్టినయ్. అప్పటిదాకా చుట్టూ కూర్చున్న జనాన్ని చూచి సిగ్గుపడుతున్నవాడు అభిమానం విడిచి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు.

అమ్మ అతనిని దగ్గరకు పిలిచింది. అతడు దగ్గరకు జరిగి అమ్మ ఒడిలో వాలిపోయాడు.

సర్వశాస్త్రాలు మనిషి ప్రవర్తనను రెండుగా విభజించాయి - మంచి పనులనీ, చెడ్డపనులనీ. మంచిపనులకు పుణ్యకార్యాలనీ, చెడ్డ పనులకు పాపకార్యాలనీ

మతాలు నామకరణంచేసి – పుణ్యకార్యాలకు ఫలితం స్వర్గసుఖాలనీ, పాపకార్యాలకు పర్యవసానం నరకయాతన అనీ నిర్దేశించినయ్.

మనిషికి గల ప్రకృతి సహజమైన బలహీనతతో ఎప్పుడో ఒకప్పుడు ప్రతివాడూ ఏదో ఒక తప్పు చేయకపోడు. అందుకు ఫలితంగా అతడు ఆమరణాంతం – మరణానంతరం అనుభవించబోయే నరకయాతనలను ఊహించుకుని దహించుకుపోక తప్పదు. ఈ భయంతో నిత్యజీవితంలో అనేకవిధాల కృంగిపోతూ జీవితమంతా నిరాశానిస్పృహలతో నిస్సారం చేసుకోవడమే కాక బ్రతుకును చితిపై కెక్కించి నిప్పంటించుకొనే వారెందరో ఉన్నారు. అటువంటి సోదరీ సోదరు లెందరో అమ్మ వద్దకు వచ్చి పశ్చాత్తాపంతో అమ్మచరణాలపై వాలిపోతారు.

అమ్మకు అందరి బిడ్డలపై అనురాగమే అయినా, 'పతితులం' అని వాపోయేవారి యెడల, సమాజం దృష్టిలో, శాస్త్రం దృష్టిలో 'పాపులు' అని ముద్ర వేయబడిన వారియెడల అనురాగమూ, అనుకంపా అధికం. అందుకనే అమ్మ "మంచివాళ్ళను లోకమెలాగూ మెచ్చుకుంటుందీ, ప్రేమిస్తుందీ, గౌరవిస్తుందీ. వాళ్ళ మంచితనమే వారిని కాపాడుతుంది కానీ చెడ్డవాళ్ళనబడే వాళ్ళను నేనుకూడా దగ్గరకు తీయకపోతే ఎట్లా ? వాళ్ళకు నా ఒడిలో ఎప్పుడూ చోటుంటుంది. వాళ్ళ కన్నీటిని తుడవటంలోనే యీ చేతులకు సార్థకత..." అని అనేక పర్యాయాలు చెప్పింది.

వట్టి మాటలు చెప్పడం, ఓదార్చడం మాత్రమే కాదు ఎంతో ఘోరమైన తప్పిదాలను చేసినవారినికూడా అపారమైన దయతో క్షమించి వారికి దుఃఖ నివారణనూ, నిర్మలమైన మనస్సునూ, నిండైన జీవితాన్నీ అమ్మ ప్రసాదించిన ఘట్టా లనేక మున్నాయి.

తప్పు అన్నా పాపం అన్నా యితరులకు బాధను కలిగించడమే కదా. ఇతరులకు బాధను కలిగించినవారిని, అదీ హత్యచేసిన వారిని అయినా మనమూ క్షమించ వచ్చునూ, సహించవచ్చునూ. కానీ మనపై కాలు దువ్విన వారినీ, మనపై కత్తి నెత్తిన వారినే కాదు మనను కటువుగా ఒక్కమాట అన్నవారినే మనం సహించలేము. అమ్మ తనను హింసించినవారినీ, తనకు ద్రోహం చేసినవారినీకూడా నిరవధిక ప్రేమతో కరుణతో క్షమించిన సంఘటనలను మనం కళ్ళారా చూసినప్పుడు, ఆ అసాధారణ మనస్తత్వానికి విభ్రాంతులం కావడమే కాదు, ఆ అత్యున్నతమైన వ్యక్తిత్వానికి వినమ్రములమై అంజలి ఘటిస్తాము

అమ్మయౌవనంలో అమ్మస్త్రీత్వాన్నే మలినపరచటానికి ఉద్యమించిన కీచకుడొకడు యిటీవల అమ్మ పాదాల నాశ్రయించాడు. అమ్మ అతనిని అప్తునివలె దగ్గరకు తీసుకుని అతని కన్నీళ్ళు తుడిచి, అతనికి పసిబిడ్డకువలే నోట్లో అన్నం పెట్టి, బంధువుకువలె నూతన వస్త్రాలను బహూకరించింది.

మారణాయుధాలతో తన యింటిపై దాడిచేసి, ఎందరిపైననో హత్యా ప్రయత్నం చేసి, గాయపరచి యింట్లోని సొమ్మునంతనూ అపహరించి, ఆకాశ చుంబితమైన తన కీర్తి పతాకను భూతపసం చేయటానికి కక్షతో పూనుకున్న దుండగులను పోలీసులు పట్టుకుని తన ఎదుటకు తీసుకువస్తే – యితరులైతే సామాన్యంగా ఏం చేస్తారు? వారిపై ప్రతీకారం తీర్చుకుంటారు: లేకపోతే తీర్చుకోవ టానికి ప్రయత్నిస్తారు. కానీ, అమ్మ ఏం చేసిందీ? ముందుగా వారికి కాఫీ యివ్వండీ, కడుపునిండా అన్నం పెట్టండీ – అని ఆదేశించింది.

తనపై కత్తిదూసిన వాడిని కూడా "వాడూ నాబిడ్డే–" అని అమ్మ మాత్రమే అనగలుగుతుంది. అందుకే అమ్మ అందరికీ అమ్మ అయింది. ఆ అమ్మ "తల్లికి తప్పే కనుపించదు" అని ఉద్ఘాటించింది

అమ్మ దృష్టిలో – మనిషి ఏ పనిచేసినా, అందుకు మూలం అతనిలోని ప్రేరణ మాత్రమే. ఆ ప్రేరణ విధిచోదితం. కనుక మనిషి చర్యలకు మనిషి బాధ్యుడు కాడు. మంచిచేసినా, చెడ్డచేసినా మనిషి కర్తకాడు. అతనికి కర్తృత్వం లేదు. అతనికి ప్రేరణ నిచ్చిన దైవమే కర్త. కనుక మనిషి మంచిపని చేస్తే అతడిని పొగడ నవసరం లేదు; చెడ్డపని చేస్తే తెగడనవసరంలేదు. "నా దృష్టిలో పాపపుణ్యాలనేవే లేవు, పాపమనేది ఏమైనా ఉంటే – భగవంతుడంత పాపిష్టి లేడు. అందుకు శిక్ష ఏమైనా ఉంటే – అది వాడికే వేయాలి..." అంటుంది అమ్మ.

"కొట్టి తిట్టి నన్ను ఏడిపించలేరు. మీ మంచితనమే నన్ను ఏడిపిస్తుంది–" అని చెప్పిన అమ్మ బిడ్డల్లోని మంచితనానికి తాను కరిగిపోతూ, తమ చెడ్డతనానికి కుమిలిపోయే బిడ్డలకు నిష్కృతిని ప్రసాదించడమే కాక, వారిని ఓదారుస్తూ, లాలిస్తూ వారివెంట తానూ నడుస్తూ వారినీ మంచిదారుల నడుపుతుంది. మంచి చెడ్డలు రెండూ ఒకదాని కొకటి వైరుధ్యం కావు: సృష్టి వైవిధ్యానికి చిహ్నాలు మాత్రమేననీ రెండూ ఉన్నప్పుడే సృష్టి పరిపూర్ణ మవుతుందనీ వివరిస్తుంది.

— మే 1977

వెలితి

1977 నవంబరు 5 వ తేదీన మధ్యాహ్నం... విశాఖపట్నంనుంచి వచ్చిన శ్రీ రామకృష్ణశెట్టిగారికి అమ్మ ఎన్నో కబుర్లు చెబుతూ అన్నం కలిపి పెట్టింది. మరి ఆ అన్నంలో ఎంత అమృతం కలిపిందో ! ఎంత అనుగ్రహం కలిపిందో ! !

కడుపునిండా అన్నం పెట్టిన తర్వాత ఆయన్ను దగ్గరకు తీసుకుని కుంకుమతో బొట్టుపెట్టి అమ్మ క్రొత్తగుడ్డలు ప్రసాదించింది. అప్పటిదాకా దివ్య వాత్సల్యపరంపరాధిలో తలమునకలై పరవశిస్తున్న ఆ సోదరుడు కొన్ని క్షణాలు నిశ్చేతనుడై "అమ్మా-చిన్నతనంనుంచీ నాకు అన్నీ ప్రసాదించావు నాకు ఏ వెలితీ లేదు. నా కీ క్రొత్తగుడ్డలు ఎందుకమ్మా" అని అడిగాడు అమాయకంగా.

వెంటనే అమ్మ అన్నది "నీకు వెలితి ఉందని కాదు నాన్నా! నాకే వెలితి ఉంది. దాన్ని పూడ్చుకోడానికే యివన్నీ –"

ఆ సమాధానానికి అతడు అప్రతిభుడై నిరుత్తరుడై పోయాడు.

అమ్మకు వెలితి ! ? సంపూర్ణత్వమే తానయిన అమ్మకు లోపమా ?

అతనిలో ఏమి ప్రశ్నలు ప్రభవించాయో, ఏమి సమాధానాలు సముత్పన్నమైనాయో.... అతడిలో శోకం సముత్తుంగ తరంగితమయింది. అతడి కపోలాలు

తడిశాయి. అమ్మ కొనగోట లాలనగా మృదువుగా అతడి కన్నుల్లో మెరిసే అశ్రు పీణను మీటుతూ, తన పమిట చెంగుతో సిక్త కపోలాలను తుడుస్తూంది.

ఏమీ వెలితిలేని అతడు దుఃఖలహరిలో కొట్టుకొనిపోతూ ఉంటే – వెలితి గల అమ్మ చిద్విలాసంగా ఆనందతీరాన ఆసీనయై అతడికి కరాపలంబ మొసగి చేరువకు చేదుకుంటున్నది.

అదొక విచిత్ర సన్నివేశం !

ఒకసారి ఒక సోదరుడితో మాట్లాడుతూ అమ్మ "ఆశా అసంతృప్తుల కలయికే జీవితం" అని రమణీయంగా నిర్వచించింది. ఆ సోదరుడు "యీ సూక్తి నీక్కూడా వర్తిస్తుందా ?" అని అడిగితే "ఎందుక్కాదూ ? పిల్లలు కావాలని నాకూ ఆశ, ఉన్నవాళ్ళు చాలక అసంతృప్తి. ఎంతగానో మీకు పెట్టుకోవాలని ఆశ; ఆశించి నంతగా పెట్టుకోలేకపోతున్నానే అని అసంతృప్తి .... యిట్లాగే నా మనస్సు ఆశా అసంతృప్తుల మధ్య ఊగిసలాడుతూనే ఉంటుంది నాన్నా–" అని వివరించింది అమ్మ.

అమ్మ మనకు అన్నం పెడుతూ మనం తింటుంటే తాను త్రేన్చుతూ "మీరు తింటే నేను తిన్నట్లే నాన్నా–" అంటుంది.

మీకు పెట్టుకోకపోతే, మీరు తినకపోతే నేను చిక్కిపోతాను" అని విచిత్రమయిన సత్యాన్ని పదేపదే వ్యక్తం చేస్తుంది.

అమ్మ తన దగ్గరకు వచ్చిన ప్రతివాడిచేత బతిమిలాడి అన్నం తినిపిస్తూ ఉంటుంది. నీ కీ శ్రమ ఎందుకమ్మా ?" అంటే అది తన తృప్తి కోసమే నంటుంది.

ఒక్కొక్కసారి తాను లేవలేని స్థితిలో చాలా అనారోగ్యంగా ఉండికూడా ఆరోగ్యంగా, బలంగా ఉండి కరచరణాదులు సవ్యంగా పనిచేసే వారిక్కూడా – వాళ్ళ వయస్సుతో, హోదాలతో నిమిత్తం లేకుండా – ఆప్యాయంగా, ఆదరంగా కబుర్లు చెబుతూ కథలు చెబుతూ.... అల్లరిచేసే పిల్లలను తల్లి చంకన వేసుకుని ఆకాశాన్ని చందమామనూ చూపించి అన్నం తినిపించినట్లు ... అమ్మ స్వయంగా అన్నం కలిపి ముద్దలుచేసి నోటికి అందిస్తూ ఉంటుంది. అన్నం పెట్టిన తర్వాత వాళ్ళ మూతిని తానే వంగి చీరెపమిటతో తుడుస్తుంది. ఆ తరుణంలో అమ్మ నయనాంచలాల వెలిగే దీప్తిలో ఎంతో ఆనందమూ సంతృప్తి స్పష్టంగా కనిపిస్తాయి.

ఈ సంఘటనలు చూస్తూ ఉంటే - అమ్మ ఎవరికి పెడుతున్నదీ అన్న విషయంలో ఏ మాత్రం ప్రాధాన్యం ఉన్నట్లు కనిపించదు. అమ్మకు అన్నం పెట్టడమే కావాలి. ఎవరికీ అన్నది కాదు.

అట్లాగే ఎందరికో గుడ్డలుకూడా పెడుతుంది, వాళ్ళు కట్టుకుంటే తాను ఆనందిస్తుంది. "ఈ చీరె నేను కట్టుకునే కంటే నువ్వు కట్టుకుంటేనే ఎంతో బాగున్న దమ్మా-" అని ప్రశంసిస్తూ ఉంటుంది.

ఈ సంఘటనలన్నీ సమీకరించుకుని సమీక్షించుకుంటే- మనకు అమ్మ బహురమ్యంగా దర్శన మివ్వడమే కాక, మన ఆలోచనలకు క్రొత్త బాటలు వేస్తుంది.

"మీ ధ్యేయమూర్తి ఎవరమ్మా?" అన్న ప్రశ్నకు సమాధానంగా "మీరే నా ధ్యేయమూర్తులు" అనీ.... "మీరు దేవుడ్ని చూశారా?" అంటే "మిమ్మల్ని చూస్తున్నానుగా మీరు దేవుడు కాకపోతే గదా" అనీ.... "ఈ కనిపించేదంతా దైవమే" ననీ ప్రవచించింది అమ్మ.

భక్తికి అనేక ముఖాలు. ఆరాధన పలు రకాలు. ఒకడు తన భక్తిని సాహిత్యంద్వారా మరొకడు సంగీతం ద్వారా ప్రకటించుకుంటాడు. ఒకడు ఒక్క సత్యవాక్కుద్వారా సిద్ధి పొందితే, మరొకడు అహింసద్వారా జీవిత పరమార్థాన్ని అందుకుంటాడు. ఒకడు త్యాగం ద్వారా, మరొకడు యోగంద్వారా జీవిత లక్ష్యాన్ని చేరుకుంటాడు. ఒకరు తన బిడ్డలో దైవాన్ని చూస్తే, మరొకరు దైవాన్ని, తన బిడ్డగా భావిస్తారు. రాతినే దైవంగా భావించే, దాన్ని సజీవంగా ఊహించి, దానికి నిత్యమూ స్నానం చేయించి, అలంకరించి, అన్నంపెట్టి, జోలపాడి, నిద్రబుచ్చి ....ఆ సేవలో ఆ ప్రేమలో ఎంతో ఆనందాన్ని అనుభవించే కొందరిని మనం చూస్తున్నాం.

అట్లాగే అమ్మకూడా మనలో దైవాన్ని చూస్తూ ఆరాధిస్తున్నదా? అమ్మకు యిది సాధన మార్గమా ?

ఏ సామాన్యమైన తల్లి అయినా - తాను తిన్నా తినకపోయినా తన బిడ్డకు కడుపునిండా పెట్టుకోవాలని ఆకాంక్షిస్తుంది. తన బిడ్డ కంటికింపుగా గుడ్డలు

కట్టుకోవాలని అభిలషిస్తుంది. అదే విధంగా ఏ విచక్షణా లేకుండా భిన్నత్వంలేని మన సత్వంతో మనందరికి అన్నం పెట్టుకునీ, గుడ్డలు పెట్టుకునీ ఎనలేని ప్రేమను కురిపిస్తూ బిడ్డల ఆనందమే తన ఆనందంగా భాసిల్లే తత్వం అమ్మలోని సర్వ మాతృత్వానికే నిదర్శనమా ?

"మీరు నా బిడ్డలే కాదు, నా అవయవాలుకూడా" ననీ, "ఇదంతా (లోకమంతా) నేనే" ననీ, "నేను మీరు కానప్పుడుగదా" అనీ, అమ్మ పలికిన అనేక వాక్యాల్లో అమ్మకు మనతో అంటే యీ సర్వ సృష్టితోనూ గల పరిపూర్ణ తాదాత్మ్యం కనిపిస్తుంది. అందువల్లనే మన సంతోషాన్నే తన సంతోషంగానూ, మన సంతృప్తినే తన సంతృప్తిగానూ అనుభవించగలిగిన అమ్మకు- మన వెలితే తన వెలితి అయిందా? దానిని ఎక్కడ పూరించినా ఫలిత మొకటేనా - మనకు ఒక చేతికి జబ్బు వస్తే, మరొక చేతికి యింజక్షను యిచ్చినా నయమైనట్లు. కనుకనే మన వ్యాధులను తాను భరిస్తూ తాను మందులు సేవించి మనకు బాధావిముక్తినీ, ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నదా ? కాకపోతే - ఏమీ ఆహారాన్ని తీసుకొనని అమ్మకు వ్యాధులేమిటి ? చికిత్స లెందుకు ?

ఈ అత్యద్భుత అపూర్వ తత్వం అమ్మకు సర్వసృష్టితోనూ గల తాదాత్మ్యస్థితిని వివరిస్తున్నదా ?

ఇటీవల ఒక మిత్రుడు నన్ను "రోజూ అమ్మ ఒక వెయ్యిమందికి అన్నం పెట్టినంత మాత్రాన వందల కోట్ల జనాభా గల ప్రపంచానికి ఏమి ఉపకారం జరుగుతుంది ? ఎందరో లోకంలో ఆకలితో ఉన్నారుగదా...." అని అడిగాడు.

ఆ మాట నిజమే !

లోకంలో వందల కోట్ల జనాభా ఉంది. అందులో ఎందరో అతిపేద ప్రజలు నిత్యమూ అన్నం తినలేని వారున్నారు. ఏ ఒక్కరూ అందరి ఆకలినీ తీర్చలేని మాట వాస్తవమే. అట్లా అని అందరూ ఉపేక్ష వహిస్తే - ఏమవుతుంది ? చైనాభాషలో ఒక చక్కని సామెత ఉంది...నీ చుట్టూ ఉన్న చీకటిని తిట్టుకుంటూ కూర్చునేకంటే-నీకు చేతనైన ఒక చిన్న క్రొవ్వొత్తిని వెలిగించడం మేలు-అని. అదేవిధంగా నీ చుట్టూ ఎంతో పేదరికం ఉంది. ఎంతో ఆకలి ఉంది. ఎంతో అశాంతి ఉంది. అదంతా చూస్తూ కళ్ళూ చెవులూ మూసుకుని తన కడుపే

కైలాసంగా తన సుఖభోగాల్లో తాను మునిగి ఉండడంకంటే-తన దగ్గరకు వచ్చిన ఎవరితోనైనా -వాళ్ళ చిరునామాల ప్రసక్తి లేకుండా-వాళ్ళ సుఖదుఃఖాలలో పాలు పంచుకుని తన చేతనైన సహాయం, అదెంత స్వల్పమైనా, చేయటం మంచిదిగాదా ? అట్లా, ఉన్నవాడు తాను తినే దానిలో కొంతభాగం లేనివాళ్ళకు - ఏ ఒక్కడికైనా- రోజూ పెడుతూవుంటే లోకంలో లేమి మిగులుతుందా ? ఆకలి ప్రజ్వరిల్లుతుందా ? అశాంతి రాజ్యమేలుతుందా ?

ఈ సందేశాన్ని ఆచరిణ పూర్వకంగా లోకానికి అందించేందుకే అమ్మ అన్నం పెట్టడమూ, గుడ్డలు పెట్టడమూ చేస్తున్నదా ?

కాకపోతే - "నా జీవిత మబద్ధం; చరిత్రబద్ధం" అని ప్రకటించిన అమ్మకు వీటితో అవసర మేమిటి : "నాకు పని అంటూ లేదు. నేను స్నానంచేసినా చీరె కట్టుకున్నా - అది మీ కోసమే" అని చాటిన అమ్మ - పలికే ప్రతి మాటా మన కొక పాఠమే, చేసే ప్రతిపనీ మనకొక ప్రబోధమే,

కనుకనే మహాత్ములజీవితాలే లోకానికి మహోత్తమ సందేశాలవుతున్నాయి. విజ్ఞులూ, విమర్శకులూ మహాపురుషుల జీవితాలు పరిశీలించేటపుడు కేవలం వాళ్ళు ఏమి చెప్పారూ, చెబుతున్నారూ అనేదే కాక వాళ్ళు ఏమి చేశారూ అనేదికూడా గమనిస్తారు. వాళ్ళ మాటలూ చేతలూ ఏకమై, ఆ గీటురాయిపై నిలవగలిగిన వాళ్ళే అఖండ జ్యోతులై నిరంతరం ప్రభాసిస్తూ లోకానికి వెలుగు వెల్లువలను ప్రసారం చేస్తూ ఉంటారు.

—నవంబరు 1977

"నువ్వేంచేసినా నాకోసమే"

1978 జులై 7 వ తేదీ మధ్యాహ్నం. అమ్మ పదసన్నిధిన ఒక్కడనే కూర్చున్నాను. ఇతరులెవరూ లేరు. ఇటువంటి సదవకాశం యీమధ్య దొరకి లేదు. ఇటీవల ఎప్పుడూ యిరవైనాలుగు గంటలూ అమ్మ బహుజన పరివేష్టిత అయ్యే ఉంటున్నది. ఎన్నో విషయాలు అమ్మతో ఏకాంతంలో మాట్లాడాలని అభిలాష. అది తీరని కోరికగానే మిగులుతున్నది. నేను సారథ్యం వహించి ఎందరికో ఏకాంత సంభాషణకూ, ఆంతరంగిక విషయ నివేదనకూ అవకాశం కల్పిస్తూనే ఉన్నప్పటికీ - ఆ అవకాశం నాకుమాత్రం లభించటం లేదంటే – వినటానికి విడ్డూరంగానే ఉండవచ్చునుగానీ వాస్తవానికి ఏమాత్రమూ దూరమైన విషయం కాదు. ఎన్నో విషయాలు మనస్సులోకి తెచ్చుకుని ఒక విషయాన్ని అమ్మముందు ఉంచాను.

సాధారణంగా అమ్మతో నే నెప్పుడు సంభాషణకు ఉపక్రమించినా - ఒక తమాషా జరుగుతుంటుంది నేను నా వ్యక్తిగత విషయ మేదైనా అడిగితే - దాని సంగతి నీకెందుకూ, నేను చూసుకుంటానుగా- అంటుంది. ఆ విషయం నిజమే - సర్వసృష్టి స్థితి లయాలకు అమ్మే కారణమని గాఢంగా నమ్ముతూ యీ ప్రశ్న అడగడంలో అర్థ మేమున్నది? ప్రతిసారీ ఒక ప్రశ్న అడగడమూ, అమ్మ సమాధానం విని సిగ్గుపడి నాలిక్కొరుక్కొని తలవంచుకోవడమూ జరుగుతూనే ఉన్నది. ఒకవేళ ఆధ్యాత్మికంగా ప్రశ్న ఏమయినా అడిగితే - ఇవన్నీ నీకెందుకు

నాన్నా? ఇది తెలుసుకోనందువల్ల నీకు కలిగే నష్టం ఏమిటి? – అని ఎదురు ప్రశ్న వేస్తుంది అమ్మ. నిజమే. ఏమి తెలుసుకోవడానికి అయినా చరమస్థితి-దైవాన్ని తెలుసుకోవడమేగదా, దైవాన్ని తెలుసుకోవడం దైవానుగ్రహం పొందటంకోసమే మరి. ఆ కృప జడివానగా కురుస్తుంటే – యిక విచారణ లెందుకూ ? సాధన లెందుకూ ?

మరి, ఆనాటి ప్రశ్నకు అమ్మ సమాధానం చెప్పేదో, లేదో .... అంతలో ఒక సోదరుడు అమ్మ గదిలోకి ప్రవేశించి అమ్మ మంచం ప్రక్కనే కూర్చున్నాడు.

అమ్మ అతణ్ణి ఉద్దేశించి "అతనికి జీవితం వృథాగా గడిచిపోతున్నట్లు ఉన్నదిట, జీవితానికి సార్థకత లేకపోతే బ్రతికి ప్రయోజన మేమిటి? – అని అడుగుతున్నాడు..." అన్నది.

అతడు కృష్ణాజిల్లా నివాసి. సంపన్న కుటుంబీకుడు. బ్రహ్మచారి. గణనీయమైన ప్రభుత్వ ఉద్యోగి దురదృష్టవశాత్తూ – అతనికి ఒక మానసికవ్యాధి కలిగింది. ఎప్పుడూ తాను చనిపోతున్నానన్న భావన కలుగుతూ అతడ్ని భయకంపితుణ్ణి చేస్తుంది.

అతని స్థితి అతనికి దుర్భరం కావటమే కాక అతని బంధువులకూ స్నేహితులకూ కూడా బాధాకరంగా పరిణమించింది.

అనేక విధాల చికిత్స జరిగింది. ఫలితం కనుపించలేదు. అతని హితాభిలాషు లందరూ అతణ్ణిగురించి విచారగ్రస్తులయినారు.

ఆ సమయంతో అతణ్ణి చికిత్స నిమిత్తం దూర ప్రదేశాలకు పంపే ఏర్పాట్లు చేస్తుండగా అతడే – నన్ను కాపాడ గలిగితే, ఒక అమ్మ మాత్రమే. ఇతరు లెవరూ నన్ను రక్షించలేరు–అన్నాడు

అతని కోరికమేరకు అతణ్ణి అమ్మవద్దకు తీసుకువచ్చి విషయం విన్నవించారు. ఏ విషయంలోనూ కర్తృత్వమూ, బాధ్యతా తనపై పెట్టుకోవడం అమ్మకు అలవాటు లేదుగదా.

"ఇక్కడ ఉంచండి. డాక్టర్ చేత చికిత్స చేయిస్తాను, నయం కావచ్చును" అన్నది అమ్మ.

అమ్మ తత్వమూ, అమ్మ సర్వసామర్థ్యమూ, అమ్మ మాటల తీరూ తెలిసిన వాళ్ళు - ఆ మాటలనే అమ్మ హామీగా, అభయప్రదానంగా భావించి అతణ్ణి జిల్లెళ్ళమూడిలో వదిలి నిశ్చింతగా నిశ్చల చిత్తంతో తిరిగివెళ్ళిపోయారు.

అనాటినుండి అతని బాధ్యతను అమ్మ స్వయంగా తానే స్వీకరించింది. అతనికి ఏ వేళ ఏ ఆహారం కావాలో తన నివాసంలోనే యిప్పించేది. ఎక్కువకాలం తన సన్నిధిలోనే కూర్చోబెట్టుకునేది. అతడు సహజంగానే చాలా బిడియస్తుడు అయినందువల్ల - అతడు అడగకుండానే అతని అవసరాలన్నీ తీరే ఏర్పాటు చేసింది. అమ్మ అంటే అడగకుండానే పెట్టేదే అయినప్పటికీ - అందరి విషయంలో ప్రత్యక్షంగా బాధ్యత తీసుకోవడం భౌతికంగా సాధ్యపడని విషయంగదా !

అతనికి హోమియోలో చికిత్సకూడా ఏర్పాటు చేసింది.

ఒకవారంరోజులుకూడా గడవకుండానే అతనిలో అనల్పమైన పరిణామం గోచరించింది. స్థిమితం ఏర్పడింది. మనస్సుకు ధైర్యమూ వచ్చింది. ఈ స్థితికి అమ్మ అనుగ్రహమే కారణం-అని మనం అంటే, వైద్య ప్రభావమే నని అమ్మ అంటుంది. ఇలాంటి అనేక విషయాల్లో - ఒకరి జీవితంలో శుభపరిణామదశ రావడమూ, అతడు నా దగ్గరకు రావడమూ...రెండూ ఏకీభవిస్తాయిగానీ, అతడు నా దగ్గరకు వచ్చినందువల్ల అతనికి శుభం చేకూరడం కాదు - అంటుంది. ఈ విషయాల్లో మనం అమ్మతో వాదనకు దిగి మన విశ్వాసాన్ని వ్యక్తపరిస్తే - చివరకు అమ్మ యీ సత్ఫలితాలను మన 'విశ్వాసా'నికి ఆపాదించి "విశ్వాసమే దైవం" అని మనకు ఒక క్రొత్త పాఠం చెబుతుంది. మరి, మనం విశ్వాసంవల్ల దైవానుగ్రహం సంపాదించగలం అనుకుంటున్నానుగానీ - విశ్వాసమే దైవం - అన్న నిర్వచనం చదువుకోలేదు. అట్లాగే జ్ఞానంవల్ల దైవాన్ని తెలుసుకోవచ్చుననీ, దైవాన్ని చేరుకోగలమనీ అనుకుంటున్నాము కానీ "జ్ఞానమే దైవం" అనేమాట మనకు క్రొత్త విషయం. ఒకసారి అమ్మ అన్నదీ "బ్రహ్మజ్ఞానం సరైన మాట కాదు, జ్ఞానమే బ్రహ్మ" అని.

ఇప్పుడు అతనిలో ఒక క్రొత్త ఆలోచన, ఆవేదన బయలుదేరాయి. తన జీవితం నిరర్థకంగా గడవబోతున్నదని అతని తపన. వ్యర్థంగా జీవించేకంటే మరణం మేలు-అని అతని అభిప్రాయమూ, అందుకు అభిలాష. ఇదే విషయాన్ని అమ్మకు నివేదిస్తే - జీవితానికి సార్థకత ఏమిటి? - అని అతడ్నే అమ్మ అడిగింది. తన శరీరాన్నీ, శక్తినీ, మనస్సునూ, సంపదనూ-అన్నిటినీ దైవమే తనకు ప్రసాదించాడని

నమ్మి, ఆ సర్వమూ సంకోచంలేకుండా దైవానికే అర్పించడమూ, అంటే దైవ సేవకే వినియోగించడమూ-అని వివరించి విషణ్ణ వదనంతో యింకా అన్నాడు "అమ్మా - మేము నిన్ను దైవం అని నమ్ముతున్నాము. మా జీవనానికీ జీవితానికీ నీవే మూలం అనీ అనుకుంటున్నాము. అయినా మాకు నీనుండి ఎన్నో దాపరికాలు, ఎన్నో రహస్యాలు. కనీసం మా బ్యాంక్ అకౌంట్లను నీకు సరెండర్ చేయలేకపోతున్నాము, వట్టి స్వార్థజీవనులం" అని.

"నాన్నా - నువ్వు చాలా పొరబడుతున్నావు. నువ్వు బ్రతుకుతున్నది నాకోసమే. ఉద్యోగం చేస్తున్నదీ నాకోసమే. ఇది నీకు తెలియక పోవచ్చును. అంతమాత్రంచేత నష్టం లేదు, నువ్వు ఏం చేసినా నాకోసమే. అది నాకే చెందుతుంది. ఈ విషయంలో నువ్వు దిగులుపడకు. ఈ కనుపించే అన్నీ దైవస్వరూపాలే. దైవం కాని ప్రాణి, వస్తువు...ఏమీ లేదు. నువ్వూ దైవమే. ఈ సృష్టిలో ఏ ప్రాణికి నీకూ కాకుండా నీ శక్తి, సేవలూ ఎక్కడికీ పోతున్నయ్? ఇందులో ఎవరికి చెందినా - అది దైవానికి చెందినట్లే కనుక యిందులో స్వార్థం అన్న ప్రసక్తే లేదు; అంతా పరమార్థమే" నని అమ్మ హితోపదేశంజేసి అతనిలో కొడిగట్టిన జీవితేచ్ఛను ఉజ్జ్వలం చేసింది.

జీవితంలో పరాజయాలూ, పరాభవాలూ పొంది నిరాశా నిస్పృహలకు లోనై లోకంపై విరక్తి విసుగూ పెంచుకుని జీవితాన్ని తుదముట్టించుకుందామని యిచ్ఛ కలిగి - తుదిక్షణాల్లో అమ్మదర్శనం చేసుకుని ఆ పావనపాదాలు కడసారి స్పృశించి వెళదామని అమ్మ చెంతకు వచ్చే అనేకులు పరోక్షంగానో-ప్రత్యక్షంగానో, అమ్మ హితోక్తులచే, అమ్మ మమకారంచే ప్రభావితులై ప్రభావితులై కొత్తరక్తంతో క్రొంగొత్త దృక్పథంతో ఉత్తేజితులై ఉత్సాహవంతులై జీవితం గురించి తెలుసుకుని, లోకంపై అభిమానమూ అనురాగమూ పెంచుకుని, లోకంనుండి తామెలా ఆనందం పొందవచ్చునో పాఠాలు చదువుకుని, తాము లోభులు కాక లోకహితంగా తమ జీవితాలను ఎలా మలుచుకోవాలో నేర్చుకుని తృప్తిగా జీవన మార్గాల పయనిస్తున్నారు.

అమ్మ ఒడిలో పెరిగినవానికి జీవితం ఒక అమృతకలశం !

అమ్మ బడిలో నేర్చినవానికి లోకం ఒక నందనవనం ! !

— జులై 1978

"రోగి కూడా నారాయణుండే"

1978 మే 14 వ తేదీన జిల్లెళ్ళమూడిలో మాతృశ్రీ మెడికల్ సెంటరుకు అమ్మ ప్రారంభోత్సవం చేసింది. ఆ పవిత్ర సమయంలో అమ్మ డాక్టర్లను ఉద్దేశించి– "వైద్యో నారాయణ హరిః–అనే పూర్వోక్తి నా అభిప్రాయంలో అసమగ్రమైన వాక్యం. తనకు ఆయురారోగ్యాలనూ నవజీవనాన్నీ ప్రసాదించే వైద్యుని రోగి నారాయణ స్వరూపుడుగా భావించడమే కాదు, వైద్యుడుకూడా రోగిని నారాయణ స్వరూపుడు గానే భావించాలి. అపుడే డాక్టర్లు హృదయ పూర్వకంగా శ్రద్ధగా ప్రేమగా చికిత్స చేయగలుగుతారు. రోగికి చేసే ఏ చిన్న సేవ అయినా అది భగవంతుడికి చేసే పూజ అవుతుంది. అసలు భగవంతుడంటే ఒక మూర్తి దాల్చి సింహాసనాసీనుడై పరి పాలకుడై సర్వ సృష్టి స్థితి లయకారుడై ఎక్కడో లేడు. ఈ కనుపించే సృష్టి సర్వమూ దైవ స్వరూపమే ఈ సృష్టికి అవల యిందుకు భిన్నంగా అవాఙ్మానస గోచరుడై దైవం ఎక్కడో లేడు. సృష్టియే దైవం. సృష్టిలో దైవం కానిది ఏమీ లేదు. భగవంతుడు రూపరహితుడు కాడు. మనకు కనిపించే అన్ని రూపాలూ అయినవాడు. కనుకనే ఎక్కడ ఎవరికి ఏ మాత్రం పరిచర్యం చేసినా ఏ రూపంలో ఏమాత్రం సేవచేసినా – అది దేవతార్చనయే అవుతుంది–" అని హితోపదేశం చేసింది.

ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న ఆంగ్ల సోదరుడు శ్రీ విలియంజేమ్సు కాంపి యన్ పత్రిక సహాయంతో దాదాపు రూ 80000/–ల ఖర్చుతో శ్రీవిశ్వజననీ పరిషత్ వారు భవన నిర్మాణం చేశారు. ఇందులో పిల్లలకూ స్త్రీలకూ ప్రత్యేకమయిన ఉచిత చికిత్స జరుగుతుంది. ఆశ్రమవాసులకూ ఆ గ్రామస్థులకేకాక సర్వజనులకూ అక్కడ ఉచిత చికిత్స జరుగుతుంది. ప్రజల, ప్రభుత్వ సహకారం కూడా లభ్యమైతే– నిత్యమూ పరిసర గ్రామాలక్కూడా వెళ్ళి వైద్య సలహాలు, మందులూ ఉచితంగా యిస్తూ–పేద ప్రజలకూ బలహీన వర్గాలకూ కూడా వైద్యచికిత్సను అందుబాటులోకి తీసుకరాగల మొబైల్ హాస్పిటల్‌ను నిర్వహించాలని నిర్వాహకుల ఆశయం.

ప్రస్తుతం హాస్పిటల్లో నాలుగు పడకలుమాత్రం ఏర్పాటయినాయి. ఆ భవనంలోనే డాక్టరు నివాసంకూడా నిర్మించడం ఎంతో అనుకూలంగా ఉంది. అక్కడనే క్లినికల్ లేబరేటరీకూడా ఉచితంగా ఏర్పాటుచేయడం హర్షించవగ్గ విషయం

అన్ని సదుపాయాలతో సౌకర్యాలతో ఆ భవనం అత్యంత రమణీయంగా అలరారు తోంది.

ఈ హాస్పిటలులో డాక్టర్‌గా ఏ. ఇనజకుమారి ఎం బి బి.ఎస్. నియమించ బడింది. ఈ బృహత్ కార్యక్రమ నిర్వహణకోసం యీమెకు నెల్లూరులో శ్రీ అన్న పూర్ణాక్లినిక్‌లో ప్రసిద్ధ డాక్టర్ యస్. వి. సుబ్బారావుగారి దగ్గర మూడు సంవత్సరాలు శిక్షణ యిప్పించబడ్డది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే-నేడు ప్రారంభమైన హాస్పిటల్‌కు డాక్టరును అమ్మ మూడేళ్ళ క్రితమే నియమించింది. జిల్లెళ్ళమూడిలో స్థాపించబడ్డ ఓరియంటల్ కాలేజికికూడా అమ్మ ఎనిమిది సంవత్సరాలు ముందుగానే ప్రిన్సిపాల్‌ను నియమించడం జరిగింది. సంస్థలను స్థాపించి తర్వాత వ్యక్తులను నియమించడం సాధారణ ప్రక్రియ అయితే అమ్మమాత్రం ముందుగా వ్యక్తులను ఏరుకొని తర్వాత సంస్థలను నిర్మిస్తుంది.

ఈ ఆరోగ్య సముద్ధరణ కార్యక్రమానికి తమ సహకారాన్ని ప్రకటిస్తూ బాపట్లలోని 'సేవ్ ది చిల్డ్రన్' సంస్థ వారు రూ. 15000/- లకు చెక్కును అమ్మకు సమర్పించగా అమ్మ హాస్పిటల్ నిర్వాహకులకు దానిని ప్రసాదించింది.

అమ్మ మనకు ప్రసాదించిన మూడవ వరం హాస్పిటల్. మొదటిది-అన్నపూర్ణాలయం. రెండవది-విద్యాలయం. మూడవది-వైద్యాలయం. ఈ మూటి ద్వారా అందరికీ అన్నమూ, విద్యా, వైద్యమూ ఉచితంగా అందించాలని అమ్మ సంకల్పం.

ఒక ఆధ్యాత్మిక కేంద్రంలో సామాజిక సేవా కార్యక్రమాలకు యింత ప్రాధాన్యం యిచ్చి అందులో తాను పాల్గొంటూ యితరులకు ఉద్బోధనూ ఉత్తేజాన్ని అందించడం అమ్మలోని మానవతావాదానికి సర్వజన మమకారానికీ తార్కాణమే కాదు. ఉపదేశాలూ, సందేశాలూతోనే కాలయాపన చేయని కార్యశీలతక్కూడా ప్రత్యక్ష నిదర్శనం.

ప్రతివాడూ తమ అధివ్యాధుల నివారణకోసం అధ్యాత్మిక వ్యక్తులవద్దకూ ఆశ్రమాలకూ పరుగులుతీస్తున్న యీ కాలంలో అమ్మ తన ఆశ్రమంలోనే రెండు వైద్యాలయాల నిర్వహణకు అనుమతించడం గమనించ దగిన విషయం.

ప్రభుత్వంవారు ఎంతగా ప్రోత్సాహపరుస్తున్నప్పటికీ - డాక్టర్లు పల్లెటూళ్ళకు వెళ్ళి ప్రాక్టీసు చెయ్యటానికి యిష్టపడక - పట్టణాల్లోనే ప్రాక్టీసుచేయటానికి ఉబలాటపడే కాలంలో - ఒక వైద్యశాస్త్ర పట్టభద్రురాలు స్వార్థరహితంగా సాహసంతో మారుమూల గల ఒక కుగ్రామానికి రావడం ప్రశంసనీయమైన విషయం. అందుకు దోహదం కలుగజేస్తూ ఒక బృహత్తర ప్రణాళికను సిద్ధంచేసిన శ్రీ విశ్వజననీ పరిషత్‌వారి ఔదార్యమూ, ప్రజాహితచింతన ఆదర్శప్రాయమైనవి.

హాస్పిటల్ ప్రారంభోత్సవ సమయంలో జరిగిన ఒక ఘటన సంస్మరణీయమైనది. నిత్యరోగి అయిన అమ్మ డాక్టర్ చెయిర్‌లో ఆసీనురాగా - ప్రసిద్ధుడైన డాక్టర్ సుబ్బారావుగారు మొదటి పేషెంటుగా వెళ్ళి బల్లపై కూర్చున్నాడు. అమ్మ అతడిని ఆ పరీక్షా యీ పరీక్షా చేస్తూ కుడిచేయి మణికట్టువద్ద పట్టుకున్నది. డాక్టరుగారికి అంతకుముందు కొన్నిరోజులుగా అక్కడ నొప్పి ఏర్పడి, థర్మామీటరుకూడా విదిలించ నివ్వటంలేదట. కాని అమృతహస్తం తగిలిందో లేదో ఆ నొప్పి మాయమైంది.

ఇదేదో కాకతాళీయమనుకోవటానికి - లోగడ యిటువంటి సంఘటనలు అనేకం జరిగాయి. జిల్లెళ్ళమూడి నివాసి గాదె ముకుందు, గుంటూరు నివాసులు ఏకా పుండరీకాక్షయ్యగారు, అన్నంరాజు దుర్గమ్మగారు, వేటపాలెం గ్రామస్థులు రాజుపాలెం రామచంద్రరావుగారు యింకెందరో ఉన్నారు. యీ అదృష్టాన్ని పొంది యిందుకు సాక్షులైనవారు. కాని అమ్మను అడిగితేమాత్రం అందుకేవో భౌతికమయిన కారణాలు చూపించి - తన మహత్తు ఏమీ లేదని చెప్పి మన నోళ్ళు మూయిస్తుంది. అమ్మకూ మనకూ మధ్య యిటువంటి తెరలు వేయటం అమ్మకు వేడుక.

అటువంటి ఒక తెర - యీ హాస్పిటల్ కావచ్చు!

ఏమయినా—అనేక జబ్బులతో తాను అహర్నిశమూ బాధపడుతూ - మన ఆరోగ్యంకోసం మన ఆనందంకోసం ఆలోచిస్తూ ఆరాటపడటం ఒక్క అమ్మ మాత్రమే చేయగలుగు.

ఆకలి విషయంలోనూ అంతేగదా - చిన్నతనంనుంచీ తన ఆకలినోట్లో గుడ్డలు కుక్కి మన ఆకలి తీర్చటానికే అమ్మ నిరంతర ప్రయత్నం చేస్తున్నది.

మరి -

బిడ్డల గురించిన తపనే మాతృత్వమా?

—మే 1978

నిరీక్షణ

"అమ్మను చూట్టానికి జిల్లెళ్ళమూడి ఎన్ని గంటలకు వెళ్ళమంటారు?"

బాపట్లలో ప్రెస్సులో పనిచేసుకుంటున్న నన్ను ఒక సోదరుడు అడిగాడు.

"మీ వీలు ప్రకారమే వెళ్ళండి - ఎప్పుడు వెళ్ళినా ఫర్వాలేదు" అని చెప్పాను.

"అట్లాగాదు - దర్శనం ఎన్నిగంటలకో సరిగా చెప్పండి" అతను స్పష్టమైన సమాధానం కోరాడు.

"ఇన్ని గంటలకు దర్శనం అని నియమం ఏమీ లేదు. అహర్నిశం అమ్మదర్శనం చేసుకొనవచ్చును."

"మీరు ఏమీ అనుకోవద్దు - యింతగా ఎందుకు అడుగుతున్నానంటే - క్రిందటినెలలో నేను ఒకసారి ఉదయం జిల్లెళ్ళమూడి వెళ్ళాను. మధ్యాహ్నానికిగానీ నాకు దర్శనం కాలేదు. ఎంతోకాలం వృధా అయిపోయింది" నేను వింటూ ఉన్నాను అతను మళ్ళీ అడిగాడు.

"అందువల్ల .... నేను ఏ సమయానికి వెళితే వెంటనే అమ్మ దర్శనం అవుతుందో చెప్పండి. సరిగ్గా ఆ సమయానికే వెళ్ళి అమ్మను చూసి తిరిగి వస్తాను."

అమ్మ తనకొక ప్రత్యేక కార్యక్రమమంటూ లేదని వివరిస్తూ "నాకు పని అంటూ ఉంటే - అది మీకు కనపడటమే" నని ఉద్ఘాటించింది. "అమ్మ"ను నిర్వ చిస్తూ "అమ్మ అంటే అంతులేనిదీ అడ్డులేనిదీ" అని ప్రకటించింది.

కనుకనే అమ్మను ఎవరయినా ఎప్పుడయినా చూడవచ్చును. అమ్మను చూడటానికి ఏ కాలనియమమూ లేదు; ఏ అర్హతా, యోగ్యతా అక్కరలేదు. ఏ మొక్కుబడులూ చెల్లించ నవసరం లేదు. ఏ ముడుపులూ కట్టనవసరం లేదు. అందరూ నిర్నిబంధంగా అమ్మను దర్శించవచ్చును..... అమ్మలో అదికూడా ఒక విశేషమే!

తాను 'వల్లకాని మిట్ట' అయినప్పటికీ - తనను చూడకోరి వచ్చినవారిని అమ్మ ఎంతో ఆదరంగానూ, ఆపేక్షతోనూ చూస్తుంది. వారికి ఏ మాత్రం అసౌకర్యం కలిగించదు. ప్రతివారికీ దర్శనం యిచ్చి పంపటంలో అమ్మ చూపే శ్రద్ధ నిరుపమానమయినది. ఒక్కొక్కసారి ఒక్కొక్కప్పుడు ఆవరణలోకివచ్చి తెలియక ఎక్కడెక్కడో తిరుగుతుంటే - అమ్మే వాళ్ళను పిలిపించి దర్శనం ప్రసాదిస్తుంది.

కాని ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం ఏమీ బాగాలేదు. అమ్మ మాటలలో చెప్పాలంటే- అమ్మ శరీరం "చిరికిన గుడ్డ" వలే ఉన్నది. "గాజుబొమ్మ" లాగున్నది. విశ్రాంతి అవసరమని వైద్యులు పదే పదే తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అవసరం ఎంతో బలవత్తరమయితే కానీ అమ్మ విశ్రాంతి తీసుకోదు. అటువంటి సమయాల్లో వచ్చినవారికి వెంటనే అమ్మదర్శనం లభ్యం కాదు.

ఇంకొక తరుణం ఉన్నది- అమ్మ దర్శనానికి వీలుకానిది - అది అమ్మ స్నానంవేళ.

అమ్మ స్నానం చేయటానికి కనీసం గంట పడుతుంది. అటువంటి స్నానాలు రోజుకు నాలుగయిదు చేయవచ్చును. అమ్మ అధ్యాత్మికరహస్యం యీ స్నానంలోనే ఉన్నదని అనేకులు అభిప్రాయపడతారు. కొన్ని వందల బిందెల చన్నీళ్ళు పోసుకుంటే కానీ అమ్మ శరీరానికి తృప్తిలేదు; శరీరంలో నిరంతరం రగిలే మంటలు చల్లారవు. ఆ మంటలు రోగానికి సంబంధించినవని అమ్మ అంటుంది; యోగానికి సంబంధించినవని విజ్ఞులు భావిస్తారు.

కానీ అవాంతరం ఎందుకు ఏర్పడినప్పటికీ - అమ్మ దర్శనంలో ఆలస్యం కావటం కూడా మంచిదే. ఆ నిరీక్షణలోని సమయం ఏమాత్రం వ్యర్థంకాదు. అసలు వెంటనే దర్శనం అయ్యేకంటే - ఆ నిరీక్షణ అవసరంకూడా. సవాసరి క్షణాలలో - ఏ వాహనంలోనో అమ్మ నివాసం చేరేకంటే - ఏదో మైలువద్ద బస్సుదిగి ఆ మైలున్నర దూరం కాలినడకన రావటంలోకూడా అనితర సాధ్యమయిన ఒక మధురానుభూతి ఉన్నది.

అమ్మ నివాసంకు రాగానే అమ్మదర్శనం వెనువెంటనే చేసుకుని మరుక్షణం లోనే వెనుదిరిగి వెళితే అది యాంత్రికంగానే ఉంటుంది. అందులో సౌకర్యం ఉండ వచ్చునూ; కాలహరణం లేకపోవచ్చునేమో గానీ రసానుభూతి మాత్రం కలగదు.

అమ్మ గదిముందు కూర్చుని అమ్మ రాకకోసం ఎదురుచూడడంలో ఎంతో ఆనందం ఉన్నది. ఆ ఉత్కంఠలో ఒక మధురానుభవం ఉన్నది. కనబడ బోయే అమ్మనుగురించి ఆలోచించుకుంటూ ఉంటే – అమ్మ మూర్తితోపాటు మన గత జీవితంలోని అనేక ఘట్టాలు తెరమీద బొమ్మలవలె మనకు దృగ్గోచరమౌతాయి. మనం అనుకోకుండానే మన పాపపుణ్యాల బేరీజు జరుగుతుంది. పశ్చాత్తాపాగ్నిలో మనసు పునీతమౌతుంది. పునీతమైన మనసు క్రమేణా అమ్మమూర్తితో నిండి పోతుంది. అమ్మమూర్తితో నిండటం అంటే - అమృతంతో నిండటమే గదా!

అపుడు అమ్మకూ తనకూ మధ్యగల గోడలూ, తలుపులూ బదాబద్దలయి పోతాయి. ఎవరిని చూసినా అమ్మే అనిపిస్తుంది. కనుపించిన ప్రతివారిపై పూజ్య భావం ప్రభవిస్తుంది. అందరిపైనా ప్రేమ జనిస్తుంది. కన్ను తెరిచినా మూసినా అమ్మరూపమే కనిపిస్తుంది. ఒంటికి గాలి తగిలితే ప్రేమతో అమ్మే నిమురుతున్న దనుకుంటాడు. శబ్దం వినిపిస్తే ఆప్యాయంగా అమ్మే పలకరిస్తున్న దనుకుంటాడు. ఆకలి ఉండదు; దాహం ఉండదు. ఈ లోక స్ఫురణే ఉండదు.

అదొక అపూర్వానుభవం. అదొక అనుపమానుభవం. ఆ అవస్థను సమాధి అనవచ్చును; సాలోక్యమనవచ్చునూ; సామీప్యమనవచ్చునూ. పేరు ఏదయితే నేమి, ప్రతివాడూ కోరుకొన దగినస్థితి.

అందుకనే ప్రెస్సులో ఆ సోదరునితో చెప్పాను...అమ్మ సన్నిధిలో అనుభవం ఎంత గొప్పది అయినప్పటికీ, అమ్మకోసం చేసే నిరీక్షణకూడా ఒక అద్భుతమయిన అనుభవ మనీ, దానిని ఎవరూ వదులుకో రాదనీ....

–మార్చి 1978

ప్రేరణ అమ్మదే

అనేక విషమపరిస్థితులలో అనేకులు వచ్చి అమ్మను అడుగుతారు - ఏమి చేయమంటావు అమ్మా? - అని. నీకు తోచినట్లు చెయ్యి నాన్నా- అంటుంది అమ్మ. ఆ ఆదేశంలోని ఆంతర్యం అవగతంకాక అతను మళ్ళీ మళ్ళీ అర్థిస్తే అమ్మ అప్పుడు విశదపరుస్తుంది - నీకు తోచిందే నేను చెప్పాననుకో - అని. కొందరు ఆ వాక్యాన్ని వెంటనే అర్థం చేసుకుని అంగీకరించి ఆనందంతో వెళ్ళిపోతారు. వారు అదృష్ట వంతులు కొందరు ఆ వాక్యంలోని యథార్థం వారి మేధాశక్తికి అందక బాధపడతారు.

కాని, అమ్మ జీవితమూ, జీవిత విధానమూ, ప్రబోధమూ, బోధనా విధానమూ - అన్నీ అద్భుతమయినవీ, అపూర్వమయినవీ.

అన్ని క్రియలకూ ఆధారమయిన, అందరి ఆలోచనలకూ ప్రేరణ అయిన అమ్మ - తనకేమీ తెలియనట్లు తన ప్రమేయమేమీ లేనట్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా కూర్చొనటం మనకు వింతగానూ, వినోదంగానూ ఉన్నా "మఱుగే నా విధానం" అని సుస్పష్టంగా వివరించి అమ్మ మనకు ఆనందాన్ని కలిగిస్తున్నది.

అనేకుల జీవితాల్లో అమ్మ ప్రేరణ ఎంత ప్రస్ఫుటంగా ఉంటుందో అనేకులకు విదితమే. ఆ ప్రత్యేక సమయంలో అమ్మే కనుక అట్లా ప్రేరేపించి ఉండకపోతే, తామట్లు చేయటానికే అవకాశంలేదనీ, తమ జీవిత గతియే మరోవిధంగా ఉండి ఉండేదనీ అనేకులు చెపుతారు.

కాని వారికి హేతువాదుల ప్రశ్న ఒకటి ఎదురవుతుంది- ఆ ప్రేరణ యీ అమ్మ చేసినదే అని ఏమిటి, మరెవరయినా కావచ్చుగదా - అని.

సాధారణంగా దానికి విశ్వాసమే తప్ప సాక్ష్యం లభించటం కష్టం. కానీ...

1971 సెప్టెంబరు 17 వ తేదీన-

అనారోగ్యంగా ఉండి చీరాలలో చికిత్స పొందుతున్న నాన్నగారిని చూచి వచ్చిన సోదరి ఉష బాపట్లలో పత్రికా ముద్రణ కార్యక్రమంలో ఉన్న నా వద్దకు వచ్చి ఆ వివరాలు అందించి, టాక్సీలో జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మకు కూడా నివేదించి

వస్తానన్నది. నేను అంతకుముందే అమ్మతో ఫోనలో మాట్లాడి ఉన్నాను. అమ్మ నన్ను బాపట్లలోనే ఉండి నా పని నన్ను చూచుకొనమని ఆదేశించింది. తాను ప్రస్తుతంలో చీరాల వెళ్ళే అభిప్రాయమూ వ్యక్తంచేయలేదు. కాని నేను హఠాత్తుగా, సోదరి ఉషతో టాక్సీలో బయలుదేరి – అప్పటికి అక్కడకు వెళ్ళి అమ్మను చూచి వద్దామని మాత్రమే – పెట్రోలుబంకు దగ్గరకు వెళ్ళిన తరువాత అమ్మను చీరాల తీసుకువెళ్ళి నాన్నగారిని చూచివస్తే బాగుండునదనే అభిప్రాయం కలిగి అందుకు అవసరమయిన పెట్రోలునుకూడా నింపుకుని జిల్లెళ్ళమూడి వెళ్ళాము. అక్కడనుంచి అమ్మను తీసుకని చీరాల వెళ్ళాము. మేము వెళ్ళేసరికి అక్కడ డాక్టరుగారూ, నాన్నగారూ, తదితరులూ అందరూ అమ్మ కోసం నిరీక్షిస్తున్నట్లుగానే చెప్పారు. నాకు ఆశ్చర్యం కలిగింది

కాని, అమ్మను నేను ప్రయాణం చేయించటానికి ప్రేరణ నాదేనని అనుకోవటానికి అవకాశముంది. కాని అది నూటికి నూరుపాళ్ళూ అమ్మదే అనటానికి ఆధారమూ, మనకు నిదర్శనానికి ఏమో–మా టాక్సీ రెండుమైళ్ళ దూరంలో ఉండగానే అమ్మ-వాడు నన్ను చీరాల తీసుకు వెళ్ళటానికి టాక్సీ తీసుకు వస్తున్నాడు – అని సోదరి వసుంధరతో చెప్పింది.

మొదట్లోనే వసుంధర ఆ మాట చెబితే ఆశ్చర్యపోయాను. చీరాల వెళ్ళి అక్కడ అమ్మకోసం నిరీక్షిస్తున్న అందరినీ చూచి మరీ విస్మయం పొందాను.

— సెప్టెంబరు 1971

అవ్యాజానురాగమూర్తి

1972 సెప్టెంబరు 23 వ తేదీ రాత్రి సోదరి శ్రీమతి సక్కుబాయి అమ్మను తన కారులో ప్రయాణం చేయమని అర్థించింది. అమ్మ అంగీకరించింది. చిరంజీవులు లాల, పార్థులనుకూడా అమ్మ తనవెంట రమ్మన్నది.

ప్రయాణం ఎక్కడకో ఎందుకో మా కెవరికీ తెలియదు. బాపట్ల చేరిన తర్వాత చిరంజీవి రవినికూడ రమ్మన్నది.

కారు అక్కడనుండి ఎటు వెళ్ళాలని ప్రశ్న వచ్చింది. అమ్మ తటస్థంగానే కూర్చున్నది. కారు రేపల్లెదారికి మళ్ళింది. గగనతలం మేఘావృతమై చల్లనిగాలి వీస్తూ ప్రయాణం సమ్మోదకరంగా ఉన్నది. అమ్మ కబుర్లు చెబుతుంటే మాలో ఎవరికీ కాలమూ దూరమూ గమనంలో లేవు.

భట్టిప్రోలు వచ్చింది. ఇక లాల, పార్థుల సంతోషానికి హద్దులు లేవు. కారణం–అది వాళ్ళ జన్మస్థలం. అమ్మ వారి గ్రామానికి వచ్చింది. నిత్యమూ, ఎందరో సంపన్నులూ, లబ్ధప్రతిష్ఠులూ, ఉన్నతోద్యోగులూ వచ్చి వారి పట్టణాలను అమ్మ పాదరజస్సుతో పావనం చేయమనీ వారి గృహాలను అమ్మ ఆగమనంతో జ్యోతిర్మయం చేయమనీ ప్రాధేయపడుతుంటే – ఎక్కడకూ కాలు కదపటానికి యిష్టపడని అమ్మ అనాడు అనాహూతంగా, తమ గ్రామం వచ్చింది. అది ఎవరిని ఆనందంలో పులకలెత్తించదూ? ఎవరిని పారవశ్యంలో ముంచెత్తదూ? అయినా వారు అమ్మను "మా యింటికి రా అమ్మా!" అని ఆహ్వానించలేకపోయారు.

కాని అర్థించకుండానే వారింటికి కారును పోనివ్వమన్నది అమ్మ. క్షణాల్లో కారు వారింటి ముందు కొబ్బరిచెట్లనీడల చీకట్లో ఆగింది. వారిద్దరు సోదరులూ, ఒక్క గంతులో యింటిలోకి దూరారు. నిద్రిస్తున్న తలిదండ్రులను లేపారు.

వారు హఠాత్తుగా మేల్కొన్నారు. వారు విన్నది నిజమో కలయో, అర్థం కాలేదు. కాని క్షణాల్లోనే అమ్మ వారి ఎదుటికి వచ్చి నిలుచున్నది. పూర్ణ కుంభాలూ మంగళవాద్యాలూ లేవు సరిగదా, గృహస్థులు ఎదురువెళ్ళి కాళ్ళు కడిగిఅయినా లోపలకు ఆహ్వానించటానికి వ్యవధి నివ్వకుండా అమ్మ సరాసరి లోపలికివచ్చి

నిలుచున్నది. విశ్వసమ్మోహమయిన ప్రశాంత సుందరరూపం ! కన్నుల్లో వాత్సల్యపు వెన్నెల చల్లదనం ! ;

ఆ గృహిణి అమ్మ పాద ద్వయాన్ని తన రెండు చేతులా బంధించి ఉన్మాదినిలా కేకలు వేస్తూ-"అమ్మా ! యీ దీనురాలిపై దయ ఉన్నదని నిరూపించ టానికి వచ్చావా? ఇవ్వాళ సాయంకాలంనుండీ ఎంతగానో బాధపడుతున్నాను-అమ్మకు నాపై దయ తప్పిందని. అది కాదని చెప్పటానికి నీవే స్వయంగా వచ్చావా? ఎంత కరుణామయివి అమ్మా!" అంటుంటే అక్షరాలు కన్నీటిలో కరిగిపోయాయి.

కొద్ది క్షణాలు కూర్చుని అమ్మ లేచి యింట్లోకి వెళ్ళింది. ఇల్లు నాలుగు మూలలా చూచింది. వంట యింట్లోకి వెళ్ళింది. అక్కడ పచ్చడిజాడీల మూతలు తీసి వాటిని రుచి చూచింది. ఆ గృహిణి అమ్మకు ఏమి నివేదించాలో తెలియక అయో మయంగా అమ్మ వెంట క్రొత్త యింట్లో తిరిగినట్లు తిరుగుతున్నది. అమ్మ ఆ గదిలో ఒక మూలకు వెళ్ళి అక్కడ గిన్నె అడుగున మిగిలిన అన్నం తీసుకుని, ఒక గిన్నెలోని మెంతి మజ్జిగ పోసుకుని రెంటినీ కలుపుకుని ఆకలిగొన్న దానివలె తింటుంటే ఆ గృహిణి గుండె పగిలేటట్లుగా దుఃఖించింది. అమ్మ మజ్జిగన్నం తన వెంటవచ్చిన మా అందరికీ, తదితరులకూ ప్రసాదించింది.

"పేదలపైన నీ అపారమయిన ప్రేమను పుస్తకాల్లో చదివి విస్తుపోతున్న మాకు ప్రత్యక్షం చేస్తున్నావా, అమ్మా?" అని ఆ గృహిణి గద్గద కంఠంతో విలపిస్తూ అమ్మకు నమస్కరించుకున్నది.

ఆ అదృష్టవతియైన గృహిణి శ్రీమతి లక్కరాజు సీతమ్మ.

అక్కడనుండి బయలుదేరాము. అక్కడకు రెండుమైళ్ళలో ఉన్న పెద పులివర్రు పోదామన్నది అమ్మ. అక్కడ ఎంతో అనారోగ్యంతో బాధపడుతున్న సోదరి జానకిని తన వాత్సల్య వారాశిలో ముంచెత్తి ఆశీర్వదించింది అమ్మ.

ఇంటికి తిరిగిరాగానే అమ్మను అడిగాను- "అమ్మా! పిలవకుండానే వాళ్ళ యిళ్ళకు వెళ్ళావేమమ్మా?" అని. "వాళ్ళు రమ్మని పిలిచే దేమున్నది? వాళ్ళ బాధే నన్ను పిలిచింది. బాధకంటే వేరే పిలుపే మున్నది?" అన్నది-అమ్మ, అవ్యాజాను రాగ మూర్తి.

-- అక్టోబరు 1972

ఆకలిబాధ

1972 జులై 14 వ తేదీన ప్రఖ్యాత నర్తకులు శ్రీ సంపత్‌కుమార్ తన బృందంతో అమ్మను దర్శించుకున్నారు. అమ్మ ఆశీస్సులతో పాటు "భోజనం చేసి వెళ్ళండి నాన్నా -" అన్న అనురాగపూర్వకమయిన ఆజ్ఞాపనమూ అందుకున్నారు. కానీ తరువాత కార్యక్రమపు వత్తిడివలన వారు భోజనం చేయకుండానే వెళ్ళిపోయారు.

దర్శన కార్యక్రమం జరుగుతూనే ఉన్నది. మధ్యలో అమ్మ - వారు భోజనం చేస్తున్నారో, లేదో చూసిరమ్మని ఒక సోదరుని పంపింది. వారు భోజనం చేయకుండా వెళుతున్నారు. వెంటనే అమ్మ కబురుచేసింది. వెనక్కు తిరిగివచ్చి భోజనంచేసి వెళ్ళమని. అయినా వారు అక్కడినుండే అమ్మకు తమ క్షమాపణలు అందజేసుకుని ముందుకు సాగిపోయారు.

అందుకు అమ్మ ఎంత బాధపడిందో అభివర్ణించలేము. "అమ్మా బీద వారయితే దారిలో ఆకలితో బాధపడతారేమో అనుకొనవచ్చును. వారికేమమ్మా ?" అని ఉపశమన వాక్యాలు వల్లించాము.

"అదేమిటీ అట్లా అంటారు ? ఆకలికి బీదవాడనీ, భాగ్యవంతుడనీ, భేదమేమున్నది ? భాగ్యవంతుడికి - యినప్పెట్టెలోని డబ్బుగానీ, బ్యాంకులోని డబ్బుగానీ, మరెక్కడయినా వారికోసం తయారుచేస్తున్న విందుగానీ - ఆకలిని తీర్చగలుగుతుందా ? కనుకనే నే నెప్పుడూ మీ బీదతనాన్నీ, భాగ్యాన్నీ చూసి అన్నం తినమని అడగను. మీ ఆకలిని చూసి మాత్రమే చెబుతాను. అన్ని అంతస్తులకూ, స్థితులకూ, వయస్సులకూ, యోగ్యతాయోగ్యతలకూ అతీతమై ఆకలిపెట్టే బాధ భరించటం కష్టం నాన్నా" అని మాకు సమాధానం చెబుతూ -

"ఇక్కడికి ఆకలితో రావచ్చును నాన్నా - కానీ యిక్కడినుండి ఎవరూ ఆకలితో వెళ్ళకూడదు. ఆ ఆకలినీ బాధనూ మీరు సహించవచ్చును గానీ నేనే సహించలేను. అది నాకే బాధ" అని వివరిస్తూ—

"అసలు.... మీకు అన్నం పెట్టుకోవటం నాకు తృప్తి. నేను ఏమి వేసిపెట్టినా

ప్రసాదభావంతో మీకు ఆనందం కలుగవచ్చును. కానీ యింకా బాగా పెట్టుకోలేక పోతినే అని నాకే అసంతృప్తి –" అని విపులీకరించింది.

ఆ మాటలు వింటుంటే అమ్మకు మనపైగల అనురాగానికీ, మన బాధల యెడల సానుభూతికీ మనసు ఆశ్చర్యం కలుగవచ్చునూ, అమ్మ యందలి మన ప్రేమను సహస్రాధికం చేయవచ్చును కాని నిశితంగానూ, నిలకడగానూ మనం ఆలోచించి నట్లయితే మనకు ఒక అద్భుతమైన భావం స్ఫురిస్తుంది.

అప్పుడే భోజనంచేసి ఎవరయినా అమ్మ దర్శనానికి వచ్చినా – వారిని కూడా అమ్మ భోజనం చేయమంటుంది. ఈ విషయంలో ఒకరిని ఆజ్ఞాపించ వచ్చునూ, ఒకరిని బతిమిలాడవచ్చునూ. ఎట్లాగయినా సరే అందరిచేత ఆ అన్నపూర్ణా లయంలో అమ్మ ప్రసాదం భుజింపజేస్తుంది. ఔను–అది ప్రసాదమే మరి అన్నమే అయితే ఆకలిని మాత్రమే తీర్చగలిగేది. కానీ ఆ అన్నం–భుజించిన వారికి భౌతిక మానసిక తృప్తిని చేకూర్చటమేగాక వారి అనేక క్లిష్టసమస్యలకు పరిష్కారాలు అందిస్తున్నది.

ఆ అంతరార్థమూ, దివ్యరహస్యమూ అవగతంకాని మనం "అన్నం తిని వచ్చా" మనో, "వెళ్ళి తింటా" మనో మొహమాటం ప్రదర్శిస్తాము.

మన అవసరం గ్రహించగలిగిన అమ్మ, మనను అనుగ్రహించదలిచిన అమ్మ బతిమిలాడి అయినా సరే మనచేత ఆ ప్రసాదాన్ని భుజింపచేస్తుంది. అయితే "మరుగే నా విధానం" అని ప్రకటించుకున్న అమ్మ ఆ విషయాన్ని అభివ్యక్తం చేయక, మానవాకృతిలో దాచుకున్న మాధవత్వం వలెనే భద్రపరచుకుని నటిస్తూ "ఆకలి" అనీ "అన్న" మని అంటూ ఉంటుంది.

కానీ, మనచేత అన్నపు ముద్దలను తినిపిస్తూ మనలను అనుగ్రహించే అమ్మనుగురించి ఆలోచిస్తే – తాను అన్నపుమెతుకు భుజించిగానీ ద్రౌపదిని అనుగ హించలేని శ్రీకృష్ణుడు స్మృతికి వచ్చి – ఆ అంతరం మనలను సమ్ముగ్ధులనూ, సమ్మోద భరితులనూ చేయటమేగాక – దైవం మాతృ రూపంలో అవతరించటంలోని విశేషానికీ మన అదృష్టానికీ పరవశుల మవుతాము.

–జులై 1972

"సర్వత్రా మమకారమే మాధవత్వం"

1972 ఆగష్టు 15 రాత్రి అన్నపూర్ణాలయ వార్షికోత్సవం సందర్భంలో భక్తితో కృతజ్ఞతతో మనం అమ్మను అర్చించుకొనటమూ, ప్రేమతో వాత్సల్యంతో అమ్మ మనకు తృప్తిగా అన్నం పెట్టుకొనటమూ పూర్తి అయి వచ్చినవారిలో అనేకులు అమ్మ వద్ద సెలవూ ప్రసాదమూ అందుకుని వెళ్ళిపోగా అమ్మగదికి దక్షిణభాగంలో ఆరు బయట మంచంపై అమ్మ విశ్రమించింది. మిగిలిన మేము అమ్మమంచం చుట్టూ కూర్చుని ఉన్నాము.

ఆసక్తితో కొందరు అమ్మను ఏవేవో ప్రశ్నిస్తుంటే—ఆప్యాయతతో వారికి అమ్మ సమాధానాలిస్తున్నది. నిత్యమూ ఆ సమయంలో అమ్మకు అది వాడుక అయితే మనకు అది ఆనందప్రదమయిన వేడుక అయింది.

ఆ ప్రసంగం మధ్యలో విశాఖపట్నంనుంచి వచ్చిన పోర్టు ఆఫీసరు ఒకరు అమ్మను అడిగారు.

"అమ్మా – మమకారాలు బంధం అని తెలుసు. వాటివలన ఎన్నో యిబ్బందులనీ, యిక్కట్లనీ తెలుసు. అయినా యీ మమకారాలను ఎలా వదిలించుకోవాలే తెలియటం లేదు. అందుకు మీ సలహా కావాలి."

"మమకారం మానవ సహజం. మనిషికి అవయవాల్లాగానే గుణాల్లాగానే మమకారమూ సామాన్యమే. అది వదలదు. అయినా ఎందుకు వదలాలి? అది మనిషికి చైతన్యాన్ని ప్రసాదిస్తూ మనిషిలో అభిమానాన్ని, అనురాగాన్నీ ఉద్భవింపజేస్తుంది.

అని మమకారాన్ని గురించి వివరిస్తూ...

"అయినా—మీకు యితరు లెవరిమీద మమకారం కలగటం లేదుగా? వీధిలో ఎవరయిన కష్టపడుతుంటే మీరు బాధపడుతున్నారా?" అని ప్రశ్నించింది.

వారు నిర్మొహమాటంగా అంగీకరించారు. అయినా అమ్మ వారిసమాధానం ఏమీ వినకుండానే—

"ఏమో బాబు—మీరు యివన్నీ వదిలించుకోవాలనీ, వీటినుండి విముక్తులు కావాలనీ కోరుకుంటున్నారు. నాకేమో రోజురోజుకు యివి బలపడుతున్నాయి. నేను యీ మమకార బంధాలలోనే ఉన్నాను. మరి, నేను మీకేమి సలహా యివ్వనూ?" అని తిరిగి ప్రశ్నించి జవాబుకోసం ఎదురుచూడకుండానే మౌనం దాల్చింది.

అమ్మ పై ప్రశ్న 'యితరుల నేమయినా ప్రేమిస్తున్నావా?' అని అడగటంలో ప్రేమించిమని సూచనే ఉన్నది. మరి అమ్మ ఏమీ సూటిగా చెప్పదు గదా. అమ్మసూచనలూ, సలహాలు అర్థంకావటం కష్టంకూడా. అవి ఆకులందున అణిగి మణిగి అలరాడే పండ్లవలే దాగి ఉంటాయి.

ఈ విషయాన్నే అమ్మ లోగడ సవివరంగానూ స్పష్టంగానూ ఉద్ఘాటించింది—విరాగాన్ని నిర్వచిస్తూ "సర్వత్రా అనురాగమే విరాగ" మని. ఇంకొక సందర్భంలో "పరిమితమయిన మమకారం మానవత్వాన్నీ అపరిమితమైన మమకారం మాధవత్వాన్నీ సూచిస్తాయి" అని వివరిస్తూ మరో సన్నివేశంలో "ఎక్కడ ఎవరిని చూచినా తన బిడ్డ అనిపించటమే బ్రహ్మత్వం" అని విపులీకరించింది.

మన మమకారం పరిమితులతోనూ, షరతులతోనూ కూడి ఉన్నది. అమ్మ మమకారం అపరిమితమూ అపారమూ అవ్యాజమూ అయినది. కనుకనే అమ్మ మమకారం ప్రేమ సంభృతమై దివ్యమై ఆనంద ప్రదంకాగా మన మమకారం దుఃఖానికి కారణ మవుతున్నది.

అమ్మ మమత ఎంత విశాలమూ, నిరవధికమూ అంటే అది వ్యాప్తమై దిగంతాలు తాకటమేగాక ఈ సృష్టినే "నాది" అనుకున్నది.

ఇంతవరకూ మనం 'ఈ ఊరు నాది' 'ఈ రాష్ట్రం నాది' 'ఈ దేశం నాది' అనుకున్న వారినీ అన్న వారినే ఎరుగుదుమూ. వారే ఆదర్శప్రాయులూ అయి నారుగానీ—"ఈ సృష్టి నాది" అనుకున్నవారిని మనం ఎరుగము.

నేడు అమ్మ మాత్రమే అందుకు ఏకైక ఉదాహరణగా భాసిస్తూ "జగదారాధ్య" అయింది.

— ఆగష్టు 1972

"నేనందరినీ ప్రేమిస్తాను"

పుట్టిన ప్రతిప్రాణి జీవితానికీ సార్థకత సంప్రాప్తం కాకపోవచ్చును. వారి ప్రతి చర్యకూ ప్రయోజనం పరమావధి కాకపోవచ్చును.

కానీ కొందరుంటారు. వారు వేసే ప్రతిపదమూ మహోత్తమ లక్ష్యోన్ముఖమై నడుస్తుంది. వారి పెదవిదాటిన ప్రతిపదమూ మహోదాత్త అర్థస్ఫోరకమై అలరారుతుంది. వారి జీవితం మానవాళికే ఆదర్శవంతమై, మహోన్నత సూత్రాలకూ సిద్ధాంతాలకూ సజీవోదాహరణమై మహోజ్జ్వలమై వెలుగొందుతుంది. వారినే కొందరు కారణ జన్ములనీ అవతార పురుషులనీ అంటారు. వారినే కొందరు పరిపూర్ణ మానవులనీ, పురుషోత్తములనీ అంటారు.

నేడు అమ్మలో దైవత్వం అనుభూత మయిన కొందరు అమ్మను అవతారమూర్తి అన్న పరమ విశ్వాసంతో పూజిస్తున్నారు, ఉపాసిస్తున్నారు. అమ్మలో పరకాష్ఠనందుకున్న మానవతను అవలోకించి అవగాహన చేసుకున్న మరికొందరు అనురాగమూర్తిగానే సంభావనచేసి అమ్మను ప్రేమిస్తున్నారు, గౌరవిస్తున్నారు. అమ్మమాత్రం వీరూ వారూ అన్న భేదభావరహితంగా ప్రేమిస్తున్నది. మనం మన దృష్టిని యింకొంచెం నిశితం చేసుకునో, యింకొంత విశాలం చేసుకునో చూస్తే- అమ్మ తనను పూజించేవారినీ, ప్రేమించేవారినే కాక తనను ద్వేషించేవారినీ నిందించేవారిని సైతమూ ఒకే స్థాయిలో ప్రేమిస్తున్నది.

ఈ ప్రేమ అమ్మ బాల్యంనుండీ అమ్మలో సహజంగానే ఉన్నట్లు - అమ్మ జీవితాన్ని పరిశీలించినా, అమ్మ జీవిత చరిత్రను పఠించినా మనకు అవగత మవుతుంది. తన తొమ్మిదవ సంవత్సరంలో ప్రఖ్యాత పండితులూ, పరమ సాధువులూ అయిన వాసుదాసస్వామివారిని అమ్మ కలుసుకున్నప్పుడు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన అమ్మను చూచి జాలిపడి- 'అందరూ నిన్ను ప్రేమించేటట్లు దీవించేదా?' అని వారు అడిగితే "అట్లా కాదు. ఎవరు నన్ను ప్రేమించినా, ప్రేమించకపోయినా- నేను అందరినీ ప్రేమించేటట్లు దీవించండి" అని వారిని అమ్మ అడిగిననాడు స్వామి

వారినే కాక నేడు అవ్యాజమూ, అనుపమానమూ, అపారమూ అయిన ప్రేమతో జగత్తునే విభ్రాంతిచకితం చేస్తున్నది

దానికి మనం 'కరుణ' అని పేరు పెట్టుకొనవచ్చును. 'సానుభూతి' అని నామకరణం చేసుకోవచ్చును. దానిని మనం 'ప్రేమ' అని పిలువవచ్చును. 'వాత్సల్యం' అని భావించవచ్చును. పేరు ఏమయినా మనపై అమ్మకు గల మధుర భావం మాత్రం అనిర్వచనీయమయినదీ, అపూర్వమయినదీ. పూర్వం ఏ చరిత్ర లోనూ, ఏ పురాణంలోనూ, కనీ వినీ ఎరుగనిదీ— అమ్మకు ఎక్కడ ఎప్పుడు ఎవరిని చూచినా తన బిడ్డయే అనిపిస్తుందట. ఎవరిలోనూ ఏ తప్పూ కనుపించదట. ఒకవేళ ఎవరైనా ఏ సాంఘిక నియమాన్ని ఉల్లంఘించో, ఏ ధర్మసూత్రాన్ని అతిక్రమించో ప్రవర్తించినా అమ్మ ఆ దోషం ఆ వ్యక్తికి ఆపాదించదు ఏ వ్యక్తి ఏ ప్రవర్తనకయినా బాధ్యత దైవం యిచ్చే ప్రేరణదే నని అమ్మ ప్రబల విశ్వాసమూ, ప్రబోధమూ. కనుక ఆ దోషం దైవానిదేనని అందుకు ఏదయిన శిక్ష ఉంటే ఆ దైవమే అనుభవించాలనీ అమ్మ ఉద్ఘాటిస్తున్నది.

కనుకనే మనం గణించే పాపపుణ్యాలూ మంచి చెడ్డలూ అమ్మ దృష్టిలో లేవు. అమ్మకు దుర్మార్గులూ— సన్మార్గులూ, అందరూ సమానమే. కాకపోతే సన్మార్గులను వారి సత్ప్రవర్తనమే కాపాడుతుండీ, లోకమూ గౌరవిస్తుంది. కనుక దుర్మార్గులకు తాను ఆశ్రయమివ్వాలీ, వారిని ఆదరించాలీ, ఆదుకోవాలీ అని జాలిపడుతుంది. ఏ మనిషి అయినా ఏ తప్పునయినా తప్పించుకోలేకనే చేస్తారని అమ్మ నమ్ముతుంది. ఏ సమయంలోనయినా, ఏ సందర్భంలోనయినా అమ్మకు మానవాళిపైగల కరుణకూ ప్రేమకూ హద్దు చూడలేము.

మానవుడు నిత్యమూ అన్వేషించే సుఖశాంతులు పొందటానికి అమ్మ నిరంతరం నిర్విరామంగా సందేశాన్నీ సూత్రాలనూ ప్రసారం చేస్తున్నది. మనిషిని నిర్నిద్రంగా అలమటింపజేసి అలయింపజేస్తున్న అసంఖ్యాక సమస్యలకు అమ్మ సులభపరిష్కారాలనూ సుగమమార్గాలనూ ప్రబోధిస్తున్నది

అమ్మను దర్శించినవారికీ, స్మరించినవారికీ, ధ్యానించినవారికీ ఉపాసించిన వారికీ, పూజించినవారికీ అమ్మ అనేకానుభవాలు ప్రసాదిస్తున్న విషయం ఎవరికి వారికే అనుభవైకవేద్యం. ఒకరి అనుభవాన్ని మరొకరు నిరాకరించటానికీ ఖండించటానికీ వీల్లేదు. వారికి రాముడుగానో, శివుడుగానో, కృష్ణుడుగానో, ఏసుక్రీస్తుగానో, మహమ్మదుగానో, సీతగానో, పార్వతిగానో.... ఏ దేవత రూపంలోనయినా అమ్మ దర్శనం యివ్వవచ్చునూ. వారికి అసాధ్యాలను సాధ్యాలుగనూ, అఘటనలను ఘటనలుగనూ చూపించవచ్చునూ, చేయవచ్చునూ.

కాని వాటన్నిటికంటే దేశకాలాద్యతీతంగా అమ్మ ప్రవచిస్తున్న సత్యాలూ, ప్రసారం చేస్తున్న సందేశమూ వినూత్నమూ విశిష్టమూ అయినవే కాక విప్లవాత్మకమైనదీ, ప్రజాబాహుళ్యానికి అత్యంతోపయోగకరమయినవీ.

చరిత్రలోనూ పురాణాల్లోనూ అనేకానేక మహత్తులు ప్రకటించిన వాళ్ళూ ప్రదర్శించినవాళ్ళూ... అవతార పురుషులనీ కారణజన్ములనీ ప్రఖ్యాతి నందినవాళ్ళూ, ప్రసిద్ధులయినవాళ్ళూ.... అనేకులున్నారు. కానీ అమ్మవలె అమృత హృదయులై అనురాగమూర్తులై వాత్సల్యసింధువులై జనసామాన్యాన్ని యింతగా జాగరితం చేసిన వాళ్ళూ, సృష్టిరహస్యాన్ని యీ విధంగా ప్రజాకోటికి ఏ అరమరికా లేకుండా తేట తెల్లంగా బహిర్గతం చేసినవాళ్ళూ ఏ విచక్షణా పాటించకుండా ఎల్లరకూ తన ఎనలేని ప్రేమను ఎల్లలు లేకుండా పంచిపెట్టిన వాళ్ళూ.... అల్పమూ, అరుదే కాదు అపూర్వంకూడా.

ఎటు జూచినా ఎట్లా ఆలోచించినా అమ్మచరిత్రా అమ్మ జీవితమూ అమ్మ హృదయమూ-అమ్మ మూర్తీ-అత్యద్భుతమూ అమృతమయమూ అనురాగ భరితమూ ఆదర్శమూ ఆరాధ్యమూ అయి ఉన్నాయి.

మరి అమ్మకు స్వర్ణోత్సవం జరుపుకోవాలని నిశ్చయించుకున్నాము. మన ప్రేమనూ గౌరవాన్నీ భక్తినీ నివేదించుకోవాలని ఆశిస్తున్నామూ, ఆరాట పడుతున్నామూ.

అయితే యీ నివేదన ఎట్లా ఉండాలీ, మన ప్రేమను ఎట్లా వ్యక్తం చేసుకోవాలీ అన్న విషయంలో భిన్నభిన్న అభిప్రాయాలుండటం సహజం.

కొందరు యీ సందర్భాన్ని పురస్కరించుకుని-రోజూ అష్టోత్తర నామావళితో పూజచేసుకునేవాళ్ళు సహస్రనామాలతో పూజచేసుకొనవచ్చును. రోజూ ఒక కొబ్బరికాయ కొట్టేవాళ్ళు వంద కొబ్బరికాయలు పగుల కొట్టవచ్చును. రోజూ అమ్మ పాదాలపై ఒక పువ్వును సమర్పించేవాళ్ళు బుట్టెడు పూలను కుమ్మరించ వచ్చును. రోజూ ఒక పండును నివేదన చేసేవాళ్ళు గంపెడు పండ్లను ఆరగింపుచేయ వచ్చును. రోజూ ఒక్క అగరువత్తిని వెలిగించేవాళ్ళు కట్టవత్తులతో గదిని పరిమళ భరితం చేయవచ్చును. కర్పూరంపలుకుకు బదులుగా కర్పూరం మద్దనే వెలిగించి హారతి యివ్వవచ్చును -ఏదో మొక్కుబడి చెల్లించుకునే చేతులు దులుపుకోవటం కాక యీ సందర్భంలో మనపై బృహత్తరమైనబాధ్యత ఉన్నది.

అమ్మ దర్శనార్థమై ఎంత ఎక్కువమంది నిత్యమూ వస్తున్నారని మనం అనుకుంటున్నా-అమ్మను గురించి తెలియనివాళ్ళూ, అమ్మ ప్రశాంత మనోజ్ఞ మూర్తిని తిలకించనివాళ్ళూ, ఆ దర్శనంలోనే మౌనంలోనే ఎన్నో రోజులుగా పీడించే సమస్యలకూ ప్రశ్నలకూ పరిష్కారాలనూ సమాధానాలనూ పొంది మృగ్యం అనుకున్న మనశ్శాంతిని అనుభవించినవాళ్ళూ, అమ్మ సందేశాన్నీ ప్రబోధాన్నీ ఆలకించని అభాగ్యులూ- ఎందరో ఉన్నారు. ఆ సోదరులకూ అమ్మ మధుర సందేశాన్ని అందించాలి.

అందుకు మనం ఒక ఉద్యమాన్నే నడపాలి. పట్టణ పట్టణంలోనూ, గ్రామ గ్రామంలోనూ సభలూ సమావేశాలూ జరపాలి. ఇంటింటికీ, మనిషి మనిషికీ మాతృ సందేశాన్ని మోసుకుపోవాలి. గుండెగుండెకూ నరనరానికీ అమ్మ యిచ్చే నవరక్తాన్ని ఎక్కించాలి. మూఢాచారాలనూ, ఛాందస విశ్వాసాలనూ అనవసర అపోహలనూ, భయద భ్రాంతులనూ అమ్మసందేశపరశువుతో ఛేదించాలి, అమ్మ చల్లని ప్రేమ జగత్తునంతా పున్నమవెన్నెలవలే పరచుకోవాలి. ఆ వెన్నెల వెలుగులలో సర్వసృష్టి పరవశించిపోవాలి.

అందుకు వ్యష్టిగానూ సమష్టిగానూ చేయాల్సింది ఎంతయినా ఉన్నది. ఇందుకు హనుమంత జాంబవంతులూ కావాలి. ఉడతలూ బుడతలూ కావాలి. వ్యక్తులూ కృషి చేయాలి. అధ్యయన పరిషత్తులూ పరిశ్రమించాలి.

ఇది అందరికీ ఉమ్మడి పిలుపు. ఇది అమ్మపై మనకుగల ప్రేమకు అభివ్యక్తం చేసుకునేందుకు మహావకాశం.

అమ్మ నవ్య సందేశం దశదిశలకూ ప్రసారం చేసే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ అమ్మకు ఉపకరణంగా పరిణమించాలి, సర్వ విభేదరహితంగా ప్రేమకూ త్యాగానికీ సహనానికీ సమానత్వానికీ నిలయమై విలసిల్లే జిల్లెళ్ళమూడి పృథ్విలోని ప్రత్యంశంలోనూ ప్రతిబింబించాలి- అన్న ధ్యేయం మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు సమాంతరమై పోవాలి.

"కలో గంజో తనకున్నంతలో ఆదరణగా అందరికీ పెట్టే యిల్లు ఏదయినా జిల్లెళ్ళమూడే" నన్నది అమ్మ.

— ఏప్రిల్ 1972

అనుభవసారం

"అమ్మరూపంలో మనం ఎంత ప్రశాంతతనూ, ప్రసన్నతను చూస్తామో-అమ్మ ఆలోచనలో, ప్రవచనంలో అంత విప్లవాన్ని వింటాము బాహ్యంగా, అంటే కట్టులో, బొట్టులో ఎంత ప్రాచీన సంప్రదాయాన్ని పాటిస్తుందో ఆంతరంగికంగా అంత పరిపూర్ణ స్వాతంత్రాన్ని అవలంబిస్తుంది అమ్మ.

కనుకనే అమ్మను అందరూ అసమాన అపూర్వ హేతువాదినిగా అంగీకరించారు. అమ్మ ఏమి పలికినా ఏమి ప్రవచించినా తన అనుభవమే అధారంగా తీసుకున్నదిగానీ, ఏ శాస్త్రాన్నీ, ఏ గ్రంథాన్నీ ఆలంబం చేసుకొన ప్రయత్నించ లేదు అమ్మలోని విశిష్టతల్లో యిదికూడా ఒకటి.

అమ్మ ఉపన్యాసాలు చేయకపోయినా, ఉద్గ్రంథాలు రచించకపోయినా సంభాషణల్లోనో, సంవాదల్లోనో అనేక అపూర్వ సత్యాలను ఉద్ఘాటిస్తున్నది. వాటిలో కొన్ని పూర్వ శాస్త్రాల్లోనో, ఉపనిషత్తుల్లోనో ఉల్లేఖింపబడిన సత్యాలతో సరిపోవచ్చును కానీ వాటికంటే అతీతంగానూ, కొన్నియెడల భిన్నంగానూ చెప్పిన సత్యాలు ఎన్నో నేటి మేధావుల ఆలోచనలకు పదును పెడుతున్నాయి.

హిందూ స్త్రీకి భర్తయే దైవమని శాస్త్రాలు చెబితే - భర్తకు భార్యకూడా దేవతయేనని అమ్మ చేర్చింది. శిష్యునికి గురువే బ్రహ్మఅని శాస్త్రాలు చెబితే- గురువునకు అంతేవాసికూడా అంతే నన్నది అమ్మ. రోగికి వైద్యుడు నారాయణుడే కాదు. వైద్యునికి రోగికూడా ఆరాధ్యమే నన్నది అమ్మ. అన్నం పరబ్రహ్మ స్వరూపమని పూర్వఋషులు ప్రవచిస్తే, అశుద్ధంకూడా అదేనసీ, ప్రజ్ఞానమే కాదు అజ్ఞానమూ; ఆనందమే కాదు దుఃఖమూ; తేజమే కాదు తిమిరమూ, సత్యమే కాదు అసత్యమూ; సౌందర్యమే కాదు వికారమూ; శివమే కాదు శవమూ; శబ్దమే కాదు నిశ్శబ్దమూ .... బ్రహ్మమే నని ప్రవచిస్తూ అమ్మ పరిపూర్ణ వాదాన్ని ప్రవేశపెట్టి ఆధ్యాత్మిక చింతనలో ఒక నూతనాధ్యాయాన్ని రచించడమే కాక - మనిషికి పునర్జన్మ లేదనీ, పాపపుణ్యాలు లేవనీ, కర్తృత్వం లేదనీ, ఇహపరాలు లేవనీ, జగత్తు మిథ్య కాదనీ, అందరికీ సుగతే ననీ చెబుతూ ఆధ్యాత్మిక వాదంలో పెనుతుపానునే సృష్టించింది.

ఈ విప్లవాత్మక సిద్ధాంతాలలో తలమానిక మయిన వాక్యాన్ని అమ్మ యిటీవలేనే వెలువరించింది. అది 'దేవుడిని గురించి తెలుసుకోవటమంటే, వాడు లేడని తెలుసుకోవటమే' అని.

ఎంత అపూర్వమయిన ప్రవచనం యిది : ఎంత విప్లవాత్మకమయిన ప్రకటన యిది : నేతి, నేతి యంటూ కనుపించేదేదీ దైవం కాదని పూర్వ తాత్వికులందరూ ఆ దైవాన్ని ఎక్కడో ఒక ఊర్ధ్వ లోకంలో ఒక ఉన్నత సింహాసనారూఢుణ్ణి సకల కల్యాణ గుణాభిరాముణ్ణి చేసి కూర్చొన పెడితే....నేడు అమ్మ యీ కనుపించే దంతా దైవమే ననీ దైవమెక్కడో ఒక చోట ఒక రూపధారియై లేడనీ, వాడు యీ జగత్తును సృష్టించలేదనీ, దైవం సర్వాంతర్యామి కాక సర్వమూ అయి ఉన్నా డని చెబుతూ దైవంకాని, శాశ్వతంకాని యీ ప్రపంచాన్ని వదిలి దూరంగా పారిపోయి కళ్ళూ, చెవులూ, మూసుకుని పరమార్థాన్ని సాధించాలనుకునే మానవునికి-సత్యమూ, శివమూ. సుందరమూ అయినది యీ జగత్తే నని చాటుతూ, యీ జగతిలో ప్రతి ప్రాణినీ ప్రేమించటమే దైవారాధనగా ప్రబోధిస్తూ ... శూన్యమై వెలవెల బోతున్న జగత్తును సుందర నందనవనంగా మార్చివేయటంతో, దైవంగా ఆరాధింపబడుతున్న అమ్మ అపూర్వ అనుపమ విశిష్ట మానవతావాదినిగాకూడా ఆదర్శమైంది.

—నవంబరు 1974

నా జీవితమే సందేశం

గాలీ, నీరూ మనిషికి అవసరం. కనుకనే అవంటే మనిషికెంతో ప్రేమ. కాని గాలి ఝంఝూ ప్రభంజనమైనా, నీరు మున్నీరై చెలియలికట్టలు దాటినా మనిషికి వాటిని చూస్తే ఎంత భయమో చెప్పలేము. అదే విధంగా ప్రియతమమయిన ప్రజలు, అమ్మ పర్యటనలో అమ్మను చూడవచ్చినవారు, వందలు వేలు దాటి లక్షలలో పడి నిర్వాహకుల్ని భయపెట్టారనటం అతిశయోక్తి కాదు.

అందువల్లనే యేమో, జిల్లెళ్ళమూడికి వందలమైళ్ళ దూరంలో గల చిత్తూరు, కడప జిల్లాలలో అమ్మపర్యటన నిర్ణయమయిందంటే - నిర్వాహకులకెంతో సంతోషమయింది. అక్కడ అమ్మ ఎరుక తక్కువగా ఉండవచ్చుననీ, అమ్మను చూడ వచ్చే జనం అల్పసంఖ్యలో ఉండవచ్చుననీ అన్న ఆశతో.

కానీ వారి అంచనాలను అమ్మ తలక్రిందులు చేసింది. తన పిల్లలను చూడటానికి తాను వచ్చాననీ, తక్కువకాలంలో ఎక్కువమందిని చూడటం తన ఉద్దేశమనీ చెబుతూ సిద్ధసంకల్ప అయిన అమ్మ ఒక్క పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వారిపై తాను కోటికుంభాలతో అనురాగాన్ని క్రుమ్మరిస్తూ, కోటిచేతులు చాచి, కోటి గొంతులతో ఎలుగెత్తి పిలుస్తుంటే - దూరమనీ దగ్గరనీ, వందలమైళ్ళనీ, వేలమైళ్ళనీ- ఏమున్నది? అవి చిత్తూరు కడపలే కాదు, ఎంత దూర తీరాలయినా అమ్మపిలుపును అందుకోనకుండా ఎవరు ఉండగలరు? అందుకుని ఆ దివ్యమూర్తిని కనులారా దర్శించకుండా ఎవరు ఉండగలరు? దర్శించుకొని "పుణ్యమహో పుణ్యమహో పుణ్యం తవ దర్శనం...." అని మనసారా గానం చేయకుండా ఎవరు ఉండగలరు?

అందువలననే చిత్తూరు కడప జిల్లాలలో అమ్మ ఎక్కడ దర్శనమిచ్చినా- ప్రజలు సముద్రాలవలె పొంగిపోయారు. అందరిలో ఒకటే ఆసక్తి, ఎనలేని భక్తి. అన్ని కేంద్రాలలో అమ్మను కారుదింపి వేదిక నెక్కించటమే కష్టసాధ్యమై పోయింది, అన్నివేలమందికీ ఆ కొద్ది అడుగుల దూరంలోనే, ఆ కొన్ని క్షణాలకాలంలోనే అమ్మపాదస్పర్శ చేయాలని తీవ్రమయిన ఆకాంక్ష. వారి ఆకాంక్ష బలంముందు పోలీసులూ, వలంటీర్లూ ఓడిపోక తప్పలేదు, ప్రతి వేదికవద్దా వలంటీర్లకూ ప్రజలకూ

మధ్య విచిత్రమూ, అనవసరమూ అయిన ఘర్షణ అనివార్యం అయింది. ఎక్కడ అమ్మకు ఏ స్పర్శవల్ల బాధ కలుగుతుందోనని ఒక వర్గమూ, ఆ దివ్యశరీరాన్ని స్పృశించి తమ బాధలు నివారించుకుందామని మరో వర్గమూ. ఒక వర్గం వారికి అమ్మపై ప్రేమ. మరో వర్గం వారికి అమ్మపై భక్తి, ఇది ప్రేమకూ భక్తికీ మధ్య ఆశ్చర్యకరమయిన వివాదం! ఈ వివాదానికి ఎట్లా రాజీ కుదర్చాలో ఏ నిర్వాహకులకూ అర్థం కాలేదు . !

అన్ని చోట్లా అమ్మను చూచి ఆనందించిన ప్రజలు అమ్మనోటినుండి ఒక్క సందేశం వినటానికి ఉత్సుకతను చూపించారు. వేదికలపై అమ్మ వెల్లడించక పోయినా పత్రికావిలేఖరుల గోష్టులలోనూ, జిజ్ఞాసువులతో జరిపిన చర్చలలోనూ తన అనుభవసారాన్నీ, సందేశసారాన్ని వ్యక్తం చేస్తూనే వచ్చింది. అది దైవం ఎక్కడో ఒక మూలసింహాసనారూఢుడై యీ జగత్ పరిపాలన చేయటంలేదనీ; కనుపించేదంతా దైవమేననీ; ఎవరిని చూచినా తనకు తన బిడ్డయే ననిపిస్తుందనీ; వారి'కింత' పెట్టుకోవాలనిపిస్తుందనీ విపులీకరిస్తూ .... సర్వత్రానురాగమే తన సందేశంగా అందిస్తూ - తానేమీ ఘనకార్యాలు చేయడం లేదనీ, తన జీవితంలో ఏమయినా ఆదర్శప్రాయమయినదిగా తమకు తోస్తే స్వీకరించవచ్చు ననీ నిరాడంబరంగా వివరించింది.

ఔను—

లౌకికంగా నేమీ, పారమార్థికంగా నేమీ, వెలుగు వెల్లువల వెదజల్లే మహిమాన్విత సంఘటనలతో కూడిన ఆ దివ్యజీవితంకంటే మహత్తర సందేశ మేముంటుంది?

—ఫిబ్రవరి 1974

ఆధ్యాత్మిక జీవనం

ఆ రోజు గురుపూర్ణిమ - విజయవాడనుండి ఒక కుటుంబం అమ్మను చూడటానికి మొట్టమొదటిసారిగా వచ్చింది. ఆ కుటుంబం పెద్ద శ్రీ సూరంపూడి సర్వేశ్వరరావు గారు, స్కూల్స్ యిన్‌స్పెక్టరుగా చేసి రిటైరయ్యారు. వారి కుమార్తెలు యిద్దరు, అవివాహితలు; వారి కుమారుడూ, కోడలూ వచ్చారు.

కుమార్తెలు యిద్దరూ అమ్మకు నమస్కారం చేసుకుని వివాహ ప్రాప్తి కలగజేయుమని అమ్మను అర్థిస్తూ .... ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రసాదించమని వేడుకున్నారు.

తండ్రి అమ్మకు పాదాభివందనంచేసి - పరిపూర్ణజ్ఞానాన్నీ, ముక్తినీ, అనాయాసమరణాన్నీ అనుగ్రహించమని ప్రార్థించాడు.

కుమారుడుకూడా అమ్మకు ప్రణమిల్లి - ఆధ్యాత్మిక జీవితం ప్రసాదించమ్మా - అని కోరుకున్నాడు.

నాకు ఆశ్చర్యం కలిగింది - ఆ కుటుంబంలోని సభ్యులందరి ఏకగ్రీవమయిన అభిలాషను వినగానే.

అతను మోకాళ్ళపై కూర్చుని తదేకంగా అమ్మను అవలోకిస్తున్నాడు - అమ్మ ఏమి చెబుతుందా-అని.

అమ్మ మౌనంగానే ఉన్నది. ఆ చూపులో గానీ, ముఖంలో గానీ ఏభావమూ ప్రస్ఫుటం కావటం లేదు. అమ్మకు సహజమయిన ప్రశాంతత, నిర్లిప్తత అమ్మ వదనమండలంలో తేజరిల్లు తున్నాయి.

"హాయిగా బ్రతికే వాళ్ళు - కోరి కోరి ఎందుకు కష్టాలు తెచ్చుకుంటారు? ఆధ్యాత్మిక జీవితం కోరుకోనడం అంటే - పూలబాటనుండి ముళ్ళ డొంకలోకి మళ్ళడమే" అన్నారు అక్కడి సోదరుల్లో ఒకరు.

"సిద్ధపడే అడుగుతున్నాను" అన్నాడు అతడు నిశ్చలంగా.

అతని స్థిరచిత్తమూ, ధైర్యమూ ప్రశంసాపాత్రమైనవి.

ఇంకా అమ్మ మౌనం వీడలేదు. గది అంతా కూడా చాలా నిశ్శబ్దంగా ఉన్నది.

"అమ్మా - వారడుగుతున్నారు..." అన్నాను, వారు అమ్మనుండి ఏమయినా వినాలని కుతూహలంగా ఉన్నారని భావిస్తూ.

అమ్మ పెదవులు కదిలాయి.

గది అంతా సావధానమయింది. గది అంతా చెవులైనాయి.

అమ్మ పెదవి విప్పితే చాలు - అత్యద్భుత ప్రతిభా సంపన్నుడయిన వైణికుడు విశిష్టమయిన వల్లకీ వల్లరిపై సుందరమయిన అంగుళితో సుతారంగా మీటినట్లు .... ఒక అలౌకిక నాదం ప్రభవిస్తుంది. ఆ నాదంనుండి దివ్యరాగం సముద్భూతమై పరిసరాలన్నిటా పరివ్యాప్తమై అణువణువునూ పులకింపజేస్తుంది. గుండె గుండెలోనూ గులాబులు విరిసినట్లు ఒక అలౌకిక పరిమళం ప్రసృతమవుతుంది.

అదంతా ఒక దివ్య ప్రక్రియ.

ఆ వాగమృత తరంగిణిలో ఒక బిందు వయినా ఆస్వాదించగలిగినవారు అదృష్టవంతులు, ధన్యులు!

"ఆధ్యాత్మిక జీవనం అని ప్రత్యేకంగా ఉందని నేను అనుకోవడం లేదు."

అమ్మ అక్షరమక్షరాన్నీ రాగమయంగా రమణీయంగా ప్రవచించింది.

అపారమయిన అమ్మ అనుభవం ప్రసవించిన అపూర్వమందారం ఆ వాక్యం! అమ్మ - అనంతజ్ఞానతైలంతో వెలిగించిన దివ్యజ్యోతి ఆ వాక్యం!

అందరూ ఆసక్తిగా వింటున్నారు. అమ్మ పునరుద్ఘాటించింది. "నా దృష్టిలో ఆధ్యాత్మిక జీవితమంటూ ప్రత్యేకంగా లేదు నాన్నా. నీవు చేసే ప్రతి పనీ దైవకార్యమే. ఈ జగత్తే దైవస్వరూపం అయితే నీవు చూసేది ఏది దైవం కాదూ? నీవు చేసేది ఏది ఆధ్యాత్మికం కాదూ?"

ఆధ్యాత్మిక జీవితంకోసం ప్రత్యేకంగా చేయవలసిన ప్రయత్నమంటూ లే-దని అమ్మ నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

అయితే - ఈ భావం అమ్మ యీనాడే క్రొత్తగా చెప్పలేదు. అనేక పర్యాయాలు అనేక రీతుల్లో అభివ్యక్తం చేసింది.

సామాన్యుల్లో లౌకికానికీ ఆధ్యాత్మికానికీ మధ్య అడ్డుగోడ ఉన్నది. అమ్మ ఆ గోడను పునాదులతో సహా పడగొడుతున్నది.

మనం నివసించే యీ లోకం కాక - మరణానంతరం మనం వెళ్ళి మన పాపపుణ్యాలకు ఫలితాలను అనుభవించే వేరే లోకాలు ఉన్నవనే భ్రాంతీ, ఈ సృష్టి స్థితి లయ కారకుడైన భగవంతుడు వేరే ఉన్నాడనే భ్రమా మన ఊహలకూ ఆలోచనలకూ ఆధారం.

అమ్మ యీ భ్రమనూ భ్రాంతిని అమూలాగ్రం అన్నివిధాల తొల గిస్తున్నది. అమ్మ తన అనుభవంనుండి పలికిన అనేక నిర్వచనాలూ ప్రవచనాలూ ఈ పరమ సత్యాన్ని బలపరుస్తున్నాయి.

"మీరు దైవం జగత్తు కంటే వేరు అంటారు. నేను ఈ జగత్తే దైవం అంటాను. మలయమారుతాలు, కోయిల కూతలు, విరబూసిన పూలసరోవరాలే కాదు- పెంట, పేడ, చీము, నెత్తురు - అన్నీ కలిసిన ప్రకృతినే పరమేశ్వరుడు అను కుంటున్నాను"

"నాలుగు చేతులూ, కాళ్ళతో వేరుగా ఎక్కడో లేడు. అన్నీ అయి ఉన్నాడు. గులాబీపువ్వుగా, తమలపాకుగా, మంచంగా, కిటికీగా - అన్నీ తానే అయి ఉన్నాడు."

"దేవుణ్ణి చూడాలనే ఆసక్తి నాకు లేదు. ఈ కనపడుతున్నదానికన్నా భిన్నంగా ఏదీ నాకు కనపడటం లేదు."

"వాడెక్కడో ఉన్నాడనీ, యిక్కడ లేడనీ, మీరు కాదని, చూడాలనీ ప్రయత్నమూ లేదు. మీ కంటే భిన్నంగా (దైవం) ఉన్నాడనుకోవడం లేదు."

"ఒకే శక్తి అన్ని గుణాలతో అన్ని రూపాలతో ఉంది. ఈ కనుపించే సర్వమూ దైవమే - ప్రత్యేకించి ఒక రూపంలో లేదు, చూడడానికి. గంగానది అదే, మురికి కాలవా అదే."

"కనపడే దంతా అదే అయితే కళ్లు మూత లెందుకు?"

"కనపడుతున్నది కాదనుకుని ఎందులోనో ఏదో ఉందనుకోను ధర్మం, అర్థం, కామం - యీ మూడూ కాదనుకుని చేస్తున్నది లేదు. ఇంతకంటే వేరే ఏముందీ?"

సంసారం, భర్త, భార్య, సంతానం, మమకారాలు అన్నీ లౌకికమయిన అనుబంధాలనీ, ఆధ్యాత్మికానికి బంధాలనీ మనం అనుకుంటుంటే - అమ్మ యివేవీ ఆధ్యాత్మికానికి ప్రతిబంధాలనుకోకపోగా సాధనకు అవకాశాలే నంటున్నది.

అమ్మ అనురాగానికీ, మమకారానికీ సరిహద్దులూ, పరిమితులూ చెరిపేసి 'సర్వ్యతానురాగం' 'అపరిమిత మమకారం' మాధవత్వానికి మారుపేర్లు అనేసరికి - పెద్దపులులే లేడికూనలై మనం భయపడదగినవి కాక పెంచుకోవలసినవిగా మారి పోయాయి.

అందుకనే అమ్మ "పెండ్లిలో పెద్దపులి ఉన్నదనుకునే వారి భయం పోగొట్టడానికే నే నీ పెండ్లి చేసుకుంటున్నాను" అన్నది.

పిల్లలకు అన్నం పెట్టుకోవడం మన దృష్టిలో లౌకికం. మరి-తన పిల్లల మయిన మనకు అన్నం పెట్టుకొనడమే ఆధ్యాత్మిక సాధన అయింది అమ్మకు.

మనం - బడికి వెళితే లౌకికమనీ, గుడికి వెళితే ఆధ్యాత్మికమనీ భావిస్తాము. అమ్మదృష్టిలో బడికీ, గుడికీ తేడా లేదు.

మనం బజారునుండి పూలు కొనితెచ్చి-భార్య జడలో తురిమితే లౌకికమూ, దైవాన్ని అర్చిస్తే ఆధ్యాత్మికమూ. అమ్మ దృష్టిలో భర్తకు భార్య దేవతయే కాబట్టి భార్యను అలంకరించడమూ దైవారాధనే.

"ముముక్షుత్వమే మోక్షం."

ఒక సందర్భంలో శ్రీమతి కడప రామసుబ్బమ్మగారితో ప్రసంగిస్తూ - "ప్రజాసేవకూడా మోక్ష మార్గమే" నన్నది. అమ్మ దృష్టిలో పురుష ప్రయత్నం కూడా దైవ సంకల్పమే.

"ధ్యాసే ధ్యానం." "దిగులే జిజ్ఞాస." "నిరంతరస్మృతే ఆరాధన." "ఆవేదనే ఆరాధన." "తపనే తపస్సు." "తృప్తే ముక్తి." "వైకల్యం లేనిదే కైవల్యం." "వర్గం లేనిదే స్వర్గం."

ఈ జంటపదాల్లో మొదటి వర్గ మంతా మన దృష్టిలో లౌకికాలు. అమ్మ దృష్టిలో మన మనుకునే ఆధ్యాత్మికాలు.

"వినబడే ప్రతిశబ్దమూ ఓంకారమే. కూరలు తరిగేటప్పుడు కత్తిపీటనుంచి వచ్చే శబ్దంకూడా ఓంకారమే. రాయిపై రాయితో కొట్టినా ప్రణవనాదమే. నాకు పిల్లల ఏడుపులోనూ వేదమే వినిపిస్తుంది. శబ్దమే ఆత్మశబ్దం. కుక్క అరుపుకూడా అదే."

"ప్రణవమే కాదు, అన్ని అక్షరాలూ దైవ స్వరూపమే" నన్నది అమ్మ.

"పొయ్యి, రోలు-రోకలి, చీపురు, కత్తిపీట నా వేదాలు. చేట పంచమ వేదం."

మనం పరమలౌకికాలు అనుకునే వస్తువులు ఎట్లా ఆధ్యాత్మిక సాధనలు అయిపోయాయో ! పరుసవేది స్పర్శతో ప్రతిదీ సువర్ణమే అయినట్లు అమ్మదృష్టి సోకి ప్రతిదీ దైవమే అవుతున్నది !

"శరీరం కూడా ఆత్మ కాకపోలేదు" - అన్న వాక్యం వేదాంత చింతన లోనే విప్లవం సృష్టించింది. మనం శరీరం హీనమయినదని అనుకుంటూ, అంతకంటే విశిష్టమయినది మనస్సూ, అంతకంటే ఉన్నతమయినది జీవుడూ, పరమోత్కృష్ట మయినది ఆత్మ అనుకుంటున్నాము. కాని శరీరానికీ, ఆత్మకూ గల అంతరాలను అమ్మ తుడిచేసి రెండూ వేరు కావు - అన్నది.

"దేవాలయంకూడా దేవుడే."

మన దృష్టిలో బాధ లౌకికమయినది. ఆనందం ఆధ్యాత్మికమయినది. అమ్మ "బాధగూడా భగవంతుడే" నన్నది. మనం మంచితనం లౌకికమనీ, మనకు అర్థంకాని అతీతశక్తి దైవమనీ అనుకుంటుంటే - అమ్మ "మంచితనాన్ని మించిన దైవత్వం ఏముంది!" అంటున్నది.

అదే విధంగా మనం 'అలౌకికాలు' అని ఆకాశంలో నిలబెట్టిన వాటిని అమ్మ అవలీలగా అవనిపైకి దించి మనకు అందుబాటులోకి తీసుకురావడం మరో విశేషం.

"పాపం పుణ్యం లేవు - యిష్టం అయిష్టంతప్ప." శ్రీపాదవారు అన్నట్లు మన దృష్టిలో పాపపుణ్యాలు యమదూతలు. అమ్మ వాటిని పరమ లౌకికమయిన యిష్టాయిష్టాలుగా మార్చింది,

"మనం "ఇడా, పింగళ-" అని ఏమేమో అనుకుంటుంటే - "ఇడా, పింగళ అంటే ఏంలేదు నాన్నా - కుడి, ఎడమమాత్రమే" నంటుంది.

మనం 'శివలింగం'ను పూజిస్తుంటే - "అవసరమయితే నేను శివలింగంతో కుంకుడుకాయలు కొడతాను. ఏముంది అక్కడ ? అదీ రాయేగా-" అంటుంది సులభంగా.

'మంత్రం' అనేది మన దృష్టిలో విశిష్టమయిన ఆధ్యాత్మికమయితే - "మంత్రమంటే ఏముందీ, అక్షర సముదాయమేగా" అంటున్నది. ఆచారం విషయం వస్తే- అమ్మదృష్టిలో ఆచారం ఆరోగ్యంకోసమే మడి అంటే మనం ఏర్పరుచుకున్న హద్దులే.

పరమార్థం గురించి మాట్లాడుకుంటే - "అంతా స్వార్థమేగా. పరమార్థం ఏముందీ?" అంటుంది.

"నాది సర్వ సాధారణ స్థితి" అని చెబుతూ "సర్వం సాధారమయిన స్థితి" అని వివరించింది. మనకు విశేషమై కనిపించే వన్నీ అమ్మకు సామాన్య మయినవే. అందుకే అమ్మ మాన్యయే కాదు, సర్వసామాన్య ; అనన్య సామాన్య ;

లౌకికాలలో, ఆధ్యాత్మికాలలో 'సమదర్శనం' చేస్తున్నది అమ్మ.

మన దృష్టిలో అంధకారం లౌకికం; అసత్తు లౌకికం; అజ్ఞానం లౌకికం. అమ్మదృష్టిలో తేజఃతిమిరాలు, సదసత్తులు, జ్ఞానాజ్ఞానాలు....సర్వ ద్వంద్వాలూ ఆత్మ స్వరూపాలే "అంతా ఆత్మగా కనుపించడమే ఆత్మసాక్షాత్కారం" అని నిర్వచిస్తూ "ఎంత వెదికినా నాకు అది కానిది కనిపించడంలేదు" అని ప్రకటించిన అమ్మ ఆత్మజ్ఞాని, అద్వైతమూర్తి. అందుకనే మనందరకూ 'ఆరాధ్య' అయింది.

— జులై 1982

సన్యాసం

ఏలూరునుంచి శ్రీ లక్ష్మణయతీంద్రులు, మరికొందరు యతులు, వారి శిష్యులు అమ్మను చూసేందుకు జిల్లెళ్ళమూడి వస్తారని కబురు తెలిసింది. దూరదేశంలో ఉండే పిల్లలు యింటికి వస్తున్నారని తెలిసిన తల్లి పొందే అపారమైన ఆనందం అమ్మ ముఖంలో వికసితమైంది. వాళ్ళకోసం క్రొత్తగుడ్డలు తెప్పించమన్నది. తనదంటూ, తనకంటూ ఒక ప్రత్యేకమైన సాంప్రదాయం ఏమీ లేనప్పటికీ అమ్మ అందరి సంప్రదాయాలనూ మన్నిస్తుంది కదా! కనుకనే వారు ఏ గుడ్డలు కట్టుకుంటారో, ఏ రంగు వేసుకుంటారో, ఎంతగుడ్డ కావాలో వివరంగా కనుక్కొని వారికి సరిపోయేటట్లు తెప్పించమన్నది. ఆ గుడ్డలు తన చేతిమీదుగా వారికి ప్రసాదించాలనీ, వారు కట్టుకుంటే తాను చూడాలని అమ్మ ఉద్దేశం, అందులో అమ్మకు ఎనలేని ఆనందం. అందుకే లోగడ ఒకసారి అమ్మ అన్నది "నేను కట్టుకునే కంటే, మీరు కట్టుకుని కనబడితే నాకెంతో తృప్తిగా ఉంటుందీ" అని

వారు ఏమి తింటారో – ఏమి తినరో విచారించమన్నది. వాళ్ళకు తనచేతి మీదుగా స్వయంగా భోజనం పెడతానన్నది; అమ్మా – నీ సన్నిధానంలో, అదీ నువ్వే పెట్టేటప్పుడు యింకా యీ నియమ నిబంధనల ఆలోచన లేమిటమ్మా ? – అని అడిగితే "నేను పెడుతున్నానన్న ఆనందం వారికి మిగల్చకుండా - 'మా నియమ భంగం అయిందే' అన్న బాధను కూడా వారికి పంచిపెట్టాలా" అని అమ్మ నవ్వింది.

వారికి వసతికోసం ప్రత్యేకమైన గదులను ఏర్పాటు చేయమన్నది. వాటిని పరిశుభ్రం చేయమనీ చెప్పింది, ప్రయాణం చేసిన బడలికతో ఉంటారు కదా, రాగానే స్నానం చేస్తారేమో కనుక్కోమన్నది. ఇలా ఎన్నో చిన్న చిన్న విషయాల్లోకూడా అమ్మ కనబరిచే ఆసక్తి చూసి మేము ఆశ్చర్యచకితుల మయినాము.

ఫిబ్రవరి 11 వ తేదీన – అనుకున్నట్లుగానే – వాళ్ళందరూ వచ్చారు. అమ్మ అందరిని దగ్గరకు తీసుకున్నది యతులందరికీ నూతన వస్త్రాలను ప్రసాదించింది. వారందరికి తానే స్వయంగా అన్నం కలిపి ముద్దలు నోటికి అందించింది. తర్వాత వారి శిష్యులందరిని బారులు తీర్చి కూర్చోబెట్టి అమ్మ తాను కూడా స్వయంగా వడ్డించింది. చాలాకాలం తర్వాత అట్లా వడ్డిస్తున్న అమ్మను చూసి మేమందరమూ ఎంతో ఆనందపడ్డాము.

వారి యెడల అమ్మ చూపిన వాత్సల్యానికి వారు అమితానందభరితు లయ్యారు. వారు తల్లి ఒడిలో ఆడుకునే పసివాళ్ళలాగ కనుపించారు. వాళ్ళ ఆనందంలోనే అమ్మ తాదాత్మ్యం పొందింది. ఆరోగ్యం సరిగా లేకపోయినప్పటికీ ఆనాడు అమ్మలో ఎంతో ఉత్సాహం కనబడింది. ఆ సాయంకాలం అమ్మ సమక్షంలో శ్రీ లక్ష్మణ యతీంద్రులు ప్రసంగం చేశారు. సత్ పదార్థంలో మనసును లగ్నం చేయడమే – సన్యాసం అని నిర్వచించి సన్యాసియొక్క ధర్మాలను వివరిస్తూ సన్యాసి "జాతీయ సంపద" గా అభివర్ణించారు.

అనేక సందర్భాలను పురస్కరించుకొని అమ్మ యీ తురియాశ్రమము గురించి చక్కగా వివరించింది. వివాహం చేసుకుని గృహస్థుగా ఆధ్యాత్మిక సాధన చేయటం కోటలో ఉండి యుద్ధం చేయటం; సన్యసించటం కోటవిడిచి యిద్ధానికి వెళ్ళటం" అని ఐహూరమ్యంగా వర్ణించింది మరొక సమయంలో "బుద్ధుడు వెళ్ళాడని అందరూ వెళ్ళడం కాదు. ఆయన వెళ్ళినట్లుగా వెళ్ళాలి" అని హితోపదేశం చేసింది. బుద్ధుడెందుకు వెళ్ళాడూ ! జగత్తులో అనేక రూపాల తాండవిస్తున్న దుఃఖాన్ని చూసి, ఆ వేదనకు మూలాన్ని వెతుక్కుంటూ వెళ్ళాడు. వెదికి వెదికి మానవుడు దుఃఖానికి కారణం "కోరిక" యే నని తెలుసుకున్నాడు.

"ఆ కోరిక లేని స్థితిని సంపాదించుకోవటానికి ప్రయత్నమే సన్యాసం" అని అమ్మ వివరించింది. అయితే, "మంచం మీద వద్దు, చాపమీదనే పడుకుంటా ననడం కోరికే. తెల్లగుడ్డవద్దు, కాషాయగుడ్డ కావాలనటమూ కోరికే. వైరాగ్యమంటే వేపాకు తిని ఉండడమే కాదు. ఏది దొరికితే అది తృప్తిగా స్వీకరించడమే. వేపాకే తింటాను, అంటే అదీ కోరికే" అని విపులీకరిస్తూ "సర్వభక్షకు డయినవాడే భిక్షుకుడవుతా" డనీ, "లింగభేదం, రూపభేదం, స్పర్శభేదం లేనివాడే సన్యాసి" అనీ అమ్మ ఉద్ఘాటించింది.

ఆ స్థితి వస్తే యింట్లో ఉన్నా, ఆశ్రమంలో ఉన్న ఒకటే. కాషాయ వస్త్రాలు కట్టుకున్నా, తెల్లగుడ్డలు కట్టుకున్నా ఒకటే. సంసారంలో ఉన్నా, సన్యాసం తీసుకున్న ఒకటే. కానీ యింట్లో ఉండి సాధించలేమన్న జంకు కలిగిన తర్వాత ఒక కట్టుబడిలో ఉండవచ్చునన్న ఉద్దేశంతో సన్యాసం తీసుకుంటారు. అపుడు మనస్సులో ఏమున్నా ప్రయోగాలుండవు. కొన్ని నియమాలకు కట్టుబడి ఉంటారు" అని అమ్మ అతి సున్నితంగా చెబుతూ "సన్యాసి కావలెగానీ పుచ్చుకొనటం కాదు" అని అందంగా విభజన చేసింది.

మన సమాజంలో గృహస్థాశ్రమం ఆధ్యాత్మిక సాధనకు ప్రతిబంధకం అన్న నమ్మకం ఉన్నది. ఆ గృహస్థాశ్రమానికి పెండ్లి సింహద్వారం కనుక పెండ్లి ఆధ్యాత్మికతకు విరోధియని భ్రాంతి. ఆ భ్రమను తొలగించడానికే పెండ్లిలో పెద్దపులి ఉన్నదనుకునే వారి భయం పోగొట్టడానికే నేను పెండ్లి చేసుకున్నాను" అని అమ్మ తన వివాహ సందర్భంలో ఒక ప్రకటన చేసింది.

"అన్ని ఆశ్రమాలకూ ఒకదే విలువ" అనికూడా అమ్మ స్పష్టం చేసింది ఏ ఆశ్రమంనుండి అయినా ముక్తిని పొందవచ్చుననేది అమ్మ అభిప్రాయం ముక్తి అంటే అమ్మ దృష్టిలో నిత్య తృప్తి. తృప్తి అంటే అనుభవించేది మినహా మరింకేమీ అవసరం లేని స్థితి. మరి మనిషికి అందనిదీ, అనుభవించేది అంటే అలసభావమూ అందనిదాని కొరకు ఆరాటమూ కదా. అందిన దానిలో తృప్తి, అందని దానికొరకు ఆరాటం లేకపోవడమే ముక్తి అని అమ్మ ఘంటాపథంగా చెప్పింది. అమ్మకు తొమ్మిదవ సంవత్సరం ప్రాయంలో అమ్మ బంధువులు అమ్మను శ్రీ వాసుదాస స్వామివారి వద్దకు తీసుకుని వెళ్ళారు. వారికి అమ్మను 'తల్లి లేని పిల్ల' అని పరిచయం చేయగా వారు సానుభూతిని వ్యక్తం చేస్తూ "నీ కేమి కావాలమ్మా!" అని అడిగారు. వెంటనే అమ్మ "ఏమీ కావాలనేది అక్కరలేకుండా కావాలి" అని సమాధానం చెప్పింది ఆ సమాధానానికి ఆయన దిగ్భ్రాంతిచెంది, అటువంటి వాక్యం తానెప్పుడూ వినలేదని అనుకున్నారట. అప్పటికి యిప్పటికి అమ్మది అదే స్థితి. ఇది కావాలి-అదిలేదు. ఇది వద్దూ-అని కాదు. పట్టుచీరెలు కట్టుకోవచ్చును. గోనెపట్టాలు చుట్టుకోవచ్చునూ పంచభక్ష్యపరమాన్నాలూ తినవచ్చును, పస్తులూ ఉండవచ్చునూ కొందరిచే నుతించ బడవచ్చునూ, కొందరిచే నిందించబడవచ్చునూ అమ్మకు అన్నివేళలా ఒకటే మనః స్థితి. ఆ భిన్నత్వం లేని మనస్తత్వమే అమ్మను దేవతాపీఠంపై ఆసీనునుచేసి లోకా రాధ్యను చేసింది.

సంసారం అంటే మన దృష్టిలో భార్యా, భర్తా సంతానమూ-అని. కానీ అమ్మ నిర్వచనం సంసారం అంటే సంకల్పమే. తెనాలిలో ప్రఖ్యాత పండితులు శ్రీ మూల్పూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారితో సంభాషిస్తూ యీ విషయం వెల్లడించగా – ఆ పండితుడు నివ్వెరపోయి ఆ అపూర్వ నిర్వచనాన్ని వెంటనే ఒక కాగితంపై వ్రాసు కున్నారు.

మరి సంకల్పం లేని మనిషి ఉంటాడా? తరంగం లేని సముద్రం వుండ వచ్చునేమో కానీ సంకల్పంలేని మనస్సు వుండదు గదా. సంకల్ప రాహిత్యం చేసు కుంటేకాని మోక్షం లభించదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మరి, యిదెలా సాధ్య

మవుతుంది? దీనికి అమ్మ చక్కని పరిష్కారం సూచించింది సంకల్ప రాహిత్యమంటే -సంకల్పాలు లేక పోవటం కాదట. తనకువచ్చే ప్రతి సంకల్పమూ దైవదత్తమని విశ్వసించటమట. ఎంత చక్కని నిర్వచనం! ఎంత సులభ పరిష్కారం! అందుకనే అమ్మ 'తానొకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తాడు' అన్న సామెతను ఖండిస్తూ దైవం తలుపే మనిషి తలుపు అని నిర్ద్వంద్వంగా చెప్పింది. "చేసే పని అంతా దైవసేవ అనుకోగలిగితే ఆధ్యాత్మిక సాధనకు సంసారం ప్రతిబంధకం కానేరదు" అని అమ్మ యిహ పరాలకు రెంటికీ అందమయిన సేతువు నిర్మించింది.

మామూలు అర్థంలో సన్యాసమంటే సత్ పదార్థమందు మనస్సును లగ్నం చేయటమని లోగడనే చెప్పుకున్నాం కదా. సన్యాసులు - యీలోకం విథ్యయనీ, యిది కాక 'సత్' అనేది మరెక్కడనో ఉన్నదనీ, విశ్వశిస్తూ దానిని వెదుకుతూ, దాని గురించి ఆలోచిస్తూ అదే గమ్యంగా, అదే ధ్యేయంగా జీవనం సాగిస్తారు. అమ్మ యీ లోకం 'సత్' కాకపోలేదని చెబుతూ యీ లోకంలో ప్రత్యణువూ ప్రేమాస్పదమే నని చెప్పింది.

కనుకనే సాంప్రదాయక సన్యాసం మమకారాలను ఛేదించుకొనమని ప్రబోధిస్తుంటే-అమ్మ మమకారాలను పెంచుకొనమని ఉద్బోధిస్తూ "నా వైరాగ్య మేమిటో తెలుసా? సర్వత్రానురాగమే నా విరాగం" అని ప్రేమామృతాన్ని లోకంపై దోసిళ్ళతో వెదజల్లింది.

సన్యాసులు తమ చుట్టూ గిరులు గీచుకుని కూర్చుని, కనబడే జగత్ సౌందర్యాన్ని చూడక కళ్ళుమూసుకుని, సహజంగా ప్రతి హృదయంలోనూ ఉత్పన్న మయ్యే అనురాగామృత లహరులను అణిచి వేసుకుంటూ జడప్రాయులై జటాధారు లయ్యే కంటే - అమ్మ అభిప్రాయం ప్రకారం సన్యాసులు విశ్వమే తమ కుటుంబంగా భావించి ప్రతిజీవినీ తమ సోదరుడుగా ప్రేమించి అర్తులకు తాను సేవకుడనని ప్రవర్తిస్తే....ప్రస్తుతం అనేక అపోహలకు ఆలవాలమయిన 'సన్యాసం' పవిత్రమై, సుందరమై, సర్వజన పూజ్యమై విలసిల్లదూ?

గృహస్థుకూ సన్యాసికీ-యిద్దరికీ ప్రేమే మార్గమయినప్పుడు ప్రవృత్తికీ నివృత్తికీ భేదం ఏమున్నదీ? ఒక ఆశ్రమం గొప్పదనీ, మరొక ఆశ్రమం అల్పమనీ అంతర మేమున్నదీ?

— ఫిబ్రవరి 1979

రక్షణ

కటాక్షం, రక్షణ - అనేవి తెలుసుకోవడం చాలా కష్టం. భగవదనుగ్రహం పొందిన వ్యక్తి తన జీవితంలో అనుక్షణమూ రక్షణ పొందుతున్నప్పటికీ, కొన్ని సమయాల్లో తెలుసుకోగలుగుతాడు; కొన్ని సమయాల్లో తెలుసుకోలేడు. భగవల్లీల ప్రత్యక్షంగా అనుభూతమయితేనే గానీ - మనిషికి భగవంతునిపై, భగవంతుని సర్వసామర్థ్యంపై, అనుగ్రహంపై, రక్షణపై విశ్వాసం స్థిరపడదు. శాస్త్రాలవల్లా, మాటలవల్లా కూడా నమ్మకం ఏర్పడవచ్చును గానీ దానికి అచంచలత్వం ఉండదు; ఒకమాట వలన కలిగిన నమ్మకం మరోమాటవల్ల క్షీణించవచ్చును; సమూలంగా క్షయం పొందవచ్చును. కానీ అనుభవం పునాదిగా నిర్మితమయిన విశ్వాససౌధం - ఎంత తీవ్రమయిన ఎన్ని తుఫానులు వచ్చినా - యీషణ్మాత్రమూ చలించదు.

అమ్మ పాఠాలు చెప్పే తీరు అత్యంత విలక్షణంగా ఉంటుంది. వీలయి నంతవరకూ అమ్మ ఉపదేశమూ, సందేశమూ అన్యాపదేశంగా ఉండడమేకాదు, సోదాహరణంగానూ, క్రియాత్మకంగానూ ఉంటాయి. కారణం, మనిషికి మాటలు నీటిపైని వ్రాతలు అని తెలుసును కనుక. మనస్సులపై శాశ్వత ముద్రను వేయటంలో అమ్మ అసమాన ప్రవీణ.

ఆగష్టు 22 వ తేదీ ఉదయం...

అమ్మసాన్నిధ్యంలో కూర్చుని కొందరు సోదరులం "మాతృశ్రీ" గత సంచికలలోని సంపాదకీయాలు చదువుకుంటున్నాము. 1978 జనవరి సంచికలోని సంపాదకీయం చదువబడ్డది. అందులోని విషయం నక్సలైట్లు అమ్మ ఆవరణపై దాడి చేయడమూ, సోదరుడు గోపాలకృష్ణమూర్తిపై హత్యా ప్రయత్నమూ, అతడిని అమ్మ రక్షించడమూ.

ఈ విషయం చర్చనీయాంశమై, పఠనం ఆగిపోయింది.

వాద ప్రతివాదాలు తీక్షణంగా సాగాయి.

ఒక సోదరుడు - "ప్రమాదాన్ని తప్పించగల శక్తి ఉంటే, అమ్మ ఆ సంఘటననే నిరోధించవచ్చును గదా !" అన్నాడు.

ఈ ప్రశ్నలో తార్కిక లక్షణం ఉండవచ్చునుగానీ, ఔచిత్యం కనుపించదు. మనం పై ప్రశ్నను ఆధారం చేసుకుని ఆలోచిస్తే - రామాయణమూ లేదు, మహా భారతమూ లేదు. జగదీశ్వరుడైన మహావిష్ణువు అవతారమూర్తి శ్రీరామచంద్రునికి తెలియకుండానే - రావణుడు సీతాదేవిని అపహరించాడా ? సర్వజగత్ సమ్మోహన కరుడయిన శ్రీకృష్ణపరమాత్మ సామర్థ్య సంగీత లహరి కౌరవుల మనః పాషాణాలను కరిగించడంలో పరాజితమై పోయిందా ?

ఎవరు ఎవరినీ సమాధానపరచలేక సంతృప్తి పరచలేక సతమతమౌతూ చివరకు అమ్మనే అర్థించాము - పరిష్కారం కోసం.

జవాబేమీ చెప్పకుండా - అమ్మ మంచం దిగి స్నానాలగదికి వెళ్ళింది. అమ్మ మళ్ళీ వస్తుంది. సమాధానం చెబుతుంది - అని కొన్ని క్షణాలు నిరీక్షించాము. అంతలో స్నానాలగదినుండి నీటిసవ్వడి వినిపించింది. అమ్మ స్నానం చేస్తున్నదని మాకు అర్థమైంది.

ఇదేమిటీ ?.... అమ్మ అంత నిర్లిప్తంగా వెళ్ళిపోయింది ! నిర్బాధ్యతగా వ్యవహరించింది ! బిడ్డలు తెలని చర్చలో తల బద్దలు కొట్టుకుంటే - తనకేమీ పట్టదా ? తెలియజెప్పేవాడు గురువూ, తెలియజేసేవాడు దైవమూ - అని అమ్మేకదా వివరించింది. తెలియనిది తెలియజేయడానికే తన రాక - అనిగూడా అమ్మ అతి బాల్యంలోనే ప్రకటించిందిగదా !

మరి, ఏమిటీ విడ్డూరమూ, వింత ప్రవర్తన ! తనను గురించిన రహస్యం తాను వివరిస్తేనే, అందులో సత్యం ఉంటుందిగానీ మన వాదాలు ఊహాజనితాలే గదా!

"మరుగే నా విధానం"- అని ప్రవచించిన అమ్మ నిగూఢ తత్వాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలో విఫలులమై ఆ చర్చను వాయిదా వేసుకున్నాము. అందరూ క్రిందికి వెళ్ళిపోయారు. నేను కూడా వెళదామని బయటకు వచ్చాను. చెలుచర్ల రఘునాథ్ అనే విద్యార్థి కనుపించాడు. అతని చేతిలో బ్లీచింగ్ పౌడరు గల పొట్లాన ఉన్నది. అంతకు కొద్దిరోజుల క్రితమే వరద వచ్చి తగ్గినందున

నీళ్ళన్నీ నిర్జీవపదార్థాలతో కలిసి మలినమై ఉన్నాయి. అందువల్ల అతడు నీళ్ళ ట్యాంకుల్లో ఆ మందు కలిపే పనిలో ఉన్నాడు.

పై ట్యాంకులో కలపడానికి అమ్మ ఉండే గది దక్షిణపు దిశన కఱ్ఱల వంతెన దాటిపోవాలి ఇది నేల మట్టానికి షుమారు 30 అడుగుల ఎత్తున ఉన్నది. క్రింద నాపరాళ్ళు పరిచి ఉన్నాయి. మధ్యలో అనేకం యినుపకడ్డీలూ, ఎలక్ట్రిక్ తీగెలూ ఉన్నాయి పైనుంచి చూస్తే అదొక మృత్యు గహ్వరంలా కనుపిస్తుంది.

అతడు నవ్వుతూ నన్ను పలకరించాడు. నేను సమాధానం చెప్పి ముందుకు సాగాను. నాలుగు అడుగులు వేశానో లేదో-దభీమని పెద్ద శబ్దం వినిపించింది. వెనుదిరిగి చూశాను.... ఆ కఱ్ఱవాడు కనుపించలేదు. కఱ్ఱలవంతెన ఒక ప్రక్క విరిగి హంతకుడువలె గజగజ వణుకుతూ గాలిలో వ్రేలాడుతున్నది. క్రిందికి చూశాను. అతడు రాళ్ళపై పడి అమ్మా.... అమ్మా.... అంటున్నాడు.

నేను గబగబా క్రిందికి పరుగెత్తాను. అతణ్ణి చేతులపై తీసుకువచ్చి ఆసుపత్రిలో పడుకోబెట్టాము. డాక్టర్ సత్యమూ, డాక్టర్ వనజకుమారీ వచ్చారు. ప్రాథమిక చర్యలు గైకొన్నారుకానీ పరిస్థితి వాళ్ళకు ఏమీ అర్థం కాలేదు. ప్రాణ భయంలేదని చెప్పలేమన్నారు ఎముకలువిరిగి ఉండవచ్చును; మూత్రకోశం దెబ్బతిని ఉండవచ్చును; లోన కనపడని గాయాలు తగిలి ఉండవచ్చును; షాక్ తగిలి మెదడు దెబ్బతినవచ్చును.... ఖచ్చితంగా ఏమి జరిగిందో ఆ సమయంలో చెప్పలేమని తమ అసహాయస్థితిని వ్యక్తం చేశారు.

ఆ రాత్రి అందరికీ ఆందోళనే. ఎవరికీ నిద్రపట్టలేదు. అతడు మాత్రం ఆదమరిచి నిద్రపోయాడు. మరునాడు ఉదయానికే ఆ విద్యార్థి లేచి తిరగడం మొదలు పెట్టేడు. అందరికీ ఆశ్చర్యం వేసింది. అతనికి ఒక్క ఎముకా విరగలేదు. మామూలుగా ఉన్నాడు.

అందరూ ఆశ్చర్యంతో ఆనందంతో అమ్మ అనుగ్రహానికి చేతులెత్తి నమస్కరించారు. విద్యార్థిని అభినందించారు.

ఇది అమ్మ రక్షణేననే అందరి విశ్వాసం. అయితే-యిక్కడ మళ్ళీ మొదటి ప్రశ్నే తలెత్తుతుంది. కానీ-ఆ ప్రశ్నకు క్రియాత్మకంగా అమ్మ ప్రసాదించిన సమాధానంగానే యీ సంఘటనను భావించాలి.

ఒకసారి రక్షణను గురించి "ఒక మనిషి దారిన నడుస్తున్నాడనుకో. వాడి కాలికి ఎదురుదెబ్బ తగిలి ఎగిరి గంతువేస్తాడు. అపుడు మొదట ఎదురుదెబ్బ తగిలి నందుకు బాధపడతాడు. తర్వాత అతడు ఎగిరి గంతువేసినపుడు అడుగువేయకుండా దాటిన స్థలంలో గాజుపెంకును చూసి ఆనందిస్తాడు. ఆ ఎదురుదెబ్బ తగలకపోతే అతడి కాలు ఆ గాజు పెంకుపై పడి కాలు తెగిపోయి ఉండేది .... రక్షణ అట్లా ఉంటుంది. అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆ ఎదురుదెబ్బ తగలకపోతే తప్పిన గండం తెలీదు" అని వివరించింది అమ్మ.

లోగడ ఒకసారి చీరాల డాక్టర్ పొట్లూరి సుబ్బారావుగారి 5 సంవత్సరాల కుమార్తు గోడపైనుండి క్రిందికి పడ్డాడు. వాడికేమీ దెబ్బలు తగల్లేదు. అందరూ ఆశ్చర్యపోతుంటే ఆ పసివాడు తనను అమ్మ రెండుచేతులతోనూ పట్టుకుని నేలపై పెట్టింది అని చెప్పాడు.

మరొకసారి సోదరులు శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మగారి అబ్బాయిని, మరొకసారి శ్రీ రామబ్రహ్మంగారి అబ్బాయిని, మరొకసారి శ్రీమతి సత్యవతిని అమ్మ ఇట్లాగే కాపాడింది.

అమ్మ రక్షణకు పాత్రులయిన వ్యక్తులెందరో దైవానుగ్రహానికి నిత్య కేతనాలై లోకానికి నిరంతర ఉద్దీపన కలుగజేస్తూ ఉంటారు.

అయితే యీ రక్షణ అందరికీ అన్నివేళలా ఎందుకు లభ్యం కాదు? - అన్న ప్రశ్న జనిస్తుంది అది కేవలం మన అవసరం కాక అమ్మకు అవసరం అనిపించినపుడు, తప్పక రక్షిస్తుంది.

ఏ పాఠం ఎవరికి ఎప్పుడు ఎట్లా చెప్పాలో బాగా తెలిసిన గురువు - అమ్మ.

ఏ రోగికి ఏ మందు ఎప్పుడు ఎట్లా యివ్వాలో బాగా ఎరిగిన వైద్యుడు- అమ్మ.

-సెప్టెంబరు 1978

కటాక్షం

1981 ఆగష్టు 19 వ తేదీ ఉదయం. అమ్మ మామూలుగా తన గదికి బయట దక్షిణపు వైపున గోడకు ఆనించివేసిన మంచంపై కూర్చుని ఉంది. రోజూ అమ్మ సూర్యకిరణాలు తన సుందర పాదద్వయంపైబడి ఆ చరణాలను చుంబించి నమస్కరించుకున్న తర్వాతగానీ లోపలకు వెళ్ళదు.

రోజూ ఉదయాన్నే క్రమం తప్పకుండా వచ్చి అమ్మకు నమస్కరించి గానీ దినచర్య కుపక్రమించని వారున్నారు. అందులో శ్రీమతి గజేంద్రమ్మ ఒకతె. ఆనాడు ఆమె నమస్కరించుకోవడానికి వచ్చింది. తలవంచి తలను పాదాలకు ఆనించి నమస్కరించుకుంది. కుడిచెయ్యికి కట్టు ఉంది. ఆమె కొద్దిరోజుల క్రితమే కాలుజారి పడ్డది: చెయ్యి విరిగింది. అంతకు కొన్నాళ్ళ క్రితం ఎడమ చెయ్యి విరిగితే కట్టు కట్టించుకుందీ, యిటీవలనే నయమయింది. ఆ కట్టు విప్పించుకుంది. అంతలోనే మళ్ళీ రెండో చెయ్యి విరిగింది. అందువల్ల ఆమె చేతులతో పాదాలు తాకేందుకు వీలుగాక తలతోనే పాదాలను స్పృశించింది.

ఆమె దయనీయ పరిస్థితిని చూస్తే - నాకూ బాధనిపించింది.

"బొట్టు పెట్టమ్మా-" గజేంద్రమ్మక్కయ్య అమ్మను విసురుగా అడిగిం, అట్లా మాట్లాడడమే ఆమెకు అలవాటు.

"ఇప్పుడు బొట్టెందుకూ?" అమ్మ ప్రశ్నించింది - మామూలుగా. అమ్మ సన్నిధిలో నివసించేవాళ్ళు ఎక్కడికయినా బయటి ఊరుకు వెళ్ళేటప్పుడు అమ్మకు చెప్పి బొట్టు పెట్టించుకుంటారు.

"ఊరికి పోతా నమ్మా" అంతే విసురుగా అన్నది అక్కయ్య.

"రెండు చేతులూ విరగ్గొట్టుకుని వెళితే అక్కడ నీ కెవరు చేస్తారు? .... ఎవరి పనులతో వారికి సరిపోతుంది."

అమ్మదగ్గర ఉండే యింకో అక్కయ్యను గజేంద్రమ్మక్కయ్య దగ్గర ఉండి సహాయపడుతుండమని అమ్మ నియమించింది. అదే విచిత్రం, ఒక కూతురు

తల్లికీ, ఒక చెల్లెలు అక్కకూ కూడా చేయనంతగా జిల్లెళ్ళమూడిలో ఒకరికి ఒకరు తోడ్పడుతారు.

"ఏందమ్మా – అందరూ నవ్వుతున్నారు .... చేయించుకున్నంతకాలమూ హాయిగా చేయించుకుని, మీ అమ్మగారు నీ రెండు చేతులూ విరగ్గొట్టిందని...." ఆమె గొంతులో ఎంతో బాధ ధ్వనించింది.

"మీ అమ్మగారికి ఏం చేతవుతుందమ్మా ? అక్కడ కాళ్ళు విరగ్గొట్టుకునీ, చేతులు విరగ్గొట్టుకునీ మా దగ్గరకు వస్తారు. మీ అమ్మగారికి ఏమీ చేతకాదు....యిట్లా ఏవేవో ఆసుపత్రిజనం అంటారమ్మా..." ఆమె యింకా పూడిపోయిన గొంతుతో చెబుతూనే ఉంది.

"నిజమేగా గజేంద్రమ్మా. నిజమే. మా అమ్మకు ఏమీ చేతకాదు – అని చెప్పకపోయావా? నా కేమీ బాధలేదు–"

"నీ కేమీ బాధలేదు. అదే మా బాధ. మాకెంత సిగ్గుగా ఉంటుందీ, వాళ్ళట్లా మాట్లాడుతుంటే ! గొంతు పిసుకుదామనిపిస్తుంది..."

"వాళ్ళెవరో సరేనమ్మా. మా వాళ్ళుకూడా అడుగుతారమ్మా. మీ అమ్మగారికి నీమీద ఎంతో ప్రేమా, దయా అంటావుగా ! దయ ఉంటే యిట్లాగేనా జరిగేది? దయ అంటే యిదేనా? .... అని." అంటుండగానే ఆమె కళ్ళు నీటికుండలయినాయి; ఆమె గొంతు పెగల్లేదు.

"నామీద దయవల్లనే యిట్లా జరిగింది ' అని చెప్పు గజేంద్రమ్మా–" అమ్మ సన్నగా నవ్వుతూ చిన్నగా సలహా యిచ్చింది.

"దయవల్ల యిట్లా జరిగిందా?!"

"ఔను. నీ చెయ్యి విరగడమూ నా దయవల్లనే. విరిగింది అతుక్కోవడమూ దయవల్ల నే అన్నీ దయవల్లనే....దయ లేదని అనుకోకు. దయ తప్పదమంటూ లేదు.

అమ్మ ఒక్కొక్క మాటా వత్తి వత్తి స్ఫుటంగా పలుకుతుంటే ...ఆ భావం అర్థంగాని గజేంద్రమ్మ అమ్మవంక కండ్లప్పగించి చూసింది.

వెంటనే అమ్మ లోగడ చెప్పిన ఒక వివరణ గుర్తుకు వచ్చింది. "వాడి కరుణ లేకపోతే మనం లేము. మనం చేసే పనులన్నీ వాడి కరుణవల్లనే; నా దృష్టిలో కష్టసుఖాలు రెండూ కరుణ వల్లనే. ప్రతి చిన్నపనీ, మనం చేతుతో చేస్తున్నా మనుకున్నా, మనస్సుతో చేస్తున్నా మనుకున్నా .... మనం ఎట్లా చేసినా వాడి కరుణ వల్లనే. మనకు కనపడకుండా ఆయా తరుణాల్లో ఆయా పనులు చేయించడమే కరుణ,"

ఇంకొకసారి అన్నది ... "నా దృష్టిలో ఆగ్రహానుగ్రహాల్లేవు. అంతా అనుగ్రహమే. కష్టసుఖాలు శుభాశుభాలు అన్నీ అనుగ్రహం వల్లనే. ఇవ్వబడిన సర్వమూ పరమే..."

మనం మామూలుగా మనకు అనుకూలంగా అయిన పనినే భగవంతుని దయగా గుర్తించగలము. మన యింట్లో ఒక శుభకార్యం జరిగితే, మన అబ్బాయి పరీక్ష ఫస్టుక్లాసులో పాస్ అయితే, మన అబ్బాయికి మంచి ఉద్యోగం దొరికితే, మన అమ్మాయికి మంచి సంబంధం కుదిరి పెండ్లి అయితే, మన పొలం బాగా పండితే. వ్యాపారంలో మనకు బాగా లాభాలువస్తే, అనుకోకుండా ఏ విధంగానయినా మనకు డబ్బు కలిసొస్తే, ప్రమాదకరమైన వ్యాధి అకస్మాత్తుగా నయమయితే.... దేవుడి దయ మనమీద ఉన్నదని భావించగలం; ఆనందించగలం; దేవుడికి రెండు చేతులూ యెత్తి మ్రొక్కగలం.

పాసు అవుతాడనుకున్న — మన అబ్బాయి పరీక్ష తప్పితే, ఉద్యోగం లేకుండా దేశదిమ్మరిగా తిరుగుతుంటే, మన అమ్మాయికి పెండ్లికాక దారి తప్పితే, మన పొలాలు వరదపాలైతే, మనం వ్యాపారంలో పూర్తిగా నష్టపడితే, తిరిగే తిరిగే మనిషి కుటుంబానికి అక్కరకు వచ్చినవాడు హఠాత్తుగా చనిపోతే – దేవుడి దయ అనుకుంటామా ?

ఒక క్రొత్త యిల్లు కట్టుకుంటే - దేవుడి దయ మనయందు ఉన్నదను కుంటాము కానీ, కట్టుకున్న క్రొత్తయిల్లు అకారణంగా కూలిపడితే, మన యిల్లు అగ్నికాహుతి అయితే – దేవుడి దయకు మనం పాత్రుల మయినా మని సంతోషించ గలమా ?

కానీ అమ్మమాత్రం అన్నీ కరుణవల్లనే అంటుంది. అయిన పనీ, కాని పనీ అన్నీ ఒకే అనుగ్రహ ఫలితాలే నంటుంది.

ఒకరితో "నొప్పి కూడా వాడిచ్చినదే" ననీ, మరొకరితో "బాధ కూడా వాడి ప్రసాదమే" ననీ, మరొకరితో "దుఃఖం వాడి అనుగ్రహం కాకపోలే" దనీ అమ్మ అనేక విధాల వివరించింది. మరొకసారి "ఒడిదుడుకులుకూడా నా ఆశీర్వచనమే నాన్నా-" అన్నది. మరొకసారి "దరిద్రం కూడా నే నిచ్చినదే" నని పలికింది. ఒకరితో "దారి తప్పడం కూడా అనుగ్రహమే" నన్నది. ఒక సోదరి "ఆ వాతావరణంలో ఎట్లా ఉంటానో" నని భయపడుతూ ఉంటే "ఆ వాతావరణం కూడా అమ్మ కల్పించింది - అని అనుకుంటూ ఉండు" - అన్నది.

ఒక సందర్భంలో "పడడానికీ, పడకుండా ఉండడానికీ, పడ్డా దెబ్బలు తగలకుండా ఉండడానికీ - అన్నిటికీ ఒకే కారణం" అని ఉద్ఘాటించింది అమ్మ.

ఒక సోదరుడు అమ్మను "నమ్మకం దేనివల్ల కుదురుతుంది?" అని అడిగాడు. "నమ్మకం కలగకపోవడానికి కారణ మేమిటో, కలగడానికి కారణ మదే" నని అమ్మ చెప్పింది.

"నమ్మకం గ్రేస్ కాదా?" అతని ప్రశ్న.

"నమ్మకమే కాదు; లేకపోవడంకూడా" అన్నది అమ్మ.

అమ్మ అభిప్రాయం ప్రకారం-భగవంతుడి కటాక్షం ఎప్పుడూ ఉన్నది. మనం అనుకున్నది అనుకున్నట్లు జరిగినప్పుడు మాత్రమే దానిని గుర్తించగలం. కటాక్ష మనేమిటి - భగవంతుడిని అయినా అంతే. మనం అనుకున్న రూపంలో కనిపిస్తేనే గుర్తించగలం. లేనప్పుడు మన ముందు నిలబడ్డా భగవంతుడు అని అనుకోలేము.

కరుణ అంటే మనం అనుకున్నది కాదు; మనకు అవసరమయినది. ఇదంతా 'వాడి కరుణే' నన్న గుర్తిపు మనకు కలగడమే అసలు కరుణ.

అమ్మ ప్రబోధించే పరిపూర్ణ అద్వైత సిద్ధాంతంలో అమ్మ కటాక్షానికి యిచ్చిన అపూర్వ నిర్వచనం ఒక ముఖ్యాంగమై, ముఖ్యాంశమై విలసిల్లుతోంది.

— ఆగష్టు 1981